# యేసు జీవితమూ పరిచర్య

shepherds
GLOBAL CLASSROOM

Shepherds Global Classroom క్రీస్తు శరీరాన్ని శక్తివంతం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న క్రైస్తవ నాయకుల కోసం పాఠ్యాంశాలను అందిస్తు వారిని సిద్ధ పరుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆధ్యాత్మిక శిక్షకులకు 20-కోర్సుల పాఠ్యాంశాల సాధనాన్ని అందించడం ద్వారా, స్వదేశీ శిక్షణా కార్యక్రమాల సంఖ్యను విస్తరించాలని మేము ఆశిస్తున్నాము.

ఈ కోర్సు ఉచితంగా అందుబాటులో ఉంది డౌన్‌లోడ్ చేసుకోవడానికి https://www.shepherdsglobal.org/courses

ప్రధాన రచయిత: Dr. Randall D. McElwain

కాపీరైట్ © 2023 Shepherds Global Classroom
మూడవ ఇంగ్లీష్ ఎడిషన్ నుండి తెలుగులోకి అనువదించబడింది.

సర్వ హక్కులు ప్రత్యేకించబడినవి.

థర్డ్-పార్టీ వనరులు వాటి సంబంధిత యజమానుల కాపీరైట్ గా ఉన్నాయి మరియు మరియు వివిధ లైసెన్సుల ద్వార పంచుకొనబడ్డాయి.

ఈ పుస్తకంలో వాడబడిన వాక్య భాగాలు బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా వారి తెలుగు పరిశుద్ధ గ్రంథం నుండి తీసుకోవడం జరిగింది. Telugu Old Version Bible - పరిశుద్ధ గ్రంథము O.V. Bible

**అనుమతుల గమనిక:**

ఈ కోర్సు క్రింది మార్గదర్శకాల ప్రకారం ప్రింట్ మరియు డిజిటల్ ఫార్మాట్‌లలో ఉచితంగా ముద్రించబడుతుంది మరియు పంపిణీ చేయబడుతుంది: (1) కోర్సు కంటెంట్ ఏ విధంగానూ మార్చబడకపోవచ్చు. (2) కాపీలను లాభం కోసం అమ్మకూడదు. (3) విద్యా సంస్థలు ఈ కోర్సును ఉచితంగా లేదా ట్యూషన్ ఫీజు తీస్కొని కాపీ గా ఉపయోగించు కోవచ్చు (4) Shepherds Global Classroom అనుమతి మరియు పర్యవేక్షణ లేకుండా కోర్సు అనువదించబడదు.

# విషయసూచిక


కోర్సు అవలోకనం.......5

ఇశ్రాయేలు పటం.......6

(1) పరిచర్య కొరకు సిద్ధపాటు.......7

(2) యేసువలే ప్రార్థించడం.......27

(3) యేసువలే నడిపించుట.......47

(4) యేసువలే బోధించడం.......69

(5) యేసువలే ప్రసంగించడం.......91

(6) యేసు, దేవుని రాజ్యం.......109

(7) యేసువలే ప్రేమించడం.......133

(8) సిలువ మరియు పునరుత్థానం.......155

(9) చెరగని ప్రభావాన్ని విడిచి వెళ్ళడం.......181

రాజ్య సువార్త (ప్రసంగం).......201

సిఫార్సు చేసిన వనరులు.......213

అభ్యాసాలు రికార్డు.......215

# కోర్సు అవలోకనం

ఈ కోర్సు యేసు జీవితాన్ని, పరిచర్యను నేటి దినాల్లోని పరిచర్యకు, జీవితానికి ఒక మాదిరిగా అధ్యయనం చేస్తుంది. ఇది సువార్తల సమగ్ర అధ్యయనం కాదు. ఈ కోర్సు యేసు పరిచర్యలోని కొన్ని నిర్దిష్టమైన కోణాలను పరిశీలించి, నేటి పరిచర్యకు పాఠాలను అందిస్తుంది. మీరు క్రీస్తు జీవితమంతా అధ్యయనం చేయాలంటే, పుస్తకం చివర్లో సిఫార్సు చేసిన పుస్తకాల జాబితా భాగాన్ని చూడండి.

ఒకవేళ బృందంగా అధ్యయనం చేస్తే, వనరులను/మెటీరియల్ ను ఒకరి తరువాత మరొకరు చదవచ్చు. చర్చ కోసం మధ్య మధ్యలో కొంత సమయం కేటాయించాలి. తరగతి నాయకుడుగా, చర్చ అనేది అధ్యయనం చేస్తున్న మెటీరియల్ కు సంబంధించినదిగానే ఉండేలా జాగ్రత్తపడడం మీ బాధ్యత. ప్రతి చర్చా సమయపు కాల పరిమితికి ఇది సహాయపడుతుంది.

చర్చా ప్రశ్నలు, తరగతిలో చేసే కార్యకలాపాలు ఈ గుర్తుతో సూచించబడతాయి ►. వీటిని చూసినప్పుడల్లా, దాని క్రిందున్న ప్రశ్నలు అడిగి, విద్యార్థులు సమాధానం గురించి చర్చించేలా చేయండి. అర్థవంతమైన చర్చకు సమయం కేటాయించండి. ఇలా చేయకపోతే, విద్యార్థులు యేసు పరిచర్య అధ్యయనాన్ని నేటి పరిచర్యతో అనుసంధానించటంలో విఫలమౌతారు.


కోర్సు అంతటిలో ప్రధాన విషయాల్లో (main text) చివరి సూచనలు (footnotes) రెంటిలోను అనేక లేఖన భాగాలు ఇవ్వడం జరిగింది. తరగతి గదిలో బిగ్గరగా చదవాల్సిన వాక్యభాగాలు కూడా బుల్లెట్ పాయింట్లతో సూచించబడ్డాయి ►. విద్యార్థులు, పెద్ద వాక్యభాగాలను క్లాసు మొదలయ్యేముందే చదవాలి. చిన్న వాక్యభాగాలు క్లాసులో చదవచ్చు.

**"నిశిత పరిశీలన"** అనే పేరుగల భాగాలు, పాఠం చర్చకు సంబంధించిన ప్రత్యేక విషయాలపై దృష్టిపెడతాయి.

ప్రతి పాఠంలో ఒకటి లేక రెండు అభ్యాసాలు ఉన్నాయి. విద్యార్థి Shepherds Global Classroom (షెఫర్డ్ గ్లోబల్ క్లాస్ రూమ్) నుండి ధృవీకరణ పత్రం (సర్టిఫికెట్) పొందాలంటే, తరగతి సెషన్లలో హాజరై, అభ్యాసాలు పూర్తి చేయాలి. పూర్తి చేసిన అభ్యాసాలను గురించి నివేదించటానికి కోర్సు ముగింపులో ఒక ఫారం ఇవ్వడం జరుగుతుంది.

ఈ కోర్సులో ముఖ్యమైన ఉద్దేశ్యాలలో ఒకటి విద్యార్థులను బోధకులుగా తయారుచేయడం. క్లాసు లీడరు విద్యార్థులు తమ బోధనా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు అవకాశాలు ఇవ్వాలి. ఉదాహరణకు, క్లాసు లీడరు కొన్నిసార్లు విద్యార్థికి తరగతిలో పాఠంలోని ఒక చిన్న భాగాన్ని బోధించే అవకాశం ఇవ్వాలి.

**ఇశ్రాయేలు పటం**




(1) తూరు[1]

(2) కైసరియ ఫిలిప్పి

(3) గలిలయ (ప్రాంతం)

(4) కానా

(5) కపెర్నహూము

(6) నజరేతు

(7) దెకపొలి (ప్రాంతం)

(8) సమరయ (ప్రాంతం)

(9) యొర్దాను నది

(10) ఎమ్మాయి

(11) యెరూషలేము

(12) బెత్లెహేము

(13) తీర మైదానం

(14) కేంద్ర ఉన్నత భూములు

(15) యూదయ అరణ్యం

(16) మృత సముద్రం

(17) గలిలయ సముద్రం

(18) మధ్యధరా సముద్రం

---

[1] "ఇశ్రాయేలు పటం" సృష్టించబడింది SGC తెరచిన డేటాతో NED, SRTM, NASA, మరియు Bible Geocoding (CC BY 4.0), లో నుండి అందుబాటులో ఉంది https://www.flickr.com/photos/sgc-library/52344178339, ప్రజా డొమైన్ (CC0).

# పాఠం 1

# పరిచర్య కొరకు సిద్ధపాటు

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) పరిచర్యకు యేసు మన మాదిరిని గుర్తించాలి.

(2) దేవుడు తాను పిలిచినవారిని సిద్ధపరచడంలో ఆయన సార్వభౌమాధికారాన్ని అభినందించాలి.

(3) దేవుడు తన కోసం ఎంపిక చేసుకున్న పనికి, దేవుని పిలుపుకు విధేయత చూపాలి.

(4) శోధనలు జయించడానికి యేసు అడుగుజాడల్లో నడవాలి.

## ఈ పాఠం కొరకు సిద్ధపాటు

*మత్తయి 1-4, లూకా 1-3, మరియు యోహాను 1 చదవండి.*

## పరిచర్యకు సూత్రం

దేవుడు పరిచర్యకు పిలిచిన వారిని, తాను పిలిచిన పని కొరకు సిద్ధపరుస్తాడు.

## పరిచయం

ఈ కోర్సులో, యేసు నేటి దినాల్లోని పరిచర్యకు, జీవితానికి ఒక మాదిరి అనే విషయాన్ని అధ్యయనం చేస్తాం. యేసు "నేను మీకు చేసిన ప్రకారము మీరును చేయవలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని" (యోహాను 13:15) అని చెప్పాడు. భూమిపై యేసు జీవితం ఆయన్ని వెంబడించినవారికి మాదిరి.

పౌలు ఈ సూత్రం అర్థం చేసుకున్నాడు. ఫిలిప్పీలో క్రైస్తవుల మధ్య సంఘర్షణ గూర్చి విన్నప్పుడు, పౌలు యేసు మాదిరి సూచించాడు. "క్రీస్తుయేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి" (ఫిలిప్పీయులకు 2:5). ఈ క్రైస్తవులు యేసు మాదిరి అనుసరిస్తే, వారి విధేయత సంఘంలో సంఘర్షణను పరిష్కరిస్తుందని పౌలుకు తెలుసు.

ఆఫ్రికా పర్యటనలో, యూదుడైన ఒక జర్నలిస్టు డేవిడ్ ఫ్లోట్జ్, మలావి విమానాశ్రమంలో నిస్సహాయస్థితిలో ఉండిపోయాడు. అక్కడ ఒక ఆఫ్రికా దేశపు పాస్టర్ ని కలిశాడు. ఆ పాస్టర్ ఫ్లోట్జ్ ని తన ఇంటికి తీసుకెళ్ళి రెండు రోజులు ఆహారం పెట్టి, యేసు క్రీస్తు గురించి సాక్ష్యమిచ్చాడు. తరువాత డేవిడ్ ఫ్లోట్జ్ అతని గురించి ఇలా రాశాడు: "ఈ వ్యక్తి

విశ్వసించే దేనిని నేను నమ్మనుగాని అతని విశ్వాసం చూసి ఆశ్చర్యపోయాను. క్రీస్తు అతనిలో ఉన్నాడని, అందుకే పరదేశులను ఇంటికి తీసుకెళ్ళి ఆశ్రయమిచ్చి, ఆహారం పెట్టి, వస్త్రాలు ఇచ్చాడని భావిస్తాడు." యేసు మాదిరిని అనుసరించడానికి దేవుడు మనల్ని పిలిచాడని ఈ ఆఫ్రికా పాస్టర్ గ్రహించాడు.

ఈ కోర్సు, యేసు జీవితం గురించి సమగ్ర అధ్యయనం కాదు, గాని నేటి పరిచర్యకు మాదిరి చూపించు యేసు జీవితంలో కొన్ని విషయాలపై దృష్టిపెడదాం. యేసు మాదిరిని అనుసరించి, మన పరిచర్య ఆ ప్రకారం ఉండేలా చూద్దాం.

ఈ మొదటి పాఠంలో, పరిచర్యకు యేసు సిద్ధపడడం అనే విషయాన్ని గూర్చి చూస్తాం. దేవుడు పరిచర్యకు పిలిచిన వారిని, ఆయన పిలిచిన పని కొరకు సిద్ధపరుస్తాడనే సూత్రాన్ని ఇది వివరిస్తుంది.

## దేవుడు తన సేవకుని కుటుంబ నేపథ్యాన్ని సిద్ధపరిచాడు

► మీ కుటుంబ నేపథ్యం, భూలోక జీవితం గురించి ఆలోచించండి. మిమ్మల్ని పరిచర్య కోసం సిద్ధపరచటానికి దేవుడు ఏ విధంగా మీ నేపథ్యం ఉపయోగించాడు?

సార్వభౌముడైన దేవుడు యేసు పుట్టుకకు శతాబ్దాల క్రితమే ఆయన సేవకుని కొరకు మార్గం సిద్ధపరచాడని సువార్తల్లోని వంశావళి చూపిస్తుంది. యేసు పుట్టుకకు చాలాకాలం క్రితం, ఆయన రాకకై దేవుడు మార్గం సిద్ధపరిచాడు.

"యేసు ఎవరు?" అనే ప్రశ్నకు వంశావళి సమాధానం. వంశావళి అబ్రాహాము, దావీదు గొప్పతనాన్ని చూపిస్తుంది. దేవుడు అబ్రాహాముతో, "భూమియొక్క సమస్తవంశములు నీయందు ఆశీర్వదించబడునని" (ఆదికాండము 12:3) వాగ్దానం చేశాడు గనుక యేసు వంశావళిలో అబ్రాహాము ముఖ్యుడు. ఈ వాగ్దానం నజరేయుడైన యేసులో నెరవేరింది.

దావీదు సింహాసనం నిత్యం స్థిరంగా ఉంటుందని (2 సమూయేలు 7:16) దేవుడు వాగ్దానం చేసినందున వంశావళిలో దావీదు ముఖ్యుడు. యేసు జన్మించినప్పుడు, దావీదు సింహాసం అధిరోహించి 500 సంవత్సరాలు దాటిపోయింది. యేసు దావీదు వాగ్దాన నెరవేర్పుగా ఉన్నాడని మత్తయి మరియు లూకా తెలియజేస్తారు.

### యేసు దావీదు కుమారుడు (మత్తయి 1:1-17)

గ్రీకు క్రొత్త నిబంధనలో, మత్తయి సువార్తలోని మొదటి రెండు పదాలు మొదటిగా మత్తయి సువార్తను చదివిన వారికి ఆదికాండాన్ని జ్ఞాపకం చేసి ఉంటాయి (ఆదికాండము 2:4, ఆదికాండము 5:1). ఆదికాండము సృష్టిపై దేవుని సార్వభౌమాధికారాన్ని చూపించినట్లే, మత్తయి చరిత్రపై దేవుని సార్వభౌమాధికారాన్ని చూపిస్తాడు. ఇశ్రాయేలు చరిత్రంతా మెస్సీయ పుట్టుకపై నడిచిందని మత్తయి వంశావళి చూపిస్తుంది.

మత్తయి వంశావళి, ఒక్కో గుంపులో 14 పేర్లతో మూడు గుంపులను గురించి వివరిస్తుంది. ఇది సాధారణంగా యూదులు గుర్తుపెట్టుకోవడానికి సహాయపడుతుంది. అనేకమంది పేర్ల జాబితాను గుర్తుంచుకునేందుకు క్రమమైన గుంపులు విద్యార్థులకు సహాయపడతాయి. ఈ జాబితాలో అబ్రాహాముకు, యోసేపుకు మధ్యనున్న ప్రతి పితరుని పేరు చేర్చలేదని మత్తయి పాఠకులకు తెలుసు. మత్తయి పదే పదే ఉపయోగించిన “కనెను” అను పదం ప్రతి పితరుడిని సూచిస్తుంది. యూదుల వంశావళిలో సాధారణంగా కొన్ని తరాలను విడిచిపెడతారు. యేసు వంశావళిలో మత్తయి ముఖ్యమైన వారి పేర్లపై దృష్టిపెట్టి, మిగిలిన పేర్లను విడిచిపెట్టాడు.

మత్తయి కొన్ని తరాలు విడిచిపెట్టడం వలన అతడు చేర్చిన పేర్లు మరిముఖ్యంగా ఆసక్తికరమైనవి. మత్తయి ఈ పేర్లను ఒక ఉద్దేశ్యంతో ఎన్నుకున్నాడు. ఉదాహరణకు, మత్తయి నలుగురు స్త్రీల పేర్లు చెప్పాడు. ఇది యూదుల వంశావళిలో అసాధారణం. జాబితాలోని స్త్రీలలో మనం ఆశించే అర్హతలు లేవు. రాహాబు, రూతు పరదేశులు. తామారు, రాహాబు, బత్షెబ లైంగిక పాపం చేసినవారు.

అదేవిధంగా, జాబితాలో ఉన్న కొందరు పురుషులు అవమానం పొందివారు. యూదా తామారును అవమానించాడు. యెకొన్యా సంతానం ఇశ్రాయేలు సింహాసనానికి అనర్హులు (మత్తయి 1:12, యిర్మీయా 22:30). గమనించదగిన విషయం ఏంటంటే, మత్తయి దావీదు గొప్ప విజయాలు సాధించాడని గుర్తించలేదుగాని ఊరియా భార్య ద్వారా సొలొమోనుకు తండ్రిగా గుర్తించాడు.

ఈ పేర్లు యేసును పాపస్వభావం గల మానవత్వంతో గుర్తిస్తాయి. దేవుడు ఆయన కుమారుణ్ణి మచ్చలేని కుటుంబ నేపథ్యం ద్వారా కాదుగాని సాధారణ పాపుల సంతానం ద్వారా లోకంలోకి పంపాడు. యూదా అధికారులు యేసు గౌరవింపదగని పుట్టుకను అవమానించి, అనర్హుడిగా తిరస్కరించారు (యోహాను 8:41, 48). దేవుడు పాపపు నేపథ్యంగల వ్యక్తిని వాడుకుని, తన గొప్ప ఉద్దేశ్యాలను నెరవేర్చగలడని మత్తయి చూపించాడు.

► మన సంస్కృతిలో, వ్యక్తి నేపథ్యంలో ఏ విషయాలను బట్టి మనం అతన్ని తక్కువ సామర్థ్యంగలవాడిగా చూస్తాం?

దేవుడు చాలాసార్లు తన సేవ కొరకు ఊహించని నేపథ్యాల నుండి ప్రజలను పిలుస్తాడు. కుటుంబ నేపథ్యాన్ని బట్టి పనికిరాని వారంటూ ఎవరు లేరు. ఒక వ్యక్తి తక్కువ సామర్థ్యంగలవాడని భావించడానికి కారణమయ్యే నేపథ్యాలు దేవునికి ముఖ్యం కాదు.

**యేసు ఆదాము కుమారుడు (లూకా 3:23-38)**

మత్తయి “యూదుల రాజు” వంశావళిని అబ్రాహాము నుండి ఆరంభిస్తాడు. లూకా యేసు వంశావళిని ఆదాము నుండి ఆరంభిస్తాడు. యేసు “మనుష్య కుమారుడు” అని నొక్కి చెప్పే లూకా మాటలకు ఇది సరిగ్గా సరిపోతుంది. లూకా వంశావళి యేసు మానవత్వాన్ని నొక్కి చెప్తుంది. లూకా యేసు వంశావళిని ఆయన శోధన సన్నివేశానికి ముందుంచాడు. మొదటి ఆదాము విఫలమయ్యాడు, రెండవ ఆదాముగా యేసు విజయం సాధించాడని ఇది పాఠకులకు జ్ఞాపకం చేస్తుంది.

**నిశిత పరిశీలన: మత్తయి మరియు లూకా సువార్తల్లోని వంశావళి**

మత్తయి 1 మరియు లూకా 3 లో యేసు వంశావళి భిన్నంగా ఉన్నాయి. మత్తయి అబ్రాహాము నుండి మొదలుపెట్టి, రాజైన సొలొమోను, తరువాత చివరికి యోసేపుతో ముగించాడు. లూకా వంశావళిని యోసేపు నుండి మొదలుపెట్టి, నాతాను (దావీదు మరొక కుమారుడు)తో కొనసాగించి, చివరికి ఆదాముతో ముగించాడు.

అబ్రాహాము, దావీదు మధ్య వంశావళి ఒకటే. అయితే దావీదు, యోసేపు మధ్య రెండు వంశాలు వేరు. ఈ భిన్నత్వానికి వివరణ, మత్తయి యోసేపు పూర్వికుల్ని ప్రస్తావించాడు, అయితే లూకా మరియ పూర్వికుల గురించి రాశాడు.[2]

మత్తయిలో యోసేపు పూర్వికులు సొలొమోను నుండి వచ్చిన రాజ వంశస్తులు. యేసు రాజు అనే మత్తయి ప్రసంగానికి/విషయానికి ఇది సరిగ్గా సరిపోతుంది. ఇది యేసు చట్టపరమైన వంశం-యోసేపు ద్వారా రావాలి.

లూకాలో మరియ పూర్వికులు దావీదు కుమారుడైన నాతానుతో ఆరంభమైన “భౌతిక” వంశావళి. యేసు “మనుష్య కుమారుడు” అనే లూకా ఉద్ఘాటనకు ఇది సరిగ్గా సరిపోతుంది. దీనిని చూపించాలని, లూకా యేసు వంశావళిని మరియతో మొదలుపెట్టాడు. అయినా, “యోసేపు కుమారుడు” అనే మాటతోనే ఆరంభిస్తాడు, ఎందుకంటే యూదుల వంశావళిలో స్త్రీ వంశం కనుగొనాలంటే కూడా పురుషుల పేర్లు ఉపయోగిస్తారు.

మరియ వంశవృక్షం దావీదు ద్వారా రక్తసంబంధం చూపిస్తుంది. యోసేపు వంశవృక్షం సొలొమోను ద్వారా సింహాసనాధికారం చూపిస్తుంది.

---

[2] ఇతర సాధ్య వివరణల కొరకు, http://www.gotquestions.org/Jesus-genealogy.html, (మార్చి 22, 2021న యాక్సెస్ చేయబడింది) చూడండి.

## దేవుడు తన సేవకుని కుటుంబ నేపథ్యం సిద్ధపరచాడు (కొనసాగింపు)

### యేసు దేవుని కుమారుడు (యోహాను 1:1-18)

యోహాను సువార్త దైవిక వంశావళితో ఆరంభమైంది; యేసు దేవుని కుమారుడు. "యేసు జీవితం ఆయన జన్మతో.. ఆరంభం కాలేదు. ఆయన ఒక నిర్దిష్ట పని నెరవేర్చుటకు ఆదిసంభూత స్థితి నుండి లోకంలోకి వచ్చాడు."[3]

పాత నిబంధనలో, ఇశ్రాయేలు ప్రజలు దేవుని ప్రసన్నతను ప్రత్యక్షగుడారంపై మేఘంగా చూశారు. ఇప్పుడు దేవుడు యేసుక్రీస్తునందు మన మధ్య ఉన్నాడు (యోహాను 1:14). దేవుని దివ్య మహిమ ఇప్పుడు మానవ రూపంలో ప్రత్యక్షమైంది.

వాక్యం శాశ్వతమైంది: "వాక్యము దేవునియొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను" (యోహాను 1:1). తండ్రి, కుమారుడు నిత్య సహవాసం కలిగియున్నారు.[4] యేసు మన లోకంలోకి ఎందుకు వచ్చాడు? తండ్రిని కనుపరచుటకు. ఎవడును ఎప్పుడైనను తండ్రిని చూడలేదు, కాని యేసు ఆయనను బయలుపరచాడు (యోహాను 1:18). మనం యేసును చూస్తే, తండ్రిని చూసినట్లే (యోహాను 14:9).

నేడు, అనేకులు యేసును ప్రేమగల మిత్రుడుగా, తండ్రిని కఠిన తీర్పరిగా చూపిస్తారు. అయితే, యోహాను 1 యేసు స్వభావాన్ని తండ్రి స్వభావంతో సమానంగా చూపిస్తుంది. యేసును చూస్తే, తండ్రిని చూసినట్లే.

## దేవుడు, తన సేవకుని అద్భుత జననం ద్వారా సిద్ధపరచాడు

యేసు సుమారు క్రీ.పూ. 5లో యూదయలోని బెత్లేహేములో జన్మించాడు.[5] రోమా జనాభా లెక్కల కొరకు యోసేపు బెత్లేహేముకు వెళ్ళాడు. రోమా ఆధీనంలో ఉన్న ప్రాంతాలన్నిటిపై పన్నులు విధించడం జనాభా లెక్కల ప్రధాన ఉద్దేశ్యం.

పట్టణంలో ప్రజలు ఎక్కడ నివసిస్తున్నారో, ఎక్కడ పని చేస్తున్నారో తెలుసుకోవటం రోమీయుల సాధారణ పద్ధతి. అయితే, తిరుగుబాటు చేయాలని చూస్తున్న యూదులతో శాంతి కొనసాగించాలని, యూదయ ప్రాంతంలో ఉన్నవారు యూదా పద్ధతిలో తమ పూర్వికుల ఇంటికి వెళ్లి నమోదు చేసుకోవడానికి రోమా అనుమతి ఇచ్చింది. తత్ఫలితంగా,

---

[3] J. Dwight Pentecost, *The Words and Works of Jesus Christ*. (Grand Rapids: Zondervan, 1981), 28

[4] యేసు సృష్టించబడినవాడు అనే యెహోవ సాక్షుల వాదనను యోహాను 1:3 ఖండిస్తుంది. యేసు సృష్టిలో ఉన్నాడు. "కలిగియున్నదేదియు ఆయనలేకుండ కలుగలేదు."

[5] 1582 వరకు గ్రెగోరియన్ క్యాలెండర్ అభివృద్ధి చెందలేదు. ఈ క్యాలెండర్ సుమారుగా ఉండేది కాని, ఖచ్చితమైనది కాదు. సుమారు క్రీ.పూ 4లో హేరోదు మరణించాడు. ఈ తేదీ ఆధారంగా, యేసు జననం సుమారు క్రీ.పూ.5-6 జరిగింది.

యోసేపు మరియ నజరేతు నుండి బెత్లెహేముకు 100 కిలోమీటర్లు ప్రయాణం చేశారు. కుటుంబ పెద్ద, పురుషుడు మాత్రమే నమోదు చేసుకోవలసిన అవసరత ఉన్నప్పటికీ, యోసేపు మరియను కూడా బెత్లెహేముకు తీసుకెళ్ళాడు. చిన్న గ్రామమైన నజరేతులో, చుట్టుప్రక్కల కొండెములు చెప్పుకొంటున్న వాళ్ల మధ్య మరియను విడిచిపెట్టడానికి యోసేపు ఇష్టపడి ఉండకపోవచ్చు.

దేవుడు ఆయన ఉద్దేశ్యాన్ని నెరవేర్చుకోవడానికి లోక సంఘటనలు ఉపయోగిస్తాడు. దేవుని ఉద్దేశ్యాలు నెరవేర్చడానికి, యూదుల జనాభా గణన చేయాలనే "ఎంపిక"ను ఒక అన్య చక్రవర్తికి దేవుడు సార్వభౌమాధికారంతో అప్పగించాడు. "యెహోవా చేతిలో రాజు హృదయము నీటికాలువల వలెనున్నది. ఆయన తన చిత్తవృత్తిచొప్పున దాని త్రిప్పును" (సామెతలు 21:1). దేవుని రాజ్యంలో పనివారంగా, చెడ్డవారు అధికారంలో ఉన్నప్పటికీ కూడా దేవుడు ఆయన ఉద్దేశ్యాలు నెరవేర్చగలడనే గొప్ప నిశ్చయత ఇది మనకు ఇస్తుంది.

యేసు జననం కొరకు దేవుడు లోకాన్ని ఎలా సిద్ధపరచాడో చూపించే ఒక ఉదాహరణ, జనాభా గణన. మన లోకాన్ని మెస్సీయ కొరకు సిద్ధపరచడానికి, దేవుడు గ్రీకు సామ్రాజ్యపు సాంస్కృతిక నేపథ్యం, రోమా సామ్రాజ్యపు న్యాయ వ్యవస్థ, యూదా మత సూత్రాలు వాడుకున్నాడు. ఈ నేపథ్యాన్ని అధ్యయనం చేయడానికి, దయచేసి Shepherds Global Classroom (షెఫర్డ్ గ్లోబల్ క్లాస్ రూమ్) కోర్సులో, క్రొత్త నిబంధన అన్వేషణ[6] అనే మొదటి పాఠం చూడండి.

**కాపరులు వెళ్లి చూడడం (లూకా 2:8-20)**

యేసు జన్మించాడనే ప్రకటన మొదట బెత్లెహేము వెలుపల ఉన్న గొర్రెలకాపరులు విన్నారు. మొదటి శతాబ్దపు యూదులు కాపరులను విస్మరించేవారు గనుక ఇది గమనించదగిన విషయం. కాపరులు సామాజికంగా తక్కువ స్థాయిలో ఉన్నందున యూదుల న్యాయస్థానాల్లో వాళ్ల సాక్ష్యం అంగీకరించరు. కాపరులపై దృష్టిపెట్టడం వలన, "కాపరులను స్వాగతించారు గనుక దేవుని రాజ్యంలో అందరినీ స్వాగతిస్తారు!" అని లూకా సూచిస్తున్నాడు. "ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయు చున్నాను" (లూకా 2:10) అని దేవదూత కాపరులతో చెప్పాడు.

సువార్త కేవలం ఒక్క రాజ్యానికే (ఇశ్రాయేలు) లేక ఒక్క సామజిక వర్గానికే పరిమితం కాదు; సువార్త ప్రజలందరికీ. ఇది లూకా సువార్త అంతటా కనిపిస్తుంది. స్త్రీలకు, సమరయులకు, జక్కయ్యవంటి సమాజం నుండి వెలివేయబడిన వారికి యేసు చేసిన పరిచర్య పట్ల లూకా ఎక్కువ శ్రద్ధ చూపుతాడు.

---

[6] https://www.shepherdsglobal.org/ నుండి లభిస్తుంది.

**జ్ఞానులు వెళ్లి చూడడం (మత్తయి 2:1-12)**

మత్తయి సువార్త మొదట యూదులకు ఉద్దేశించింది. యేసు సందేశం ప్రజలందరికీ అనేదానిపై లూకా దృష్టిపెట్టాడు, మత్తయి మొదట పరలోక రాజ్యం గురించి యేసు ఇచ్చిన సందేశంపై దృష్టిపెట్టాడు. కాపరులకు బదులుగా, మత్తయి జ్ఞానుల సందర్శనను చూపించాడు. బహుశా ఆయన జన్మించిన కొన్నినెలలకు, యేసు కుటుంబం తమ స్థిర నివాసానికి చేరుకున్న తరువాత ఈ సందర్శన జరిగింది (మత్తయి 2:11). రెండు సంవత్సరాల కంటే తక్కువ వయస్సుగల మగపిల్లలందరినీ వధించమని హేరోదు ఇచ్చిన ఆజ్ఞను బట్టి ఇది అర్థమవుతుంది.

జ్ఞానులు, అసాధారణ విషయాల కొరకు చూసే ఖగోళ శాస్త్రజ్ఞులు. ప్రయాణం ప్రమాదకరమైన సమయంలో, ఆకాశంలో చూసిన వింత సూచన పరిశోధించడానికి వారు చాలా దూరం ప్రయాణించారు.

జ్ఞానులు ముందుగా యెరూషలేముకు వచ్చారు, యూదుల రాజును కనుగొనే హేతుబద్ధమైన ప్రదేశం. ప్రత్యర్థిని గూర్చిన వార్త హేరోదు విన్నప్పుడు, అతడును అతనితోకూడ యెరూషలేము వారందరును కలవరపడిరి (మత్తయి 2:3). “యెరూషలేము వారందరును” అనే మాట యెరూషలేములోని మతాధికారులు తరువాత యేసును తిరస్కరిస్తారని ముందుగానే సూచిస్తుంది.

జ్ఞానుల సందర్శన, మెస్సీయను అన్యులకు మొదటిగా వెల్లడిపరచడం. సూచనవల్ల కలవరంతో నిండిన యెరూషలేము ప్రజలకు భిన్నంగా జ్ఞానులు విశ్వాసం చూపించారు. యేసు కేవలం యూదుల రాజుగా మాత్రమే కాదు రాజ్యలన్నిటికీ రాజుగా ఆవిర్భవించాడు.

యేసును ఆరాధించుటకు ఎంతమంది జ్ఞానులు వచ్చారో మత్తయి చెప్పలేదు. మత్తయి 2:11 లో చెప్పిన మూడు బహుమతుల ఆధారంగా ముగ్గురు జ్ఞానులు అని సాంప్రదాయ వాదం చెబుతుంది. ప్రతి బహుమానం యేసు పరిచర్యలోని కొన్ని కోణాలను సూచిస్తుంది.

- బంగారం రాజుకిచ్చు బహుమానం. అయితే, యేసు సింహాసనం నుండి కాదుగాని సిలువ నుండి పరిపాలిస్తాడు.
- సాంబ్రాణి యాజకుడికిచ్చు బహుమానం. బలులు అర్పించేటప్పుడు, సాంబ్రాణిని సుగంధద్రవ్యంలా వాడతారు. యేసు యాజకునిగా, ప్రజలందరు దేవుని సన్నిధిలో చేరే ప్రవేశం కలిగించాడు.
- బోళం చనిపోయినవారిని భద్రపరచుటకు వాడతారు. యేసు మానవులందరి నిమిత్తం చనిపోవడానికి జన్మించాడు.

## దేవుడు తన సేవకుడిని భద్రపరిచాడు

యేసు జననం ముందు, దేవుని ప్రణాళిక బయలుపరచడానికి దేవదూత స్వప్నమందు యోసేపుతో మాట్లాడాడు. జ్ఞానులు సందర్శించిన పిమ్మట, ఐగుప్తుకు పారిపొమ్మని దేవదూత యోసేపును హెచ్చరించాడు. హేరోదు మరణం వరకు వారు ఐగుప్తులోనే ఉన్నారు (సుమారు క్రీ.పూ. 4).

అనేక కోణాల్లో, హేరోదు మహాన్ ప్రభావవంతమైన పాలకుడు. ఆయన యూదులను గౌరవించేవాడు, యూదుల ఆహార నియమాలను కూడా పాటించేవాడు. ఆయన యేసు జీవితం మొత్తం కొనసాగిన దేవాలయ పునర్నిర్మాణాన్ని ప్రారంభించాడు. క్రీ.పూ. 25లో వచ్చిన కరువు సమయంలో, యూదయలో ఆకలితో ఉన్నవారికి తాను తన సొంత డబ్బుతో ఆహారం కొనుగోలు చేసి అందించాడు.

అయితే, హేరోదు తార్కికత లేని భయంతో తన స్థానాన్ని ఎవరో తీసుకోవచ్చని అనుకున్నాడు. అతన్ని చంపడానికి కుట్ర చేస్తున్నారని అనుమానించి, తన భార్య మరియామ్నే, తల్లి అలెగ్జాండ్రాను హత్యచేశాడు. హేరోదు ముగ్గురు కుమారులు వయస్సులో ఉండగా, ముప్పుగా ఉంటారనే భావనతో వారిని హత్యచేశాడు. హేరోదు వంటి పిచ్చోడు, బెత్లెహేములో పిల్లలను వధించడం ఆశ్చర్యమేమి కాదు. తన సింహాసనం కాపాడుకోవడానికి కొంతమంది పిల్లలను చంపటం ఇబ్బందేమి కాదు.

హేరోదు క్రూరత్వం మరణం వరకు కొనసాగింది. అతని మరణం సమీపిస్తుండగా, యెరూషలేములోని ప్రముఖ పౌరులను అరెస్టు చేసి, చంపాలని హేరోదు ఆదేశించాడు. ఈ సంఘటన అతని మరణ దినం దుఃఖ దినంగా ఉండే భరోసా ఇస్తుందని నమ్మాడు. (బదులుగా, హేరోదు మరణం తరువాత విధవరాలైన తన భార్య, చెరలో ఉన్నవాళ్ళని విడిపించి, పాలస్తీనా అంతటా వేడుక వాతావరణం నెలకొల్పింది.)

హేరోదు మరణం తరువాత, అతని సంస్థానాన్ని ముగ్గురు కుమారులు పంచుకున్నారు. అంతిపకు గలిలయ మరియు పెరెయపై అధికారం ఇచ్చారు; ఫిలిప్పుకు పాలస్తీనా ఈశాన్య భాగంపై అధికారం ఇచ్చారు; అర్కెలాస్ కి యూదయ, ఇదూమియ మరియు సమరయపై అధికారం ఇచ్చారు. అర్కెలాస్ కు తన తండ్రి బలహీనతలన్నీ ఉన్నాయికాని ఒక్క మంచి లక్షణం కూడా రాలేదని ప్రాచీనా చరిత్రకారులు చెబుతారు. యూదులు అతన్ని ద్వేషించి, కైసరుకు ఫిర్యాదులు చేయడం వల్ల క్రీ.శ. 6లో అతన్ని తప్పించారు. దీని తరువాత, యూదయను పొంతు పిలాతు వంటి రోమా గవర్నర్ లు పాలించారు.

హేరోదు మరణం తరువాత, యోసేపును ఇశ్రాయేలుకు తిరిగి వెళ్ళుమని హెచ్చరించుటకు స్వప్నమందు దూత మరల కనిపించాడు. అయితే, అర్కెలాస్ హేరోదు అంతటి ప్రమాదకరమైనవాడు గనుక, యోసేపు బెత్లెహేముకు వెళ్ళక తన కుటుంబాన్ని నజరేతుకు తీసుకెళ్ళాడు.

► చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడు, జాన్ వెస్లీ మంటల్లో నుండి అద్భుతంగా బయటపడ్డాడు. దేవుడు తనను ఒక ప్రత్యేక ఉద్దేశ్యం కొరకు రక్షించాడని నమ్మాడు. వెస్లీ తన గురించి, "అగ్నిలోనుండి తీసిన కొరవివలెనే" (జెకర్యా 3:2) అని చెప్పుకున్నాడు. అద్భుతంగా రక్షించడం ద్వారా లేక దైవకృత కార్యం ద్వారా దేవుడు తమను పరిచర్య కొరకు ఎలా రక్షించాడో తెలియజేయడానికి తరగతిలో ఉన్న సభ్యులను ఆహ్వానించండి.

### నిశిత పరిశీలన: మత్తయి 2:23

ఇతర సువార్తల కంటే, యేసు పరిచర్య పాత నిబంధన ప్రవచనాలను నెరవేర్చిందని, మత్తయి చూపిస్తుంది. యూదులకు రాస్తూ, యేసు వాగ్దానం చేయబడిన మెస్సీయ అని మత్తయి చూపించాడు.:

- యేసు కన్యకకు జన్మించడం (మత్తయి 1:22-23) యెషయా 7:14 నెరవేర్పు.
- బెత్లెహేములో యేసు జననం (మత్తయి 2:5-6) మీకా 5:2 నెరవేర్పు.
- ఐగుప్తు ప్రయాణం (మత్తయి 2:14-15) హోషేయ 11:1 నెరవేర్పు.
- బెత్లెహేములో శిశువుల వధ (మత్తయి 2:16-18) యిర్మీయా 31:15 నెరవేర్పు.
- యెరూషలేము ప్రవేశం (మత్తయి 21:1-5) జెకర్యా 9:9 నెరవేర్పు.

ప్రవచన నెరవేర్పు గూర్చిన ఒక క్లిష్టమైన ఉదాహరణ మత్తయి 2:23లో కనిపిస్తుంది. మత్తయి రాశాడు, "నజరేతను ఊరికి వచ్చి అక్కడ కాపురముండెను. ఆయన నజరేయుడనబడునని ప్రవక్తలు చెప్పినమాట నెరవేరునట్లు."

ఇక్కడ క్లిష్టమైన విషయం ఏంటంటే, మెస్సీయ నజరేయుడనబడునసే పాత నిబంధన ప్రవచనం లేదు. బహుశా ఈ వచనం వెనుక రెండు ఆలోచనలు ఉన్నాయి:

1. యేసు కాలంలో, నజరేతు ప్రాముఖ్యతలేని గ్రామం (యోహాను 1:46). యూదులు తమ మెస్సీయ యూదయ నుండి వస్తాడని నమ్మారు, గలిలయలోని వాణిజ్య ప్రాంతం నుండి కాదు (యోహాను 7:41, 52). యేసు నజరేతు వంటి తృణీకరించబడిన గ్రామంలో నుండి వచ్చాడనే వాస్తవం యెషయా 49:7 మరియు యెషయా 53:3 వంటి ప్రవచనాలు నెరవేర్చింది.

2. యెషయా 11:1 మెస్సీయ "చిగురు" అని ప్రవచిస్తుంది. అంకురానికి (నెట్జర్) హెబ్రీ పదం "నజరేతు" అనే పదంలా ఉంటుంది. మత్తయి యూదా శ్రోతలు ఈ పదాలను గుర్తించియుంటారు.

## దేవుడు ఆయన సేవకుని కొరకు పూర్వుడు ద్వారా మార్గం సిద్ధపరచాడు

బాప్తిస్మమిచ్చు యోహాను యేసు బంధువు. తన తండ్రి జెకర్యా, యాజకులకు అత్యంత గౌరవనీయమైన విధిని నిర్వర్తిస్తుండగా, అంటే రాజ్యం పక్షాన ధూపం వేయుచున్నప్పుడు యోహాను కథ ఆరంభమైంది (లూకా 1:9).

జెకర్యా ఈ పవిత్ర విధి నిర్వర్తిస్తుండగా, దూత ధూపవేదిక కుడి వైపున నిలబడెను. యూదుల సాంప్రదాయం ప్రకారం, అర్పణ సమయంలో ఇది దేవుడు నిలబడే చోటు. కుమారుని కొరకు తాను చేస్తున్న ప్రార్థన ఆలకించబడెనని గబ్రియేలు దూత జెకర్యాకు సెలవిచ్చాడు.

ఎలీసబెతుకు పిల్లలు కనే వయసు దాటిపోయినందున, జెకర్యా దూత వాగ్దానం అనుమానించాడు. అతని అపనమ్మిక కారణంగా, యోహాను జన్మించేవరకు మూగవాడైయ్యాడు. ఒక యాజకునిగా లేఖన విద్యార్థిగా, జెకర్యాకు హన్నా, రాహేలు గురించి పాత నిబంధన కథలు తెలుసు కాబట్టి దేవుడు అద్భుతంగా ఎలీసబెతు గర్భం తెరుస్తాడనే వాగ్దానం నమ్మాలి.

ముప్పై ఏళ్ళ తరువాత, యోహాను తన పరిచర్య మొదలుపెట్టాడు. యెరూషలేములో యాజకుడుగా సేవచేయక, యూదయ అరణ్యంలో ప్రవక్తగా పరిచర్య చేశాడు. యోహాను యేసుకు ముందుగా పంపబడ్డాడు. యోహాను ప్రకటిస్తుండగా, "వాగ్దానము చేయబడిన మెస్సీయ నీవేనా?" అని ప్రజలు అడిగినప్పుడు, "అయితే నాకంటె శక్తి మంతుడొకడు వచ్చుచున్నాడు; ఆయన చెప్పుల వారును విప్పుటకు నేను పాత్రుడను కాను" (లూకా 3:16) అని సమాధానమిచ్చాడు. ఒక బానిస చేసే అత్యంత హీనమైన పని, యజమానుడి చెప్పులు చూసుకోవడం, కాని యోహాను, "అయితే నాకంటె శక్తి మంతుడొకడు వచ్చుచున్నాడు; ఆయన చెప్పుల వారును విప్పుటకు నేను పాత్రుడను కాను" అని చెప్పాడు. యోహాను విధేయతగల సేవకు మాదిరి.

లేఖనమంతటిలో, మరొకరికి మార్గం సిద్ధపరచడానికి దేవుడు ప్రజలను వాడుకున్నాడు. ఉదాహరణకు బర్నబా, పౌలును చూడండి. సౌలు క్రైస్తవులను హింసిస్తున్నప్పుడు, బర్నబా సంఘంలో ఘనత కలిగిన నాయకుడు. కొందరు క్రైస్తవులు సంఘాన్ని హింసించే పౌలును నమ్మలేదు, కానీ బర్నబా పౌలును నమ్మాడు.

వారు మొదటి మిషనరీ యాత్ర మొదలుపెట్టినప్పుడు, అపొస్తలుల కార్యములు ఆ బృందమును "బర్నబా మరియు సౌలు" అని సూచించింది (అపొస్తలుల కార్యములు 13:2). త్వరలో, వారిని "పౌలు బర్నబా" అని పిలిచారు (అపొస్తలుల

కార్యములు 13:43 దాని కొనసాగింపు ). ఆరంభంలో బర్నబా నాయకుడు, కాని పౌలు నాయకుడుగా ఉండాలని అతడు ఇష్టపడ్డాడు.

కొన్నిసార్లు మీ పాత్ర బాప్తిస్మమిచ్చు యోహాను లేక బర్నబావలే ఉండొచ్చు, మరొకరి కొరకు మార్గం సిద్ధపరచడం. దేవుడు మిమ్మల్ని ఎక్కడ వాడుకోవాలని ఆశపడతాడో, అక్కడ ఆయనకు విధేయులవ్వండి. దేవుడు మిమ్మల్ని మద్దతిచ్చే పాత్రలో ఉంచితే, ఆ పరిచర్య తిరస్కరించకండి. దేవుడు మిమ్ములను ప్రభావవంతమైన విధానంలో వాడుకుంటాడని మీరు నమ్మొచ్చు.

బాప్తిస్మమిచ్చు యోహాను తన అనుచరులను యేసు వైపు చూపినప్పుడు, అతని విధేయత కనిపిస్తుంది (యోహాను 1:35-37). తమ బోధకుని గౌరవిస్తూ అనుసరించే శిష్యులను సంపాదించటం బోధకుని/రబ్బీ లక్ష్యం. కాని, బాప్తిస్మమిచ్చు యోహాను తన అనుచరులకు గొప్ప బోధకుడ్ని చూపించాడు. తన కంటే గొప్పవాడిని చూపించడమే తన బాధ్యతని అతడు గ్రహించాడు. తన అనుచరులు తనను విడిచి యేసును వెంబడించడం అతడు చూశాడు. అతని లక్ష్యం, తన సొంత మహిమ కాదుగాని దేవుని రాజ్యం. క్రైస్తవ నాయకులుగా, మన లక్ష్యం మనకొరకు పేరు సంపాదించుకోవడం కాదుగాని ప్రజలకు యేసును చూపించడమని, గుర్తుంచుకోవాలి.

**నిశిత పరిశీలన: మారుమనస్సు పొందటం అంటే ఏంటి?**

► మత్తయి 3:1-6 చదవండి.

యోహాను మారుమనస్సు సందేశం ప్రకటించాడు. ఈనాడు, మారుమనస్సు అంటే మనసు మార్చుకోవడమని కొందరంటారు. క్రైస్తవులుగా చెప్పుకునే అనేకులు వారు మారారు అనడానికి పెద్దగా ఋజువులు ఏం చూపించరు.

అయితే, “మారుమనస్సు” అనే పదానికి అర్థం, మానసిక నిర్ణయానికి మించినది. క్రొత్త నిబంధన రచయితలు హెబ్రీ ప్రవక్తల మాదిరిగానే “మారుమనస్సు” అనే పదాన్ని ఉపయోగించారు. దాని అర్థం జీవితం పూర్తిగా మారటం. క్రొత్త నిబంధనలో, మారుమనస్సు అంటే:

- మీ ఆలోచనలు, నమ్మకాలు మార్చుకోవడం మరియు
- మీ క్రియలు, జీవనశైలి మార్చుకోవడం.

కొన్ని సంవత్సరాల క్రితం అమెరికాలో పాపంతో నిండిన జీవనశైలికి పేరు గాంచిన పాప్ గాయకుడు ఒకడున్నాడు. ఇతను “నేను క్రైస్తవుడుగా మారి, పరిశుద్ధాత్మతో నింపబడ్డాను. మునుపటివలే జీవిస్తున్నాను కాని క్రైస్తవుడను. ఒకవేళ నేను

మరణిస్తే, పరలోకం వెళ్తాను." ఇతడు "మారుమనస్సు" గురించి చెప్పుకుంటున్నాడు కాని జీవితంలో ఎటువంటి మార్పు లేదు. ఇది నిజమైన మారుమనస్సు కాదు.

మారుమనస్సు మన జీవన విధానాన్ని మారుస్తుందని యోహాను బోధించాడు. మారుమనస్సుకు తగిన జీవితం జీవించే వారు బాప్తిస్మానికి అర్హులని యోహాను చెప్పాడు (లూకా 3:8). బాప్తిస్మం, కేవలం ఒక ఆచారంగా మారకూడదు: "నమ్ముతున్నాను, కాబట్టి నాకు బాప్తిస్మం ఇవ్వండి." బాప్తిస్మం నిజమైన మారుమనస్సుకు, మారిన జీవితానికి సాక్ష్యంగా ఉండాలి.

## దేవుడు ఆయన సేవకుని పరీక్ష ద్వారా సిద్ధపరచాడు

శోధనపై యేసు సాధించిన విజయం మన శోధనకు మాదిరి. "యేసు అపవాది చేత శోధింపబడుటకు ఆత్మ వలన అరణ్యమునకు కొనిపోబడెను" (మత్తయి 4:1). యేసు తన బహిరంగ పరిచర్య ఆరంభించడానికి ముందు శోధన ఎదుర్కొన్నాడు. ఇతరులకు ప్రకటించే ముందు, యేసు తన తండ్రి చిత్తానికి పరిపూర్ణ విధేయత చూపించాడు.

మత్తయి శోధన వృత్తాంతాన్ని యేసు బాప్తిస్మం తీసుకున్న తరువాత రాశాడు. మన గొప్ప శోధనలు ఎల్లప్పుడు ఆధ్యాత్మిక విజయం తరువాత వస్తాయి. కర్మెలు పర్వతంపై ఏలీయా విజయాన్ని పొందిన వెంటనే, అతను తన ప్రాణాన్ని కాపాడుకోవడానికి పారిపోతుండగా నిరాశ, అనుమానమనే శోధనలో ఉన్నట్లు చూస్తాం (1 రాజులు 18-19).

లూకా యేసు వంశావళిని ఆదాముతో ముగించిన తరువాత శోధన కథ రాశాడు. ఆదాము విఫలమైనప్పుడు, మనుష్యకుమారుడు, యేసు విజయం సాధించాడని లూకా చూపించాడు (లూకా 3:38). యేసు తననుతాను మానవాళితో గుర్తించుకున్నాడు మరియు పాపంపై సాధారణ క్రైస్తవులు విజయం ఎలా సాధించాలో మాదిరి చూపించాడు.

### శోధనలు

#### *రాళ్లను రొట్టెలుగా మార్చు శోధన*

రాళ్లను రొట్టెలుగా మార్చుటకు దైవిక శక్తిని ఉపయోగించుమని సాతాను యేసును శోధించాడు. తండ్రి మీద ఆధారపడకుండా ఆయన తన స్వప్రయోజనం కొరకు తన శక్తిని ఉపయోగించాలని సాతాను యేసును శోధించాడు. యేసు ఆహారం పొందే హక్కు తండ్రికి అప్పగించాడు.

> "'నా హక్కులు ఉద్ఘాటిస్తూ బలాన్ని నిరూపించుకుంటాను.' కాని నిజమైన బలం మానవుని చిత్తాన్ని దేవుని చిత్తానికి అప్పగించుకోవడంలో ఉందని పరిపూర్ణ మానవుడు చూపించాడు" అని చెప్పేవాళ్లని మేం మెచ్చుకుంటాం,
> - జి. కాంప్‌బెల్ మోర్గాన్ నుండి తీసుకున్నారు.

తాను తినకూడని ఆహారం తినడానికి శోధించబడినప్పుడు మొదటి ఆదాము దేవునికి అవిధేయుడయ్యాడు. రెండవ ఆదాము విధేయుడయ్యాడు.

***దేవాలయ శిఖరం నుండి క్రిందికి దూకాలనే శోధన***

దేవాలయ శిఖరంపై నుండి దూకమని సాతానుడు యేసును శోధించాడు (కిద్రోను లోయకు 91 మీటర్లు ఎత్తు). ఇది ప్రజలకు ఆశ్చర్యం కలిగించవచ్చు, అదే సమయంలో కాపాడతానన్న వాగ్దానాన్ని నెరవేర్చే విషయంలో తండ్రిని బలవంతపెడుతుంది.

తండ్రి వాగ్దానాలు పరీక్షించాలని యేసుని శోధించడానికి సాతాను కీర్తన 91:11-12లోని వాగ్దానాన్ని ప్రస్తావించాడు. ఈ పరీక్షతో, యేసు తండ్రిని తన దాసునిగా చేస్తాడు- తన కోరికలను, అంచనాలను తీర్చేటట్లు చేస్తాడు.

కీర్తన 91లోని వాగ్దానాన్ని, అది వర్తించని సందర్భంలో వర్తింపజేయడానికి యేసు నిరాకరించాడు. సాతానుకు ప్రతిస్పందనగా, యేసు ద్వితీయోపదేశకాండము 6:16ను ఉల్లేఖించి, "మీరు దేవుడైన యెహోవాను ఆయనను శోధింపకూడదు" అని చెప్పాడు. దేవుని పిల్లలముగా, దేవుడు మన ఉద్దేశ్యాల కొరకు ఆయన శక్తిని ఉపయోగించాలని కోరకూడదు.

**నిశిత పరిశీలన: నిజమైన విశ్వాసం**

కొందరు క్రైస్తవులు "బైబిల్ లోని ప్రతి వాగ్దానం నాది" అని చెబుతారు. లేఖనంలో ప్రతి వాగ్దానం వాస్తవమైనప్పటికీ, "ఈ వాగ్దానం ఈ సందర్భానికి వర్తిస్తుందా?" అని ఎల్లప్పుడు ప్రశ్నించుకోవాలి. యేసు అరణ్యంలో ఎదుర్కొన్న ఆ పరిస్థితికి కీర్తన 91 లోని వాగ్దానం దేవుని చిత్తం కాదని ఆయనకు తెలుసు. దేవుని శక్తిని నియంత్రించకుండా దేవుని వాగ్దానాలను నిజమైన విశ్వాసంతో పట్టుకున్నామని ఎలా తెలుస్తుంది?

**(1) దేవుని వాక్యం ఖచ్చితంగా తెలుసుకోవాలి.**

బైబిల్లోని వాగ్దానాల సందర్భాన్ని, దాని షరతులను ఎంత ఎక్కువగా అర్థం చేసుకుంటే, దాని అన్వయం మన పరిస్థితికి ఎలా సరిపోతుందో అంతే ఎక్కువగా తెలుసుకుంటాం.

కొన్ని వాగ్దానాలను కొన్ని పరిస్థితుల్లో కొందరికి ఇచ్చారు. పాత నిబంధనలో, ఇశ్రాయేలు ప్రజలు నిబంధనకు నమ్మకంగా ఉంటే భౌతిక ఆశీర్వాదాలను దేవుడు వాగ్దానం చేశాడు. వాళ్ల భూమి అధిక ఫలమిస్తుంది, కొట్లలో ధాన్యం సమృద్ధిగా ఉంటుంది, యుద్ధాల్లో విజయం కలుగుతుంది. క్రొత్త నిబంధన వాగ్దానాలు ఎక్కువగా ఆత్మీయ ప్రయోజనాలకు సంబంధించినవి. దీని నేర్చుకోవడానికి కొందరు చింతిస్తారు, కాని మనం ఆనందించాలి. భౌతిక

ఆశీర్వాదాలు తాత్కాలిక విలువగలవి; ఆత్మీయ ఆశీర్వాదాలు నిత్య విలువగలవి. దేవుడు మన వ్యక్తిగత కోరికలు నెరవేర్చునట్లు కాదుగాని ఆయన వాగ్దానాలు ఆయన పద్ధతిలో నెరవేర్చాలని విశ్వాసం నమ్ముతుంది.

**(2) సాధారణ మరియు ప్రత్యేక వాగ్దానాలు మధ్య వ్యత్యాసం గుర్తించాలి.**

మనం సాధారణ వాగ్దానం చదివినప్పుడు, దేవుడు మన నిర్దిష్ట పరిస్థితికి వాగ్దానం ఇస్తున్నాడా అని అడగాలి. కొన్ని వాగ్దానాలు సాధారణమైనవి కాని సార్వత్రికం కాదు.

కీర్తన 103:3 "నీ సంకటములన్నిటిని కుదుర్చువాడైన" దేవుని స్తుతిస్తుంది. కొందరు క్రైస్తవులు దీనిని, ప్రతి విశ్వాసి ఎదుర్కొనే ప్రతి రోగాన్ని దేవుడు స్వస్థపరుస్తాడనే సార్వత్రిక వాగ్దానంగా చూస్తారు. అయితే, ప్రతి రోగం స్వస్థపడదని వాక్యభాగం సెలవిస్తుంది. పౌలు స్వస్థత కొరకు ప్రార్థించాడు, దేవుడు "లేదు" అని చెప్పాడు (2 కొరింథీయులకు 12:7). కొన్నిసార్లు దేవుడు తన పిల్లలను స్వస్థపరుస్తాడు; మరికొన్నిసార్లు ఆ బాధ భరించే కృప అనుగ్రహిస్తాడు.

మనం ముగ్గురు హెబ్రీ యువకుల్లా స్పందించాలి. నెబుకద్నెజరు వాళ్లను అగ్నిగుండలో వేస్తానని బెదిరించినప్పుడు వారిలా చెప్పారు: "మేము సేవించుచున్న దేవుడు మండుచున్న వేడిమిగల యీ అగ్నిగుండములోనుండి మమ్మును తప్పించి రక్షించుటకు సమర్థుడు; మరియు నీ వశమున పడకుండ ఆయన మమ్మును రక్షించును; ఒక వేళ ఆయన రక్షింపకపోయినను రాజా, నీ దేవతలను మేము పూజింపమనియు, నీవు నిలువబెట్టించిన బంగారు ప్రతిమకు నమస్కరింపమనియు తెలిసికొనుము" (దానియేలు 3:17-18). దేవుడు వాళ్ళని విడిపించగల సమర్థుడని వాళ్ళకి తెలుసు; ఒకవేళ దేవుడు విడిపించకపోయినా, ఆయనను నమ్మకంగా సేవిస్తామనే సమర్పణతో ఉన్నారు.

దేవుడు శారీరక బాధల నుండి తన పిల్లలను విడిపించగల సమర్థుడు, కాని ఎల్లప్పుడు ఆ మార్గం అనుసరించడు. బైబిల్ వాగ్దానం ప్రత్యేకంగా మీ కొరకేనని దేవుడు స్పష్టపరచేవరకు, ఆయన తన చిత్తానుసారంగా చేస్తాడని నమ్మండి. అపొస్తలుడైన యోహాను ఈ వాగ్దానం ఇచ్చాడు, "ఆయననుబట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా, ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే. మనమేమి అడిగినను ఆయన మన మనవి ఆలకించునని మన మెరిగినయెడల మనమాయనను వేడుకొనినవి మనకు కలిగినవని యెరుగుదుము" (1 యోహాను 5:14-15).

ప్రతి బైబిల్ వాగ్దానం నేనున్న పరిస్థితికి వర్తిస్తుందని ఆశించకూడదు. "'ఆయన చిత్తప్రకారం అడుగుతాను" అని విశ్వాసం చెబుతుంది. ప్రతి వాగ్దానం వ్యక్తిగత వాగ్దానంగా తీసుకోకూడదు. దానికి బదులుగా, వాగ్దానం నా పరిస్థితికి ఉద్దేశించిందా కాదా అని అడగాలి.

**(3) యేసు నామంలో ప్రార్థించాలి.**

"మీరు నా నామమున దేని నడుగుదురో తండ్రి కుమారునియందు మహిమపరచబడుటకై దానిని చేతును" (యోహాను 14:13) అని యేసు వాగ్దానం చేశాడు. యేసు నామంలో ప్రార్థించడమంటే, మీ ప్రార్థన యేసు ప్రాధాన్యతలు, చిత్తం, స్వభావానికి అనుగుణంగా ఉందని అర్థం. దేవుని మహిమపరచు వాటి కొరకు యేసు ప్రార్థించాడు; మనం కూడా అలాగే చెయ్యాలి. మనకు నిజమైన విశ్వాసం ఉంటే, మన చిత్తం కాదుగాని దేవుని మహిమపరచాలని చూస్తాం.

తండ్రి మహిమపరచబడునట్లు ప్రార్థించడం అంటే, మన జీవితంలో దేవుని అంతిమ ఉద్దేశ్యాలకు అప్పగించుకోవడమని అర్థం. దేవుడు ఇశ్రాయేలుకు వాగ్దానం చేశాడు, "'నేను మిమ్మునుగూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును, రాబోవు కాలమందు మీకు నిరీక్షణకలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశములేగాని హానికరమైనవి కావు" (యిర్మీయా 29:11). ఇశ్రాయేలు 70 ఏళ్లు బబులోను చెరలో ఉండగా, దేవుడు ఈ వాగ్దానాన్ని ఇచ్చాడని గుర్తుంచుకోవాలి. బబులోనులో బానిసత్వం కూడా దేవుని ప్రజలకు మేలు చేస్తుంది; బాధలో, ఇశ్రాయేలు దేవునికి మొరపెడుతుంది, ఆయన వారి మొర ఆలకిస్తాడు.

ఈ వాగ్దానం నేడు మనకు వర్తిస్తుందా? అవును! దేవుని స్వభావం మారదు; ఆయన పిల్లలకు మేలు చేస్తాడు. జరిగే ప్రతిదీ మంచి కాదు, కాని మన జీవితంలో జరిగే ప్రతి విషయంలో దేవుడు తన ఉద్దేశ్యం నెరవేరుస్తున్నాడని మనకు తెలుసు గనుక యేసు నామంలో నమ్మకంగా ప్రార్థించవచ్చు.

## దేవుడు ఆయన సేవకుని పరీక్ష ద్వారా సిద్ధపరచాడు (కొనసాగింపు)

### శోధనలు (కొనసాగింపు)

***లోక రాజ్యాల ప్రతిపాదన***

సాతానుడి అంతిమ శోధన రాజీపడే ప్రతిపాదన ఇచ్చింది, సిలువ లేకుండా యేసు పరిపాలన సాధించే మార్గం. ఒకవేళ యేసు సాతానుడికి నమస్కరిస్తే, సిలువ శ్రమ తప్పించుకోగలడు. యేసు ద్వితీయోపదేశకాండము 6:13ని ఉటంకిస్తూ స్పందించాడు, "నీ దేవుడైన యెహోవాకు భయపడి ఆయనను సేవించి ఆయన పేరట ప్రమాణము చేయవలెను" (మత్తయి 4:10).

**శోధనపై యేసు విజయం**

శోధనలో యేసు మాదిరిననుసరించి ప్రయోజనం పొందాలంటే, యేసు పరిపూర్ణ మానవుడని గుర్తుంచుకోవాలి. ఆయన “సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను” (హెబ్రీయులకు 4:15).

► 1 కొరింథీయులకు 10:13 మరియు హెబ్రీయులకు 4:15 చదవండి. శోధన గురించి అవి ఏం బోధిస్తాయి?

1 యోహాను 2:16లో శరీరాశ, నేత్రాశ, జీవపుడంబం ద్వారా శోధన కలుగుతుందని అపొస్తలుడు చెప్పాడు. యేసు ఈ మూడు కోణాల్లో శోధించబడ్డాడు.

- యేసు రొట్టెకొరకు ఆకలిగొన్నప్పుడు సాతానుడు శరీరాన్ని శోధించాడు.
- యేసుకు లోక రాజ్యాలన్నిటిని చూపిస్తూ, సాతానుడు కన్నులను శోధించాడు.
- జనసమూహాన్ని ఆశ్చర్యపరచు నాటకీయ చర్యకు యేసును శోధిస్తూ, జీవపుడంబం కలుగజేయాలని చూశాడు.

శోధనపై యేసు విజయం, మన శోధనకు మాదిరి. శోధనపై విజయం సాధించడానికి యేసు వాడిన మూడు సాధనాలను గమనించండి.

***ఆత్మ శక్తి***

యేసు పరిశుద్ధాత్మ నడిపింపులో నడిచాడు. ఆత్మ నడిపింపునుబట్టి చేశాడు. “యేసు పరిశుద్ధాత్మ పూర్ణుడై యొర్దానునదినుండి తిరిగి వచ్చి, నలువది దినములు ఆత్మ చేత అరణ్యములో నడిపింపబడి” (లూకా 4:1).

ఆయన భూలోక పరిచర్య అంతటా, పరిశుద్ధాత్మ శక్తితో పనిచేశాడు. ఆత్మ శక్తితో దయ్యాలు వెళ్లగొట్టాడు. (మత్తయి 12:28). “దేవుడు నజరేయుడైన యేసును పరిశుద్ధాత్మతోను శక్తితోను అభిషేకించెనను నదియే. దేవుడాయనకు తోడైయుండెను గనుక ఆయన మేలుచేయుచు, అపవాదిచేత పీడింపబడిన వారినందరిని స్వస్థపరచుచు సంచరించుచుండెను” (అపొస్తలుల కార్యములు 10:38).

యేసు భూలోక పరిచర్యను పరిశుద్ధాత్మ శక్తితో చేశాడు. శోధనలో మనం బలంగా ఉండాలంటే, పరిశుద్ధాత్మ శక్తితో జీవించాలి.

### *ప్రార్థనా శక్తి*

40 దినాలు ఉపవాస ప్రార్థన తరువాత యేసు శోధించబడ్డాడు. ప్రార్థన ఆత్మీయ పోరాటానికి ఆయన్ని సిద్ధపరచింది. తరువాత పాఠంలో, యేసు జీవితం మరియు పరిచర్యలో ప్రార్థనకున్న కేంద్ర స్థానం చూద్దాం. యేసు ప్రార్థనపై ఆధారపడినప్పుడు, ప్రార్థన లేకుండా ఆత్మీయ పోరాటాలు గెలుస్తామని మనం ఎలా ఆశిస్తాం?

మన ప్రార్థనా జీవితంపై అజాగ్రత్తగా ఉన్నప్పుడు సాతానుడు మనపై తరచు దాడిచేస్తాడు. విలువైన ప్రార్థనా జీవితం లేకపోతే, శోధనలో బలహీనంగా ఉంటామని వాడికి తెలుసు.

### *వాక్య శక్తి*

యేసు ప్రతి శోధనను వాక్యంతో ఎదుర్కొన్నాడు. ఆయనకు ఈ లేఖనాలు ఎలా తెలుసు? యూదుల బాలురు తమ బాల్య విద్యలో భాగంగా తోరాను (ధర్మశాస్త్రాన్ని) కంఠస్థం చేస్తారు. యేసు శోధించబడినప్పుడు, ఆయనకు వాక్యం గుర్తొచ్చింది.

క్రైస్తవులుగా, మన హృదయంలో దేవుని వాక్యం నాటుకోవాలి. శోధన సమయాల్లో, శోధన ఎదుర్కొనే శక్తి వాక్యం ఇస్తుంది.

శోధన ఎదుర్కొంటున్న సమయంలో, మన యొద్ద ఉన్న సాధనాలే యేసు ఉపయోగించాడు. మనం కూడా యేసువలే ఆత్మ శక్తితో, ప్రార్థనా శక్తితో, వాక్య శక్తితో శోధన ఎదుర్కోవాలి. ఈ ఆయుధాలు లేకుండా, సాతానుడి అఘాతంలో పడిపోతాం.

### **నిశిత పరిశీలన: శరీరాధరణం**

యేసు దైవత్వంగలవాడని ఆరంభ క్రైస్తవులు సార్వత్రికంగా నమ్మారు. ఏరియస్ వంటి అబద్ధ బోధకులు యేసు దైవత్వాన్ని నిరాకరించినప్పటికీ, ఆర్థోడాక్స్ క్రైస్తవులు యేసు దైవికమైనవాడని బోధించారు.

ఆర్థోడాక్స్ క్రైస్తవ్యం యేసు పరిపూర్ణ మానవుడు అని కూడా బోధించింది. ఈ సిద్ధాంతాన్ని అబద్ధ బోధకులు నిరాకరించారు. నేటికీ, చాలామంది ఇవాంజెలికల్స్ యేసు మానవత్వాన్ని ఎక్కువ పట్టించుకోరు. యేసు పరిపూర్ణ దైవత్వంగలవాడే కాని ఆయన మానవత్వం వాస్తవం కాదని చాలామంది క్రైస్తవులు అనుకుంటారు. ఆయన మానవ శరీరాన్ని అరువు తీసుకున్నాడే తప్ప, పరిపూర్ణ మానవుడు కాదని చెబుతారు.

ఈ తప్పుడు ఆలోచనకు కొన్ని ప్రసంగ ఉదాహరణలు కూడా సహకరిస్తాయి. ప్రయాణించడానికి రైతుగా నటించిన ఒక రాజు పురాణాన్ని కొందరు ప్రసంగికులు చెబుతారు. అయితే, యేసు మానవుడిగా నటించలేదు. ఆయన మనలో ఒకడయ్యాడు.

మన క్రైస్తవ అనుభవానికి యేసు మానవత్వ సిద్ధాంతం ప్రాముఖ్యం. యేసు పరిపూర్ణ మానవుడు కానట్లైతే, ఆయన జీవితం మనకు వాస్తవ మాదిరి కాదు. ఒక వేదాంతవేత్త "యేసు నిజంగా మనవంటి వాడు కాకపోతే, మనం ఆయనవలే ఉండనక్కరలేదు" అని చెప్పాడు. [7]

మనం ఎల్లప్పుడు ఉద్దేశ్యపూర్వక పాపంలో పడిపోతామని చాలామంది నమ్ముతారు. పరిశుద్ధాత్మ శక్తి ద్వారా సాధారణ క్రైస్తవులు పాపంపై విజయం పొందుతారని యేసు ఆయన మానవత్వంలో చూపించాడు.

యేసు మన పతనమైన మానవత్వంలో భాగమైనప్పుడు, ఆత్మ కొరకైన మన అవసరత ఆయన అనుభవించినప్పుడు, మనవలె ఆయన శోధించబడినప్పుడు, శోధనపై ఆయన విజయం మన అనుదిన జీవితాల్లో విజయం ఎలా సాధించాలో చూపిస్తుంది. పరిశుద్ధాత్మ ద్వారా, మనం విజయవంతమైన జీవితం కలిగియుంటాం.

► వీటిలో దేన్ని అర్థం చేసుకోవడం మీకు కష్టం: యేసు దైవత్వ సిద్ధాంతమా లేక మానవత్వ సిద్ధాంతమా? మన క్రైస్తవ జీవితం, పరిచర్యలో ఈ సిద్ధాంతాల ప్రాముఖ్యతను చర్చించండి.

### ముగింపు: దేవుడు ఆయన సేవకులను సిద్ధపరుస్తాడు

ఈ పాఠంలో, యేసు పరిచర్యకు దేవుడు మార్గం ఎలా సిద్ధపరిచాడో చూశాం. ఆయన వంశావళి ద్వారా, రోమా సామ్రాజ్యం ద్వారా, అద్భుత జననం ద్వారా, బాప్తిస్మమిచ్చు యోహాను పరిచర్య ద్వారా, మరియు శోధన ద్వారా కూడా దేవుడు యేసు కొరకు మార్గం సిద్ధపరిచాడు.

ఈ సత్యాన్ని బైబిల్ అంతటా పదే పదే చూస్తాం. పౌలు ఉదాహరణ చూడండి. పౌలు రోమా పట్టణమైన తార్సులో పెరిగాడు. చిన్నప్పటినుండి, అతనికి అన్య స్నేహితులు ఉన్నారు. చాలామంది యూదుల్లా కాకుండా, పౌలు అన్యులతో సౌకర్యంగా ఉండేవాడు.

---

[7] Cherith Fee Nordling, "Open Question" *Christianity Today*, April 2015, 26-27

పౌలు తండ్రి, రోమా పౌరుడు, కాబట్టి పౌలుకు రోమా పౌరసత్వపు హక్కులు ఉన్నాయి. అతని తల్లి, యూదురాలు, కాబట్టి పౌలు పాత నిబంధన లేఖనాల్లో ఆరంభ శిక్షణ పొందాడు. అతను తెలివిగలవాడు, గొప్ప రబ్బీయైన గమలీయేలు దగ్గర హెబ్రీ దైవజ్ఞానాన్ని నేర్చుకున్నాడు. రోమా నేపథ్యంతో, గ్రీకు భాషను, గ్రీకు తత్త్వవేత్తల బోధలు నేర్చుకున్నాడు.

ఈ నేపథ్యాన్ని బట్టి, దేవుడు పౌలును అన్యజనులకు మిషనరీగా పిలవడంలో ఆశ్చర్యం లేదు. పుట్టుక నుండి, దేవుడు పౌలును అన్యజనులకు అపొస్తలుడుగా సిద్ధపరిచాడు. ఈ పరిచర్య కొరకు దేవుడు చేసిన సిద్ధపాటు గురించి ఆలోచించండి:

- పౌలు రోమా పౌరసత్వం వల్ల ఉచిత ప్రయాణం చేయగలడు.
- పౌలుకున్న హెబ్రీ, గ్రీకు శిక్షణ, క్రొత్త నిబంధనలో అతి గొప్ప పత్రికలు రాసే సాధనాలను ఇచ్చింది.
- పౌలు గ్రీకు తత్త్వశాస్త్రం నేర్చుకోవడం, ఏథెన్సు వంటి ప్రదేశాల్లో గ్రీకువారితో మాట్లాడే సమర్థత ఇచ్చింది.

బహుశా మీరు ఇలా అనొచ్చు: “పౌలువలే దేవుడు నాకు గొప్ప విద్య ఇవ్వలేదు. నాకు గొప్ప కుటుంబ నేపథ్యం లేదు.” అది సరే! మొదటి శతాబ్దపు సంఘంలో మరొక నాయకుడ్ని చూడండి.

సీమోను వాణిజ్య మత్స్యకారునిగా పెరిగాడు. అతనికి విద్య లేదు లేక పౌలు వంటి తెలివి లేదు. నిజానికి, పౌలు రాసిన కొన్ని విషయాలు గ్రహించడానికి కూడా కష్టమైనవని పేతురు తరువాత చెప్పాడు (2 పేతురు 3:15-16). కాని దేవుడు పేతురును అద్భుతంగా వాడుకున్నాడు. పౌలు మాట్లాడిన గంభీరమైన మాటలను గ్రహించలేనివారు, పేతురు చెప్పిన సరళ ప్రసంగాలు అర్థం చేసుకుంటారు.

దేవుడు నిన్ను పరిచర్య కొరకు సిద్ధపరిచాడు. నీ శిక్షణ, నీ నేపథ్యం, దేవుడు నీకు అనుగ్రహించిన ప్రతిదీ ఆయనకు అప్పగించుకుంటే, ఆయన ఉద్దేశ్యం నెరవేర్చుకోవడానికి నిన్ను వాడుకుంటాడు. దేవుడు పరిచర్యకు పిలిచిన వారిని, ఆయన పిలిచిన పని కొరకు సిద్ధపరుస్తాడు.

**పాఠం 1 అభ్యాసాలు**

(1) ఈ పాఠంలో, యేసు శోధనను జయించిన మాదిరిని మనం చూశాం. క్రింది ఇచ్చిన మొదటి చార్ట్ లో, బైబిల్లో శోధనపై జయం పొందిన ముగ్గురు వ్యక్తుల పేర్లు రాయండి. శోధన సమయంలో వారికి బలమిచ్చిన ఒక విషయం చెప్పండి. బైబిల్లో శోధనలో పడిపోయిన ముగ్గరు వ్యక్తుల పేర్లు రాయండి. ప్రతి వ్యక్తి విషయంలో వారు శోధనలో పడిపోవడానికి కారణమైన ఒక కారణం రాయండి.

(2) మీ రాసిన ఉదాహరణల ఆధారంగా, శోధనపై ఒక ప్రసంగం లేక బైబిల్ అధ్యయనం సిద్ధం చేయండి. యేసు ఉదాహరణ అదే విధంగా చార్ట్ లో మీరు రాసిన పేర్లు కూడా ఉపయోగించండి.

| శోధనపై జయం | లేఖనం | జయానికి కారణం? |
|---|---|---|
| యోసేపు (లైంగిక పవిత్రత) | ఆదికాండము 39 | దేవునిపై దృష్టి (ఆదికాండము 39:9) |
| | | |
| | | |
| | | |

| శోధనలో విఫలం | లేఖనం | ఓటమికి కారణం? |
|---|---|---|
| పేతురు<br>(యేసును యెరుగనని చెప్పడం) | లూకా 22:54-62 | అతినమ్మకం (లూకా 22:31-34) |
| | | |
| | | |
| | | |

# పాఠం 2

# యేసువలే ప్రార్థించడం

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) యేసు జీవితం మరియు పరిచర్యలో ప్రార్థనా ప్రాముఖ్యత గుర్తిస్తాడు.

(2) యేసు బోధలో ప్రార్థనా సూత్రాలను నేర్చుకొంటారు.

(3) నేడు మన పరిచర్యలో ప్రార్థన ప్రాముఖ్యత అర్థం చేసుకొంటారు.

(4) ప్రార్థనాపరులుగా మారడానికి ఆచరణాత్మక మెట్లు/దశలు వృద్ధిచేసుకొంటారు.

## పరిచర్యకు సూత్రం

మనం యేసువలే పరిచర్య చేయాలంటే, యేసువలే ప్రార్థించాలి.

## పరిచయం

ప్రార్థన పై సందేశంలో, ప్రొఫెసర్ హోవార్డ్ హెండ్రిక్స్ ఈ ఒప్పించు ప్రకటన చేశాడు:

> మీరు బైబిల్ చదివి, *ప్రార్థించకపోతే* సాతానుడు పెద్దగా పట్టించుకోడు ఎందుకంటే లేఖనం మీ జీవితాన్ని ఎన్నటికి మార్చదు. అది లేఖనాలు బాగా తెలుసనే ఆత్మీయ అతిశయాన్ని ఇస్తుంది.
>
> మీరు విశ్వాసం పంచుకుంటూ, *ప్రార్థించకపోతే* పెద్దగా పట్టించుకోడు ఎందుకంటే దేవుని గురించి మనుష్యులతో మాట్లాడటం కంటే మనుష్యుల గురించి దేవునితో మాట్లాడటం ముఖ్యమని వాడికి తెలుసు.
>
> మీరు స్థానిక సంఘు పరిచర్యలో పాల్గొంటూ, *ప్రార్థించకపోతే* సాతానుడు పెద్దగా పట్టించుకోడు ఎందుకంటే మీరు చురుకుగా ఉన్నా పెద్దగా ఏమి సాధించలేరు.[8]

---

[8] Howard G. Hendricks, “Prayer—the Christian’s Secret Weapon.” *Veritas* జనవరి 2004 లో మళ్లీ ముద్రించబడింది నుండి తీసుకున్నారు.

యేసు ఈ లోకంలో చేసిన పరిచర్యలో ప్రార్థనకు కేంద్రం స్థానం ఉంది. ప్రార్థన కంటే మరేది కూడా ప్రాధాన్యం కాదు. యేసు పరిచర్య పరలోకమందున్న తన తండ్రితో సంబంధంపై స్థిరపడింది. ఆ సంబంధం ప్రార్థన, దేవునితో సన్నిహిత సహవాసం ద్వారా కొనసాగింది.

► ఈ పాఠం అధ్యయనం చేసే ముందు, మీ జీవితం మరియు పరిచర్యలో ప్రార్థనా పాత్రను పరిశీలించండి. ఈ ప్రశ్నలు అడగండి:

- నా ప్రార్థన జీవితం స్థిరంగా ఉందా?
- ప్రార్థనకు నిర్దిష్టమైన సమాధానం చివరిగా ఎప్పుడు పొందుకున్నాను?
- నా ప్రార్థన జీవితంలో గొప్ప సవాళ్లు ఏంటి?
- ప్రార్థన జీవితంలో నేను ఎదుగుతున్నానా?

> "ప్రార్థన ప్రాణానికి వ్యాయామశాల."
> - శామ్యూల్ జ్వెమెర్, "ఇస్లాం అపొస్తలుడు."

## ప్రార్థనకు యేసు మాదిరి

యేసు పరిచర్య అంతటా, క్లిష్టమైన పరిస్థితులలో ఆయన ప్రార్థనలో నిమగ్నమవ్వడం మనం చూస్తాం. యేసు ప్రార్థించిన 15 సందర్భాలను సువార్తలు వెల్లడిస్తాయి. ప్రార్థన ఎప్పుడు కూడా రెండవ స్థానంలో ఉండకూడదు; ఆయన జీవితంలో ప్రార్థన ఎల్లప్పుడు కేంద్రంగా ఉండేది.

లూకా ఇతర రచయితలు కంటే ఎక్కువగా, యేసు పరిచర్యలో ప్రార్థనను నొక్కి చెబుతాడు . పన్నెండుమంది శిష్యులను ఎన్నుకునే ముందు రాత్రంతా ప్రార్థించాడని కేవలం లూకా చెబుతాడు (లూకా 6:12). యేసు పేతురు, యాకోబు, యోహానులను వెంటబెట్టుకుని కొండమీద ప్రార్థించడానికి వెళ్లినప్పుడు రూపాంతరం జరిగిందని కేవలం లూకా చెబుతాడు (లూకా 9:28). ఆది సంఘంలో ప్రార్థన పాత్ర గురించి లూకా 35సార్లు రాసినందున అపొస్తలుల కార్యములులో కూడా ఈ ఉద్ఘాటన కొనసాగుతుంది.

### యేసు అనుదిన పరిచర్యలో ప్రార్థన

► మార్కు 1:32-39 చదవండి.

యేసు ఆరంభ పరిచర్యలోని ఈ కథ ప్రార్థన, సేవ ఒకదానికొకటి అనుసంధానమని చూపిస్తుంది. ఈ కథ పురోగతి చూడండి. మునుపటి సాయంత్రం, యేసు ఉంటున్న నివాసం బయట ప్రజలు గుమికూడరు, ఆయన అనేకులను స్వస్థపరిచాడు.

పెందలకడనే, యేసు ప్రార్థించుటకు ఏకాంత ప్రదేశానికి వెళ్లాడు. సీమోను పేతురు ఆయన యొద్దకు వెళ్లి, "అందరు నిన్ను వెదకుచున్నారని చెప్పారు." అప్పుడు యేసు, "ఇతర సమీప గ్రామములలోను నేను ప్రకటించునట్లు వెళ్లుదము రండి; యిందునిమిత్తమే గదా నేను బయలుదేరి వచ్చితినని వారితో చెప్పెను." సేవతో కూడిన ప్రార్థన, యేసు పరిచర్య మాదిరి.

ఇది పరిచర్యకు మాదిరి. ప్రార్థనలేని సేవ ఆత్మీయ అలసటకు దారితీస్తుంది. సేవలేని ప్రార్థనా జీవితం స్వీయ-కేంద్రీకృతం; మన చుట్టుప్రక్కలున్న ప్రజల అవసరాలు తీర్చుటకు మనం ఎటువంటి ప్రయత్నం చేయం. ప్రార్థన మరియు సేవ మిళితమవ్వాలని యేసు చూపించాడు.

### నిర్ణయ సమయాల్లో ప్రార్థన

► లూకా 6:12-16 చదవండి

యేసు పరిచర్యలో అతి ముఖ్యమైన ఒక నిర్ణయం, పన్నెండుమంది అపొస్తలులను ఎంపిక చేయడం. ఆయన మాటలు విన్న వేలమందిలో, చాలామంది శిష్యులుగా పిలువబడేంత సమీపస్తులు (యోహాను 6:60, 66). ఆయన అనుచరుల్లో 72మంది బోధనా పరిచర్యలో యేసుకు ప్రాతినిధ్యం వహించేటంత సమీపస్తులు (లూకా 10:1). కాని యేసు, అపొస్తలులుగా పన్నెండు మందిని మాత్రమే ఎంచుకున్నాడు.

పన్నెండుమంది అపొస్తలులు యేసుతో ఎక్కువ సమయం గడిపారు. ఈ లోకంలో ఆయన పరిచర్య ముగింపువరకు ఆయనతో ఉన్నారు. ఆయన ఆరోహణమైన పిమ్మట, పదకొండుమంది అది సంఘంలో నాయకులయ్యారు. పన్నెండుమంది ఎంపిక చాలా కీలకం. యేసు ఏ పుస్తకం రాయలేదు లేక ఏ పాఠశాలను స్థాపించలేదు. సంఘం పట్ల ఆయన దర్శనాన్ని వీళ్ళు నెరవేర్చారు.

పన్నెండుమంది అపొస్తలులను ఎన్నుకునే ముందు యేసు ఏం చేశాడు? ప్రార్థించాడు. క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనే ముందు, యేసు రాత్రంతా ప్రార్థించాడు. ముఖ్యమైన నిర్ణయాన్ని తీసుకునే ముందు దేవుని కుమారుడు అంత శ్రద్ధగా ప్రార్థించినప్పుడు, మనం నిర్ణయాలు తీసుకునే సందర్భంలో ప్రార్థన ఇంకెంత యెక్కువ ప్రధాన పాత్ర పోషించాలి!

### శ్రమల సమయంలో ప్రార్థన

► మత్తయి 26:36-46 చదవండి.

ఆయనను బంధించడానికి కొన్ని గంటల ముందు, యేసు ప్రార్థించడానికి గెత్సెమనే తోటకు వెళ్ళాడు. ప్రార్థనతో శ్రమ కొరకు సిద్ధపడ్డాడు. యేసు, మానవుడిగా తనకు ఎదురయ్యే శ్రమలను తప్పించుకోవడానికి ఆయన దైవత్వాన్ని ఎన్నడు ఉపయోగించలేదు. బదులుగా, శ్రమలు ఎదుర్కొనే శక్తి కొరకు ప్రార్థించాడు.

యేసు గెత్సమనే తోటలో చేసిన ప్రార్థన నేడు మనకు మాదిరి. ఆయన ప్రార్థన కల్పితం కాదు. యేసు నిజమైన బాధను భరించాడు. యేసు మానవీయ రీతిలో శ్రమలకు స్పందించాడని తెలుసుకోవడం మిమ్మల్ని ప్రోత్సహిస్తుందా? శ్రమను ఎదుర్కొంటూ, విశ్రాంతి కొరకు యేసు ప్రార్థించాడు:

> ఆయన తోటలో ఇలా ప్రార్థించలేదు: "ఓ, ప్రభువా, నీ పక్షాన బాధననుభవించునట్లు నన్ను ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు." లేదు, ఆయన బాధ, భయం, తిరస్కారం, సమీపిస్తున్న నిరాశ అనుభవించాడు. పరిస్థితులెలా కనిపించినప్పటికీ తన తండ్రి విశ్వానికి కేంద్రంగా ఉన్నాడని గ్రహించి, ప్రేమగల దేవునిపై నమ్మకం ఉంచి సహించాడు.[9]

శ్రమ కాలంలో, ఉన్నదానికంటే ఎక్కువ బలంగా ఉన్నట్లు నటించకూడదు. యోబువలే, బాధలో దుఃఖపడొచ్చు. తన మానవ స్వభావంలో, యేసు కూడా అదే చేశాడు! అయితే, మన ప్రేమగల తండ్రి తుది నియంత్రణగలవాడని తెలుసు గనుక యేసువలే నమ్మకంగా ఉండగలం.

ప్రార్థనలోనే తండ్రి చిత్తాన్ని మనం అంగీకరించగలం. తండ్రి చిత్తానికి విధేయత చూపడమే శ్రమ కాలంలో యేసు ప్రార్థనకు, మరియు శ్రమ కాలంలో మన ప్రార్థనకు కీలకం: "అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్త ప్రకారమే కానిమ్మని చెప్పెను."

## ప్రార్థనను గురించి యేసు బోధ

ప్రార్థన ప్రాముఖ్యతను యేసు ఆయన మాదిరి ద్వారా చూపడమే కాదుగాని, ఆయన బోధలో కూడా ఎక్కువ సమయం ప్రార్థనకు కేటాయించాడు. యేసు అనుచరుల ఆత్మీయ జీవితం విలువైన ప్రార్థన జీవితంపై ఆధారితమైందని ఆయనకు తెలుసు. ఈ కారణం చేత, ఆయన శిష్యులకు ప్రార్థనపై శిక్షణ ఇచ్చాడు.

### కొండమీద ప్రసంగంలో యేసు బోధ

► మత్తయి 6:1-18 చదవండి.

---

[9] Philip Yancey, *The Jesus I Never Knew*. (Grand Rapids: Zondervan, 1995), 161

కొండమీద ప్రసంగంలో, ఆత్మీయ కార్యాలకు సంబంధించి మూడు విషయాలు బోధించాడు: బీదలకు ఇవ్వడం, ప్రార్థన, విశ్వాసం. తనను అనుసరించేవారికి ఇవి సాధారణ కార్యకలాపాలుగా భావించాడని ఆయన బోధ ద్వారా స్పష్టమౌతుంది. "మీరు బీదలకు ఇస్తే... లేక "ప్రార్థన చేస్తే.... లేక ఉపవాసం చేస్తే.." అని యేసు చెప్పలేదు. ఆయన అనుచరులు ఉదారంగా, ప్రార్థనపూర్వకంగా, క్రమశిక్షణ కలిగియుండాలని ఆశించాడు.

ఈ సత్క్రియలు చెడు ఉద్దేశ్యాల నుండి పుట్టినట్లయితే అర్థరహితమని చూపించాడు. ప్రాచీన లోకంలో, *వేషధారి* అంటే నాటకంలో విభిన్న పాత్రలు పోషించడానికి వివిధ ముసుగులు ధరించే నటుడని అర్థం. ఇతరుల ఎదుట "మతపరమైన పాత్ర పోషించటం" సాధ్యం.

- మన దాతృత్వంతో ప్రజలను ఆకర్షించడానికి బీదలకు ఇవ్వడం సాధ్యం. యేసు "వారు తమ ఫలము పొంది యున్నారని నిశ్చయముగా" చెప్పుచున్నాను అన్నాడు.
- సున్నితమైన మన మాటలతో ప్రేక్షకులను ఆకర్షించడానికి ప్రార్థించడం సాధ్యం. యేసు, "వారు తమ ఫలము పొంది యున్నారని నిశ్చయముగా" చెప్తున్నాను అన్నాడు.
- మన భక్తి, క్రమశిక్షణతో ప్రజలను ఆకర్షించడానికి ఉపవాసం చేయటం సాధ్యం. యేసు, "వారు తమ ఫలము పొంది యున్నారని నిశ్చయముగా" చెప్తున్నాను అన్నాడు.

ప్రతి సందర్భంలో, బీదలకు ఇచ్చిన వ్యక్తి, ప్రార్థించిన వ్యక్తి, ఉపవాసం ఉన్న వ్యక్తి ఇతరుల మెప్పు కొరకు చేశాడు. ప్రజలు ఆకర్షితులయ్యారు; అది అతని బహుమానం. కాబట్టి, దేవుని నుండి ఇక ఎటువంటి బహుమానం పొందడు.

ఈ ఆత్మీయ కార్యకలాపాల ప్రేరణ/ఉద్దేశ్యం మన పరలోకపు తండ్రిని మెప్పించటం. అది బీదలకు ఇవ్వడమైనా, ప్రార్థించడమైనా లేక ఉపవాసం చేయడమైనా, మన బహుమానం దేవుడై ఉండాలి. మనం ఈ ఆత్మీయ కార్యకలాపాలను లోక మెప్పు కోసం చేయకూడదు. బదులుగా, దేవుని పట్ల ఎల్లప్పుడు ప్రగాఢమైన ఆశతో చెయ్యాలి.

యేసు తన శిష్యులకు సరళంగా, సూటిగా ప్రార్థించాలని బోధించాడు:

> పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడుగాక, నీ రాజ్యము వచ్చుగాక, నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక, మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములు క్షమించుము. మమ్మును శోధనలోకి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము (మత్తయి 6:9-13).

ఇది మత్తయి 6:7-8లో యేసు ఖండించిన వ్యర్థమైన మాటలవలే బుద్ధిహీనంగా చేసే ప్రార్థన కాదు. బదులుగా, ఇది మన ప్రార్థనలను మార్గనిర్దేశం చేయాల్సిన పైఖరులను సూచిస్తుంది:

***సంబంధం***

“పరలోకమందున్న మా తండ్రీ” అనే మాట దేవునితో మన సంబంధాన్ని చూపిస్తుంది. దేవుడు, దూరంగా ఉండేవాడుగా కాకుండా, తన పిల్లలకు మంచి యీవులు ఇవ్వటానికి ఇష్టపడే తండ్రిగా గుర్తిస్తాం (మత్తయి 7:11). ఈ పదసమూహం సాన్నిహిత్యాన్ని (“మా తండ్రీ”) అధికారాన్ని (“పరలోకమందున్న”) సూచిస్తుంది. దేవుడు ఘనమైనవాడు అదే విధంగా వ్యక్తిగతమైనవాడు.

***గౌరవం***

“నీ నామము పరిశుద్ధపరచబడుగాక” - పరలోకమందున్న తండ్రికి, మనకు మధ్య వ్యత్యాసం చూపిస్తుంది. దేవుడు ప్రేమగల తండ్రియైననూ, ఆయన పరిశుద్ధుడు.[10] ప్రసంగి లోని జ్ఞాని నేర్చుకున్నట్లుగా, గౌరవంతోను, భయంతోను దేవుని సన్నిధిలో ప్రవేశించాలి. (ప్రసంగి 5:2)

***లోబడుట***

“నీ రాజ్యము వచ్చుగాక, నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక” ఆయన అధికారానికి మనం ఇష్టపూర్వకంగా లోబడుతున్నామని సూచిస్తుంది. దేవుని చిత్తం పరలోకంలో సంపూర్ణంగా నెరవేర్చబడినందున, భూమి మీద కూడా నెరవేరాలని మనం ప్రార్థించాలి.

***ఏర్పాటు***

లోకంలో అధిక శాతం ప్రజలు తమ అనుదిన ఆహారం కోసం అనుదినం పనిచెయ్యాలి. “మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము”- అనుదినం తండ్రి పై మన నమ్మకాన్ని సూచిస్తుంది. ఆయన పిల్లలుగా, ఆయన మన అవసరాలు తీరుస్తాడని నమ్మాలి.

***ఒప్పుకోలు***

“మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములు క్షమించుము.” లూకా 11:2-4లో, ఇదే ప్రార్థనలో “మేము మాకచ్చియున్న ప్రతి వానిని క్షమించుచున్నాము గనుక మా పాపములను క్షమించుము” అను

---

[10] “పరిశుద్ధపరచబడును” అంటే “పరిశుద్ధత” లేక “ప్రత్యేకత.”

పదాలు ఉన్నాయి. మన పాపం, దేవునికి రుణపడి ఉండటం (కొలొస్సయులకు 2:14) కాబట్టి మత్తయి మరియు లూకా రెండింటిలో అర్థం ఒకటే.

ఇతరులను మనం క్షమించడం, దేవుడు మనల్ని క్షమించడంతో అనుసంధానించడం వల్ల, మన క్షమాపణను మనం సంపాదించుకోగలమని యేసు చెప్పలేదు. బదులుగా, క్షమాపణ పొందిన మనం మన యెడల తప్పుచేసిన వారిని ఇష్టపూర్వకంగా క్షమించాలి. క్షమించని దాసుని గూర్చి యేసు చెప్పిన ఉపమానం, మన క్షమాపణ మరియు ఇతరులను క్షమించడానికి మన సుముఖత మధ్య సంబంధాన్ని చూపిస్తుంది. (మత్తయి 18:21-35).

***విజయం***

"మమ్మును శోధనలోకి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము" అనే మాట శోధన, పరీక్ష పై విజయం కొరకు చేసే ప్రార్థన. దేవుడు ఆయన పిల్లలను ఎప్పుడూ శోధించడు (యాకోబు 1:13), కాని మనందరం శోధన, పరీక్ష సందర్భాలు ఎదుర్కొంటాం (1 పేతురు 1:6-7). ఆ సందర్భాల్లో, సహించగలిగినంతకంటే ఎక్కువగా ఆయన మనలను శోధింపనియ్యడు (1 కొరింథీయులకు 10:13).

**ధైర్యంతో చేసే ప్రార్థనపై యేసు బోధ**

► లూకా 11:1-13 చదవండి.

ప్రభువు ప్రార్థన తర్వాత, ఆయన పిల్లలకు మంచి యీవులు ఇవ్వటానికి ఇష్టపడే ప్రేమగల తండ్రికి ధైర్యంగా ప్రార్థించాలని బోధించే ఉపమానాన్ని లూకా చెప్పాడు. మధ్య తూర్పు ప్రాంతంలో, అతిథి సత్కార్యం చేసేటప్పుడు పొరుగువారి నుండి అప్పు తీసుకోవడం సర్వసాధారణం. ఒకవేళ ఆ వ్యక్తి ధైర్యంగా అడిగితే, పొరుగువాడు అవసరమైన ప్రతిదీ ఇస్తాడు. ఆ సంస్కృతిలో, అభ్యర్థనకు "లేదు/కాదు" అని చెప్పడం అసభ్యంగా ఉంటుంది. పొరుగువాడు తన కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడానికి ఇష్టపడకపోయినా సరే, సహాయం కోసం అడిగినప్పుడు తిరస్కరించడు.

మరింత గొప్ప పద్ధతిలో, ధైర్యంగా అడిగే తన పిల్లలకు దేవుడు మంచి యీవులు ఇవ్వాలని ఆశిస్తాడు. ఈ ఉపమానంలో ఆ వ్యక్తి ధైర్యంగా అడిగినట్లే, మనం మన పరలోకపు తండ్రి దగ్గరకు ధైర్యంగా వెళ్ళొచ్చు. ఎందుకు? మన అభ్యర్థన తిరస్కరిస్తే, దేవుడు అవమానించబడతాడని కాదుగాని అడుగడానికి, వెదకడానికి, తట్టడానికి మనకు అనుమతిచ్చాడు (లూకా 11:9).

## నిశిత పరిశీలన: హెబ్రీ బోధనా శైలులు

లూకా 11:1-13లో, అతిథి ఆహారం కోసం అప్పు అడగడానికి పొరుగువాడు వచ్చినప్పుడు సహాయం చేయడానికి మంచం కూడా దిగడానికి ఇష్టపడని వ్యక్తి గురించి యేసు ఒక కథ చెప్పాడు.

ఈ ఉపమానం అర్థం చేసుకోవాలంటే, హెబ్రీ బోధనా శైలి అర్థం చేసుకోవాలి - చిన్న వాదన నుండి పెద్ద వాదన. ఈ విధమైన బోధ సెలవిస్తుంది, "ఒకవేళ A (చిన్న వాదన) నిజమైతే, B (పెద్ద వాదన) **ఇంకెంత** నిజమై ఉండాలి." ఇప్పుడు మనం ఇలా చెప్పొచ్చు, "ఒక వ్యక్తి ఆకలిగొన్న పరదేశికి భోజనం పెట్టగలిగినప్పుడు (A), ప్రేమగల తండ్రి తన పిల్లలను **ఇంకెంత** పోషించగలడు (B)."

మీరు ఈ ఉపమానం చదివినప్పుడు, "దేవుడు ఇష్టంలేని ఆ పొరుగువాని వంటివాడు కాబట్టి నా ప్రార్థనలకు జవాబు పొందాలంటే ఆయన్ని ఒప్పించాలని అనుకోవద్దు." బదులుగా, యేసు అయిష్టత చూపు ఆ మిత్రుడికి, యిష్టపడే పరలోక తండ్రికి మధ్య వ్యత్యాసాన్ని వివరిస్తున్నాడు. లోకసంబంధియైన స్నేహితుడు, ధైర్యంగా చేసిన అభ్యర్థనకు స్పందించినప్పుడు, పరలోకపు తండ్రి తన పిల్లలకు **ఇంకెంతగా** స్పందించగలడు!

## ప్రార్థన పై యేసు బోధ (కొనసాగింపు)

### ధైర్యంగా చేసే ప్రార్థనను గురించి యేసు బోధ (కొనసాగింపు)

#### *ప్రార్థన అంటే సంబంధం*

దేవుడు తన పిల్లల ప్రార్థనకు జవాబివ్వాలనుకున్నప్పుడు, జవాబు ఎందుకు ఆలస్యమౌతుంది? అడుగుడి, వెదకుడి, మరియు తట్టుడి అనే ఆజ్ఞలు వర్తమానకాలంలో ఉన్నాయి. అంటే మనం అడుగుతూ, వెదకుతూ, తట్టుతూ ఉండాలని అర్థమిస్తాయి. ఎందుకు?

> "ప్రార్థన అంటే మనకు కావలసినవి అడిగి, పొందుకోవడం కాదు. ప్రార్థన అంటే దేవుని అడిగి, మనకు అవసరమైనవాటిని పొందటం"
> \- ఫిలిప్ యాన్సీ

ఒక కారణం, ప్రార్థన అంటే విజ్ఞాపనల జాబితా కాదు. ప్రార్థన అంటే మన పరలోకపు తండ్రితో కొనసాగే సంబంధం. "యెడతెగక ప్రార్థనచేయుడి," (1 థెస్సలొనీకయులకు 5:15) అని పౌలు మనలను ఆజ్ఞాపించినట్లుగా, మనం అడుగుతూ, వెదకుతూ, తట్టుతూ ఉండాలని యేసు ఆజ్ఞాపిస్తున్నాడు. దేవునితో కొనసాగే ఈ సంభాషణ ద్వారా, మన సంబంధం మరింత పెరుగుతుంది. ఇది ప్రార్థన విజ్ఞాపనల జాబితాకు మించింది; ప్రార్థన అంటే సంబంధం.

### పట్టుదలతో చేసే ప్రార్థన గురించి ఉపమానం

లూకా 17లో, దేవుని రాజ్యం ఎప్పుడు వస్తుందని పరిసయ్యులు యేసుని అడిగారు. అప్పుడు యేసు, వారు సూచనల కొరకు చూడకూడదని సమాధానమిచ్చాడు. బదులుగా, ఆయన వారితో, "దేవుని రాజ్యము మీ మధ్యనే యున్నది" (లూకా 17:20-21) అని చెప్పాడు. యేసును వెంబడిస్తున్న వారిలో దేవుని రాజ్యం ఉంది.

యేసు ఆ తరువాత శిష్యులను చూసి, దేవుని రాజ్యం గురించి ప్రకటించాడు. యేసు తక్షణ రాజకీయ రాజ్యం స్థాపిస్తాడని వారు భావించారు, కాని ఆయన మరణం తరువాత కూడా వేచి ఉండాలని యేసు వారిని సిద్ధపరిచాడు. వేచియున్న సమయంలో, వారు విసుకక పట్టుదలతో ప్రార్థించాలి. ఆ తరువాత, యేసు వారికి నమ్మకమైన ప్రార్థన గురించి ఒక కథ చెప్పాడు.

► లూకా 18:1-8 చదవండి.

అనేక ప్రాచీన పట్టణాల్లో, న్యాయాధిపతులు నమ్మకంగా ఉండేవారు కాదు. లంచం తీసుకోకుండా ఒక్కరి కేసు కూడా విచారించేవారు కాదు. ఈ విధవరాలి దగ్గర న్యాయాధిపతికి లంచం ఇచ్చేంత డబ్బు లేదు, కాబట్టి అతడు ఆమె కేసు విచారణ చేయడానికి ఇష్టపడలేదు. చివరిగా, అన్యాయస్తుడైన న్యాయాధిపతి, "ఈ విధవరాలు నన్ను తొందరపెట్టుచున్నది గనుక ఆమె మాటి మాటికి వచ్చి గోజాడకుండునట్లు ఆమెకు న్యాయము తీర్తునని" చెప్పాడు.

ధైర్యవంతుడైన పొరుగువాని ఉపమానం వలే ఈ ఉపమానం కూడా చిన్న వాదన నుండి పెద్ద వాదన బోధనా శైలిని ఉపయోగిస్తుంది. మీరు ఈ ఉపమానం చదివినప్పుడు, ఈ విషయాలు అర్థం చేసుకోవాలి:

- దేవుడు అన్యాయస్తుడైన న్యాయాధిపతి కాదు. మన తండ్రి తాను ఎన్నుకున్నవారికి న్యాయం తీరుస్తాడు.
- మనం విధవరాలి వంటి వాళ్ళం కాదు. ఆమె పరదేశి; మనం దేవుని పిల్లలం.
- ఆమెకు న్యాయాధిపతి యొద్దకు వెళ్ళే ప్రవేశం లేకపోయింది; యేసు ద్వారా మనం దేవుని యొద్దకు వెళ్లగలం.

> "ప్రార్థన అంటే దేవుని అయిష్టతను జయించడం కాదు. ప్రార్థన అంటే దేవుని చిత్తానికి అప్పగించుకోవడం."
> - మార్టిన్ లూథర్

ఇది వైరుధ్యాలున్న ఉపమానం. ఒక అన్యాయస్తుడైన న్యాయాధిపతియే పట్టుదలతో ఉన్న విధవరాలికు జవాబిచ్చినప్పుడు, మన పరలోకపు తండ్రి తన పిల్లల ప్రార్థనలకు ఇంకెంతగా జవాబిస్తాడు.

### వినయంతో కూడిన ప్రార్థనను గురించిన ఉపమానం

► లూకా 18:9-14 చదవండి.

"తామే నీతిమంతులని తమ్మునమ్ముకొని యితరులను తృణీకరించు కొందరితో" యేసు ప్రార్థన గురించి మరొక ఉపమానం చెప్పాడు. ఈ ఉపమానం ప్రార్థనలో మనం కలిగి ఉండాల్సిన సరైన వైఖరిని బోధిస్తుంది.

ఉపమానంలో ముఖ్య విషయం ముగింపులో ఉంది: "తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడుననియు తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును". తమ నీతి కారణంగా ప్రార్థనలకు జవాబు వస్తుందని పరిసయ్యులు భావించారు. స్వనీతిపరులు కాని వారి ప్రార్థనలకు దేవుడు ఆయన కృపను బట్టి జవాబిస్తాడని యేసు చూపించాడు. ఏ ఒక్కరు కూడా ప్రార్థనా జవాబు పొందడానికి అర్హులు కారు; అనర్హులైనవారి ప్రార్థనలకు దేవుడు ఆయన కృపను బట్టి జవాబిస్తాడు.

### అన్వయం: క్రైస్తవుని జీవితంలో ప్రార్థన

కీస్తుని పోలిన వారందరూ ప్రార్థనాపరులు. 19వ శతాబ్దపు లివర్ పూల్ బిషప్, అయిన జే.సి. రైల్, చరిత్ర అంతటిలో గొప్ప క్రైస్తవుల జీవితాలు అధ్యయనం చేసి ఇలా చెప్పాడు. కొందరు ధనికులు, మరొకొందరు దరిద్రులు. కొందరు పండితులు, మరొకొందరు పామరులు. కొందరు కెల్వినిస్టులు; మరికొందరు అర్మీనియన్లు. కొందరు ఆరాధన క్రమం పాటించేవారు; మరికొందరు స్వేచ్ఛాపరులు. "కాని వారందరిలో సాధారణంగా ఒక విషయం ఉంది. వారందరూ ప్రార్థనాపరులు."[11]

సంఘ చరిత్ర అంతటా, క్రీస్తును పోలిన వారందరూ పార్థనాపరులు. ఒక గొప్ప క్రైస్తవ నాయకుడైన ఇ.యం. బౌండ్స్, ప్రతి ఉదయం 4:00-7:00 వరకు ప్రార్థించేవాడు. అతను "పరిశుద్ధాత్ముడు పద్ధతుల ద్వారా కాదుగాని మనుష్యుల ద్వారా ప్రవహించాడు. ఆయన యంత్రాలపైకి కాదుగాని మనుష్యుల పైకి వచ్చాడు. ఆయన ప్రణాళికలను కాదుగాని మనుష్యులను ప్రార్థనాపరులైన మనుష్యులను అభిషేకించాడు" అని రాశాడు.[12]

జార్జ్ ముల్లర్ వేలాదిమంది పిల్లలకు అనాథాశ్రమాలు పెట్టాడు. మానవుల సహాయం కోరక ప్రార్థనపైనే ఆధారపడాలని నిర్ణయించుకున్నాడు. కేవలం ప్రార్థన ద్వారా $7,000,000 పొందుకున్నాడు. అతడు అనాథాశ్రమాలకు సహకారం ఇవ్వడమే కాకుండా, ఇతర పరిచర్యలకు కూడా వేలాది డాలర్లు ఇచ్చాడు. ప్రార్థన శక్తి జార్జ్ ముల్లర్ కు తెలుసు.

---

[11] Matt Friedeman, *The Accountability Connection*. (Wheaton, Illinois: Victor Books, 1992), 37 లో ఉటంకించారు.

[12] Edward M. Bounds, *Power Through Prayer*. (Kenosha, Wisconsin: Treasures Media, n.d.), 2

## మనం ఎందుకు ప్రార్థిస్తాం?

> "ప్రార్థన లేకుండా ఏదైన చేస్తే, అది నిజంగా విలువైనదేనా?
> - డా. హోవార్డ్ హెండ్రిక్స్

### *మనం దేవునిపై ఆధారపడతాం గనుక ప్రార్థిస్తాం*

ఆయన మానవత్వంలో, యేసు తన తండ్రితో మాట్లాడడానికి ప్రార్థనపై ఆధారపడ్డాడు. ప్రార్థన దేవునిపై ఆధారపడే చర్య. మనం మనపై ఆధారపడక దేవునిపై ఆధారపడుతున్నామని ఇది చూపిస్తుంది.

► మత్తయి 26:31-46 చదవండి.

సీమోను పేతురు పతనం, ప్రార్థన ప్రాముఖ్యత చూపిస్తుంది. "ఈ రాత్రి మీరందరు నా విషయమై అభ్యంతరపడెదరు" అని యేసు ఆయన శిష్యులను హెచ్చరించాడు. మరింత సూటిగా, "సీమోనూ, సీమోనూ, ఇదిగో సాతాను మిమ్మును పట్టి గోధుమలవలె జల్లించుటకు మిమ్మును కోరుకొనెను" (లూకా 22:31) అని చెప్తూ పేతురును హెచ్చరించాడు. పేతురు రెండు కారణాల వల్ల పతనమయ్యాడు.

1. **పేతురు మితిమీరిన ఆత్మవిశ్వాసం గలవాడు.** అతను "అందుకు పేతురు నీ విషయమై అందరు అభ్యంతర పడినను నేను ఎప్పుడును అభ్యంతరపడనని ఆయనతో చెప్పగా.... చూచి నేను నీతోకూడ చావవలసివచ్చినను, నిన్ను ఎరుగనని చెప్పననెను" (మత్తయి 26:33, 35) అని చెప్పాడు. అహం పేతురుకు తనపై తాను ఆధారపడే అపార నమ్మకం కలిగించింది.

2. **పేతురు ప్రార్థనలో విఫలమయ్యాడు.** తన సొంత బలాన్ని నమ్ముకున్నాడు, దేవునిపై ఆధారపడలేదు. యేసుతో కలిసి ప్రార్థించకుండా, పేతురు నిద్రపోయాడు. మనం దేవునిపై సంపూర్ణంగా ఆధారపడాలని గ్రహించినప్పుడే అత్యాశక్తితో ప్రార్థించగలం. డిక్ ఈస్ట్మన్ "కేవలం ప్రార్థనలోనే మనం మన సమస్యలు దేవునికి అప్పగిస్తాం".[13] అని రాశాడు,

### *దేవుని పరిపూర్ణంగా తెలుసుకోవడానికి ప్రార్థిస్తాం.*

> "మన కొరకు ఏదైనా పొందుకోవడానికి ప్రార్థనకు ఒక సాధనగా చూస్తాం; బైబిల్ ప్రకారంగా ప్రార్థన అంటే దేవునిని తెలుసుకోవడం."
> **- ఓస్వాల్డ్ ఛాంబర్స్**

అధునిక సంఘంలో ఉన్న ఒక గొప్ప బలహీనత ఏంటంటే, దేవుని గూర్చి పూర్తి అవగాహన లేకపోవడం. చాలాసార్లు, మన ప్రార్థన భౌతికపరమైన అవసరాల జాబితా మరియు వ్యక్తిగత విషయాలను మాత్రమే కలిగి ఉంటుంది.

---

[13] Dick Eastman, *The Hour That Changes the World*. (Grand Rapids: Baker Book House, 1995), 12

చాలామంది, “దేవా, మా పిల్లలను నీ పోలికెలో మార్చండి” అని కాకుండా, “మా పిల్లలకు మంచి ఉద్యోగం వచ్చేట్లు సహాయం చెయ్యండి” అని ప్రార్థిస్తారు. మనం ఎక్కువగా ఆత్మీయ స్వస్థత కోసం కాకుండా భౌతిక స్వస్థత కోసం ప్రార్థిస్తాం. ప్రార్థన అవగాహన మనకెంత తక్కువగా ఉందో ఇది చూపిస్తుంది.

ప్రార్థన యొక్క ఒక ప్రాథమిక ఉద్దేశ్యం, దేవుని పూర్తిగా తెలుసుకోవడం. ప్రార్థనలో, దేవుని హృదయానికి అనుగుణంగా ఉంటాం. ప్రార్థన అంటే మనకు కావలసింది దేవునిని అడిగి పొందుకోవడం కాదు. ప్రార్థన అనేది దేవుని హృదయాన్ని మనకు తెలియజేసే జ్ఞానం ఇస్తుంది, మనం ఆయన కోరుకున్నదే కోరుకునే వరకు.

మనం ఈ సమయానికి వచ్చేసరికి, “అందుచేత ప్రార్థన చేయునప్పుడు మీరు అడుగుచున్న వాటినెల్లను పొందియున్నామని నమ్ముడి; అప్పుడు అవి మీకు కలుగునని మీతో చెప్పుచున్నాను” (మార్కు 11:24) అని యేసు చెప్పాడు. మన హృదయం దేవుని హృదయానికి అనుగుణంగా ఉన్నప్పుడు, మనం దురాశలతో లేక దేవుని చిత్తానికి వ్యతిరేకంగా అడగము (యాకోబు 4:3 మరియు 1 యోహాను 5:14). దేవుని హృదయం గూర్చిన ఈ అవగాహన పట్టుదల ప్రార్థన ద్వారా వస్తుంది.

మనం “ప్రార్థించేవరకు ప్రార్థించాలి” అని ప్యూరిటన్లు చెప్పారు. మరోమాటల్లో, మనం అర్థం లేని మాటలు విడిచిపెట్టి దేవుని సన్నిధిలోకి ప్రవేశించేవరకు సుదీర్ఘంగా, సహనంగా ప్రార్థించాలి. దేవునిలో ఆనందించేవరకు ప్రార్థించాలి.

► ప్రార్థన మీకు దేవుని గూర్చి, ఆయన చిత్తం గూర్చి లోతైన జ్ఞానం ఇచ్చిన సందర్భం గురించి చెప్పండి.

**మనం ఎలా ప్రార్థిస్తాం?**

ప్రార్థన విషయంలో యేసు మాదిరిని అధ్యయనం చేయడం ద్వారా, ప్రభావవంతమైన ప్రార్థన గురించి ముఖ్య పాఠాలు మనం నేర్చుకుంటాం.

***సహనంతో ప్రార్థిస్తాం***

యేసు దేవుని కుమారుడు. అతని ప్రార్థన జీవితం, “తండ్రీ, నేను ఏమి చేయాలనుకుంటున్నావు?” అని చెప్పే ఒక సాధారణ విషయం అని ఎవరైనా అనుకోవచ్చు. మరియు తక్షణ సమాధానాన్ని పొందుతుంది! దానికి బదులుగా, పన్నెండు మంది అపొస్తలులను ఎన్నుకునే ముందు యేసు రాత్రంతా ప్రార్థనలో గడపడం మనం చూస్తాం. ఆయన గెత్సేమనే తోటలో ప్రార్థనలో పోరాడాడు. యేసుకు కూడా ప్రార్థన విషయంలో ఓర్పు, సమయం అవసరం. ప్రార్థన అంటే దేవుని కోసం వేచి ఉండడం.

ప్రార్థనలో, వేచివుండాల్సిన ప్రాముఖ్యత గురించి రాస్తూ, గ్లెన్ పేటర్సన్ ఇలా చెప్పాడు, “మనం వేచివుండగా దేని కొరకు వేచివున్నామనే దానికంటే, దేవుడు మనలో ఏం చేస్తున్నాడనేది చాలా ముఖ్యం. మనం ఎలా ఉండాలని దేవుడు కోరుతున్నాడో అలా మనల్ని సిద్ధపరిచే ప్రక్రియలో, వేచివుండడం ఒక భాగం.” దేవునిపై ఆధారపడినప్పుడు, ఆయన్ని మరింత ఎక్కువ అర్థం చేసుకుంటాం.

కీర్తన 37:1-9 ప్రార్థన గురించి ముఖ్యమైన పాఠాలు బోధిస్తుంది. ఈ ఆజ్ఞలు చూడండి:

- వ్యసనపడకూడదు
- యెహోవాయందు నమ్మకం ఉంచాలి
- యెహోవానుబట్టి సంతోషించాలి.
- నీ మార్గాన్ని యెహోవాకు అప్పగించాలి.
- ఆయన్ని నమ్ముకోవాలి.
- యెహోవా యెదుట మౌనంగా ఉండాలి.
- ఆయన కొరకు కనిపెట్టుకోవాలి.
- కోపాన్ని మానాలి.
- వ్యసనపడకూడదు (మళ్లీ!)

నీ హృదయవాంఛలను తీర్చే దేవునియందు నమ్మకముంచాలని ఈ ఆజ్ఞ చెబుతుంది (కీర్తన 37:4). పట్టుదల ప్రార్థన ద్వారా, మనం దేవుడు ఆశించే, నమ్మకస్తులైన ప్రజలుగా మారతాం.

### *పట్టుదల ప్రార్థన మాదిరి*

తన క్రైస్తవ జీవిత ఆరంభంలో, జార్జ్ ముల్లర్ తన ఐదుగురు స్నేహితులు మారాలని ప్రార్థించాడు. చాలా నెలలు గడిచిన తరువాత, ఒకరు ప్రభువును నమ్ముకున్నారు. పది సంవత్సరాలు తరువాత, ఇద్దరు మారారు. నాలుగవ వ్యక్తి మారటానికి 25 సంవత్సరాలు పట్టింది.

> “మనుష్యులు మన అభ్యర్థనలు, మన సందేశాలు, తిరస్కరించవచ్చు, మన వాదనలు వ్యతిరేకించొచ్చు, వ్యక్తులను త్రుణీకరించవచ్చు; కాని మన ప్రార్థనలకు నిస్సహాయులు”
> - జె. సిడ్లో బాక్స్టర్

తన ఐదవ మిత్రుని కొరకు ముల్లర్ చనిపోయేవరకు ప్రార్థిస్తూనే ఉన్నాడు. 52 సంవత్సరాలు, తన స్నేహితుడు క్రీస్తునంగీకరించాలని ప్రార్థిస్తూనే ఉన్నాడు! ముల్లర్ చనిపోయిన కొన్ని రోజులకు, ఐదవ వ్యక్తి రక్షించబడ్డాడు. ముల్లర్ పట్టుదల కలిగిన ప్రార్థనను నమ్మాడు.

### *వినయంతో ప్రార్థిస్తాం.*

“అయినను నా యిష్టముకాదు, నీ చిత్తమే సిద్ధించునుగాక అని” (లూకా 22:42) యేసు ప్రార్థించాడు. తండ్రి పరిపూర్ణ చిత్తాన్ని నమ్మొచ్చని యేసుకు తెలుసు.

ప్రార్థన అనేది వినయంతో కూడిన చర్య. మనం ఇతరుల కొరకు ప్రార్థిస్తాం ఎందుకంటే మన జ్ఞానంతో వారికి సహాయం చేయలేము; దేవునిపై ఆధారపడాలి. మనం మన కొరకు ప్రార్థించుకుంటాం ఎందుకంటే మన శక్తితో జీవితం గడపలేము; దేవునిపై ఆధారపడాలి.

ప్రార్థన దేవుని సహాయం మనకు అవసరమని గుర్తుచేస్తుంది. మన సమస్యలను మన సామర్థ్యంతో పరిష్కరించగలమని భావించినప్పుడు, హృదయపూర్వకంగా దేవునికి ప్రార్థించలేము. మన స్వంత శక్తితో జీవితపు సమస్యలను పరిష్కరించలేమని గ్రహించినప్పుడు, వినయంతో దేవునికి ప్రార్థన చేస్తాం.

మన ప్రార్థన నమ్మకంతో కూడిన వినయంతో చేయబడాలి. జవాబుకోసం దేవునిపై నిరీక్షించినప్పుడు, తన పిల్లలను ప్రేమించి, వారికి ఉత్తమమైనదే అనుకొనే పరలోకపు తండ్రికి మనం ప్రార్థిస్తున్నందువల్ల, మనకు నిశ్చయత మరియు సమాధానం లభిస్తాయి. జీవితంలోని మరియు పరిచర్యలోని ఒత్తిడులలో, వినయపూర్వకమైన ప్రార్థన మనకు దేవునిపై నిశ్చబ్ద నమ్మకాన్ని ఇస్తుంది.

### *వ్యక్తిగతంగా ప్రార్థిస్తాం.*

దేవునిని “మా తండ్రీ” అని వ్యక్తిగతంగా సంబోధించటం ద్వారా ప్రార్థన మొదలుపెట్టాలని యేసు శిష్యులకు బోధించాడు. నిజమైన ప్రార్థన వ్యక్తిగతమైంది. పాల్ మిల్లర్ ఇలా రాశాడు: “చాలామంది దేవునిపై కాకుండా ప్రార్థనపై మనసు పెడతారు గనుక ఎలా ప్రార్థించాలా అని ఇబ్బంది పడుతూ ఉంటారు.”[14] చాలాసార్లు, దేవునితో మాట్లాడకుండా “ప్రార్థనలు పలుకుతూ” ఉంటాం. “వ్యర్థమైన మాటలు” పలుకకుండా ఉండాలనేది యేసు హెచ్చరికల్లో ప్రధానం (మత్తయి 6:7).

కంఠస్థం చేసిన మాటలతో విందు బల్ల వద్దకు వచ్చిన వ్యక్తి గురించి ఆలోచన చేయండి. అతడు “మన కుటుంబంతో నేను కొంచెం మాట్లాడాలి, కాబట్టి నేను కొన్ని మాటలు కంఠస్థం చేశాను” అని చెప్తాడు. ఇది నిజమైన సంభాషణ కాలేదు! అతను బల్ల దగ్గర కూర్చున్న వ్యక్తులపై శ్రద్ధపెట్టాలనుకుంటాం కాని మాటలపై కాదు.

---

14 Paul E. Miller, *A Praying Life: Connecting with God in a Distracting World*. (Colorado Springs: NavPress, 2009)

మనం లేదా ఇతరులు రాసిన ప్రార్థనలు, ప్రార్థించాల్సిన విషయాలను గుర్తుచేసుకోవడానికి సహాయపడతాయి, కానీ ప్రార్థన అంటే ఎంపిక చేసుకున్న మాటలపై కాదుగాని దేవునిపై దృష్టిపెడుతుంది. ప్రార్థన వ్యవస్థ కాదు; ప్రార్థన ఒక సంబంధం. ప్రార్థన వ్యక్తిగతమైంది.

**మనం ప్రార్థనాపరులుగా ఎలా అవుతాం?**

ఐదవ శతాబ్దంలో, రోమాకు చెందిన గొప్ప వ్యక్తి, అనిసియా ఫాల్టోనియా ప్రోబా, ప్రార్థనపై సలహా ఇవ్వాలని అగస్టీన్ ని అడిగింది. ప్రార్థనాపరురాలిగా ఎలా అవ్వాలో ప్రోబ తెలుసుకోవాలనుకుంది. ప్రార్థనపై ఒక తెలివైన సలహాతో అగస్టీన్ పెద్ద లేఖ రాశాడు.[15] ఈ భాగంలో, ప్రార్థనను గురించి అగస్టీన్ చెప్పిన సూత్రాలు పరిశీలిస్తాం.

***ఎలాంటి వ్యక్తి ప్రార్థించే వ్యక్తిగా మారగలడు?***

మొదటిగా, ప్రార్థించే వ్యక్తి ఇతర ఏ వనరులు లేనివాడై ఉండాలని అగస్టీన్ చెప్పాడు. ప్రార్థించే వ్యక్తి కేవలం ప్రార్థనపై ఆధారపడాలి.

ప్రోబ రోమ్లో అత్యంత శక్తివంతమైన, ధనవంతురాలైన ఒక విధవరాలు. ఆమె ముగ్గురు కుమారులు రోమా రాయబారులుగా పనిచేశారు. అగస్టీన్, ప్రోబకి ఇలా చెప్పాడు: "ఈ లోకంలో తాను ఒంటరి వ్యక్తిగా భావించాలి." ఎంత ధనవంతురాలైన, శక్తివంతురాలైన లేక విజయం సాధించినా, దేవుని యెదుట మన నిస్సహాయత గుర్తించాలి. అలా చేయకపోతే, మన ప్రార్థనలు సుంకరి ప్రార్థనలవలే కాక పరిసయ్యుడి ప్రార్థనలవలే ఉంటాయి.

***దేని కొరకు ప్రార్థించాలి?***

అగస్టీన్, ప్రోబకు ఆసక్తికరమైన సలహా ఇచ్చాడు: "సంతోషకరమైన జీవితం కోసం ప్రార్థించు" అని చెప్పాడు. ఇది స్వార్థంగా అనిపించొచ్చు, కాని నిజమైన సంతోషం కేవలం దేవుని నుండి వస్తుందని అగస్టీన్ వివరించాడు. "కావాలనుకున్నవన్నీ కలిగియుండి, వద్దనుకున్నవాటిని పొందకుండా ఉన్న వ్యక్తి నిజంగా సంతోషం"గా ఉంటాడు.

క్రైస్తవుడు సంతోషంగా ఉంటాడు ఎందుకంటే అతనికి దేవుడున్నాడు, దేవుడు కోరనిది ఏదియు కలిగియుండడు. కీర్తనాకారునివలే, మనం దేవుని సన్నిధితో సంతృప్తిగా ఉంటాం.

---

15 Philip Schaff, ed. *The Confessions and Letters of St. Augustine: Nicene and Post-Nicene Fathers, First Series, Volume 1*. (Buffalo, New York: Christian Literature Publishing Company, 1886), 459-469

> యెహోవాయొద్ద ఒక్క వరము అడిగితిని దానిని నేను వెదకుచున్నాను. యెహోవా ప్రసన్నతను చూచుటకును ఆయన ఆలయములో ధ్యానించుటకును నా జీవితకాలమంతయు నేను యెహోవామందిరములో నివసింపగోరుచున్నాను (కీర్తన 27:4).

మనం అన్నిటికంటే ఎక్కువగా దేవుని సన్నిధిని నిజంగా కోరితే, దేవుడు తనను తాను మనకు అప్పగించడం ద్వారా మన లోతైన కోరికను తృప్తిపరుస్తాడని తెలుసుకొని సంతోషం కొరకు ప్రార్థించవచ్చు!

### *కష్టసమయాల్లో ఎలా ప్రార్థించాలి?*

"ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్థన చేయవలెనో మనకు తెలియదు" (రోమా 8:26) అని పౌలు చెప్పిన సందర్భాలు ఉంటాయని అగస్టీన్ ప్రోబకు గుర్తుచేశాడు. నిస్సహాయ సందర్భాల్లో మనం ఎలా ప్రార్థించాలి?

అగస్టీన్ మూడు లేఖనాలు చూశాడు. మొదటిగా, "శరీరములో ఒకముల్లు" నుండి విడుదల పొందడానికి ప్రార్థించినప్పుడు అతడు పౌలు ఉదాహరణను సూచించాడు. విడుదలకు బదులుగా, "నా కృప నీకు చాలును, బలహీనతయందు నాశక్తి పరిపూర్ణమగుచున్నది" అని దేవుడు వాగ్దానం చేశాడు. "నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను గనుక క్రీస్తు నిమిత్తము నాకు కలిగిన బలహీనతలలోను....నేను సంతోషించుచున్నాను" (2 కొరింథీయులకు 12:8-10) అని పౌలు సాక్ష్యమిచ్చాడు.

రెండవదిగా, అగస్టీన్ యేసు గెత్సెమనే ఉదాహరణ సూచించాడు. యేసు ఆశలు దేవునికి అప్పగించుకున్నాడు. యేసు విడుదల కొరకు ప్రార్థించాడు: "నా తండ్రీ, సాధ్యమైతే ఈ గిన్నె నాయొద్దనుండి తొలగి పోనిమ్ము." కాని ఇలా ముగించాడు, "అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్త ప్రకారమే కానిమ్మని ప్రార్థించెను" (మత్తయి 26:39).

చివరిగా, అగస్టీన్ రోమా 8:26 సూచించాడు. ప్రార్థన ఎలా చెయ్యాలో మనకు తెలియనప్పుడు, పరిశుద్ధాత్ముడు మన హృదయాలను నడిపిస్తాడు. ఆత్మ మన బలహీనతో సహాయం చేస్తాడు, ఉచ్చరింపశక్యముకాని మూలుగుతో విజ్ఞాపన చేస్తాడు. మనం మాటలకు మించిన స్థితిలో ఉన్నప్పుడు, పరిశుద్ధాత్ముడు మన ప్రార్థనలను, తండ్రి యొద్దకు చేర్చుతాడు, అప్పుడాయన సంకల్పం చొప్పున పిలువబడినవారికి, మేలుకలుగుటకై సమస్తం సమకూడి జరుగేలా చేస్తాడు (రోమా 8:26-28).

## ముగింపు: ప్రార్థన ఎలా చెయ్యాలో తెలియనప్పుడు

కొన్నిసార్లు మనం చేయగలిగినది మౌనంగా ఉండటం.[16] ప్రార్థించాలనుకుంటారు, కాని ఎలా ప్రార్థించాలో తెలీదు; ప్రార్థించడం రాదు. అప్పుడేం చేస్తారు? క్రీస్తు, మన ప్రధాన యాజకుడని గ్రహించడం కీలకమైన విషయం.

ఇవాంజెలికల్ క్రైస్తవులుగా, విశ్వాసులందరు యాజకులని నమ్ముతాం. ఈ గొప్ప సంస్కరణ సిద్ధాంతం, ప్రతి ఒక్కరికి తండ్రి యొద్దకు ప్రవేశం ఉందని బోధిస్తుంది. అయితే, అపార్థం చేసుకుంటే, ఈ సిద్ధాంతం ఆత్మీయ పోరాటానికి నడిపిస్తుంది. "సరిగా ప్రార్థించానా? నేను చేయాల్సిన పని చేశానా?" లాంటి అనుమానాలతో నిండిపోతాం:

2013లో ఒక సమావేశంలో, ఈ ప్రశ్నలతో సతమౌతున్నానని చెప్పి ప్రొఫెసర్ అలాన్ టోరన్స్ ఈ సాక్ష్యం చెప్పాడు.

> జనవరి 2008లో, నా భార్య జేన్ క్యాన్సర్ తో చనిపోయింది. ఆమె ఒక మంచి క్రైస్తవ స్త్రీ, భార్య, తల్లి. క్యాన్సర్ శరీరమంతా పాకిపోయి చనిపోవడం, ఆమె బాధ పిల్లలు కూడా చూస్తూ ఉండటం నాకు చాలా కష్టంగా అనిపించింది. కొన్నిసార్లు, నా దుఖంలో ఎలా ప్రార్థించాలో, ఏమి ప్రార్థించాలో కూడా అర్థం కాలేదు. ఎలా ప్రార్థించాలో నాకు తెలీదు.
>
> ఆ సమయంలో, క్రీస్తు యాజకత్వం మరింత సంబంధించినదిగా ఉంటుంది. జేన్ ను నా చేతుల్లో పట్టుకున్నాను, ఆరోహణమైన యాజకుడు (యేసు క్రీస్తు) మన పక్షాన విజ్ఞాపన చేస్తున్నాడు. మనమాయన సన్నిధిలో విశ్రమించగలం.
>
> ఆ సమయంలో నేను పట్టున పెట్టుకున్న ప్రార్థన ప్రభువుతో నేర్పిన ప్రార్థనే. నేను నా సొంతంగా ప్రార్థన చేయలేకుండా ఉండాను. "పరలోకమందున్న నా తండ్రీ—నేను ఉన్న చోటుకు దూరంగా ఉన్నవాడా." అనడం బదులుగా, పరిశుద్ధాత్మ ద్వారా నేను "పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడుగాక, నీ రాజ్యము వచ్చుగాక, నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక" అని ప్రార్థించాను.
>
> క్రీస్తు నిరంతర యాజకత్వ ప్రాముఖ్యత కనుగొనడమంటే, మన జీవితంలో ప్రతి భాగాన్ని, ఆరాధనను మార్చే సువార్తను కనుగొనటం.

[16] Marc Cortez, *Everyday Theology* నుండి ఈ భాగం తీసుకున్నారు.

మన వ్యక్తిగత ఆత్మీయ శక్తి ద్వారా తండ్రిని చేరుకోవాలనే విధంగా ఆలోచన చేస్తే విశ్వాసులందరి యాజకత్వాన్ని మనం అపార్థం చేసుకుంటాం. అది తప్పు. విశ్వాసులందరు యాజకులనే ఆలోచన, క్రీస్తు తప్పా మరో మధ్యవర్తి అవసరత లేదని నొక్కి చెబుతుంది. ఆయన మన కొరకు విజ్ఞాపన చేస్తాడు, ప్రార్థనలో విఫలమైన మన ప్రయత్నాలను అంగీకరించి, వాటిని ఆమోదయోగ్యమైన బలులుగా తండ్రికి అప్పగిస్తాడు. మన ప్రార్థన ఆత్మ ద్వారా, మన ప్రధానయాజకుడు యేసుక్రీస్తు మధ్యవర్తిత్వం ద్వారా బలపడుతుంది.

ప్రార్థన ఎలా చెయ్యాలో తెలియనప్పుడు, నిరాశపడొద్దు. మన ప్రక్కన మోకరించి, మనం చెప్పలేని వాటిని చెబుతూ తండ్రికి విజ్ఞాపన చేసే వ్యక్తి మనకు ఉన్నాడు.

### పాఠం 2 అభ్యాసాలు

(1) బైబిల్ పదకోశం లేదా బైబిల్ అన్వేషణ వెబ్ సైట్/ సాఫ్ట్ వేర్ ను ఉపయోగించి, బైబిల్లో ప్రార్థన గురించి మూడు ఉదాహరణలు కనుగొనండి. ప్రతి ప్రార్థనను పరలోక ప్రార్థనతో పోల్చండి. ఇతర బైబిల్ ప్రార్థనల్లో ఏ విషయాలు పరలోక ప్రార్థనలో కనిపిస్తాయి? మీరు చూసిన దానిని నమోదు చేయడానికి తరువాత పేజిలో పట్టికను ఉపయోగించండి.

(2) ఒక నెలపాటు ప్రార్థన పత్రిక కలిగియుండండి. ప్రార్థనలో మీ నిరాశలు, ప్రార్థనలో మీ జయాలు, ప్రార్థనకు దేవుడు ఇచ్చిన సమాధానాలు రాయండి. మీ వ్యక్తిగత ప్రార్థన జీవితంలో ప్రోత్సాహకరంగా ఉండడానికి ఈ పత్రికను ఉపయోగించండి.

| బైబిలానుసారమైన ప్రార్థన | లేఖనం | ప్రార్థనలో మూలకాలు/విషయాలు |
|---|---|---|
| నెహెమ్యా | నెహెమ్యా 1:5-11 | • సంబంధం: "వారితో నిబంధనను స్థిరపరచువాడా"<br>• గౌరవం: "భయంకరుడవైన గొప్ప దేవా"<br>• విధేయత: "చెవియొగ్గి నీ దాసుడనైన నా మొఱ్ఱను"<br>• ఏర్పాటు: "నీ దాసుని ఆలోచన సఫలపరచి"<br>• ఒప్పుకోలు: "ఇశ్రాయేలు కుమారుల దోషమును నేను ఒప్పుకొనుచున్నాను" |
| | | |
| | | |
| | | |

# పాఠం 3

# యేసువలే నడిపించుట

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) యేసును గొప్ప నాయకునిగా చేసిన గుణలక్షణాలను గుర్తించగలుగుతాడు.

(2) అనుదిన ప్రాధాన్యతలను నిర్ణయించే విధంగా దేవుడిచ్చిన పరిచర్యను, పిలుపును అనుమతించగలుగుతాడు.

(3) భవిష్యత్ నాయకులకు శిక్షణ ఇవ్వడానికి, పరిచర్య బృందాన్ని నిర్మించడానికి ఒక ప్రక్రియను వృద్ధి చేయాలి.

(4) ఆయన నడిపిస్తున్న ప్రజల సేవకుడుగా అతని పాత్రను అభినందించాలి.

## పరిచర్యకు సూత్రం

నాయకులు ఇతరులకు పరిచారం చేసినప్పుడు యేసువలే ఉంటారు.

## పరిచయం

*నాయకత్వం* అనే పదం బలమైన భావాలను రేకెత్తిస్తుంది. లోక-మనస్తత్వంగల ప్రజలు నాయకత్వం గురించి ఆలోచించినప్పుడు, అధికారం, స్థానం గురించి ఆలోచిస్తారు. నాయకుడుగా ఉండటం అంటే “అధికారి”గా ఉండటం. ప్రతిష్టాత్మక నాయకులు ఉన్నత స్థానాలు సంపాదించి, ఉన్నత బిరుదులు పొందాలనుకుంటారు. సేవకులు/పాస్టర్లు కూడా ఈ మనసు కలిగియుండగలరు. పెద్ద సంఘాలు, ఉన్నత స్థానాలు, గొప్ప గౌరవం మీద దృష్టిపెట్టగలరు.

ఈ లోక మనస్తత్వానికి స్పందనగా, కొందరు క్రైస్తవులు నాయకత్వమనే పదానికి వ్యతిరేకంగా ప్రతిస్పందిస్తారు. “నా సంఘంలో నాకు నాయకుడుగా ఉండాలని లేదు. పరిచారకునిగా ఉండాలని ఉంది” అని ఒకప్పుడు ఒక సేవకుడు/పాస్టర్ చెప్పాడు. అతని మాటలు వినయంగా అనిపించినప్పటికీ, అది తన సంఘాన్ని ఒక దిశ లేక ఉద్దేశ్యం లేకుండా చేసింది. సంస్థలన్నిటికీ, సంఘాలకు కూడా, నాయకులు అవసరం.

*పాస్టర్* అనే పదానికి మూల పదం “కాపరి” అని పాస్టర్లు గుర్తుంచుకోవాలి. కాపరికి, ఆకట్టుకునే ఉద్యోగమంటూ లేదు! కాపరి దుర్వాసన గల గొర్రెలతో రోజులు గడుపుతాడు. అతని పనులు అంత ఆసక్తికరంగా ఉండవు: ఆహారం, నీరు కోసం వెదకటం, గొర్రెల వెనక తిరగటం, గాయపడిన గొర్రెలపట్ల శ్రద్ధ చూపటం.

కాపరికి ఒక ముఖ్య పాత్ర ఉంది. కాపరి హీనమైన పనులు చేస్తాడు, కాని గొర్రెమందను సురక్షితంగా చూసుకునే గొప్ప బాధ్యత కూడా కలిగి ఉంటాడు. గొర్రెలమందలు నాయకుడైన కాపరిపై ఆధారపడతాయి.

యేసు, నిజమైన నాయకుడికి ఆదర్శవంతమైన మాదిరి. ఆయన లోతైన ఉద్దేశ్యంతో వినయంగా పరిచారం చేసిన కాపరి. ఆయన బలమైనవాడు కాని కనికరపూర్ణుడు. స్థానం కోసం చూడలేదు, కాని ఆయన పరిచర్య/పనిలో నమ్మకస్తుడు. పరిచార-నాయకులకు యేసు మాదిరి.

► మీకు వ్యక్తిగతంగా తెలిసిన ఒక విజయవంతమైన నాయకుని గురించి ఆలోచించండి. ఇతనిని ఒక మంచి నాయకుడిగా మార్చిన మూడు లేక నాలుగు లక్షణాలు రాయండి. ఈ లక్షణాలు యేసు పరిచర్యలో కనిపిస్తాయా? ఈ లక్షణాలు మీ పరిచర్యలో కనిపిస్తున్నాయా?

నిజమైన నాయకత్వంలో వినయంతో కూడిన సేవ ఉంటుందని యేసు చూపించాడు. దీనత్వం అంటే బలహీనత లేక అనిశ్చితి కాదు; యేసు బలవంతుడు. యేసు అధికారాన్ని సువార్తలు పదే పదే వెల్లడిస్తాయి.[17] అయితే, యేసు గౌరవాన్ని కోరటం వలన కాదుగాని పరిచారం చేయడం వలన అధికారం పొందాడు. రాజ్యంలో స్థానాలు కొరకు శిష్యులు వాదించినప్పుడు, యేసు ఇలా చెప్పాడు:

> అన్యజనములలో రాజులు వారిమీద ప్రభుత్వము చేయుదురు; వారిమీద అధికారము చేయువారు ఉపకారులనబడుదురు. మీరైతే ఆలాగు ఉండరాదు; మీలో గొప్పవాడు చిన్నవానివలెను, అధిపతి పరిచారకునివలెను ఉండవలెను. గొప్పవాడెవడు? భోజనపంక్తిని కూర్చుండువాడా పరిచర్యచేయువాడా? పంక్తినికూర్చుండు వాడే గదా? అయినను నేను మీ మధ్య పరిచర్యచేయు వానివలె ఉన్నాను (లూకా 22:25-27).

ఈ పాఠంలో, యేసును గొప్ప నాయకుడ్ని చేసిన గుణాలను పరిశీలిస్తాం. యేసు మాదిరి అనుసరిస్తూ ప్రభావవంతమైన నాయకులుగా ఎలా ఉండాలో నేర్చుకుందాం.

## ప్రభావవంతమైన క్రైస్తవ నాయకుడికి తన మిషన్/పని తెలుసు

గొప్ప నాయకుడికి ఒక స్పష్టమైన లక్ష్యం ఉంటుంది, ఆ లక్ష్యంపైనే ఏకాగ్రతతో ఉంటాడు. యేసుకు ఆయన పని తెలుసు. యేసు తన మిషన్ ను మార్కు 10:45లో సంగ్రహించాడు: "మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు

[17] మత్తయి 7:28-29, మార్కు 1:22-28, లూకా 4:32-36, లూకా 20:1-8

రాలేదు గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెననెను."

యేసు, తన మొదటి ప్రసంగంలో, యెషయా ప్రవచనం నెరవేర్చటానికి వచ్చానని యేసు శ్రోతలతో చెప్పాడు:

> ప్రభువు ఆత్మ నామీద ఉన్నది బీదలకు సువార్త ప్రకటించుటకై ఆయన నన్ను అభిషేకించెను చెరలోనున్న వారికి విడుదలను, గ్రుడ్డివారికి చూపును, (కలుగునని) ప్రకటించుటకును నలిగినవారిని విడిపించుటకును ప్రభువు హితవత్సరము ప్రకటించుటకును ఆయన నన్ను పంపియున్నాడు అని వ్రాయబడిన చోటు ఆయనకు దొరకెను (లూకా 4:18-19, యెషయా 61:1-3 ఉల్లేఖించాడు).

యేసు మిషన్ ఆయన అనుదిన నిర్ణయాలను మార్గనిర్దేశం చేసింది. యేసు యూదయ నుండి గలిలయకు వెళ్తున్నప్పుడు, ఆయన మిషన్ తన మార్గాన్ని నిర్దేశించింది. యూదా రబ్బీలు, సమరయుల అపవిత్రతకు దూరంగా ఉండడానికి గాను యోర్దాను నదికి తూర్పు వైపు ప్రయాణించేవారు. అయితే, సమరయ స్త్రీతో దేవుని కృపను పంచుకోవాలని తన మిషన్ కు అనుగుణంగా యేసు తన మార్గాన్ని నిర్దేశించుకున్నాడు (యోహాను 4:4). క్రైస్తవ నాయకుడుగా, మీ మిషన్ మీ అనుదిన నిర్ణయాలను దిశానిర్దేశం చెయ్యాలి.

నాయకుడుగా, మీరు సాధించగల దానికంటే చేయాల్సింది చాలా ఉంది. మీ ప్రాధాన్యతలు ఎలా నిర్ణయిస్తారు? మీరు సమస్తం చేయలేరు, చేయకూడదు. మీ మిషన్ ద్వారా అవకాశాలను అంచనా వెయ్యాలి. ప్రతి నాయకుడికి రెండు జాబితాలు ఉండాలి: "చేయాల్సినవి" మరియు "చేయకూడనివి." చేయాల్సిన జాబితాలో మీరు సాధించాల్సిన విషయాలు ఉంటాయి. చేయకూడని జాబితాలో మీ మిషన్ పై నుండి మీ దృష్టిని తొలగించే విషయాలు ఉంటాయి. ఆ పనులు మరొకరు చేస్తారు, మీరు కాదు. మీ అనుదిన ప్రాధాన్యతలను మీ మిషన్ నిర్ధారించాలి.

తన మిషన్ గురించి తెలుసుకున్న నాయకుడుగా అపొస్తలుడైన పౌలు ఒక మాదిరి చూపాడు. రోమా సామ్రాజ్యంలోని ముఖ్య పట్టణాల్లో సంఘాలు స్థాపించడానికి పౌలు పిలువబడ్డాడు. మరొకరి పునాది మీద నిర్మించాలనుకోలేదు కాని, ఎన్నడు సువార్త వినని వారికి సువార్త తీసుకెళ్లాలనుకున్నాడు (రోమా 15:20). పౌలు ప్రయాణాన్ని ఈ మిషన్ నడిపించింది, ప్రతి స్థలంలో ఎన్ని దినాలు గడపాలో, అతడు ప్రసంగించిన ప్రసంగాన్ని కూడా మిషన్ నడిపించింది. పౌలు మిషన్ ప్రతి నిర్ణయాన్ని మార్గనిర్దేశం చేసింది.

► ఈ ప్రశ్నలు చర్చించండి:

- దేవుడు మీకు ఇచ్చిన మిషన్ ఏంటి? క్లుప్తంగా మీ మిషన్ ను సంగ్రహించండి.

- మీ పరిచర్యలో మీతో చేరినవారికి మీ మిషన్ గురించి చెప్పారా?
- మీ మిషన్ మీ అనుదిన నిర్ణయాలను మార్గనిర్దేశం చేస్తుందా?

### ప్రభావవంతమైన క్రైస్తవ నాయకుడు ఇతర నాయకులకు శిక్షణనిస్తాడు

ఆయన పరిచర్య ఆరంభం నుండి, ఆయన తండ్రి యొద్దకు తిరిగివెళ్లిపోయిన తరువాత పరిచర్య కొనసాగించగల శిష్య బృందాన్ని యేసు జాగ్రత్తగా ఎన్నుకుని, వారికి శిక్షణ ఇచ్చాడు. ఈ శిష్యులు ఆయన నుండి నేర్చుకున్నారు, ఆయనతో ఉన్నారు, ఆయనతో పరిచర్య చేశారు, లోకమంతా ఆయన సందేశం ప్రకటించారు. ఈ శిష్యులను ఆయన పోలికలో ముద్రించాడు, ఆయన సంఘ స్థాపనకు ఉపయోగించాడు.

> "యేసు ఏ పుస్తకం రాయలేదు. బదులుగా, మనుష్యులపై, అపొస్తలులపై ఆయన సందేశం ముద్రించాడు."
> - విలియం బార్క్లే

లూకా పరిచర్యలో ఒత్తిడి గురించి రాశాడు. "అంతలో ఒకనినొకడు త్రొక్కుకొనునట్లు వేల కొలది జనులు కూడినప్పుడు ఆయన తన శిష్యులతో మొదట ఇట్లని చెప్పసాగెను" (లూకా 12:1). వేలమందికి పరిచర్య చేయటం ఉత్తేజకరంగా ఉన్నప్పటికీ, యేసు శిష్యులకు చేసే పరిచర్యపై దృష్టిపెట్టాడు. రాజ్యం స్థాపించాలంటే సంఘాన్ని నడిపించటానికి శిష్యులకు శిక్షణ ఇవ్వాలని ఆయనకు తెలుసు. శిష్యులకు శిక్షణ ఇవ్వడం ద్వారా, తరువాత తరము వారి కోసం నాయకులను సిద్ధపరచగలం.

పౌలు ఇదే పద్ధతి అనుసరించాడు. జనసమూహానికి ప్రకటించాడు, కాని ప్రతి పట్టణంలో కొద్దిమంది నాయకులను సిద్ధపరచుటపై దృష్టిపెట్టాడు. ఇది నేటి నాయకులకు మాదిరి. పరిచర్య కోసం పరిశుద్ధులను నియమించమని పౌలు పాస్టర్లకు పిలుపునిచ్చాడు (ఎఫెసీయులకు 4:12). సంఘంలో పని అంతా చేయటం పాస్టర్ బాధ్యత కాదు; సంఘ పని కొరకు సభ్యులకు శిక్షణ ఇవ్వడం పాస్టర్ బాధ్యత. ప్రభావవంతమైన నాయకులు ఇతర నాయకులకు శిక్షణ ఇస్తారు.

### శిష్యులకు బోధించే యేసు మాదిరి

**బోధకుడు శిష్యులను జాగ్రత్తగా ఎన్నుకోవాలి.**[18]

► యోహాను 1:35-51, యోహాను 2:1-11, మత్తయి 4:18-22, లూకా 5:1-11, మరియు లూకా 6:12-16 చదవండి.

ఈ వచనాలు చదువుతున్నప్పుడు, ప్రక్రియ గమనించారా? యేసు, తన బహిరంగ పరిచర్య మొదటి వారంలో, తనను అనుసరించుమని యేసు అంద్రెయను, యోహానును పిలిచాడు. అంద్రెయ సీమోను పేతురును తీసుకొచ్చాడు. యేసు

---

[18] Robert Coleman, *The Master Plan of Evangelism*. (Grand Rapids: Baker Book House, 1963) నుండి తీసుకున్నారు.

ఫిలిప్పుని పిలిచాడు, అతడు నతనయేలును కనుగొన్నాడు (యోహాను 1:35-51). ఇది వారి పిలుపులో మొదటి దశ. వారు యేసును గుర్తించారు, కాని శాశ్వతమైన అనుచరులుగా మారలేదు. ఇది యేసును వెంబడించుమనే పిలుపు. తరువాత, యేసు వారిని పూర్తి-కాల శిష్యరికానికి పిలుస్తాడు.

ఈ ప్రక్రియలో యోహాను 2 ముఖ్య దశ. కానా వివాహంలో, యేసు ఆయన మహిమను శిష్యులకు ప్రత్యక్షపరచాడు. మిగిలిన అతిథులకు అద్భుతం గురించి తెలియదు. యేసు తననుతాను శిష్యులకు ప్రత్యక్షపరచుకున్నాడు తద్వారా వారాయనయందు విశ్వాసముంచారు. ఆయన శిష్యులు ఆయనయందు విశ్వాసముంచిరి (యోహాను 2:11).

యేసు నజరేతు నుండి కపెర్నహూముకు వెళ్లి ప్రకటించడం ప్రారంభించిన తరువాత (మత్తయి 4:12-17) మత్తయి 4:18-22లోని సన్నివేశం జరిగింది. గలిలయ సముద్రం ప్రక్క నడుస్తూ, సీమోను, అంద్రెయ, యాకోబు, యోహానులను తనను వెంబడించుమని పిలుపునిచ్చాడు. “వెంటనే వారు తమ వలలు విడిచిపెట్టి ఆయనను వెంబడించిరి” (మత్తయి 4:20). యోహాను 1లో, ఆరంభ పిలుపు తరువాత, ఈ శిష్యులు మత్స్యకారులుగా తమ పని కొనసాగించారు. యేసు వారిని పరిచారం కొరకు పిలిచాడు: “ఇప్పటి నుండి నీవు మనుష్యులను పట్టువాడవై యుందువు” (లూకా 5:10).

ఈ ప్రక్రియలో తరువాత మెట్టు యేసు, పన్నెండుమంది అపొస్తలులను ఎన్నుకోవడం. అనేకమంది అనుచరులలో నుండి (యోహాను 6లో “శిష్యులు” గా పిలువబడ్డారు), యేసు ఆయనకు సమీపంగా ఉండడానికి పన్నెండుమందిని ఎన్నుకున్నాడు.

పన్నెండుమంది అపొస్తలులను హడావిడిగా ఎన్నుకోలేదు. ఆ ప్రక్రియకు చాలా నెలలు పట్టినట్లు కనిపిస్తుంది. దీనివల్ల యేసు వారిలో ఒక్కొక్కరితో సమయం గడపగలిగాడు. చాలాసార్లు, నాయకుడు ఒక వ్యక్తిని తెలుసుకోవడానికి సమయం కూడా కేటాయించకుండ వారసుని ఎన్నుకోవడానికి తొందరపడతాడు. తెలివైన నాయకుడు ఒక వ్యక్తి నాయకత్వ సామర్థ్యం అంచనావేయడానికి కొన్ని బాధ్యతలు అప్పగిస్తాడు.

**గురువు తన శిష్యులతో సమయం గడపాలి**

► ఏది ఎక్కువ ఉత్సాహకరం, ఎక్కువమందిని చేరుకోవడమా లేక తక్కువమందికి శిక్షణ ఇవ్వడమా? సుదీర్ఘ-కాలానికి ఏది ముఖ్యం? యేసు పన్నెండుమంది విషయంలో ఎందుకు ఎక్కువ కష్టపడ్డాడు?

యేసు ఎక్కువ సమయం పన్నెండుమంది అపొస్తలులతో గడిపాడు. “వారు తనతోకూడ ఉండునట్లును దయ్యములను వెళ్లగొట్టు అధికారముగలవారై సువార్త ప్రకటించుటకును వారిని పంపవలెనని ఆయన పండ్రెండు మందిని

నియమించెను" (మార్కు 3:14-15). మొదట, ఆయన పద్ధతులు నేర్చుకోవడానికి వారు ఆయనతో సమయం గడుపుతారు. అప్పుడే వారు పరిచర్య కోసం పంపడానికి సిద్ధంగా ఉంటారు.

మార్కు గలిలయలో యేసు చేసిన ఒక ప్రయాణం గురించి రాశాడు: "[ఆయన అక్కడ ఉన్నాడని] అది ఎవనికిని తెలియుట ఆయనకిష్టములేక పోయెను, ఏలయనగా ఆయన తన శిష్యులకు బోధించెను" (మార్కు 9:30-31). యేసు ప్రధాన ఉద్దేశ్యం జనసమూహాన్ని చేరుకునే కార్యక్రమాన్ని వృద్ధిచేయటం కాదుగాని సంఘాన్ని నడిపించే మనుష్యులను సిద్ధం చేయడం.

యేసు వేలమందికి ప్రకటించాడు, కాని ఆయన ప్రధాన ఉద్దేశం భవిష్యత్ పరిచర్య కోసం కొందరికి శిక్షణ ఇవ్వడం. శిక్షణ అనేది చిన్న గుంపుపై దృష్టిపెట్టి చేస్తే మరింత ప్రభావంగా ఉంటుందని యేసుకు తెలుసు. రాబర్ట్ కోల్మెన్ ఇలా హెచ్చరిస్తున్నాడు: "మీ పరిచర్య ఎక్కువగా వృద్ధిచెందినప్పుడు, వ్యక్తులనుశిష్యులుగా చేయడానికి సమయం కేటాయించడం కష్టమౌతుంది. కాని మీ పరిచర్య వృద్ధిచెందే కొద్దీ, వ్యక్తులను శిష్యులుగా చేయడానికి సమయం కేటాయించడం చాలా ప్రాముఖ్యం."

మీరు సువార్తలు చదువుతున్నప్పుడు, యేసు తన యొద్ద కనీసం ముగ్గురు శిష్యులను ఉంచుకుని పరిచర్య చేశాడు. యేసు, ఆయన శిష్యులు, శిక్షణా తరగతుల కోసం అరణ్యప్రాంతాల్లోకి వెళ్ళేవారు. యేసు ఈ భూమిపై పరిచర్య ముగింపులో, శిష్యులతో మరింత సమయం గడిపాడు. యెరూషలేములో చివరి వారంలో, యేసు ఎక్కువ సమయం శిష్యులను తన వద్ద ఉంచుకున్నాడు. వీరికి శిక్షణ ఇవ్వడం ఆయన ముఖ్య పని.

యూదుల సామెత చెప్పినట్లుగా, "తన యజమాని ధూళి తినువాడు శిష్యుడు." శిష్యుడు తన యజమానునికి దగ్గరగా నడుస్తాడు, అతని పాదాల ధూళి గాల్లో లేచినప్పుడు దానిని పీల్చుకుంటాడు. యజమానుడు తిన్నది శిష్యుడు తింటాడు; యజమానుడు వెళ్లిన చోటికి శిష్యుడు వెళ్తాడు; శిష్యుడు యజమానుడి బోధన, మాదిరికి కట్టుబడి ఉంటాడు. యేసు శిష్యులు ఆయన స్వభావం తమలో పెంపొందించుకునేంతవరకు ఆయనతో గడిపారు. తరువాత, వారు "క్రైస్తవులు"గా వెల్లడి చేసుకున్నారు; వారు వారి యజమానిలా మారిపోతారు.

అదే విధంగా, పౌలుకు కూడా ఎల్లప్పుడు తిమోతి, తీతు, లూకా లేక తుకికు వంటి అనుచరులున్నారు. వారితో సమయం గడుపుతూ పౌలు వారిని పరిచర్యకు సిద్ధం చేశాడు.

మరలా, ఇది కూడా నేడు మనకు మాదిరి. మీరు మీ పరిచర్య చేస్తుండగా, మీకంటే చిన్నవారిని ప్రోత్సహించవచ్చు, వారు పరిచారం నేర్చుకుంటారు. ఒక విజయవంతమైన నాయకుడు ఇలా చెప్పాడు: "నాతో పాటు యౌవ్వన పరిచారకుడిని తీసుకెళ్లకుండా, ఎప్పుడూ పరిచర్య పర్యటనకు నేను వెళ్లలేదు. భవిష్యత్తు సంఘ నాయకులను

తయారుచేయడం, నేను ప్రస్తుతం చేస్తున్న పరిచర్యలాగే నాకు ప్రాముఖ్యం." ప్రభావవంతమైన నాయకులు ఇతర నాయకులకు శిక్షణ ఇస్తారని ఈ పాస్టర్ అర్థం చేసుకున్నాడు.

**గురువు తన శిష్యులకు పరిచర్య విషయంలో ఒక ఆదర్శాన్ని చూపించాలి**

శిష్యుల పాదాలు కడిగిన పిమ్మట, "నేను మీకు చేసిన ప్రకారము మీరును చేయవలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని" (యోహాను 13:15) అని యేసు చెప్పాడు. యేసు మాదిరి ద్వారా బోధించాడు. "ఇది చెయ్యాలి" అని చెప్పడం సరిపోదని ఆయనకు తెలుసు. ఎలా చెయ్యాలో కూడా చేసి చూపించాలి. యేసు ఆయన చేసి చూపించకుండా ఫలానా పని చెయ్యాలని శిష్యులకు ఎన్నడు చెప్పలేదు.

శిష్యులు యేసు ప్రార్థన చూసి, "ప్రభువా...మాకును ప్రార్థనచేయ నేర్పుమని ఆయన" (లూకా 11:1) ను అడిగారు. యేసు ప్రార్థనను గురించి కేవలం ఒక పాఠం చెప్పి ఊరుకోలేదు. ఆయన ప్రార్థించాడు. ఆయన ప్రార్థించేటప్పుడు వారు చూసి, ఆ ప్రార్థన అర్థం చేసుకోవాలని చాలా ఆసక్తి చూపారు. శిష్యులు నేర్చుకోవాలనే ఆసక్తితో ఉన్నప్పుడు, మంచిగా నేర్చుకోగలుగుతారు!

యేసు ప్రసంగంలో లేఖనాలు ఉపయోగించడం శిష్యులు విన్నారు. యేసు ఎల్లప్పుడు పాత నిబంధనను సూచించాడు. ఆయన బైబిల్ ప్రసంగ మాదిరి చూపాడు. శిష్యులు ఈ పాఠం నేర్చుకున్నారా? ఖచ్చితంగా నేర్చుకున్నారు! అపొస్తలుల కార్యములు 2లో, పేతురు ప్రసంగించినప్పుడు, యోవేలు, కీర్తన 16, మరియు కీర్తన 110ను ఉటంకించాడు. తన ప్రసంగం లేఖనాలపై ఆధారపడాలని పేతురు యేసు నుండి నేర్చుకున్నాడు. అపొస్తలుల కార్యములు లోని ప్రతి ప్రసంగం పాత నిబంధనను సూచిస్తుంది.

పౌలు ఇదే పద్ధతి అనుసరించాడు. అతను పదే పదే ఇలా రాశాడు: "మీరు నా మాదిరి చూశారు. కావున నన్ను పోలి నడుచుకొనుడి."[19] పౌలు మాదిరి ద్వారా బోధించాడు. తీతు, తిమోతి వంటి శిష్యులు తమ యజమానుడైన పౌలు మాదిరి ననుసరించి కాయుట నేర్చుకున్నారు.

నేడు, మనం శిక్షణ ఇచ్చేవారికి పరిచర్యలో మాదిరిగా ఉండాలి. వారు మన విజయాలు, వైఫల్యాలు రెండూ చూస్తారు. మనం తప్పులు ఒప్పుకుంటూ నేర్చుకొంటుండగా చాలామంది మన స్వభావాన్ని పరిశీలిస్తారు. శిష్యులు మనలను పరిశీలిస్తూ పరిచర్య వాస్తవాలు నేర్చుకుంటారు.

---

[19] 1 కొరింథీయులకు 11:1, ఫిలిప్పీయులకు 3:17, ఫిలిప్పీయులకు 4:9 లు కూడా ఉదాహరణలో ఉన్నాయి.

**గురువు తన శిష్యులకు బాధ్యత అప్పగించాలి**

► మత్తయి 10:5-11:1 చదవండి.

ఆరంభం నుండి, యేసు ఉద్దేశ్యం పరిచర్య కోసం శిష్యులను సిద్ధపరచడం. వారిని మనుష్యులు పట్టు జాలర్లుగా చేయటానికి తనను వెంబడించుమని ఆయన పిలిచాడు (మత్తయి 4:19).

శిష్యులు యేసుతో గడిపిన మొదటి సంవత్సరం, ఆయన పరిచర్యను పరిశీలించారు. ఆయన మాదిరి ద్వారా నేర్చుకున్నారు. వాళ్ళు పరిశీలించిన తరువాత, యేసు వారిని పరిచర్య కొరకు పంపాడు. యేసు తన శిష్యులపై ఎలాంటి బాధ్యత ఉంచాడో మత్తయి 10 చూపిస్తుంది.

***ఆయన వారికి అధికారమిచ్చాడు (మత్తయి 10:1).***

వారిని బయటకు పంపే ముందు, ఆయన వారికి అప్పగిస్తున్న పరిచర్య చేయడానికి అధికారం ఇచ్చాడు. కొన్నిసార్లు నాయకులు తమ మద్దతుదారులకు అధికారం ఇవ్వటానికి భయపడతారు. **అయితే, అధికారం లేని బాధ్యత శిక్షణ పొందే వారిని ముందుకు వెళ్ళనీయదు.** బాధ్యత నెరవేర్చడానికి తగినంత అధికారం ఇవ్వకుండా మన సహాయకులకు మనం ఎటువంటి బాధ్యత అప్పగించకూడదు.

***ఆయన వారికి స్పష్టమైన సూచనలు ఇచ్చాడు (మత్తయి 10:5-42).***

యేసు తన శిష్యులకు స్పష్టమైన సందేశం ఇచ్చాడు: రాజ్య ప్రకటన. వారి బాధ్యత స్పష్టమైంది. వారు ఏమి చెయ్యాలని యేసు కోరుతున్నాడో వారికి ఖచ్చితంగా తెలుసు.

ఎక్కడ పరిచర్య చెయ్యాలో యేసు శిష్యులకు చెప్పాడు: ఇశ్రాయేలులో నశిస్తున్న గొర్రెలకు. తరువాత, అపొస్తలులు అన్యజనులకు ప్రకటిస్తారు, కాని పరిచర్య చేయటం నేర్చుకుంటుండగా, ఇంటి నుండి మొదలుపెట్టాలని యేసు చెప్పాడు. మన శిష్యులు విజయం పొందడానికి సాధ్యమైన ప్రతి పని చెయ్యాలి. సాధించడానికి సులభంగా ఉండే పనితో మొదలుపెట్టాలి. యేసు సహేతుకమైన లక్ష్యాలు పెట్టాడు.

హింస గురించి యేసు తన శిష్యులను హెచ్చరించాడు. హింస, పరిచర్యలో శిష్యులు విఫలమైనందున రాదుగాని యేసుకు విధేయత చూపాలనే పిలుపు ద్వారా వస్తుంది, ఆయన అనుచరులకు, ఆయనను తిరస్కరించేవారికి మధ్య విభజన తెస్తుంది.

***ఆయన వారిని ఇద్దరిద్దరుగా పంపాడు (మార్కు 6:7).***

యేసు పరిచర్యలో బృందాలుగా కలిసి పనిచేయడం యొక్క ప్రాముఖ్యతను చూపించాడు. శిష్యులను ఇద్దరిద్దరుగా పంపాడు. కొన్ని నెలల తరువాత, ఆయన అనుచరుల్లో 72మందిని ఇద్దరిద్దరుగా పంపాడు (లూకా 10:1). ఇది ఆదిమ సంఘ పరిచర్యకు మాదిరి. పేతురు, యోహాను కలిసి పరిచర్య చేశారు. బర్నబా, సౌలు కలిసి పరిచర్య చేశారు. పౌలు సీల కలిసి పరిచర్య చేశారు.

**గురువు తన శిష్యులను పర్యవేక్షించాలి**

శిష్యులు పరిచర్య నుండి తిరిగివచ్చిన తరువాత, యేసుకు నివేదించారు (మార్కు 6:30). యేసు శిష్యులకు శిక్షణ ఇచ్చే క్రమంలో అనంతర పరీక్ష చాలా ముఖ్యం. బాధ్యత అప్పగిస్తే సరిపోదు; ప్రభావవంతమైన నాయకుడు శిష్యుల ప్రదర్శనను పరీక్షించాలి. పర్యవేక్షణ లేని బాధ్యత పేలవ ఫలితాలిస్తుంది.

► మత్తయి 17:14-21 చదవండి.

నేర్చుకునే ప్రక్రియలో వైఫల్యం ఒక ముఖ్య భాగమని హోవార్డ్ హెండ్రిక్స్ చెప్పాడు. "మేము ఈ చిన్నవానిలో దయ్యాన్ని ఎందుకు వెళ్లగొట్టలేకపోయాము?" అని శిష్యులు అడిగారు. వారికి విశ్వాసం గురించి బోధిస్తూ యేసు సమాధానమిచ్చాడు. యేసు పరలోకానికి తిరిగి వెళ్ళిన తర్వాత కంటే, పరిచర్య ఆరంభ దశలోనే విఫలమవ్వటం మంచిది!

శిష్యుని ప్రభావవంతమైన పర్యవేక్షణలో మూల్యనిర్ధారణ ఒక భాగం. శిష్యుడు పనిలో విఫలమైనప్పుడు, జట్టులో నుండి వెలివేయబడడు. బదులుగా, మనం వైఫల్యానికి కారణం గుర్తించి, భవిష్యత్తులో మెరుగుపడటం కొరకు ప్రణాళిక చెయ్యాలి.

లూకా 9లో యేసు ఈ నమూనా చూపించాడు:

- 9:1-6లో, యేసు పన్నెండుమంది శిష్యులను పంపాడు.
- 9:10 లో, వారు వారి పర్యటన గురించి ఆయనకు చెప్పారు.
- 9:37-43లో, శిష్యులు దయ్యాన్ని వెళ్లగొట్టలేకపోయారు.
- 9:46-48లో, దేవుని రాజ్యంలో గొప్పదనం గురించి యేసు వారికి బోధించాడు.
- 9:49-50లో, పరిచర్య విషయంలో ఒక తప్పుడు నిర్ణయాన్ని బట్టి యేసు యోహానును గద్దించాడు.
- 9:52లో, సమరయలో ఆయన దర్శన సిద్ధపాటుకు యేసు శిష్యులను పంపాడు.

- 9:54-55లో, పరిచర్య విషయంలో మరొక చెడ్డ నిర్ణయాన్ని బట్టి యేసు యాకోబు, యోహానులను గద్దించాడు.
- 10:1లో, యేసు పరిచర్య చేయడానికి పెద్ద గుంపును పంపాడు.

బోధన, బాధ్యత, పర్యవేక్షణ/మూల్యంకనం మధ్య ప్రత్యామ్నాయాలు చేశాడు. వారు విఫలమైనప్పుడు కూడా ఆయన తన శిష్యుల్ని విడిచిపెట్టలేదు. వైఫల్యాన్ని బోధనా అవకాశంగా మార్చుకున్నాడు.

తరువాత పౌలు అదే పద్ధతి అనుసరించాడు. క్రేతు ద్వీపంలో సంఘాన్ని నడిపించడానికి తీతును, ఎఫెసులో పరిచర్య చేయటానికి తిమోతిని నియమించాడు. తదుపరి శిక్షణ కోసం పత్రికలు రాశాడు. మొదటి మిషనరీ యాత్రలో సంఘాలు స్థాపించిన తరువాత, సంఘాలను పర్యవేక్షించడానికి రెండవ యాత్రలో తిరిగి వచ్చాడు (అపొస్తలుల కార్యములు 15:36).

శిక్షణలో ఈ నమూనా/పద్ధతి నేటికీ ప్రభావవంతమే. చాలామంది నాయకులు నేడు పర్యవేక్షణ లేక జవాబుదారీతనం లేకుండ యౌవ్వన నాయకులను పంపుతున్నారు-పరిచర్య విఫలమైనప్పుడు ఆశ్చర్యపోతున్నారు. "నేను బోధించాను, గనుక వారు మంచిగా చేస్తారు" అని మనం అనుకోకూడదు. బదులుగా, పర్యవేక్షణ కొనసాగే ప్రక్రియ. మీరు నాయకులకు శిక్షణ ఇవ్వాలంటే, పర్యవేక్షణకు సమయం కేటాయించాలి.

క్రొత్త పనివారికి శిక్షణ ఇవ్వడంలో నాలుగు దశలను గూర్చి హోవార్డ్ హెండ్రిక్స్ చెప్పాడు:

1. **చెప్పటం:** వారికి విషయం చెప్పాలి. యేసు, రాజ్య సందేశం గురించి తన శిష్యులకు ప్రకటించాడు.
2. **చూపించటం:** పరిచర్యకు నమూనా చూపించాలి. యేసు తన శిష్యులకు పరిచర్య నమూనా అందించాడు.
3. **ఆచరించడం:** ప్రత్యక్ష పర్యవేక్షణలో పరిచర్య. యేసు తన శిష్యులను పరిచర్య కోసం పంపాడు, వారి అనుభవాలు పరిశీలించాడు.
4. **చేయటం:** ప్రత్యక్ష పర్యవేక్షణలేని పరిచర్య. పెంతెకొస్తు తరువాత, యేసు పర్యవేక్షణ లేకుండా శిష్యులు పరిచర్య చేశారు.

► శిష్యుల్ని నాయకులుగా చేయడానికి మీరేం చేస్తున్నారు? మనం నేర్చుకున్న దశల్లో, మీరు ఏది ఎక్కువ ప్రభావవంతంగా చేస్తున్నారు? ఇంకా ఏ దశలో మెరుగుపడాలి? సమూహంగా, భవిష్యత్ నాయకులకు శిక్షణ ఇచ్చే విషయంలో మరింత ప్రభావితంగా ఎలా ఉండాలో చర్చించండి. మీ పరిచర్యలో నాయకులను వృద్ధి చేసే ప్రణాళిక కలిగియుండేవరకు కూడా ఈ చర్చ కొనసాగాలి.

**మన శిష్యులు ఇతర శిష్యులను సిద్ధపరచాలి**

"...మీరు వెళ్లి ఫలించుటకును, మీ ఫలము నిలిచియుండుటకును నేను మిమ్మును ఏర్పరచుకొని నియమించితిని" (యోహాను 15:16) అని యేసు శిష్యులతో చెప్పాడు. అనేకమంది శిష్యులను సిద్ధపరచాలని యేసు తన శిష్యులకు శిక్షణ ఇచ్చాడు.

► మత్తయి 13:31-32 చదవండి.

యేసు చెప్పిన ఆవగింజ ఉపమానం, దేవుని రాజ్యం దాని వాస్తవిక పరిమాణం కంటే ఎక్కువగా ఎదుగుతుందని చెప్తుంది. ఒక చిన్న ఆవగింజ ఊహించిన దానికంటే పరిమాణంలో పెద్ద మొక్కగా పెరిగినట్లే, సంఘం కూడా ఎవ్వరు ఊహించలేనిదానికంటే ఎక్కువ పెరుగుతుంది. పాత నిబంధనలో, ఆకాశపక్షులకు ఆశ్రయంగా ఉన్న చెట్టు గొప్ప రాజ్యంలో అనేక రాజ్యాలున్నాయని సూచిస్తుంది (దానియేలు 4:12 మరియు యెహెజ్కేలు 31:6). శిష్యులు శిష్యులను సిద్ధపరుస్తుండగా, సంఘం దాని అసలు పరిమాణం కంటే పెరిగి, భూదిగంతాల వరకు విస్తరిస్తుందని యేసు వాగ్దానం చేశాడు.

మన పరిచర్య తుది మూల్యాంకనం శిష్యులను సిద్ధం చేయటంలో ఉందని డా. రాబర్ట్ కోల్మెన్ రాశాడు. "తుదకు ఇక్కడ మన జీవితం ఎలా వృద్ధి చెందుతుందో అంచనా వెయ్యాలి. మనకు అప్పగించబడిన వాళ్లు గొప్ప ఆజ్ఞను పట్టుకుని, ఇతరులకు కూడా బోధించే నమ్మకమైన సేవకులుగా ఉంటారా? మన పరిచర్య వాళ్ల చేతుల్లోకి వెళ్ళే సమయం త్వరలో వస్తుంది."[20]

**నిశిత పరిశీలన: యేసు ప్రధాన యాజకత్వ ప్రార్థన**

యేసు ప్రధాన యాజక ప్రార్థన మధ్యభాగంలో ఆయన శిష్యులపై దృష్టిపెట్టాడు (యోహాను 17:6-19). ఈ ప్రార్థన యేసు తన శిష్యులకు మార్గనిర్దేశం చేసే పద్ధతి గురించి విలువైన పాఠాలను బోధిస్తుంది.[21]

**(1) మొదట, మనం శిక్షణ ఇచ్చేవారిని కాపాడుతాం.**

యేసు ప్రార్థించాడు, "నేను వారియొద్ద ఉండగా నీవు నాకు అనుగ్రహించినవారిని నీ నామమందు కాపాడితిని." సువార్తల్లో 20సార్లు, యేసు తన శిష్యులకు ప్రమాదాల నుండి జాగ్రత్తగా ఉండమని చెప్పాడు. తప్పుల నుండి

---

[20] Robert Coleman, "The Jesus Way to Win the World: Living the Great Commission Every Day." Evangelical Theological Society, 2003.

[21] Ajith Fernando, *Jesus Driven Ministry* (Wheaton, Illinois: Crossway Books, 2002), 172-173 నుండి తీసుకున్నారు.

కాపాడాడు. శిష్యులకు శిక్షణ ఇస్తుండగా, లోకంలో వారికి ఎదురయ్యే ప్రమాదాల నుండి వారిని కాపాడాలి. మన శిక్షణ ఆచరణాత్మకంగా ఉండాలి.

► మీ సంస్కృతిలో యువ పరిచారకులు ఎదుర్కొనే ప్రమాదాలు ఏంటి? గురువుగా, ఈ ప్రమాదాలు ఎదుర్కోవడానికి వారిని ఎలా సిద్ధపరుస్తారు?

**(2) వారు పరిపక్వతలోకి వస్తుండగా, మనం శిక్షణ ఇస్తున్న వారిని నమ్ముతాం.**

యేసు ఇలా ప్రార్థించాడు, "నీవు లోకములోనుండి వారిని తీసికొనిపొమ్మని నేను ప్రార్థించుటలేదు గాని దుష్టునినుండి వారిని కాపాడుమని ప్రార్థించుచున్నాను" (యోహాను 17:15). శిష్యులు శోధనలెదుర్కొంటారని యేసుకు తెలుసు కాని ఆయన తాను శిక్షణ ఇచ్చిన వారిపై నమ్మకం కలిగియున్నాడు. మనం శిక్షణ ఇస్తున్న యువ నాయకులను నమ్మడం నేర్చుకోవాలి. నాయకత్వానికి అధికారం అప్పగించి, ముఖ్య నిర్ణయాల విషయంలో ఇతరులను నమ్మాలని ఇది కోరుతుంది.

నాయకులు తమ అనుచరులను వీక్షించే రెండు మార్గాలున్నాయని అజిత్ ఫెర్నాండో రాశాడు.

- బలహీన నాయకులు తమ అనుచరుల బలహీనతలపై దృష్టిపెడతారు.
- ప్రభావవంతమైన నాయకులు తమ అనుచరుల బలహీనతలపై పనిచేస్తూనే బలంపై దృష్టిపెడతారు. ప్రభావవంతమైన నాయకులు ఇతరులను "నిరీక్షణ నేత్రాలు" ద్వారా చూస్తారు.

**(3) శిక్షణ పొందిన తరువాత, మన శిష్యులను లోకంలో పరిచర్య చేయడానికి పంపుతాం.**

"నీవు నన్ను లోకమునకు పంపిన ప్రకారము నేనును వారిని లోకమునకు పంపితిని" (యోహాను 17:18) అని యేసు ప్రార్థించాడు. పెంతెకొస్తు తరువాత, యేసు వారిని ఏ పరిచర్య కొరకైతే సిద్ధపరిచాడో శిష్యులు ఆ పనిని మొదలుపెట్టాడు. మనం శిష్యుల్ని చేస్తాం, తత్ఫలితంగా వారు లోకంలో సువార్త ప్రకటిస్తారు.

"వారియందు నేను మహిమపరచబడి యున్నాను" (యోహాను 17:10) అని యేసు చెప్పాడు. శిక్షణ ఇచ్చినవారిని లోకంలోకి పంపుతుండగా, యేసు మహిమ పొందుతున్నాడని నిర్ధారించుకోవాలి. శిక్షణ ఇచ్చిన వారి నుండి మనం మహిమపరచబడాలనే శోధనలో పడిపోతాం. ఇతరులను శిష్యులుగా చేసే మన సామర్థ్యం ద్వారా కీర్తి పొందాలనే శోధనలో పడిపోతాం. బదులుగా, మహిమ కేవలం దేవునికి మాత్రమే చెందేటట్లు చూడాలి.

## అన్వయం: పరిచర్య బృందం విలువ

పరిచర్యలో బృందం యొక్క విలువను గూర్చి యేసు మాదిరి చూపుతుంది. యువ సహోద్యోగులకు శిక్షణ ఇవ్వడం, తోటి పాస్టర్లతో సహవాసం నిర్మించుకోవడం జట్టు పరిచర్యలో భాగం. మనం ఇతరులతో సంబంధాలు ఏర్పరచుకోవడానికి సృష్టించబడ్డాం. బృందాలు ఎందుకు అంత ప్రాముఖ్యం?

### బృందాలు, సమతుల్యతనిస్తాయి

యేసు ప్రజలను విభిన్న నేపథ్యాల నుండి ఎన్నుకున్నాడు. పేతురు యోహాను ఎల్లప్పుడు స్థిరమైన ప్రత్యర్థులు. మత్తయి రోము కోసం పనిచేసేవాడు, జెలోతీయుడైన సీమోను, రోమీయులను యూదయ నుండి వెళ్ళగొట్టాలనుకున్నాడు. వీరు వ్యతిరేకులు. శిష్యుల్ని ఎన్నుకునేటప్పుడు, యేసు విభిన్న ప్రజలను ఎన్నుకున్నాడు.

అలాటి వ్యతిరేక స్వభావం గలవారు జట్టులో ఉన్నప్పుడు కష్టాలున్నప్పటికీ, ఈ విభిన్న వ్యక్తిత్వాల్లో ఉండే ప్రయోజనాలు మనం విస్మరించకూడదు. అపొస్తలుడైన పేతురు లాంటివాడు పెద్ద పెద్ద ప్రకటనలు చేయడానికి తొందరపడతాడు. కాని జాగ్రత్తపరులైన తోమా, అంద్రెయ వంటి అపొస్తలులు ద్వారా సమతుల్యమయ్యాడు. నాయకత్వంలో విభిన్నమైన వ్యక్తులు ఉండటం వలన ఆదిసంఘం ప్రయోజనం పొందింది.

బుద్ధిగల నాయకులు విభిన్న నేపథ్యాల నుండి జట్టు సభ్యుల్ని ఎన్నుకుంటారు. బలమైన జట్టు సంఘ నాయకత్వంలో వివిధ బలాలు ఇస్తుంది. ఒక సభ్యుడికి ఆర్థిక విషయాల్లో ఎక్కువ అవగాహన ఉండొచ్చు; మరొకరికి వ్యక్తిగత సంబంధాల్లో ఉండొచ్చు. అందరు కలిసినప్పుడు, సంఘంలో సమతుల్య నాయకత్వం ఉంటుంది.

### బృందాలు తెలివైన సలహా ఇస్తాయి

ఆయన శిష్యులకు శిక్షణ ఇస్తున్నప్పుడు, సంఘానికి పునాది వేస్తున్నాడని యేసుకు తెలుసు. పెంతెకొస్తు తరువాత, ఆది సంఘం అనేకమైన కఠినమైన నిర్ణయాలు ఎదుర్కోవలసి వచ్చింది. శిష్యులు ఈ నిర్ణయాలు తీసుకుంటున్నప్పుడు ఒకరి అవసరత మరొకరికి ఉంటుందని యేసుకు తెలుసు.

"అన్యజనులైన విశ్వాసులు సంఘంలో ఎలా భాగమౌతారు?" అనేది ఆది సంఘం ఎదుర్కొన్న ఒక నిర్ణయం. "వారు యూదుల ధర్మశాస్త్ర విషయాలు అన్నీ పాటించాలా?" ఇది మనకు సులభంగా ఉన్నప్పటికీ, ఒక కష్టమైన నిర్ణయం. ఇది వ్యక్తిగత ప్రాధాన్యతకు సంబంధించిన విషయం కాదు; ఆహారం, సున్నతి నియమాలు పాత నిబంధన ఆధారితం. ఈ నిర్ణయానికి దీర్ఘ-కాల ప్రభావం ఉంటుంది. ఈ నిర్ణయం వలన నేడు మనం ప్రభావితమౌతాం. యెరూషలేం సభ, భిన్నమైన నిర్ణయం తీసుకొని ఉంటే, నేడు అన్య క్రైస్తవులు యూదుల నియమాలను పాటించవలసి ఉండేది.

ఈ ముఖ్య విషయాన్ని ఆది సంఘం ఎలా పరిష్కరించిందో అపొస్తలుల కార్యములు 15 చూపిస్తుంది. వేర్వేరు ఆలోచనలు విన్న తర్వాత, వారు ఒక నిర్ణయానికి వచ్చారు. వారు అన్య సంఘానికి రాసిన పత్రికలో, నిర్ణయాన్ని వివరించడానికి అపొస్తలులు ఒక మంచి పదం వాడారు, "ఈ అవశ్యమైన వాటికంటె ఎక్కువైన యే భారమును మీ మీద మోపకూడదని, పరిశుద్ధాత్మకును మాకును తోచెను" (అపొస్తలుల కార్యములు 15:28-29). సంఘ నాయకులు సమావేశమై, అభిప్రాయాలు చర్చించుకుని, సరైన నిర్ణయం తీసుకునేట్టుగా ఆత్మ వారిని నడిపించాడు.

నిర్ణయం తీసుకునేటప్పుడు భిన్నమైన దృక్పథాల విలువను గురించి సామెతల గ్రంథ రచయిత ఉద్ఘాటించాడు.

- మూఢుని మార్గము వాని దృష్టికి సరియైనది జ్ఞానముగలవాడు ఆలోచన నంగీకరించును (సామెతలు 12:15).
- నాయకులు లేని జనులు చెడిపోవుదురు ఆలోచనకర్తలు అనేకులుండుట రక్షణకరము (సామెతలు 11:14).
- వివేకముగల నాయకుడవై యుద్ధము చేయుము. ఆలోచన చెప్పువారు అనేకులుండుట రక్షణకరము (సామెతలు 24:6).

ఇది సంఘ నాయకులకు ముఖ్య సూత్రం. మీరు ఇతరుల మాటలు వినటానికి సుముఖత చూపకుంటే, జ్ఞానంగలవారు కాదని సామెతలు సెలవిస్తుంది. మూఢుని మార్గము వాని దృష్టికి సరియైనది జ్ఞానముగలవాడు ఆలోచన నంగీకరించును.

బృంద ఉద్దేశ్యం తెలివిగల సలహా ఇవ్వడమైతే, మనకంటే భిన్నంగా ఆలోచించే ప్రజలు మనకు అవసరం. జట్టును ఎన్నుకునేటప్పుడు మనవలె ఉన్నవారిని ఎన్నుకోకూడదు. మనతో ఎల్లప్పుడు ఏకీభవించే ప్రజలు మనకు అవసరం లేదు.

**బృందాలు, ప్రోత్సాహం అందిస్తాయి**

ప్రసంగి బృందం యొక్క ప్రయోజనాలు వివరిస్తాడు: "ఇద్దరి కష్టముచేత ఉభయులకు మంచిఫలము కలుగును గనుక ఒంటిగాడైయుండుటకంటె ఇద్దరు కూడి యుండుట మేలు. వారు పడిపోయినను ఒకడు తనతోడివానిని లేవనెత్తును; అయితే ఒంటరిగాడు పడిపోయినయెడల వానికి శ్రమయే కలుగును, వాని లేవనెత్తువాడు లేక పోవును." (ప్రసంగి 4:9-10).

సంఘం వ్యతిరేకత ఎదుర్కొన్నప్పుడు, అపొస్తలులు ఒకరినొకరి ప్రోత్సహించుకున్నారు. ఆది సంఘ సభ్యుల మధ్య పరస్పర సహకారం గురించి వివరించడానికి లూకా "ఏకమనస్సుతో ఎడతెగక" అనే మాట వాడాడు.

గొప్ప మిషనరీ హడ్సన్ టేలర్ ఈ సూత్రం ఉదహరించాడు. పరిచర్యపై ఆసక్తితో టేలర్ చైనా వెళ్లాడు, కాని వెంటనే నిరుత్సాహపడ్డాడు. అతనికి ఆర్థిక సహాయం చేసే కొందరు, సహాయం చేయటం మానేశారు. స్థాపించబడిన మిషనరీలు అతనిని విమర్శించేవారు. బ్రిటిష్ ప్రభుత్వం కూడా అతని పనిని వ్యతిరేకించింది. అతన్ని పెళ్లి చేసుకోబోయే వ్యక్తి, మిషనరీని పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని ఇంగ్లాండ్ నుండి లేఖ రాసింది. టేలర్ నిరుత్సాహానికి గురై, ఇంటికి వెళ్లిపోవడానికి సిద్ధమయ్యాడు.

ఈ సమయంలో, విలియం బర్న్స్ అనే స్కాటిష్ మిషనరీ హడ్సన్ టేలర్ తో కలిసి ఏడు నెలలు చైనా లోతట్టు ప్రాంతాల సువార్త ప్రకటనలో గడిపాడు. ఇద్దరు కలిసి ప్రయాణించారు, కలిసి ప్రార్థించారు, కలిసి ప్రకటించారు. ఆ పర్యటనలో, టేలర్ చైనా పట్ల తనకున్న దర్శనం తిరిగిపొందాడు. జాన్ పోల్లోక్ ఇలా రాశాడు: "విలియం బర్న్స్ హడ్సన్ టేలర్ ను తన నుండి రక్షించాడు."

తరువాత హడ్సన్ టేలర్ చైనా ఇన్లాండ్ మిషన్ ను స్థాపించాడు, ఆధునిక యుగంలో గొప్ప మిషనరీగా ప్రసిద్ధుడయ్యాడు; విలియం బర్న్స్ దాదాపు ఎవరికీ తెలియదు. అయితే, విలియం బర్న్స్ చైన ఇన్లాండ్ మిషన్ ద్వారా మారిన వేలాదిమందిలో కొందరికి బాధ్యుడు. క్లిష్ట పరిస్థితిలో బర్న్స్ హడ్సన్ టేలర్ ను ప్రోత్సహించాడు. బృందాలు ప్రోత్సాహం అందిస్తాయి.

**బృందాలు జవాబుదారీతనాన్ని అందిస్తాయి**

మనందరికీ కనబడనివి - అంటే మనలో మనం చూడలేని లక్షణాలు కొన్ని ఉంటాయి. మన కుటుంబ నేపథ్యం నుండి, క్రైస్తవ్యంలోకి రాక మునుపు జీవితం నుండి, మన వ్యక్తిత్వం నుండి వచ్చే బలహీనతలను మనం పరిచర్యలోకి తీసుకొస్తాం. అవి మన పరిచర్యపై ప్రభావం చూపుతుంటాయి.

ఈ బలహీనతలను మనం చూడలేం కాని బృందంలోనున్న ఇతర సభ్యులు మన పరిచర్యను నాశనం చేయగల ఈ విషయాల్లో మనలను అప్రమత్తం చేస్తారు. సత్కార్యాలు చేయడానికి ఒకనినొకడు హెచ్చరించుచు ఉండాలని హెబ్రీ పత్రిక రచయిత క్రైస్తవులను పిలిచాడు (హెబ్రీయులకు 10:24). "హెచ్చరించుచు" అను పదానికి గ్రీకులో ఒకరిని గుచ్చటం లేక పొడవటం అనే ఆలోచన ఇస్తుంది. కొన్నిసార్లు, ఇది అంగీకరించనిది. ఎవరు పొడిపించుకోవడానికి (వేలు ఎత్తి చూపించుకోవడానికి) ఇష్టపడరు, కాని జవాబుదారీతనం విలువైనది. ప్రతి క్రైస్తవ నాయకుని జీవితంలో "ఇది తెలివితక్కువ పని. మళ్ళీ దాని గురించి ఆలోచించాలి" అని చెప్పే వ్యక్తి అవసరం.

మధ్యయుగంలో మఠాలు, వెస్లీ క్లాస్ మీటింగ్స్ నుండి ప్రామిస్ కీపర్స్ వంటి ఆధునిక బృందాలు వరకు క్రైస్తవుల నాయకులకు జవాబుదారీతనం అనే సుదీర్ఘ సంప్రదాయం ఉంది. నేటి సంఘు నాయకులు జవాబుదారీతనం వల్ల

లబ్దిపొందుతున్నారు. దీనిని ఒక్కొక్కరుగా చిన్న గుంపులలో చెయ్యొచ్చు లేక ఫోన్లో అయినా చెయ్యొచ్చు. మనం పతనమవ్వకుండా ముందుగానే ఆత్మీయ ప్రమాదం గురించి ఇది మనలను హెచ్చరిస్తుంది.

మంచి జవాబుదారీతనంలో ప్రతి వ్యక్తి సంపూర్ణ నిజాయితీ కలిగి ఉండాలి, వ్యక్తుల మధ్య గోప్యత ఉండాలి. జవాబుదారీ ప్రశ్నలకు అనేక ఉదాహరణలు మీరే కనిపెట్టొచ్చు. ఒక జాబితాలో ఈ ప్రశ్నలు ఉంటాయి:

- ఈ వారం, క్రమంగా దేవునితో సమయం గడిపారా?
- ఈ వారం, ఏవిధంగానైన మీ యధార్ధత విషయంలో రాజీపడ్డారా?
- ఈ వారం, మీ ఆలోచన విధానం నిర్మలంగా ఉందా?
- ఈ వారం, ఏ విధమైన లైంగిక పాపం చేశారా?
- ఈ వారం, మీ భార్య (భర్త) కోసం ముఖ్య పని ఏం చేశారు?
- ఈ వారం, మీ విశ్వాసాన్ని గూర్చి అవిశ్వాసితో పంచుకున్నారా?
- ఈ సమాధానాలు నిజాయితీగా చెప్పారా?

బృంద జవాబుదారీతనం శోధన సమయాల్లో ప్రాముఖ్యం. యౌవ్వన పాస్టర్ కి రాస్తూ, శాశ్వతంగా నిలిచి ఉండే పరిచర్యను ఎలా నిర్మించాలో పౌలు చెప్పాడు. “నీవు యౌవనేచ్ఛలనుండి పారిపొమ్ము, పవిత్ర హృదయులై ప్రభువునకు ప్రార్థన చేయువారితోకూడ నీతిని విశ్వాసమును ప్రేమను సమాధానమును వెంటాడుము” (2 తిమోతికి 2:22) అని పౌలు తిమోతికి హెచ్చరించాడు. ప్రభువును పవిత్ర హృదయంతో పిలిచే దైవ-అనుచరులతో కలిస్తే తిమోతి ఆత్మీయ జీవితం బలపడుతుందని పౌలు అర్థం చేసుకున్నాడు.

► మీరు పరిచర్య బృందంలో భాగమైతే, మీ బృందం నుండి మీరు పొందుకున్న ప్రయోజనాలు పంచుకోండి. పరిచర్య బృందంలో ఉండటం వలన వచ్చే సవాళ్లు ఏంటి?

**బృందంతో కలిసి పనిచేయటం**

యేసు భిన్న వ్యక్తిత్వాలు గలవారిని ఒక బృందంగా రూపించాడు. యేసు వారి భిన్నత్వాలను తీసుకుని, ఆది సంఘాన్ని నడిపించగల ఒక జట్టును సృష్టించాడు. సంఘానికి పేతురుకున్న ధైర్యవంతమైన నాయకత్వం అవసరం, ఫిలిప్పుకున్న మౌన స్వభావం అవసరం. నాయకుడు ఎదుర్కొనే ఒక గొప్ప సవాలు, అనుచరులను ఒక జట్టుగా మలచడం.

శ్రీలంకలో ఒక సంఘ నాయకుడైన అజిత్ ఫెర్నాండో, జట్టును నిర్మించడంలో ఉండే సవాళ్లు బాగా అర్థం చేసుకున్నాడు. అతడు ఇలా రాశాడు:

ఇవాంజెలికల్ సంఘంలో ఉండే విషాదం ఏంటంటే, నిర్ణయం తీసుకుని చర్య జరిగించే విధానంలో చాలాసార్లు వేదాంతం కంటే భావాలు ఎక్కువగా పనిచేస్తుంటాయి. బైబిలానుసారమైన క్రైస్తవుడు ఇలా చెప్తాడు: "ఈ వ్యక్తి గురించి నా భావాలెలా ఉన్నా సరే, దేవుడు కోరుతున్నాడు గనుక నేనతన్ని అంగీకరిస్తాను. అతనితో అన్యోన్యత కలిగి పని చేసే కృప ఇవ్వమని దేవునిని అడుగుతాను." మన అనుభవాలు వేరే సందేశమిచ్చినప్పుడు, ఈ వ్యక్తితో కలిసి పనిచేయాలనే ఈ ప్రయత్నం పని చేస్తుందని మన వేదాంతం చెబుతుంది. ఈ సంబంధం విషయంలో కష్టపడి పని చేయడానికి మన వేదాంతం మనల్ని నడిపిస్తుంది. మనం వ్యక్తి కొరకు, అతనితో మనం సంబంధం కొరకు ప్రార్థిస్తాం. అతన్ని క్రమంగా కలుస్తాం. అతనికి క్రైస్తవ ప్రేమ చూపుతాం, అతని వ్యక్తిగత శ్రేయస్సు కోసం చేయగలిగినదంతా చేస్తాం. బృందం ద్వారా ఇతడు ఏం సాధించగలడో ప్రణాళికలు వృద్ధిచేస్తాం.[22]

కేవలం నచ్చకపోవడం వలన ప్రజలను తిరస్కరించే హక్కు క్రీస్తు దేహంలో మనకు లేదని 1 కొరింథీయులకు 12:12-25 బోధిస్తుంది. మీరు సంఘాన్ని నిర్మిస్తే, మీకు నచ్చని సభ్యులు కూడా ఉంటారు. ఒక క్రైస్తవ నాయకుడుగా మీరిలా చెప్పాలి, "నా వ్యక్తిగత భావాలేవైనా సరే, దేవుడు నాకు అప్పగించాడు గనుక ఈ వ్యక్తిని నేను అంగీకరిస్తాను. అతనితో కలిసి పనిచేసే కృప ఇవ్వాలని దేవుని అడుగుతాను మరియు, పరిచర్యలో అతనిని దీవించి, వృద్ధి చేయమని వేడుకుంటాను."

### ప్రభావవంతమైన క్రైస్తవ నాయకుడు, ఒక దాసుడు

ఒకసారి ఒక వ్యక్తి కాబోయే పాస్టర్ ని ఇలా అడిగాడు, "నువ్వు పాస్టర్ అవ్వాలని ఎందుకు అనుకుంటున్నావ్?" అప్పుడా యువకుడు, "విమానాశ్రయంలో, ఒక వ్యక్తి తన పాస్టర్ సంచి మోయటం చూశాను. నా సంచి మోయడానికి నాకు ఎవరైనా కావాలి!" అని సమాధానమిచ్చాడు.

యేసు దృక్పథం పూర్తి భిన్నం! ఈ యువకుడు పరిచారం చేయించుకోవాలనుకున్నాడు; యేసు పరిచారం చేయాలనుకున్నాడు. "మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెననెను" (మార్కు 10:45). నిజమైన నాయకత్వం పరిచారం చేయడమని యేసు చూపించాడు. యేసు తననుతాను తగ్గించుకుని, దాసుని స్వరూపం ధరించుకున్నాడు (ఫిలిప్పీయులకు 2:7).

► యోహాను 13:1-20 చదవండి.

---

[22] Ajith Fernando, *Jesus Driven Ministry* (Wheaton, Illinois: Crossway Books, 2002), 133

యేసు సేవా-నాయకత్వ మాదిరి గురించి సువార్తలలో పలుచోట్ల ఉంది, కాని ఒక అత్యంత గొప్ప ఉదాహరణ, యేసు తన శిష్యుల పాదాలు కడగటం. ఈ దృశ్యంలో, దాసుడు అంటే ఏంటో యేసు చూపించాడు.

ప్రభు రాత్రి భోజనం సమయంలో యేసు చేసిన పని (పాదాలు కడగటం) మళ్ళీ చేయాలని కొన్ని సంఘాల్లో పాదాలు-కడిగే కార్యక్రమం పెడతారు. ఇది అద్భుత కార్యక్రమం కావచ్చు, కాని యేసు ప్రత్యేకమైన ఆచారం జరిపించలేదని గ్రహించడం ఇంకా అద్భుతం. దానికి బదులుగా, ఆయన చేయవలసిన పని చేశాడు అంతే.

యెరూషలేములో మురికి వీధుల కారణంగా, భోజనపు బల్ల యొద్ద అతిథి పాదాలు కడగటం కూలీలకు ఆనవాయితీ. ఇది అల్పమైన సేవకులకు కేటాయించిన వినయపూర్వక విధి. యేసు ఆయన శిష్యులతో పస్కా వేడుకలో పాలుపంచుకొనగా, గదిలో పరిచారకుడు ఎవడు లేడు. ఈ పని చేయడానికి ఏ శిష్యుడు కూడా ముందుకు రాలేదు; యేసు రాజ్యంలో వారు ఉన్నత స్థానాల కోసం చూస్తున్నారు. యేసు వంగి అల్పమైన సేవకుడు చేసే పని చేయడం మొదలుపెట్టాడు.

ఈ దృశ్యం నాయకత్వంపై యేసు అవగాహనను చూపిస్తుంది. ఇతరులు నాయకత్వాన్ని అధికారం, స్థాయిగా చూశారు. వారి లక్ష్యం సంస్థలో ఉన్నతంగా ఉండడం. యేసు అప్పటికే ఉన్నత స్థాయిలో ఉన్నాడు; ఆయన శిష్యుల యజమానుడు. కాని దాసుని స్వరూపం తీసుకున్నాడు.

క్రీస్తునుపోలిన నాయకుడు అంటే ఇలా ఉండాలి. కీస్తునుపోలిన నాయకుడు ఏ ఒక్కరు కోరుకోని పనిని తీసుకుంటాడు. క్రీస్తునుపోలిన నాయకుడు ఇతరులపై విరుచుకుపడే తన అధికారం ద్వారా కాదుగాని వినయంతో పరిచారం చేయడం ద్వారా ఇతరులను ప్రేరేపిస్తాడు.

> "దేవుని ప్రజల మధ్య నాయకత్వానికి చిహ్నాలుగా పెద్ద బల్లల స్థానంలో తువాలు, నీటి తొట్టెను భర్తీ చేశారు....ఇది తువాలు వెనక్కి తిరిగి తీసుకురావలసిన సమయం."
>
> - సి. జీన్ విల్క్స్

ఒకసారి ఒకరు ఇలా చెప్పారు: "దాసుని స్వభావానికి పరీక్ష ఏంటంటే, 'నన్ను దాసునిగా చూసినప్పుడు, నేను ఎలా ప్రవర్తిస్తాను?'" యేసు మాదిరి అనుసరిస్తున్న నాయకుడిని, దాసునివలే చూసినప్పటికీ అభ్యంతరపడడు. ఇతర శిష్యులతో పాటుగా యేసు యూదా పాదాలు కూడా కడిగాడనే విషయం మరచిపోకూడదు. మిమ్మల్ని అప్పగించడానికి నిర్ణయించుకున్న వాని పాదాలు కడగడం మీరు ఊహించగలరా?

శిష్యులు పాదాలు కడగటం ముగిసిన తర్వాత, అధికారం కొరకు చూస్తున్న వారితో యేసు, "నేను మీకు చేసిన ప్రకారము మీరును చేయవలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని" (యోహాను 13:15) అని చెప్పాడు. ముప్పై సంవత్సరాల తరువాత, "దీనమనస్సు అను వస్త్రము ధరించుకొని మిమ్మును అలంకరించుకొనుడి" (1 పేతురు 5:5) అని

రాసినప్పుడు బహుశా యేసు విధేయతను సీమోను పేతురు గుర్తుచేసుకున్నాడు. శిష్యులకు పరిచారం చేయాలని యేసు నడుం చుట్టూ తువాలు చుట్టుకున్నట్లుగా, ఇతరులకు పరిచారం చేసేటప్పుడు మనం విధేయతను చుట్టుకోవాలి.

క్రైస్తవ నాయకులుగా, పరిచారం కొరకు అవకాశాలు వెదకకుండ అధికారం కొరకు అవకాశాలు వెదకే శోధనలు మనం ఎదుర్కొంటాం. క్రైస్తవ నాయకత్వం పరిచారమని యేసు చూపించాడు.

### ముగింపు: ఇతర క్రైస్తవ పరిచారకులకు మార్గదర్శకత్వం చేయడం యొక్క ప్రాముఖ్యత

మీ జీవిత ముగింపులో, ఇతర క్రైస్తవ పనివారిపై బోధకునిగా మీరు చూపే ప్రభావం, మీ పరిచర్యలో గొప్ప స్వాస్థ్యం. మీ పరిచర్యలో మీరు కేవలం 12మందికి మాత్రమే మార్గదర్శకత్వం చేస్తే, మీ ప్రభావం ఆ 12మందితో పాటు వారు మార్గదర్శకత్వం చేసే వారితో కూడా వృద్ధి చెందుతుంది.

విచారకరమైన విషయం ఏమిటంటే, మార్గదర్శకత్వం (మెంటరింగ్) ప్రాముఖ్యత గురించి చాలామంది క్రైస్తవ నాయకులకు తెలిసినప్పటికీ, కొందరే ఇతరులకు మార్గదర్శకత్వం చేయడానికి సమయం కేటాయిస్తారు. పరిచర్యలో ఈ కోణాన్ని మనం ఎందుకు నిర్లక్ష్యం చేస్తాం?

ఒక కారణం, మార్గదర్శకత్వం యొక్క వెల. శిక్షణకు విలువైన సమయం అవసరం. యౌవ్వన నాయకులకు శిక్షణ ఇచ్చే సమయాన్ని, పెద్ద సమూహానికి పరిచర్య చేయడానికి కేటాయిస్తే మరీ మంచిదని మనం ఎల్లప్పుడు భావిస్తాం.

మరొక కారణం, మార్గదర్శకత్వం ఇవ్వడంతో పాటు వచ్చే నిరాశ. "నేను తరువాత తరం నాయకులకు శిక్షణ ఇస్తున్నాను" అని చెప్పడం ఆకర్షణీయంగా ఉంటుంది. వాస్తవంగా మాత్రం అంత ఉత్తేజకరంగా ఉండదు.

చాలసార్లు, యేసు ఆయన శిష్యుల్లో పురోగతి నెమ్మదిగా ఉండడాన్ని చూసి నిరాశ చెందియుండొచ్చు. యేసుతో మూడు సంవత్సరాలు గడిపిన పిమ్మట, ఫిలిప్పు, "ప్రభువా, తండ్రిని మాకు కనబరచుము, మాకంతే చాలునని ఆయనతో చెప్పగా" (యోహాను 14:8). యేసు 5000మందికి ఆహారం పెట్టిన కొన్ని వారాల తరువాత, శిష్యులు 4000మంది జనసమూహాన్ని ఎదుర్కొన్నారు. "అందుకాయన శిష్యులు—ఈ అరణ్యప్రదేశములో ఒకడెక్కడ నుండి రొట్టెలు తెచ్చి, వీరిని తృప్తిపరచగలడని ఆయన నడిగిరి" (మార్కు 8:4).

అపొస్తలుడైన పౌలు కూడా అదే నిరుత్సాహం అనుభవించాడు. యోహాను అను మారుపేరు గల మార్కు, మొదటి మిషనరీ యాత్రలోనే విరమించుకున్నాడు (అపొస్తలుల కార్యములు 13:13). దేమాకు శిక్షణ ఇచ్చిన కొంత కాలానికి, పౌలు చెరలో ఒంటరిగా ఉన్నప్పుడు ఇలా రాశాడు, "దేమా యిహలోకమును స్నేహించి నన్ను విడిచి థెస్సలొనీకకు వెళ్లెను" (2 తిమోతికి 4:10).

మార్గదర్శకత్వం ఖరీదైనది, నిరుత్సాహం కలిగిస్తుంది, కాని నాయకుని పనిలో ఆది ముఖ్య భాగం. పరిపక్వతగల ప్రతి నాయకుడు భవిష్యత్ నాయకులకు శిక్షణ ఇవ్వాలి. అదే సమయంలో, ప్రతి క్రైస్తవ నాయకునికి శ్రమ కాలంలో మద్దతిచ్చే శిక్షకుడు అవసరం.

హోవార్డ్ హెండ్రిక్స్ ప్రతి మనిషి జీవితంలో ముగ్గురు వ్యక్తులు అవసరమని చెప్పాడు:

1. ప్రతి మనిషికి అభివృద్ధి కొనసాగించాలని మిమ్మును సవాలు చేసే గురువు లాంటి పౌలు అవసరం.
2. ప్రతి మనిషికి మీ బలహీనతల విషయంలో నిజాయితీగా ఉండి మిమ్మల్ని ప్రేమించే మిత్రుడు లాంటి బర్నబా అవసరం.
3. ప్రతి మనిషికి పరిచర్యలో శిక్షణ ఇచ్చి, బోధించే యువకుని లాంటి తిమోతి అవసరం.

► ఇలా ప్రశ్నిస్తూ ఈ పాఠం ముగించండి:

- "నా పౌలు ఎవరు??"
- "నా బర్నబా ఎవరు?"
- "నా తిమోతి ఎవరు?"

## పాఠం 3 అభ్యాసాలు

(1) క్రింద ఇచ్చిన పట్టికలో, శిష్యులు యేసు పరిచర్యను పరిశీలించిన నాలుగు సందర్భాలు రాయండి. యేసును పరిశీలిస్తూ, శిష్యులు నేర్చుకున్న విషయాలు గమనించండి.

(2) భవిష్యత్ పరిచర్య కొరకు మీరు శిక్షణ ఇచ్చే ఇద్దరు లేక ముగ్గురు పేర్లు రాయండి. రెండు ప్రశ్నలకు సమాధానమిచ్చేటప్పుడు చిన్న పేరా రాయండి:

- నేను శిక్షణ ఇస్తున్న వ్యక్తిలో ఎలాంటి లక్షణాలు చూడాలని కోరుతున్నాను?
- నేను శిక్షణ ఇస్తున్న వ్యక్తిలో దేవుడు ఏం నెరవేర్చాలని కోరుతున్నాను? (నిర్దిష్టంగా చెప్పండి.)

మీరు పేరు చెప్పిన వ్యక్తులకు శిక్షణ ఇచ్చే దశలు మొదలుపెట్టండి. పరిచర్య అవకాశాల కొరకు వారిని ఎలా సిద్ధపరచగలమో చూపించమని దేవునిని అడగండి.

| సంఘటన | లేఖనం | శిష్యులకు పాఠం |
|---|---|---|
| యేసు దయ్యము పట్టిన బాలుని స్వస్థపరచడం | మత్తయి 17:14-21 | విశ్వాస శక్తి |
| | | |
| | | |
| | | |
| | | |

# పాఠం 4

# యేసువలే బోధించడం

### పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) యేసును గొప్ప బోధకునిగా చేసిన గుణలక్షణాలను గుర్తించగలుగుతారు.

(2) బోధకునిగా అభివృద్ధి చెందడానికి ఆచరణాత్మక పద్ధతులు నేర్చుకొంటారు.

(3) తరగతికి విద్యార్థుల సిద్ధపాటును మెరుగుపరిచే అభ్యాసాలను ప్రణాళిక చేస్తారు.

### పరిచర్యకు సూత్రం

మన విద్యార్థులు పూర్తిగా శిక్షణ పొందిన తర్వాత, వాళ్ల బోధకునిలా ఉంటారు.

### పరిచయం

► ఈ పాఠం ముగింపులో అభ్యాసం లేదు. బదులుగా, పాఠం అంతటిలో "పాఠాన్ని ఆచరణలో పెట్టండి" అనే శీర్షిక క్రింద చిన్న చిన్న అసైన్మెంట్లు ఉన్నాయి. వీటిలో కొన్ని రాయాల్సి ఉంటుంది లేక ఆచరించాల్సి ఉంటుంది. మిగిలిన అభ్యాసాలు, ఆలోచించేవి లేక చర్చించేవి. మీరు పాఠం మెటీరియల్ పై పని చేస్తుండగా ప్రతి అభ్యాసాన్ని చెయ్యాలి.

బోధనా శక్తి గురించి చేసిన ప్రకటనలన్నిటిలోకెల్లా ఒక అత్యద్భుత ప్రకటన యేసు చేశాడు: "శిష్యుడు తన బోధకునికంటె అధికుడు కాడు; సిద్ధుడైన ప్రతివాడును తన బోధకునివలె ఉండును" (లూకా 6:40). యేసు శిష్యులకు శిక్షణ ఇస్తున్నప్పుడు, వాళ్లు ఆయన స్వభావాన్ని ప్రతిబింబిస్తారని యేసుకు తెలుసు. దీనిని బట్టి, యేసు పన్నెండుమంది శిష్యులకు బోధించడానికి గొప్ప సమయాన్ని వెచ్చించాడు.

కొన్ని సంఘాల్లో, సండేస్కూల్ ఉపాధ్యాయులకు ఎటువంటి అనుభవం, శిక్షణ లేకుండా పని అప్పగిస్తున్నారు. క్రొత్తగా రక్షించబడినవారికి లేక యౌవ్వన పిల్లలకు బోధించడానికి అసలు సమయమే కేటాయించట్లేదు.

సంఘ నాయకులుగా, యేసు బోధనకు ఎంత ప్రాధాన్యత ఇచ్చాడో మనం కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలి. విద్యార్థులు తమ బోధకునిలా మారినప్పుడు, బోధనా బాధ్యత చాలా గొప్పగా ఉంటుంది. ఉన్నత బోధకుడైన యేసు మాదిరిని అనుసరించునట్లుగా బోధకులకు మనం శిక్షణ ఇవ్వాలి.

► యేసు బోధనా శైలి గురించి మీకు ఇప్పటికే తెలిసిన విషయాలు ఆలోచించండి. ఆయనను గొప్ప బోధకునిగా చేసిన మూడు లేక నాలుగు లక్షణాలను గుర్తించండి. ఇప్పుడు మీరు నేర్చుకున్న ఉత్తమ బోధకుని గురించి ఆలోచించండి. ఆ వ్యక్తిని గొప్ప బోధకున్ని చేసిన మూడు లేక నాలుగు లక్షణాలు గుర్తించండి. వీటిలో ఎన్ని లక్షణాలు ఈ రెండింటిలోను ఉన్నాయి?

### ప్రధాన బోధకుని హృదయం: గుణం/స్వభావం

యేసు బోధనలో విషయాలు, బోధకుని స్వభావంపై ఆధారపడి ఉంటాయి. యేసు హృదయమే ఆయన బోధకు పునాదిని ఏర్పరుస్తుంది. గొప్ప బోధకుని హృదయం ఏలా ఉంటుంది?

**యేసు, ప్రధాన బోధకుడు, ఆయన విద్యార్థుల అవసరతలు గ్రహించాడు.**

► లూకా 4:16-21 చదవండి.

స్కూల్ టీచర్లు, ప్రతి రోజు తరగతికి పాఠ్య ప్రణాళికను సిద్ధపరుస్తారు. ప్రతి తరగతిలో బోధకుడు ఏం చేస్తాడనేది పాఠ్య ప్రణాళిక చూపిస్తుంది. పాఠ్య ప్రణాళికలో ఇలాంటివి ఉంటాయి:

- లక్ష్యం: విద్యార్థులు చిన్న చిన్న ముక్కలను జతచేయటం నేర్చుకుంటారు.
- కార్యాచరణ: తరగతి వర్క్ బుక్ 89వ పేజీలోని 1-20 లెక్కలు చేస్తారు.

యేసు ఆయన పరిచర్య కొరకు పాఠ్య ప్రణాళిక కలిగియున్నాడు, కాని ఆయన పాఠ్య ప్రణాళికలో తరగతి వర్క్ బుక్ లో ఉన్నట్లుగా పేజీలు ఉండవు. బదులుగా, యేసు పాఠ్య ప్రణాళిక ఆయన విద్యార్థుల అవసరాలపై దృష్టిపెడుతుంది. యేసు ఏం నెరవేర్చడానికి పంపబడ్డాడో తన శ్రోతలకు చెప్పాడు:

- బీదలకు సువార్త ప్రకటించుట.
- చెరలోనున్న వారికి విడుదల.
- గ్రుడ్డివారికి చూపు.
- నలిగినవారిని విడిపించుట.
- ప్రభువు హితవత్సరము ప్రకటించుట (లూకా 4:18-19).

యేసు లక్ష్యాలు ఆయన శిష్యుల అవసరాలు తీర్చాయి. యేసు శిష్యులు యెరూషలేము దేవాలయంపై నియంత్రణ కలిగి, సన్హేడ్రిన్లో/మహాసభలో రాజకీయ అధికారం, ఆస్తి కలిగిన సద్దూకయ్యులు కారు. ఆయన శిష్యులు, రోమీయులు

పెట్టే బాధలు అనుభవిస్తున్న సాధారణ యూదా ప్రజలు. వాళ్లలో కొందరు గ్రుడ్డివారు లేక కుంటివారు. చాలావరకు, అధిక పన్నులు కట్టలేని బీదలు.

యేసు పాఠ్య ప్రణాళిక సులభం; ఆయన తన విద్యార్థుల అవసరాలు తీరుస్తాడు. చెరలోవారిని విడిపిస్తాడు. గ్రుడ్డివారికి చూపు ఇస్తాడు. యూదుల క్యాలెండర్లో, హితవత్సరం అంటే వేడుక జరుపుకునే సందర్భం. రుణాలు రద్దు చేసే సమయం; భూమి, అసలైన యజమాని కుటుంబానికి తిరిగి వస్తుంది; బానిసలకు స్వేచ్ఛ కలుగుతుంది. నలిగినవారికి హితవత్సరం ప్రకటించడానికి వచ్చానని యేసు ప్రకటించాడు.

ఆయన భూమిపై చేసిన పరిచర్య అంతటా, యేసు తన శిష్యుల అవసరాలు గురించి మాట్లాడారు. ప్రజలకు కోరిన ప్రతిదీ ఇవ్వలేదుగాని, అవసరమైనది ఇచ్చాడు. సమరయ స్త్రీకి నీళ్లు కోరింది; కానీ ఆమెకు విమోచన అవసరం (యోహాను 4:7-42). పేతురు చేపలు పట్టాలనుకున్నాడు; అతనికి పరిచర్య/మిషన్ అవసరం (మత్తయి 4:18-22). ప్రతి సందర్భంలో, యేసు తన శిష్యుల లోతైన అవసరాలు తీర్చాడు.

► మార్కు 10:17-22 చదవండి.

యేసు యొద్దకు వచ్చిన ధనవంతుడైన యౌవ్వనస్తుని కథలో, “యేసు అతని చూచి అతని ప్రేమించి” అని సువార్తికుడు చెప్పాడు. ఈ వచనంలో చూచి అనే పదానికి అర్థం కేవలం చూడటం మాత్రమే కాదు. లోతుగా చూసి, గ్రహించడమని అర్థం. యేసు ఈ యువకుడి హృదయం చూశాడు. కొందరు ధనవంతుడైన యువకుని మాత్రమే చూసి ఉంటారు; కాని యేసు ఆకలితో ఉన్న హృదయం చూశాడు.

► మార్కు 16:1-8 చదవండి.

పేతురు యేసును తిరస్కరించిన తరువాత, అతనికి కలిగిన అవమానం గురించి ఆలోచించండి. అతను కోడి కూయడం జ్ఞాపకం చేసుకున్నప్పుడు తన అవమానం పునరుత్థాన ఆనందాన్ని కూడా మ్రింగివేసింది. ఈ సందర్భంలో, దేవదూత మరియతో, “మీరు వెళ్లి ఆయన మీకంటె ముందుగా గలిలయలోనికి వెళ్లుచున్నాడనియు, ఆయన మీతో చెప్పినట్టు అక్కడ మీరు ఆయనను చూతురనియు ఆయన శిష్యులతోను పేతురుతోను చెప్పుడనెను.” శిష్యులందరిలోకెల్లా పేతురుకు ఎక్కువ భరోసా కావాలని యేసుకు తెలుసు. ఇతరులు తన యజమానుని తిరస్కరించిన పిరికివాని చూశారు; కాని యేసు పునరుద్ధరణ అవసరతలోనున్న తప్పిపోయిన శిష్యుడ్ని చూశాడు.

శిష్యుల్ని అర్థం చేసుకోకుండా వాళ్లకి బోధించలేమని యేసుకు తెలుసు. మీరు విద్యార్థి హృదయం గెలుచుకోవాలంటే, విద్యార్థిలాగా ఆలోచించాలి. మీరు బోధిస్తున్న వాళ్ల మనసు అర్థం చేసుకోవాలి. ఒక బోధకునిగా, విషయాలు అధ్యయనం చెయ్యాలి, అంతకంటే ఎక్కువగా, మీ విద్యార్థులను చదవాలి. మీ విద్యార్థుల అవసరాలు అర్థం చేసుకోవాలి.

**పాఠాన్ని ఆచరణలో పెట్టండి**

► మీరు బోధిస్తున్న వాళ్ల గురించి ఆలోచించండి (అధికారికంగా లేక అనధికారికంగా). పోరాటాల్లో ఉన్న విద్యార్థిపై దృష్టిపెట్టండి. ఈ విద్యార్థి అవసరాలు తీర్చడానికి ఎలాటి ఆచరణాత్మక పనులు చేయగలరో జాబితా చేయండి.

**యేసు, ప్రధాన బోధకుడు, సహనంగలవాడు**

***ఆయనకు వ్యతిరేకంగా ఉన్న వారి యెడల యేసు సహనంగా ఉన్నాడు.***

► యోహాను 6:41-71 చదవండి.

ఈ కథ యేసు పరిచర్యలో ముఖ్య పరావర్తన దశలో చోటుచేసుకుంది. గత సంవత్సరంలో, యేసు గొప్ప ప్రజాదరణ పొందాడు. ఆయన అద్భుతాలు చూసి ప్రజలు ఆశ్చర్యపోయారు, రొట్టెలు చేపలు తింటూ బాగా ఆనందించారు. ఇప్పుడు యేసు, "జీవాహారము నేనే" అని ప్రకటించాడు. ఆయన శ్రోతలను కలవరపరిచే మాటలు చెప్పాడు. "కావున యేసు ఇట్లనెను—మీరు మనుష్యకుమారుని శరీరము తిని ఆయన రక్తము త్రాగితేనే కాని, మీలో మీరు జీవముగలవారు కారు. అప్పటినుండి ఆయన శిష్యులలో అనేకులు వెనుకతీసి, మరి ఎన్నడును ఆయనను వెంబడింపలేదు."

చాలామంది ఆయన బోధ అంగీకరించరని తెలిసి కూడా యేసు వేలమందికి బోధించాడు. ఒకరు ఆయనను తిరస్కరిస్తారని తెలిసి కూడా ఆయన పండ్రెండుగురికి బోధించాడు (యోహాను 6:70). ఆయన సహనంగల బోధకుడు.

***ఆయనను అర్థం చేసుకోని వారియెడల యేసు సహనంగా ఉన్నాడు.***

► మార్కు 8:27-33 చదవండి.

నిదానంగా నేర్చుకునే విద్యార్థుల విషయంలో యేసు సహనంగా ఉన్నాడు. సువార్తల్లో ఎన్నిసార్లు శిష్యులు తమ అనుమానాలను, అంధత్వాన్ని చూపించారో గమనించండి. పేతురు, "నీవు క్రీస్తువని," గుర్తించినప్పుడు కూడా నిజంగా దాని అర్థం ఏంటో గ్రహించలేదు. కొన్ని వచనాల తరువాత, పేతురు చెడ్డ ఆలోచనలు బట్టి యేసు అతన్ని గద్దించాడు.

► యోహాను 3:1-21 చదవండి.

ఆయన బోధను అర్థం చేసుకోని పరిసయ్యుని విషయంలో యేసు సహనంగా ఉన్నాడు. నీకొదేము సందిగ్ధంలో ఉన్నప్పుడు, "నీవు ఇశ్రాయేలుకు బోధకుడవై యుండి వీటిని ఎరుగవా?" అని యేసు ఆశ్చర్యంతో అడిగాడు. ఇశ్రాయేలు నీటి మూలంగా, ఆత్మ మూలంగా జన్మించే దినమొకటి వస్తుందని యెహెజ్కేలు చెప్పిన ప్రవచనం నీకొదేముకు తెలిసియుండాలి. కాని యేసు నిరాశపడకుండా, సహనంతో నీకొదేముకు బోధించాడు.[23]

ఇక్కడ బోధకుని సహనానికి ఒక మంచి పరీక్ష ఉంది: "నేను నిరాశతో వెనకడుగు వేయడానికి ముందు ఎన్నిసార్లు బోధించడానికి ఇష్టపడతాను?" యేసు తన విద్యార్థులకు బోధించాడు, మళ్లీ బోధించాడు. ఆయన బోధనకు విద్యార్థులు ఆసక్తిగా ఉన్నారని గ్రహించినప్పుడు, ఆ బోధన కొనసాగించాడు. యేసు, ప్రధాన బోధకుడు, సహనంగలవాడు.

### పాఠాన్ని ఆచరణలో పెట్టండి

► మీరెప్పుడైనా, నిదానంగా నేర్చుకునే విద్యార్థులను విడిచిపెట్టాలనే శోధనను ఎదుర్కొన్నారా? వాళ్లు మీ బోధకు స్పందించనప్పుడు నిరుత్సాహానికి గురైయ్యారా? ప్రధాన బోధకుని సహనం మీరు బోధించేవాళ్ల పట్ల ఎలా చూపించగలరు?

### ప్రధాన బోధకుడైన యేసు, విద్యార్థుల్ని ప్రేమించాడు

► మార్కు 6:30-34 చదవండి.

పరిచర్య, జనసమూహం వలన కలుగుతున్న నిరంతర ఒత్తిడి నుండి విశ్రమించడానికి కొంచెం దూరంగా, ఏకాంతంగా యేసు తన శిష్యులను గలిలయ సముద్ర తీరానికి తీసుకెళ్లాడు. ఆయన వెళ్తున్నప్పుడు వేలమంది చూసి, యేసును కలుసుకోవాలని సముద్ర తీరాన పరిగెత్తుతూ వచ్చారు. యేసు అక్కడ 5,000 మంది పురుషులు, స్త్రీలను మరియు పిల్లలను చూశాడు. ఆయన జనసమూహాన్ని చూసి, "వారు కాపరిలేని గొఱ్ఱెలవలె ఉన్నందున వారిమీద కనికరపడి, వారికి అనేక సంగతులను బోధింపసాగెను" (మార్కు 6:34). ప్రధాన బోధకుడైన యేసు తన విద్యార్థులను ప్రేమించాడు గనుక బోధించాడు.

---

[23] యోహాను 3:5, యెహెజ్కేలు 36:25-27 వాగ్దానాన్ని సూచిస్తుంది. దేవుని ప్రజలు నీటితో కడుగబడు (ఇది అపవిత్రత నుండి, విగ్రహములవల కలుగు అపవిత్రత నుండి శుద్ధి చేస్తుంది) మరియు నూతన ఆత్మ పొందుకునే (ఇది దేవుని నియమాల్ని ఆచరించాలనే ఆశ కలిగిస్తుంది) దినము యెహెజ్కేలు చూశాడు.

ముందు ఈ పాఠంలో, యేసును వెంబడించే క్రమంలో వెల చెల్లించడానికి ఇష్టపడకుండా విచారంగా వెళ్లిపోయిన ధనవంతుడైన ఒక యువకుని కథ మనం చదివాం (మార్కు 10:17-22). “యేసు అతని చూచి అతని ప్రేమించాడు” (మార్కు 10:21). ప్రధాన బోధకుడు తన శిష్యుడ్ని, తనను విడిచి వెళ్లిపోయిన శిష్యుడ్ని సైతం ప్రేమించాడు.

యేసు సమూహాలను, వ్యక్తులను, మరియు ఆయనను తిరస్కరించినవారిని సైతం చూసి కనికరపడ్డాడు. ఒక ప్రసంగికుడు, “యూదా, యేసు ప్రేమించిన శిష్యుడు” అనే ప్రసంగ శీర్షికపై ప్రసంగించాడు. యేసు యూదాను సైతం ప్రేమించాడనే విషయాన్ని ఈ ప్రసంగికుడు గుర్తించాడు. యూదా తనను తిరస్కరిస్తాడని తెలిసి కూడా, యేసు తుది వరకు అతన్ని ప్రేమించాడు.

క్లాసుకి త్వరగా వస్తూ, ప్రతి అభ్యాసాన్ని చేస్తూ, నేర్చుకోవడానికి ఆసక్తి చూపించే విద్యార్థిని ప్రేమించటం సులభం. మనలను తిరస్కరించే యూదాను, వెళ్లిపోయిన ధనవంతుడైన యువకుడిని, పదే పదే అర్థం చేసుకోవడంలో విఫలమౌతున్న వారిని ప్రేమించడం కష్టం. ప్రధాన బోధకుడైన యేసు, కష్టమైన విద్యార్థుల్ని సైతం ప్రేమించాలని చూపించాడు.

**పాఠాన్ని ఆచరణలో పెట్టండి**

► ప్రేమించడానికి కష్టంగా అనిపించే విద్యార్థి గురించి ఆలోచించండి. బహుశా మీ నాయకత్వాన్ని ప్రతిఘటించే సిబ్బంది కావచ్చు. మిమ్మల్ని విమర్శించే సంఘ సభ్యుడు కావచ్చు. ఇలా ప్రార్థించడం మొదలుపెట్టండి, “దేవా, ఈ వ్యక్తిని ప్రేమించటం కష్టం, కాని నీవు వారిని ప్రేమిస్తున్నావని తెలుసు. నీ నేత్రాల ద్వారా వారిని చూడ్డానికి నాకు సహాయం చేయండి. యేసు తన శిష్యుల్ని ప్రేమించినట్లుగా నేను వారిని ప్రేమించడానికి సహాయం చేయండి.”

## ప్రధాన బోధకుని చేతులు: పద్ధతులు

“ప్రధాన బోధకుని హృదయం”లో మనం యేసు గుణం చూశాం. యేసు బోధించిన ప్రతిదీ ఆయన గుణంపై ఆధారితం. “ప్రధాన బోధకుని చేతుల”లో యేసు ఉపయోగించిన పద్ధతులు మనం చూస్తాం. మనం యేసువలే బోధించాలంటే, ఆయన పద్ధతులు తప్పక పాటించాలి.

**యేసు, ప్రధాన బోధకుడు, ఆయన లక్ష్యాలు తెలియపరిచాడు**

► లూకా 5:1-11 చదవండి.

యేసు గలిలయ తీరాన బోధిస్తుండగా, జనసమూహం ఆయన మీద పడుతున్నప్పుడు ఆయన సీమోను పేతురు దోనె ఎక్కవలసి వచ్చింది.[24] బోధించిన పిమ్మట, యేసు పేతురును చూసి, “నీవు దోనెను లోతునకు నడిపించి, చేపలు పట్టుటకు మీ వలలు వేయుడని” (లూకా 5:4) చెప్పాడు.

సీమోను అనుభవజ్ఞుడైన జాలరి, రాత్రంతా చేపలుపట్టినా ఏం దొరకలేదు. ఆ సమయంలో చేపలు పట్టే ప్రయత్నం చేసినా అది పని చెయ్యదని అతనికి తెలుసు కాని యేసు ఆజ్ఞాపించినట్లు చేశాడు. పేతురు ఆశ్చర్యపోయేలా, జాలర్లు విస్తారమైన చేపలను పట్టుకొని తీసుకొచ్చారు. యేసు సీమోనుతో, “ఇప్పటి నుండి నీవు మనుష్యులను పట్టువాడవై యుందువని” (లూకా 5:10) చెప్పాడు.

యేసు, మంచి బోధకులందరివలే, ఆయన లక్ష్యాలు తన విద్యార్థులకు తెలియజేశాడు. పెంతెకొస్తును దినమందు, యేసు తన కొరకు ఏర్పాటు చేసిన లక్ష్యాన్ని పేతురు నెరవేర్చడానికి సిద్ధంగా ఉన్నట్లు చూపించాడు.

ప్రభావవంతమైన బోధకులు తమ లక్ష్యాలు తెలియజేస్తారు. వారు విద్యార్థులకు ఇలా చెబుతారు, “నేడు మీరు నేర్చుకోబోయేది ఇది.” పాఠం ముగింపులో, “నేడు మీరు ఏం నేర్చుకున్నారు” అని అడుగుతారు. పాఠం లక్ష్యం నెరవేరిందని విద్యార్థులు గుర్తించారో లేదో నిర్ధారించుకుంటారు.

### పాఠాన్ని ఆచరణలో పెట్టండి

► మీకు మళ్లీ బోధనా అవకాశం వచ్చినప్పుడు, పాఠం లక్ష్యాలు బోర్డుపై విద్యార్థులకు కనబడేటట్లు రాయండి. లక్ష్యం తేటగా, సులభంగా అర్థమయ్యేట్లుగా చూడండి. పాఠం మొదలుపెట్టే ముందుగా లక్ష్యాన్ని పరిచయం చెయ్యండి. పాఠం ముగింపులో. “మన లక్ష్యం సాధించామా?” అని విద్యార్థుల్ని అడగండి.

### ప్రధాన బోధకుడైన యేసు, తన మార్గదర్శకత్వంతో అభ్యాసం చేసే అవకాశాలు ఇచ్చాడు

ప్రభావవంతమైన బోధన సాధారణ ఉపన్యాసాలకు మించింది. నిజంగా నేర్చుకోవాలంటే అభ్యాసం అవసరం.

► లూకా 10:1-24 చదవండి.

ఈ శిష్యులు ఇంకా పూర్తిగా శిక్షణ పొందలేదు కాని యేసు తాను బోధిస్తున్న పాఠాలు వాళ్లకి అభ్యసింపజేశాడు. శిష్యులు పరిచర్య చేసి, తిరిగి వచ్చిన తర్వాత, యేసుకు ఆ పరిచర్య విషయాలు చెప్పారు. వాళ్లకి పాఠాలు అర్థం కాలేదని యెరిగి,

[24] లూకా “గెన్నేసరెతు సరస్సు” యోహాను “తిబెరియ సముద్రం” మరియు మార్కు “గలిలయ సముద్రం,” మోషే “కిన్నెరెతు సముద్రం” (సంఖ్యాకాండము 34:11) ఇవన్నీ యేసు పరిచర్యలో ముఖ్యమైన పెద్ద సరస్సును సూచిస్తాయి. యేసు శిష్యులలో చాలామంది ఈ సరస్సులో జాలర్లు, అదే విధంగా ఆయన పరిచర్య ఎక్కువగా గలిలయ సముద్ర తీరంలో జరిగింది.

ఆయన మరిన్ని హెచ్చరికలు ఇచ్చాడు. "మీరు చూచుచున్న వాటిని చూచు కన్నులు ధన్యములైనవి" (లూకా 10:23)" అని చెప్పి కూడా వారిని ప్రోత్సహించాడు. యేసు వారి అభ్యాసానికి దిశా నిర్దేశం చేశాడు.

అభ్యసించడానికి అవకాశం ఇస్తే చాలదు; అభ్యాసాన్ని పరీక్షించాలి, తరువాత మరింత శిక్షణ ఇవ్వాలి. "అభ్యాసం పరిపూర్ణత నిస్తుంది" అనే ఒక సుపరిచితమైన సామెత ఉంది. ఇది పూర్తిగా నిజం కాదు. తప్పుడు అభ్యాసం సరైన పనితీరును కలిగించదు. "మార్గనిర్దేశిత అభ్యాసం పరిపూర్ణత నిస్తుంది" అని చెప్పడం మంచిది. ప్రభావవంతమైన బోధకుడు తన విద్యార్థులకు అభ్యాస అవకాశం ఇస్తాడు, విద్యార్థులతో కలిసి అభ్యాసాన్ని సమీక్షిస్తాడు, ఆ తర్వాత విద్యార్థులను ప్రోత్సహించి, నడిపిస్తాడు.

మార్గనిర్దేశిత అభ్యాసపు విలువ పౌలుకు తెలుసు. అతను తిమోతి, తీతుకు శిక్షణ ఇచ్చి, వాళ్లని పరిచర్యలో ఉంచాడు. కాపరి పత్రికల్లో, తిమోతి, తీతుకు మరింత ఉపదేశమిస్తూ పౌలు రాశాడు. అతడు బోధించిన సూత్రాలను వారు అభ్యసిస్తుండగా తన శిష్యులను నడిపించాడు.

దక్షిణ ఆఫ్రికాలోని ఒక పాఠశాల, తరగతి గదిలో ప్రతి విద్యార్థి 1 కొరింథీయులకు 13 కంఠస్థం చేశారు. ఈ అభ్యాసంతో ఒక విద్యార్థి కొన్ని వారాలు సతమతమయ్యాడు. సరిగా కంఠస్థం చేయలేకపోయాడు, ఇతర విద్యార్థుల ఎదుట సిగ్గుపడ్డాడు. చివరకు, ఒకరోజు ఆ విద్యార్థి తరగతి అందరి మధ్యలో అధ్యాయం మొత్తాన్ని చూడకుండా చెప్పగలిగాడు.

అతడు ఆ అధ్యాయాన్ని చూడకుండా చెప్పడం ముగించగానే, ఇతర విద్యార్థులు లేచి నిలబడి, చప్పట్లు కొట్టారు. ఎందుకు? ఈ అధ్యాయం ప్రేమ గురించి, పేమ ఇతరులను ప్రోత్సహిస్తుందని వాళ్ల బోధకుడు విద్యార్థులకు బోధించాడు. వాళ్లు వాళ్ల తోటి విద్యార్థిని ప్రోత్సహిస్తుండగా, ఈ విద్యార్థులు 1 కొరింథీయులకు 13 పాఠాన్ని ఆచరణలో పెట్టారు! ప్రభావవంతమైన బోధకులు తమ విద్యార్థులు నేర్చుకుంటున్న సూత్రాలను ఆచరించేలా ప్రోత్సహించాలి.

**పాఠాన్ని ఆచరణలో పెట్టండి**

► మీ విద్యార్థులు నేర్చుకుంటున్న వాటిని ఆచరించడానికి అవకాశం ఇవ్వండి. మీరు యౌవ్వన పాస్టర్లకు శిక్షణ ఇస్తుంటే, వాళ్లకి ప్రసంగించే అవకాశం, రోగులను దర్శించే అవకాశం లేక అవిశ్వాసితో సువార్త పంచుకునే అవకాశం ఇవ్వండి. వాళ్లు ఆ పని చేసిన తర్వాత, వాళ్ల పరిచర్యను మూల్యంకనం చేయండి, మెరుగుపడడం కోసం కొన్ని సలహాలు ఇవ్వండి, వాళ్లు సాధించిన కొన్ని విషయాలను ప్రస్తావించి వాళ్లని ప్రోత్సహించండి.

**యేసు, ప్రధాన బోధకుడు, మృదువైనవాడు**

యేసు బోధించిన అనేక పరిస్థితులను, ప్రదేశాలను గురించి ఆలోచించండి. ఆయన ఈ పరిస్థితుల్లో, ప్రదేశాల్లో బోధించాడు:

- సముద్రతీరాన (లూకా 5)
- తుఫాను మధ్యలో (లూకా 8:22-25)
- విద్యార్థికి పొరాటాలు అనుమతించడం ద్వారా (మత్తయి 14:25-33)
- ఆయన పాఠానికి ఇతరులు అంతరాయం కలిగించినప్పుడు (మత్తయి 12:46-50)
- దేవాలయ దర్శన సమయంలో (మత్తయి 24)
- ఒకరు ఆయన తరగతి గది పైకప్పు తొలగించినప్పుడు (లూకా 5:18-26)

లూకా 5:18-26లో అద్భుతం తర్వాత ఇంటికి తిరిగి వచ్చిన విద్యార్థుల గురించి ఆలోచించండి. యేసు శక్తి గురించి వాళ్లు నేర్చుకున్న ఈ పాఠం వారెన్నడూ మర్చిపోలేదు. “అందరును విస్మయమొంది–నేడు గొప్ప వింతలు చూచితిమని దేవుని మహిమపరచుచు భయముతో నిండుకొనిరి” (లూకా 5:26) అని లూకా రాశాడు.

విద్యార్థులు నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నప్పుడు ప్రధాన బోధకుడు బోధించే అవకాశాలు కనుగొంటాడని యేసు గ్రహించాడు. లూకా ఈ సూత్రానికి ఒక ఉదాహరణ ఇచ్చాడు. “ఆయన యొక చోట ప్రార్థన చేయుచుండెను. ప్రార్థన చాలించిన తరువాత ఆయన శిష్యులలో ఒకడు– ప్రభువా, యోహాను తన శిష్యులకు నేర్పినట్టుగా మాకును ప్రార్థనచేయ నేర్పుమని ఆయన నడిగెను.” (లూకా 11:1) ఆయన ప్రార్థన గురించి బోధించడానికి ఈ సందర్భం ఉపయోగించుకున్నాడు.

ఎనిమిదేళ్ల అమ్మాయి అబీగయీలు పియానో పాఠం నేర్చుకోవడానికి గదిలోకి వచ్చి, “ఈ ఉదయం నా పిల్లి చనిపోయింది!” అని చెప్పి ఏడ్వసాగింది. స్కేల్ వాయించాలనిగాని లేక పియానో టెక్నిక్ నేర్చుకోవాలనిగాని అబీగయీలుకు ఆసక్తి లేదు. అయితే, ఆమె గురువు ఆమెకు “My Favorite Kitten” (నాకు ఇష్టమైన పిల్లి) అనే సంగీతం పుస్తకం ఇచ్చినప్పుడు “దీనిని నేను నా పిల్లికి జ్ఞాపకార్థంగా నేర్చుకుంటాను” అని అబీగయీలు నిర్ణయించుకుంది.

బోధకులుగా, మనం మన విద్యార్థుల బాధ విని, దానికి అనుగుణంగా స్పందించాలి. ప్రధాన బోధకుడైన యేసువలే, మనం బోధనా విధానంలో సున్నితంగా ఉండాలి. మన విద్యార్థుల పరిస్థితులకు అనుగుణంగా పాఠాలు చెప్పడానికి ఇష్టపడాలి.

**పాఠాన్ని ఆచరణలో పెట్టండి**

► మీరు మీ బోధనా విధానంలో సున్నితంగా ఉన్నారా? పాఠాన్ని బోధించే కనీసం రెండు పద్ధతులు ప్రణాళిక చేయండి. ఒకవేళ మీరు సహజంగా ఉపన్యాసం ఇచ్చేవారైతే, ఉపన్యాసం లేకుండా చర్చ లేక కార్యాచరణ ఆధారంగా పాఠాన్ని ప్రణాళిక చేయండి. ఒకవేళ మీరు పవర్ పాయింట్ లేక ఇతర సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తే, విద్యుత్ శక్తి ఉపయోగించకుండా పాఠాన్ని ప్రణాళిక చేయండి.

**యేసు, ప్రధాన బోధకుడు, సృజనాత్మకంగా బోధించాడు/సంభాషించాడు**

యేసు కూర్చొని, "ఈరోజు మనం మన పాఠ్యపుస్తకం నుండి 212వ పేజి చదువుకుందాం. పేతురు, మా కొరకు నువ్వు మొదటి పేరా చదువు" అని ఎప్పుడూ చెప్పలేదు. బదులుగా, సృజనాత్మకంగా సంభాషించే మార్గాలు కనుగొన్నాడు.

► యేసు సృజనాత్మక బోధలో ఈ ఉదాహరణలు చదవండి:

- **లూకా 6:39-42**. గ్రుడ్డివాడు గ్రుడ్డివానికి దారి చూపే వ్యంగ్యం గురించి ఆలోచించండి. తన కంటిలో దూలం ఉంచుకొని సహోదరుని కంటిలో నలుసు తీయడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తి గురించి ఆలోచించండి.
- **లూకా 18:18-30.** భూలోక సంపదతో దేవుని రాజ్యంలో ప్రవేశం పొందటం సాధ్యమా? సూది బెజ్జంలో ఒంటె దూరటం గురించి ఆలోచించండి!
- **లూకా 9:46-48**. విధేయత గురించి బోధించడానికి యేసు పిల్లల జీవితాన్ని మాదిరిగా ఉపయోగించాడు.
- **లూకా 15:1-7.** నశించిన ఆత్మల పట్ల దేవుడు ఎలా స్పందిస్తాడు? యేసు గొర్రె విలువ గురించి రైతులకు/కాపరులకు తెలియజేశాడు.
- **లూకా 15:11-32.** పూర్తి అధికారం తండ్రి చేతిలో ఉన్న పితృస్వామ్య సమాజంలోని ప్రజలకు బోధిస్తూ, యేసు ఒక ఉపమానం చెప్పాడు, ఆ ఉపమానంలో, తండ్రి తిరుగుబాటు చేసిన కుమారుని యొద్దకు పరిగెత్తుకుని వెళ్తూ ప్రజలను ఆశ్చర్యపరిచాడు.

యేసు, తనకు ఎదురైన ఒక ప్రశ్నకు నేరుగా సమాధానం చాలా తక్కువగా చెప్పాడు. బదులుగా, ఆయన ఒక కథ ద్వారానో లేక తిరిగి ప్రశ్నించడం ద్వారానో సమాధానం చెబుతాడు. లూకా 10లో, "బోధకుడా, నిత్యజీవమునకు వారసుడనగుటకు నేనేమి చేయవలెనని ఆయనను?" ఒక న్యాయవాది ప్రశ్నించాడు. అందుకు సమాధానంగా, యేసు మంచి సమరయుని కథ చెప్పాడు (లూకా 10:25-37).

గొప్ప ప్రశ్నలు ఎలా అడగాలో యేసుకు తెలుసు. "అవును" లేక "కాదు" అని సులభంగా సమాధానం చెప్పే ప్రశ్నలు యేసు చాలా తక్కువగా అడిగేవాడు. ఎక్కువగా, ఆయన అడిగే ప్రశ్నలు శ్రోతలను క్రొత్త అవకాశలవైపు దృష్టిపెట్టేలా చేసేవి.

► ఈ ఉదాహరణలు చదవండి:

- **లూకా 7:36-50**. ఆయనను విమర్శించిన పరిసయ్యునితో యేసు, "ఎవడు అతని ఎక్కువగా ప్రేమించును, ఎక్కువ అప్పు క్షమించబడినవాడా లేక తక్కువ అప్పు క్షమించబడినవాడా?" అని ప్రశ్నించాడు.
- **మార్కు 8:36**. శిష్యత్వం గురించి బోధిస్తూ, యేసు ఇలా అడిగాడు, "ఒకడు సర్వలోకమును సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొనుట వానికేమి ప్రయోజనము?"
- **లూకా 6:46**. విధేయత చూపనివారితో, యేసు ఇలా చెప్పాడు, "నేను చెప్పు మాటలప్రకారము మీరు చేయక– ప్రభువా ప్రభువా, అని నన్ను పిలుచుట ఎందుకు?"

ఈ ప్రశ్నల్లో దేనికీ సులభమైన సమాధానం లేదు. ప్రతి ప్రశ్న యేసు బోధ గురించి లోతుగా ఆలోచించేటట్లు చేస్తుంది.

బోధకులు ప్రశ్నలు సరిగా ఉపయోగించడంలో విఫలమవ్వడానికి రెండు కారణాలున్నాయి.

1. మనం మరీ సులభమైన ప్రశ్నలు అడుగుతుంటాం. మన విద్యార్థులు లోతుగా ఆలోచించాలంటే, అవునని లేక కాదని లేక పాఠ్యపుస్తకంలో నుండి చెప్పే సమాధానాలు లేనటువంటి ప్రశ్నలు అడగాలి.
2. మనం జవాబు కోసం ఎక్కువ సమయం వేచివుండం. చాలామంది బోధకులు విద్యార్థి సమాధానం చెప్పడానికి కనీసం ఒక్క క్షణం కూడా ఇవ్వకుండా ప్రక్క విద్యార్థిని అడుగుతుంటారని పరిశోధనలో వెల్లడైంది. విద్యార్థి ప్రశ్నను సరిగా అర్థం చేసుకుని సమాధానం చెప్పడానికి కనీసం మూడు క్షణాలు పడుతుంది. మీరు ప్రశ్నలు ఉపయోగించే విధానం మెరుగుపడాలంటే, ప్రక్క విద్యార్థిని అడిగే ముందు కనీసం యేడు క్షణాలు వేచి ఉండాలి.

## పాఠాన్ని ఆచరణలో పెట్టండి

► మీరు బోధించేటప్పుడు సృజనాత్మకంగా ఉన్నారా? గలతీయులకు 6:7-8 పై పాఠం సిద్ధపరచండి. విత్తటం మరియు కోయడమనే సూత్రం గురించి విద్యార్థులు లోతుగా ఆలోచించేలా ప్రశ్నలు సిద్ధపరచండి. ప్రశ్నలు సిద్ధపరచిన తర్వాత, మరిన్ని అదనపు ప్రశ్నల కోసం క్రింద సూచనలు/ఫుట్ నోట్స్ చూడండి.[25]

## నిశిత పరిశీలన: ఉపమానాలు వివరించడం

ఉపమానం యేసుకు ఇష్టమైన బోధనా విధానం. ఉపమానం అంటే "పరలోక పాఠం కలిగిన భూలోక కథ" అని ఒకరు చెప్పారు. యేసు, తన విద్యార్థుల ఆసక్తితో అనుసంధానం చేయడానికి ఉపమానాల్లో, సుపరిచిత గ్రామీణ సందర్భాలు (రైతులు, కాపరులు, గొర్రెలు), సుపరిచిత ప్రజలు (సమరయులు, యాజకులు, సుంకరులు, పరిసయ్యులు) మరియు సుపరిచిత పరిస్థితులను (తప్పిపోయిన గొర్రె, పోయిన నాణెం, పారిపోయిన కుమారుడు) ఉపయోగించాడు.

Shepherds Global Classroom లో *బైబిల్ భాష్యానికి సూత్రాలు* అనే పుస్తకంలో ఉపమానాల వివరణపై ఒక భాగం ఉంది. ఆ సబ్జెక్టులో బోధించిన సూత్రాల సారాంశం ఇక్కడుంది. ఒక ఉపమానం చదువుతున్నప్పుడు, మనం ఇలా ప్రశ్నించాలి:

### (1) ఈ ఉపమానాన్ని ప్రేరేపించిన ప్రశ్న లేక పరిస్థితి ఏంటి?

మంచి సమరయుని ఉపమానం, "నా పొరుగువాడెవడని?" న్యాయవాది అడిగిన ప్రశ్నకు సమాధానం. యేసు ఉపమానం ఇలా జవాబిస్తుంది, "నా మార్గంలో అవసరతలో ఉన్న ప్రతివాడు నా పొరుగువాడు మరియు అది నా బాధ్యత" (లూకా 10:36-37).

పాపులతో తన స్నేహాన్ని విమర్శించిన మతాధికారులకు యేసు తప్పిపోయిన కుమారుని ఉపమానం చెప్పాడు: "ఒకప్పుడు సమస్తమైన సుంకరులును పాపులును ఆయన బోధ వినుటకు ఆయన దగ్గరకు వచ్చుచుండగా

---

[25] గలతీయులకు 6:7-8: లో విత్తటం మరియు కోయటం అనే సూత్రం గురించి ప్రశ్నలు:
ప్రకృతి లేక సమాజంలో విత్తటం కోయటం గురించి ఉదహరరించే ఉపమానాలు ఏంటి?
ఈ సూత్రాన్ని ఉదహరించే కొన్ని బైబిల్ పాత్రలు ఏవి?
ఈ సూత్రం గురించి మీకు ఏవైన వ్యక్తిగత ఉదాహరణలు ఉన్నాయా?
మీ వ్యక్తిగత జీవితంలో కోయటానికి ఇష్టలేని విత్తనాలు మీరు విత్తుతున్నారా?

పరిసయ్యులును శాస్త్రులును అది చూచి—ఇతడు పాపులను చేర్చుకొని వారితోకూడ భోజనముచేయుచున్నాడని చాల సణుగుకొనిరి.

అందుకాయన వారితో ఈ ఉపమానం చెప్పెను" (లూకా 15:1-3).

- కాపరి గొర్రెను పోగొట్టుకున్నాడు. ఆ గొర్రె దొరికినప్పుడు ఆనందించాడు!
- ఒక స్త్రీ నాణెం పోగొట్టుకుంది. ఆ నాణెం దొరికినప్పుడు ఆమె ఆనందించింది!
- తండ్రి తన కుమారుని పోగొట్టుకున్నాడు. తన కుమారుడు తిరిగి రాగా అతను ఆనందించాడు!

యేసు ఇలా సూచించాడు: "నేను పాపులతో భోజనం చేసినప్పుడు మీరు ఆశ్చర్యపడకూడదు. ఒక్క పాపి పశ్చాత్తాపపడినప్పుడుపరలోకమందు ఎక్కువ సంతోషం కలుగుతుంది!"

మన వివరణ, ప్రశ్నకు సమాధానం ఇవ్వకపోతే లేక కథను ప్రేరేపించిన పరిస్థితిని పరిష్కరించకపోతే, మనం ఉపమాన సారం కోల్పోయినట్లే.

**(2) ఉపమానంలో ప్రధాన విషయం (లేక విషయాలు) ఏంటి?**

ఉపమానంలో ఎల్లప్పుడు ప్రతి కథలోని ప్రధాన పాత్రకు ఒక ముఖ్య విషయం ఉంటుంది. ఉపమానంలోని ప్రధాన పాఠం నేరుగా ఉపమానాన్ని ప్రేరేపించిన ప్రశ్నకు లేక పరిస్థితికి అనుసంధానంగా ఉంటుంది. ఇతర పాఠాలు కథలోని పాత్రల నుండి వస్తాయి.

తప్పిపోయిన కుమారుని కథలో మూడు పాత్రలున్నాయి. కథలోని ప్రధాన పాఠం, మారుమనసు పొందిన ఒక్క పాపి విషయమై పరలోకమందు సంతోషం కలుగుతుందని చెప్పడమని మనం చూశాం. ఈ పాఠం యేసు ఉపమానాన్ని ప్రేరేపించిన పరిస్థితికి సమాధానమిస్తుంది. ఉపమానంలోని ప్రతి పాత్ర, కథలోని ప్రధాన పాఠానికి సంబంధించి పాఠాలు బోధించవచ్చు. ఉపమానంలోని తండ్రి, మన పరలోకపు తండ్రి యొక్క అద్భుత ప్రేమ గురించి బోధిస్తాడు. తప్పిపోయిన కుమారుడు పాపం యొక్క వెలను, అదే విధంగా పశ్చాత్తాప సాధ్యతను రెండింటిని బోధిస్తాడు. అన్న, మంచి కుమారుడుగా కనిపించినప్పటికీ, తండ్రి ప్రేమ వలన పొందే ఆధిక్యతలను మనం కోల్పోయే అవకాశముందని బోధిస్తాడు.

**(3) ఉపమానానికి ఏ సాంస్కృతిక వివరాలు ముఖ్యం?**

యేసు ఉపమానాలు ఎల్లప్పుడు ఆయన సంస్కృతికి భిన్నంగా ఉండేవి. ఈ కారణంగానే ఉపమానాలు ఎక్కువ కాలం గుర్తుండే అవకాశం ఉంటుంది: తండ్రి తిరుగుబాటు చేసిన కుమారుని ఆహ్వానించడానికి పరిగెత్తటం; సమరయుడు

వీరుడు/హీరో; నిస్సయురాలైన విధవరాలు అధికారియైన న్యాయాధిపతిని ఓడించటం. మనం ఉపమాన సాంస్కృతిక నేపథ్యాన్ని బాగా అర్థం చేసుకుంటే, యేసు సందేశాన్ని కూడా అంతే బాగా అర్థం చేసుకుంటాం.

## అన్వయం: బోధకుని ఏడు నియమాలు

డా. హోవార్డ్ హెండ్రిక్స్[26] డల్లాస్ థియోలాజికల్ సెమినరీలో 60 సంవత్సరాలకు పైగా బోధించాడు. అతని కెరీర్లో, 10,000 మందికి పైగా విద్యార్థులకు బోధించాడు. అతని అత్యంత ప్రభావవంతమైన పుస్తకాల్లో ఒకటి, తన తత్వశాస్త్రాన్ని సంగ్రహించి రాసిన చిన్న పుస్తకం “Seven laws of the teacher” (బోధకుని ఏడు నియమాలు). ఈ నియమాలు యేసు బోధనా శైలి ఆధారితం. మీరు ఈ నియమాలు అన్వయించుకొంటే ప్రభావవంతమైన బోధకులౌతారు.

### బోధకుని నియమం

*బోధకుని నియమం.* ఈరోజు మీరు ఎదగటం మానేస్తే, రేపు బోధించటం మానేస్తారు.

డా. హెండ్రిక్స్ ఇలా అడిగాడు, “మీరు మంచినీళ్లు పాత చెరువులోవి త్రాగుతారా లేక ప్రవహించే సెలయేరు నుండి త్రాగుతారా?” ప్రవహించకుండా ఒకేచోట నిలవుండి, చూడడానికి మంచిగా అనిపించని చెరువులో నీళ్ల కంటే తాజాగా ప్రవహించే సెలయేరు నీళ్లే త్రాగుతారు.

కొందరు బోధకులు తమ సబ్జెక్ట్ కి సంబంధించిన ఇతర క్రొత్త పుస్తకాలు చదవకుండ లేక ఎటువంటి క్రొత్త ఆలోచనలు పొందకుండ సంవత్సరాలు గడిపేస్తూ ఉంటారు. వాళ్ల బోధన నిలవున్న ఆ పాత చెరువు నీళ్లలా మారుతుంది. బోధకులుగా, దేవుని వాక్యంలో క్రొత్త అవగాహనను పొందడానికి నిరంతరం అధ్యయనం చేస్తున్న పాస్టర్లవలే మనం కూడా నేర్చుకోవాలి.

### పాఠాన్ని ఆచరణలో పెట్టండి

► “బోధకుడా, నువ్వు బైబిల్లోనుండి ఈ మధ్యకాలంలో ఏం నేర్చుకున్నావు?” అని ఒక విద్యార్థి మిమ్మల్ని అడిగాడని భావించండి. మీ సమాధానం ఈవారంలో, ఈ నెలలో, ఈ సంవత్సరంలో లేక చాలాకాలం క్రితం అని వస్తుందా? దేవుని వాక్య జ్ఞానమందు మీరు అనుదినం ఎదుగుతున్నారా?

---

[26] ఈ భాగంలోని మెటీరియల్ Howard Hendricks, *Teaching to Change Lives* (Colorado Springs: Multnomah Books, 1987) నుండి తీసుకున్నాం.

**బోధన నియమం**

*బోధన నియమం:* ప్రజలు నేర్చుకునే విధానం మీరెలా బోధిస్తున్నారో నిర్ణయిస్తుంది

యేసు కాపరులకు గొర్రెల కథలు చెప్తూ బోధించాడు; “మనుష్యులను పట్టే జాలర్లు” గురించి మాట్లాడుతూ జాలర్లకు బోధించాడు; బావి యొద్ద స్త్రీతో నీళ్ల గురించి మాట్లాడుతూ బోధించాడు. ప్రభావవంతమైన బోధకుడు ప్రతి విద్యార్థి అవసరాలకు అనుగుణంగా ఉంటాడని యేసుకు తెలుసు.

> “బోధన యొక్క తుది పరీక్ష మీరు ఏం చేస్తున్నారు లేక ఎంత బాగా చేస్తున్నారన్నది కాదుగాని నేర్చుకునేవారు ఏం నేర్చుకుంటున్నారు ఎంత బాగా నేర్చుకుంటున్నారనేది ముఖ్యం.”
> - డా. హోవార్డ్ హెండ్రిక్స్

డా. హెండ్రిక్స్ బోధనను ఫుట్ బాల్ కోచ్ పనితో పోల్చాడు. కోచ్ ఆట ఆడడు; ఆటగాళ్లను నడిపిస్తాడు, ఉత్తేజపరుస్తాడు. అదేవిధంగా, ప్రధాన బోధకుడు ఉపన్యాసాలిస్తూ పనంతా తానే చేయడు. ప్రధాన బోధకుడు విద్యార్థికి ప్రభావవంతమైన రీతిగా ఉండే విధంగా నేర్చుకోవడానికి ప్రతి విద్యార్థిని ప్రేరేపిస్తాడు.

అరుణ్, ఒక బైబిల్ క్లాస్ విద్యార్థి. విద్యార్థులందరూ పరీక్ష కోసం జాగ్రత్తగా నోట్స్ తీసుకోవాలని బోధకుడు ఆశించాడు. అరుణ్ నోట్స్ తీసుకోవడానికి ఇష్టపడలేదు. బదులుగా, బోధకుడు బోధిస్తూ ఉండగా, నోటు బుక్ లో బొమ్మలు గీస్తూ ఉండేవాడు. అరుణ్ వినట్లేదని బోధకుడు భయపడ్డాడు. “అరుణ్, బొమ్మలు గీయకు. నేను చెప్పేది రాసుకో” అని బోధకుడు పదే పదే చెప్పాడు. బోధకుడు చెప్పింది చేయడానికి అరుణ్ ప్రయత్నించాడు కాని చాలా విసిగిపోయాడు.

అప్పుడు బోధకునికి డా. హెండ్రిక్స్ బోధనా నియమం గుర్తొచ్చింది. “అరుణ్, ఒక ప్రయోగం చేద్దాం. నేను క్లాసులో చెప్పింది నీకు గుర్తుంటే బొమ్మల్లో గీసి చూపించు” అన్నాడు. ప్రయోగం సఫలమయ్యింది. అరుణ్ మాటల్ని బొమ్మల్లోకి మార్చి నేర్చుకున్నాడు. బోధకుడు తన అంచనాలు మార్చుకోవటం నేర్చుకున్నాడు ఎందుకంటే “ప్రజలు నేర్చుకునే విధానం మీరెలా బోధిస్తున్నారో నిర్ణయిస్తుంది.”

**పాఠాన్ని ఆచరణలో పెట్టండి**

► మీ తరగతిలో విద్యార్థులందరిలో భిన్నంగా నేర్చుకునే విద్యార్థి ఉన్నాడా? విద్యార్థి ప్రభావవంతంగా నేర్చుకోవడానికి మీరెలా సహాయపడగలరు?

**కార్యాచరణ నియమం**

*కార్యాచరణ నియమం:* ఎక్కువ భాగస్వాములవ్వడం ఎక్కువ నేర్చుకోవడానికి సహాయం చేస్తుంది.

ఆయన శిష్యులు తాను బోధిస్తున్న పాఠాలను తప్పక ఆచరించాలని యేసుకు తెలుసు. ఆయన వారిని పరిచర్య కొరకు పంపాడు; జనసమూహాలకు రొట్టె చేపలు పంచిపెట్టించాడు; ప్రార్థన కోసం అరణ్యప్రదేశానికి తీసుకెళ్ళాడు. వాళ్లు నేర్చుకున్నది ఆచరించే అవకాశాలు ఇచ్చాడు. దాని ఫలితం ఏంటి? అపొస్తలులు భూలోకాన్ని తలక్రిందులు చేసేవారిగా ప్రసిద్ధిచెందారు (అపొస్తలుల కార్యములు 17:6).

> "నేను వింటాను...మళ్లీ మర్చిపోతాను.
> నేను చూస్తాను...గుర్తుంచుకుంటాను
> నేను చేస్తాను.....అర్థం చేసుకుంటాను."
> - చైనీయుల సామెత

మనస్తత్వవేత్తలు ఇలా చెబుతారు

- మనం విన్నవాటిలో పదిశాతం కంటే తక్కువ గుర్తుంచుకుంటాం.
- మనం చూసి, విన్న వాటిలో యాభైశాతం కంటే తక్కువ గుర్తుంచుకుంటాం, కాని
- మనం విని, చూసి, చేసినప్పుడు తొంబై శాతం గుర్తుంచుకుంటాం.

చురుకుగా పాలుపొందినప్పుడు ఎక్కువగా నేర్చుకుంటాం.

**పాఠాన్ని ఆచరణలో పెట్టండి**

► మీరు తదుపరి పాఠం కోసం సిద్ధపడుతుండగా, మీరు బోధిస్తున్న సూత్రాన్ని విద్యార్థులు ఆచరణలో పెట్టేటట్లుగా కార్యాచరణ సిద్ధం చేయండి.

**సంభాషణ/సమాచార నియమం**

*సమాచార/సంభాషణ నియమం:* నిజంగా బోధించాలంటే, విద్యార్థితో సంబంధం ఏర్పాటు చేసుకోవాలి.

బోధకులు, సేవకులుగా మనం సమాచార పనిలో ఉన్నాం. మన పని కేవలం సమాచారం ఇవ్వడమే కాదు, దానికి మించింది; మన పని, సత్యాన్ని మన శ్రోతలకు చెప్పడం. సంభాషించాలంటే సాధారణ విషయం కనుగొనడం అవసరం. మన విద్యార్థులతో సన్నిహిత సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని కమ్యూనికేషన్ ఆశిస్తుంది.

విద్యార్థులతో సంబంధం ఏర్పాటు చేసుకోవడానికి యేసు ఒక మాదిరిని అందించాడు.యేసుకు, సమరయ స్త్రీకి మధ్య అవరోధాలు ఉన్నాయి : జాతీ, మత, సాంఘిక అవరోధాలు. యేసు యూదుడు; ఆమె సమరయురాలు. యేసు పురుషుడు; ఆమె స్త్రీ. యేసు గౌరవనీయమైన బోధకుడు; ఆమె అనైతికమైన స్త్రీ. ఈ అవరోధాలున్నప్పుడు యేసు సంబంధం ఎలా ఏర్పాటు చేస్తాడు? ఆయన సామాన్యమైన విషయాన్ని కనుగొన్నాడు; ఇద్దరు దప్పిగొన్నారు. శారీరక అవసరత జీవితాన్ని మార్చివేసే అనుభవాన్ని ఇచ్చింది. (యోహాను 4:1-42).

కమ్యూనికేషన్ లో మూడు దశలుంటాయని డా. హెండ్రిక్స్ రాశాడు:

1. **జ్ఞానం**- నాకు తెలిసింది. ఇది సమాచారంలో సరళ స్థాయి.
2. **భారం**- నా భావన. ఇది సమాచారంలో లోతైన స్థాయి.
3. **క్రియ**- నేను చేసే పని. ఈ సమాచార స్థాయి మన విద్యార్థులను మారుస్తుంది.

ఆఫ్రికాలో సెమినరీ పరిపాలకుడు (అడ్మినిస్ట్రేటర్) తన దర్శనాన్ని ఒక సంపన్న దాతకు చెబుతుండగా, సునీల్ విన్నాడు. సునీల్ ఊహించినదానికంటే ఎక్కువ డబ్బు అతను ఆ దాతను (Donor) అడిగాడు. సునీల్ ఆశ్చర్యాన్ని మరింత పెంచేలా, ఆ దాత ఉదారంగా ఇచ్చాడు. ఎందుకు? సెమినరీ పరిపాలకుడు మూడు స్థాయిల్లో మాట్లాడాడు:

1. **జ్ఞానం**- ఆఫ్రికాలో సెమినరీ శిక్షణ అవసరత అతనికి తెలుసు.
2. **భారం** – అతను ఆఫ్రికాలో సంఘ నాయకులకు శిక్షణ ఇవ్వాలనే భారం కలిగినవాడు.
3. **క్రియ**- అతడు ఆఫ్రికాలో ఉండి, సంఘ నాయకులకు శిక్షణ ఇవ్వడానికి చాలా త్యాగం చేశాడు. తాను ఆఫ్రికాలో ఏం చేస్తున్నాడో పరిపాలకుడు చెప్పాడు.

ప్రభావవంతంగా బోధించాలంటే, మనకు సబ్జెక్ట్ విషయంలో భారం ఉండాలి. అనేక సండేస్కూల్ తరగతుల్లో ఈ సంభాషణ ఊహించండి:

> గురువు: "ఈరోజు మనం యోహాను 6లో 5000మందికి ఆహారం పెట్టిన కథ చదువుతాం.
>
> విద్యార్థి: "నాకొక ప్రశ్న. వాళ్లు కేవలం పురుషులను మాత్రమే లెక్కించారని బైబిల్ సెలవిస్తుంది. ఎందుకు?"
>
> గురువు: "నాకు తెలీదు. అది అంత ముఖ్యం కాదు. పాఠంపై దృష్టిపెట్టు."

అప్పటి వరకు ఉత్సాహంగా ఉన్న బైబిల్ కథ ఒక్కసారిగా విచారంగా మారిపోతుంది. కొన్ని రొట్టెలు, చేపలను యేసు 20,000మందికి ఎలా పంచాడో పిల్లలు తెలుసుకోవడానికి ఇష్టపడతారు. దానిని మనం వినసొంపుగా ఎందుకు చేయలేం? ఈ గురువు జ్ఞానాన్ని సంభాషించడం లేదు; యూదా రచయితలు కేవలం పురుషుల్ని మాత్రమే ఎందుకు లెక్కించారో తెలుసుకోవడానికి నేపథ్యం చదవలేదు. ఈ ఉత్తేజకరమైన కథ విషయంలో గురువుకి అంత అభిరుచి లేదు. ఈ పాఠం ద్వారా గురువు జీవితం మార్చబడే అవకాశం లేదు, విద్యార్థుల జీవితాలు మార్చడానికి వీలు కలిగించే విధానం లేదు.

**పాఠాన్ని ఆచరణలో పెట్టండి**

► మీరు పాఠం కోసం సిద్ధపడుతుండగా, మీ ప్రపంచం మీ విద్యార్థుల ప్రపంచం మధ్య దూరం గురించి ఆలోచించండి. ఈ విద్యార్థులతో సంబంధం ఏర్పాటు చేసుకోండి. మీ విద్యార్థుల ఆసక్తులతో పాఠాన్ని అనుసంధానం చేసే మార్గాలు వెదకండి.

**హృదయపు నియమం**

*హృదయ నియమం:* ప్రభావవంతమైన బోధన ముఖాముఖి సంభాషణ కాదుగాని హృదయాన్ని హత్తుకొనే సన్నిహిత సంభాషణ.

యేసు కొండమీద ప్రసంగం ముగించిన తర్వాత, జనసమూహం ఆయన బోధకు ఆశ్చర్యపడ్డారు, "ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలె కాక అధికారముగలవానివలె వారికి బోధించెను" (మత్తయి 7:28-29). యేసు బోధ తన హృదయంలో నుండి వచ్చి, తన శ్రోతల హృదయాలను తాకింది.

యేసు కనికరం గురించి సువార్తలు పదే పదే చెబుతాయి. ఆయన ప్రజల మీద కనికరపడ్డాడు. ఆయన హృదయం వారి హృదయాలను చేరుకుంది. హోవార్డ్ హెండ్రిక్స్ ప్రభావవంతమైన బోధనా మూలకాలను గురించి చెప్పాడు.

***బోధకుని ప్రవర్తన విద్యార్థిలో నమ్మకాన్ని ప్రేరేపిస్తుంది.***

విద్యార్థి బోధకుని ప్రవర్తన నమ్మితే, బోధించే దానిని కూడా నమ్ముతాడు. పాస్టర్లుగా మరియు బోధకులుగా, ఆ నమ్మకాన్ని పాడుచేయకూడదు. నమ్మకాన్ని పునర్నిర్మించుకోవడం కష్టం. జ్ఞానంగల క్రైస్తవ నాయకులు నైతిక లేదా నైతిక వైఫల్యాలకు నడిపించేవాటికి దూరంగా పారిపోతారు. మీ ప్రవర్తన మీ విద్యార్థులలో నమ్మకాన్ని ప్రేరేపించాలి.

***బోధకుని కనికరం విద్యార్థిలో ప్రేరణ కలిగిస్తుంది.***

ఒక విద్యార్థి బోధకుని కనికరాన్ని అనుభవించినప్పుడు, నేర్చుకోవాలనే ప్రేరణతో ఉంటాడు. యేసు వారిని ప్రేమిస్తున్నాడని శిష్యులకు తెలుసు గనుక వారాయనను అనుసరించారు. మీరు మీ విద్యార్థులను ప్రేమించకపోతే, మీ నుండి నేర్చుకోవాలనే ప్రేరణ వాళ్లకి ఉండదు.

చిన్న పిల్లలకు బోధించే బోధకులతో మాట్లాడుతూ, డా. హెండ్రిక్స్ ఇలా చెప్పాడు, "ఒకవేళ స్రవంతికి క్రొత్త బూట్లు ఉంటే, మీరు ఆ క్రొత్త బూట్లు గమనించాలి, లేకపోతే ఆమె మీ పాఠం వినదు!" మీరు విద్యార్థిపై ఆసక్తి చూపినప్పుడు (మీ ప్రేమను బట్టి) మీరు బోధించే పాఠం నేర్చుకోవడానికి వాళ్లు ఇష్టపడతారు.

*బోధకుని విషయాలు విద్యార్థికి అవగాహన కలిగిస్తాయి.*

విద్యార్థిని నేర్చుకోవడానికి ప్రేరేపించబడిన తర్వాత, మీరు విషయాన్ని బోధించడానికి సిద్ధంగా ఉండాలి. మీరు వాళ్ల నమ్మకం చూశాక, మీ విద్యార్థితో హృదయపూర్వకంగా మాట్లాడవచ్చు.

**పాఠాన్ని ఆచరణలో పెట్టండి**

► మీరు మీ విద్యార్థుల్ని ప్రేమిస్తున్నారా? అంతే ముఖ్యంగా, మీరు వాళ్లని ప్రేమిస్తున్నారని వాళ్లకి తెలుసా? దేవుడు మీకిచ్చిన విద్యార్థులతో హృదయపూర్వకంగా ఎలా మాట్లాడగలరు?

**ప్రోత్సాహ నియమం**

*ప్రోత్సాహ నియమం:* విద్యార్థిని సరిగా ప్రేరేపించినప్పుడే బోధన ప్రభావవంతంగా ఉంటుంది

*ప్రేరణ* అనే పదం విన్నప్పుడు, చాలామంది బోధకులు మిఠాయి, సర్టిఫికెట్లు, గ్రేడులు లేక విద్యార్థులను ప్రేరేపించే ఇతర మార్గాల గురించి ఆలోచిస్తారు. ఈ ఫలితాలు (బహుమానాలు) తప్పుకాదు, ఇవి యౌవనస్థులకు ఆసక్తి కలిగిస్తాయి, కాని ఇవి నిజమైన లక్ష్యానికి సంబంధించినవి కాదు. బహుమానం ఆశించి పనిచేసే విద్యార్థి తాను నేర్చుకుంటున్న సత్యాన్ని బట్టి మారే అవకాశం ఉండదు. విద్యార్థి అంతర్గత ఉద్దేశ్యాల గురించి బోధకుడు మాట్లాడడం మంచిది.

డా. హెండ్రిక్స్ కొన్ని అంతరంగ ఉద్దేశ్యాల జాబితా ఇచ్చాడు:

- **యాజమాన్యం.** “ఇది నా చర్చి. ఇది పెరగాలంటే, నేను సందర్శకులను ఆహ్వానిస్తాను.”
- **అవసరత.** “శోధన జయించడానికి నాకు దేవుని వాక్యం అవసరం, కాబట్టి నేను లేఖనాన్ని కంఠస్థం చేస్తాను.”
- **ఆమోదం.** “నా బోధకుడంటే నాకిష్టం మరియు నాకు ఆయన్ని సంతోషపెట్టాలని ఉంది గనుక నేను పాఠం చదువుతాను.”

ఈ ప్రేరణలు, మిఠాయి లేక గ్రేడుల కంటే ఎక్కువకాలం ఉంటాయి. మనం ఈ ప్రేరేపకాలు ఉపయోగిస్తూ, సుదీర్ఘ-కాల అధ్యయనం కోసం మన విద్యార్థులను ప్రోత్సహిద్దాం.

**పాఠాన్ని ఆచరణలో పెట్టండి**

► మీ విద్యార్థుల కోసం మీరు ఉపయోగించే ప్రేరణ ప్రేరేపకాల జాబితా చేయండి. నేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల ద్వారా మీరు వారిని ఎలా ప్రేరేపిస్తారు?

**సిద్ధపాటు నియమం**

*సిద్ధపాటు నియమం:* బోధకుడు మరియు విద్యార్థి ఇద్దరూ మంచిగా సిద్ధపడినప్పుడే బోధన ప్రభావవంతంగా ఉంటుంది. ఇది మీ సంఘంలో ఒక సాధారణ సండేస్కూల్ పాఠంలా అనిపిస్తుందా?

> బోధకుడు: "ఈరోజు మనం ఎఫెసీయులకు 5వ అధ్యాయాన్ని అధ్యయనం చేయబోతున్నాం. దయచేసి మీ బైబిళ్ళు తెరవండి."
>
> విద్యార్థులు ఆలోచిస్తారు: "మనం ఎఫెసీయులకు 5 వ అధ్యాయం ఎందుకు అధ్యయనం చేయాలి?"

ఎఫెసీయులకు 5 బోధిస్తూ, బోధకురాలు ఒక గంట సమయం గడుపుతుంది. ఆమె మంచి బోధకురాలు. ఆ గంట ముగిసే సమయానికి, విద్యార్థులు పౌలు సందేశం ద్వారా ప్రేరణ పొందుతారు. పాఠం ముగుస్తుంది, విద్యార్థులు ఇంటికి వెళ్లిపోతారు. వారం గడిశాక, మనం మళ్ళీ ఈ మాటలు వింటాం:

> బోధకుడు: "ఈరోజు మనం ఎఫెసీయులకు 6 వ అధ్యాయం అధ్యయనం చేయబోతున్నాం. దయచేసి మీ బైబిళ్ళు తెరవండి."
>
> విద్యార్థులు ఆలోచిస్తారు: "మనం ఎఫెసీయులకు 6 వ అధ్యాయం ఎందుకు అధ్యయనం చేయాలి?"

తరగతి మొదలవ్వక ముందే విద్యార్థులు ఎఫెసీయులకు 6 వ అధ్యాయం చదివితే ఎంత బాగుంటుంది! విద్యార్థులు ప్రశ్నలతో తరగతికి వస్తే పాఠం మరింత బాగుంటుందా? అవును! దీన్ని మీరెలా సాధిస్తారు? పాఠం కోసం విద్యార్థులను సిద్ధపరిచే అభ్యాసం ఇవ్వాలని ప్రొఫెసర్ హెండ్రిక్స్ సూచించాడు. ఉదాహరణకు:

- వచ్చే వారంలో తాము నేర్చుకోబోయే పాఠం గురించి ఆలోచన చేసే అభ్యాసాన్ని విద్యార్థులకు ఇవ్వాలి. "వచ్చే ఆదివారం లోపు, ఎఫెసులో పౌలు సంఘం ఎలా మొదలుపెట్టాడో నేర్చుకోవడానికి అపొస్తలుల కార్యములు 19 చదవండి."
- పాఠానికి నేపథ్యాన్ని అందించే అభ్యాసాలు ఇవ్వండి. "వచ్చే ఆదివారం లోపు, ఎఫెసులో అర్తెమీదేవి దేవాలయం గురించి బైబిల్ నిఘంటువులో చదవండి. ఇది ఎఫెసీయులకు 6:10-20లో పౌలు నొక్కి చెప్పిన ఆత్మీయ పోరాటం గురించి వివరించడానికి సహాయపడుతుంది.

- విద్యార్థులు వ్యక్తిగతంగా అధ్యయనం చేసే సామర్థ్యాన్ని పెంచే అభ్యాసాలు ఇవ్వండి. ఈ వారంలో ప్రతిరోజు ఎఫెసీయులకు 6వ అధ్యాయం చదవండి. చదివేటప్పుడు ఈ అధ్యాయంలో మీకున్న ఒక ప్రశ్న రాయండి. వచ్చే ఆదివారం, మీ ప్రశ్నలు చర్చిద్దాం."

**పాఠాన్ని ఆచరణలో పెట్టండి**

► మీరు బోధించే తర్వాత క్లాసులో, విద్యార్థులను తర్వాత పాఠం కోసం సిద్ధపరచటానికి అస్సైన్మెంట్ ఇవ్వండి. అసైన్మెంట్, వాళ్లు చదవబోతున్న పాఠం గురించి వారి అవగాహన పెంచేలా చూడండి.

## ముగింపు: బోధకుని ప్రవర్తన ప్రాముఖ్యత

"సిద్ధుడైన ప్రతివాడును తన బోధకునివలె ఉండును" (లూకా 6:40) అని యేసుకు తెలుసు. ఆయన శిష్యులు ఈ సూత్రాన్ని పాటించారు. అతను పరిపూర్ణ ప్రేమగల వ్యక్తి యొద్ద శిక్షణ పొందాడు గనుక, "ఉరిమెడువాడైన" యోహాను "ప్రేమగల అపొస్తలుడైన" యోహానుగా మారాడు. అతడు విశ్వాసానికి ఆదర్శవంతుడైనవాని యొద్ద శిక్షణ పొందాడు గనుక, "అనుమానస్తుడైన తోమ," "భారతదేశానికి అపొస్తలుడైన" తోమాగా మారాడు. శిష్యులు పరిపూర్ణ శిక్షణ పొందినప్పుడు, తమ బోధకునివలే అయ్యారు.

బోధకుని మొదటి మెట్టు, మీ విద్యార్థులు ఎలా ఉండాలని మీరు కోరుకుంటారో అలా మీరు ఉండటమే. యేసు స్థిరత్వానికి మాదిరిగా ఉండకుండా స్థిరత్వంలేని పేతురును "బండ"గా మార్చలేడు. విద్యార్థులు ఎలా ఉండాలనుకుంటామో ముందు మనం ఆ విధంగా ఉండాలి.

పౌలు ఈ సూత్రం అర్థం చేసుకున్నాడు. అతను కొరింథీయులతో, "నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకొనుడి" (1 కొరింథీయులకు 11:1) అని చెప్పాడు. ధైర్యంతో కూడిన ఎంత గొప్ప ప్రకటన! పౌలు భావం ఇదే: "మీరు సరైన జీవితం గడపాలనుకుంటే, నన్ను అనుసరించండి." పౌలు క్రీస్తును పోలి నడుచుకున్నాడు కాబట్టి, కొరింథీయులు పౌలును అనుసరించటం మంచిది.

నా విద్యార్థులు ఒకవేళ నావలే మారితే, నేను తప్పక ఇలా అడగాలి: "నా విద్యార్థులు అనుసరించడానికి సిగ్గుపడుతున్న లక్షణాలు నేను చూపిస్తున్నానా?" నేను నా విద్యార్థులతో కోపంతో, అసహనంతో స్పందించినప్పుడు, "వాళ్లు శిక్షణ పూర్తి అయ్యాక" ఇతరులపట్ల కోపం, అసహనం వెల్లడిచేసినప్పుడు నేను ఆశ్చర్యపడకూడదు.

ప్రవర్తన బోధకునికి కేంద్రం. మీ జీవితంలో మీరు కలిగిలేని లక్షణాలు మీ విద్యార్థుల జీవితంలో పెంపొందించలేరు. బోధకుడు గొప్ప జ్ఞానాన్ని, బోధను కనుపరచడం కంటే దైవికమైన స్వభావం చూపించడం చాల ప్రాముఖ్యం. మన విద్యార్థులు ఎలా ఉండాలని మనం ఆశపడతామో మనం ఆ విధంగా ఉండాలి.

**పాఠాన్ని ఆచరణలో పెట్టండి**

► యేసువలే బోధించడం అనే ఈ పాఠం ముగిస్తుండగా, మీ విద్యార్థులు అనుసరించకూడని గుణాలు మీలో ఏమైనా ఉంటే చూపించమని దేవుని అడగండి. మీ విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకున్నప్పుడు, వాళ్ల జీవితాల్లో దేవుని స్వభావం ప్రతిబింబించడం చూడగలుగునట్లు మీ జీవితాలను మార్చుకోవడానికి అవసరమైన మార్పు చేసుకోవడానికి కృపనివ్వమని దేవునిని అడగండి.

**పాఠం 4 అభ్యాసం**

ఈ పాఠానికి సంబంధించిన అభ్యాసాలను పాఠం అంతటిలో చేశాం. పాఠం మధ్య మధ్యలో చెప్పిన కార్యాచరణలు పూర్తి చేస్తే, 4వ పాఠానికి అదనపు అభ్యాసాలు ఏం లేవు.

# పాఠం 5

# యేసువలే ప్రసంగించడం

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) యేసును గొప్ప ప్రసంగికునిగా చేసిన గుణలక్షణాలను గుర్తిస్తాడు.

(2) ప్రభావవంతమైన ప్రసంగంలో పరిశుద్ధాత్ముని పాత్రను అభినందిస్తాడు.

(3) కాపరి-సేవకునిగా నమ్మకత్వానికి కట్టుబడి ఉండగలుగుతారు.

(4) యేసు ప్రసంగ మాదిరి అనుసరించి ప్రసంగం సిద్ధపరచుకోగలుగుతారు.

## పరిచర్యకు సూత్రం

ప్రభావవంతమైన ప్రసంగం కేవలం మానవ కష్ట ఫలితమే కాదు; ప్రభావవంతమైన ప్రసంగం పరిశుద్ధాత్మ శక్తి ద్వారా బలపరచబడుతుంది.

## పరిచయం

యేసు ప్రసంగానికి జనసమూహం ఎలా స్పందించారో చూడండి.

- "యేసు ఈ మాటలు చెప్పి ముగించినప్పుడు జనసమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడుచుండిరి" (మత్తయి 7:28-29).
- "జన సమూహమంతయు ఆయన బోధకు బహుగా ఆశ్చర్యపడడం చూచి" (మార్కు 11:18).
- "సామాన్యజనులు ఆయన మాటలు సంతోషముతో వినుచుండిరి" (మార్కు 12:37).

యేసు ప్రసంగం శక్తివంతమైంది. ఆయన ప్రసంగం వినడానికి వేలమంది కూడుకున్నారు. ఖచ్చితంగా ఆయన ప్రసంగ శైలి నేడు మనకు మాదిరి. భులోకంలో యేసు తన మానవత్వంతో ప్రసంగించాడని గుర్తుంచుకోండి. "వాస్తవానికి, యేసు శక్తివంతమైన ప్రసంగికుడైనప్పటికిని ఆయన దేవుడు" అని ఆలోచించవద్దు. దానికి బదులుగా, "యేసు-మానవుడుగా-అధికారంతోను శక్తితోను ప్రసంగించాడని" ఆలోచించండి. ఆయన ప్రసంగం ప్రేక్షకులను సత్యంవైపు ఆకర్షించింది. నేను సువార్తను ప్రభావవంతంగా బోధించడానికి యేసు దగ్గర ఏం నేర్చుకోగలను?"

► మీరు క్రీ.శ. 30లో జీవిస్తూ, యేసు ప్రసంగం విన్నారనుకోండి. మీరు ఏం చూడడానికి, వినడానికి ఆశపడతారు?

## యేసు అధికారంతో ప్రసంగించాడు

► 2 కొరింథీయులకు 4:1-6 చదవండి.

యేసు కపెర్నహూములో ప్రసంగించినప్పుడు, ఆయన వాక్యం అధికారంతో కూడినది గనుక ప్రజలు ఆయన బోధకు ఆశ్చర్యపడ్డారు (లూకా 4:32). కొండమీద ప్రసంగం ముగించినప్పుడు, "జనసమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడుచుండిరి. ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలె కాక అధికారముగలవానివలె వారికి బోధించెను" (మత్తయి 7:28-29). శాస్త్రులు తమ సిద్ధాంతాలకు మద్దతుగా ఇతర రబ్బీల మాటలను వాడేవాడు, కాని యేసు అధికారంతో ప్రకటించాడు.

పాస్టర్లుగా, మనం అధికారంతో ప్రసంగించాలి. మన అధికారం యేసు అధికారం కంటే భిన్నమైంది. ఆయన అధికారం, స్వాభావికంగా ఆయనలో నుండే వచ్చింది; మన అధికారం యేసుక్రీస్తు ప్రతినిధులుగా మనకు అనుగ్రహించబడింది; మన అధికారం మనం ప్రకటించే సందేశం నుండి వస్తుంది.

**మనం యేసుక్రీస్తు ప్రతినిధులుగా అధికారంతో ప్రసంగిస్తాం.**

"పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది" అని యేసు చెప్పాడు. తరువాత వచనంలో, ఆయన తన అనుచరులను నియమించాడు, "కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి.... ఇదిగో నేను యుగసమాప్తివరకు సదాకాలము మీతోకూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:18-20). మనం యేసుక్రీస్తు ప్రతినిధులుగా నియమించబడ్డాం గనుక మనకూ అధికారం ఉంది.

1783లో, అమెరికా సంయుక్త రాష్ట్ర ప్రతినిధులు, అదే విధంగా కింగ్ జార్జ్ III ప్రతినిధులు అమెరికా విప్లవాత్మక యుద్ధాన్ని ముగించే పారిస్ ఒప్పందంపై సంతకం చేయడానికి సమావేశమయ్యారు. ఒప్పందంపై సంతకం చేయడానికి కింగ్ జార్జ్ III పారిస్ వెళ్ళలేదు. జార్జ్ వాషింగ్టన్ ఒప్పందంపై సంతకం చేయలేదు. అయితే తమ పరిపాలకుని పేరున ఒప్పందంపై సంతకం చేసే అధికారం ప్రతి దేశ ప్రతినిధికి ఉంది.

అదే విధంగా, మనం యేసుక్రీస్తు ప్రతినిధులుగా ప్రసంగిస్తాం. "గనుక మేము మమ్మునుగూర్చి ప్రకటించుకొనుటలేదు గాని, క్రీస్తుయేసునుగూర్చి ఆయన ప్రభువనియు, మమ్మునుగూర్చి, యేసు నిమిత్తము మేము మీ పరిచారకులమనియు ప్రకటించుచున్నాము" (2 కొరింథీయులకు 4:6) అని పౌలు రాశాడు. పౌలు అధికారం తన సొంత అధికారం కాదు. అతడు ఒక దాసుడు, కాని ప్రభువైన యేసుక్రీస్తు ప్రతినిధి.

**మనకు అప్పగించబడిన సందేశం వలన మనం అధికారంతో ప్రసంగిస్తాం**

మన అధికారం మనం ప్రకటించే లేఖనంపై ఆధారితం. పౌలు ఇలా రాశాడు: "అయితే కుయుక్తిగా నడుచుకొనకయు, దేవుని వాక్యమును వంచనగా బోధింపకయు, సత్యమును ప్రత్యక్షపరచుటవలన ప్రతిమనుష్యుని మనస్సాక్షి యెదుట మమ్మును మేమే దేవుని సముఖమందు మెప్పించుకొనుచు" (2 కొరింథీయులకు 4:2). పౌలు కపటంగా ఏది చేయలేదు లేక దేవుని వాక్యాన్ని బలహీనపరచే పని ఏది చేయలేదు.

కొందరు పాస్టర్లు బైబిల్ని నమ్మకూడదని చెప్పే విశ్వవిద్యాలయాల్లో చదివారు. వారు అధికారంతో ప్రకటించరు. బదులుగా, ఎప్పుడు అనుమానిస్తూ ఉంటారు. ఎందుకు? వారు బైబిల్ అధికారాన్ని అనుమానిస్తారు; కేవలం మానవుల జ్ఞానంపై ఆధారపడతారు. దేవుని సేవకులుగా, మన అధికారం దేవుని వాక్య ఆధారితమావ్వాలి.

మీరు దేవుని వాక్య సందేశాన్ని నమ్మనియెడల దాని ప్రకటించటం వ్యర్థం. మనం దేవుని వాక్య సందేశాన్ని నమ్మినప్పుడు మాత్రమే అధికారంతో ప్రసంగించగలం.

మన అధికారం యేసు నుండి, మనం ప్రసంగించే సందేశం నుండి వస్తుందని గ్రహించినప్పుడు, సేవకులు రెండు ప్రమాదాలు తప్పించుకోగలరు.

**(1) మొదటి ప్రమాదం** "నేనే పాస్టర్. నేనే బాస్! ఎవ్వరు నన్ను ప్రశ్నించలేరు" అని చెప్పే అహంకారం.

ఈ అహంకారం ప్రజలను సువార్తకు దూరం చేస్తుంది. "మేము మమ్మునుగూర్చి ప్రకటించుకొనుటలేదు గాని, క్రీస్తుయేసునుగూర్చి" (2 కొరింథీయులకు 4:5) ప్రకటిస్తున్నామని పౌలు చెప్పాడు. మన అధికారం యేసు నుండి, ఆయన వాక్యం నుండి వస్తుంది.

మనం తప్పు చేసినప్పుడు దాని ఒప్పుకునే వినయం మనకు కావాలి. ఒక పాస్టర్ ఇలా చెప్పాడు: "నేనెప్పుడైన తప్పు చేస్తే సంఘానికి చెప్పను. వారు నా అధికారాన్ని నమ్మరు." మన అధికారం మన సొంత పొరపాటులపై ఆధారపడదు; మన అధికారం దేవుని వాక్యంపై ఆధారపడుతుందని ఈ పాస్టర్ మర్చిపోయాడు. మనం మన సంఘాన్ని దేవుని వాక్యాధికారం వైపు నడిపించాలి. నా మాటలు ముఖ్యం కాదు; దేవుని వాక్యం ప్రాముఖ్యం.

**(2) రెండవ ప్రమాదం**, "నేను కేవలం ఒక పాస్టర్ ని. నాకు అధికారం లేదు. కౌన్సిలింగ్ నిపుణుడికి మనస్తత్వశాస్త్రం గురించి తెలుసు; శాస్త్రజ్ఞులకు భూమి మూలాల గురించి తెలుసు; సాంఘికవేత్తలకు మానవుని లైంగిక కోరికలు గురించి తెలుసు. నేను భావోద్వేగ అవసరాలు, సృష్టి, లేక నైతికత గురించి మాట్లాడలేను ఎందుకంటే అందులో నేను నిపుణుడ్ని కాదు" అని చెప్పే తప్పుడు వినయం.

"మేం దాసులం, కాని యేసుక్రీస్తు ప్రతినిధులంగా మాకు అధికారముందని" పౌలు చెప్పాడు. దాసునిగా, మనం వినయంతో బ్రతకాలి. యేసుక్రీస్తు ప్రతినిధులుగా, నమ్మకంతో ప్రకటించాలి. మనం దేవుని వాక్యాన్ని ఉన్నది ఉన్నట్లుగా ప్రసంగించినప్పుడు, విశ్వానికి రాజు అధికారంతో మనం సేవిస్తాం.

**యేసు ప్రసంగాలు, అవసరతలో ఉన్న ప్రజలకు శుభవార్తను తెస్తాయి**

యేసు తన శ్రోతల అవసరాలు గురించి మాట్లాడాడు. యేసు సువార్త ప్రకటిస్తూ గలిలయ ప్రాంతంలో పర్యటిస్తుండగా, జనులు విసిగి చెదరియున్నందున వారిమీద కనికరపడ్డాడు (మత్తయి 9:35-36). యూదులు రోముకు బానిసలు; బీదలు తమ పేదరికం నుండి బయటపడే ఆశలు లేవు; కుష్ఠురోగులను బహిష్కరించారు; సుంకరులను సమాజం తిరస్కరించింది. వీళ్లందరికీ, యేసు ఆశ కలిగించాడు.

మీరు ప్రజల అవసరాలు గురించి మాట్లాడినప్పుడు, వాళ్ల దృష్టి మీవైపు మళ్లుతుంది. ఒకవేళ నేను అరణ్యంలో నివసిస్తుండగా, "నేడు జీవజలం గురించి నేను ప్రకటిస్తాను" అని మీరు చెబితే, నేను జాగ్రత్తగా వింటాను! నేను ముసలివాడిగా, బలహీనుడుగా ఉన్నప్పుడు, "నేడు పక్షిరాజువంటి బలం ఇచ్చే దేవుని గురించి ప్రకటిస్తాను" అని మీరు చెబితే, నేను వింటాను!

సువార్త అంటే శుభవార్త అని యేసు ఎప్పుడూ మర్చిపోలేదు. నిరీక్షణ అవసరమైన వారికి సువార్త ప్రకటించటం కోసం ఆయన వచ్చాడు. ప్రభావవంతమైన ప్రసంగం మన మాటలు వింటున్నవారికి నిరీక్షణ ఇవ్వాలి. యేసువలే, "నేను ఎవరికి ప్రకటిస్తున్నాను*?* వాళ్ల అవసరాలు ఏంటి*?"* అని ప్రశ్నించుకోవాలి.

మీ కారుకు ప్రమాదం జరిగి, రక్తస్రావంతో చనిపోయే స్థితిలో ఉన్నారని ఊహించుకోండి. ఆసుపత్రిలో, వైద్యుడు మీకు కారు యాక్సిడెంట్ల గురించి గణాంకాలతో కూడిన పూర్తి రంగురంగుల చార్ట్ ఇస్తాడు. స్టెతోస్కోపు చారిత్రికంగా ఎలా అభివృద్ధి చెందిందో వివరిస్తాడు. చివరిగా, అజాగ్రత్తగా కారు నడిపితే ఏమౌతుందో హెచ్చరిస్తాడు.

వైద్యుడు చెప్పిన ప్రతి విషయం సరైనదే, కాని అది మీ అవసరాన్ని తీర్చదు. ఎవరో ఒకరు మీ గాయాలు కట్టాలి. మీ బాధకు మందు ఇవ్వాలి. ప్రసంగం కేవలం వాస్తవిక విషయాలకు మించింది; ప్రసంగం శ్రోతల అవసరాలకు అనుగుణంగా ఉండాలి.

మన పతనమైన లోకంలో చెడ్డ వార్తలు వినటం చాలా సులభం. సువార్త దానికి మించింది; అది పతనమైన లోకానికి నిరీక్షణ ఇస్తుంది. యేసు ఎల్లప్పుడు తన శ్రోతలకు నిరీక్షణ కలిగించాడు. యేసు ఎన్నడు సత్యం విషయంలో రాజీపడలేదు, మనం సత్యం విషయంలో ఎన్నడు రాజీపడకూడదు. అయితే సత్యాన్ని సరైన విధంగా ప్రకటిస్తే అది

నిరీక్షణ ఇస్తుందని యేసుకు తెలుసు. ఒక పెద్ద ప్రసంగికుడు "ప్రజలకు దురదపుట్టిన చోట మీరు గోకాలి" అని చెప్పాడు. మీరు ఎవరినైతే చేరుకొనే ప్రయత్నం చేస్తున్నారో వారి అవసరాలకు అనుగుణంగా ప్రకటించాలి.

## యేసు ప్రసంగాలు ఒప్పింపజేస్తాయి

యేసు తన శ్రోతల అవసరాలతో ఆరంభించాడు, కాని ఆయన ఉద్దేశ్యం కేవలం గాయంపై తాత్కాలిక కట్టువేయడమే కాదుగాని అంతకు మించింది. యేసు ప్రసంగం వాళ్ల మనస్సాక్షిని ఒప్పింపజేసి, వాళ్ల జీవితాలు మార్చింది.

యేసు, తన శ్రోతలు చేసిన పాపాలకు తీర్పు ఉంటుందని ప్రకటించడానికి భయపడలేదు. వ్యభిచారంలో పట్టబడిన స్త్రీతో యేసు, "నేనును నీకు శిక్ష విధింపను" అని చెప్పాడు, అంతేకాదు, "నీవు వెళ్లి ఇక పాపము చేయకుమని" కూడా చెప్పాడు (యోహాను 8:11).

యోహాను, యేసు పరిచర్యలో బెతెస్థ కోనేరు యొద్ద ఉన్న పక్షవాయువుగల ఒక వ్యక్తి గురించి చెప్పాడు. అతన్ని స్వస్థపరచిన తరువాత, "ఇదిగో స్వస్థతనొందితివి; మరి యెక్కువ కీడు నీకు కలుగకుండునట్లు ఇకను పాపము చేయకుమని" (యోహాను 5:14) యేసు చెప్పాడు. పాపాన్ని ప్రతిఘటించడానికి యేసు భయపడలేదు.

యేసు ప్రసంగించినప్పుడు, ఆయన శ్రోతలు ఒప్పించబడ్డారు. సమకాలీన ప్రసంగికులవలే కాక, నీతిగా జీవించే ఆవశ్యకత గురించి బోధించాడు. "మీరాయన ఆజ్ఞలు గైకొనవలెనని నా తండ్రి ఆశించడు" అని యేసు ఎక్కడా చెప్పలేదు. బదులుగా, "శాస్త్రుల నీతికంటెను పరిసయ్యుల నీతికంటెను మీ నీతి అధికము కానియెడల మీరు పరలోకరాజ్యములో ప్రవేశింపనేరరని మీతో చెప్పుచున్నాను" (మత్తయి 5:20) అన్నాడు. యేసు ప్రసంగం, ఆయన మాటలు, విన్న ప్రతి ఒక్కరిని ఒప్పింపజేసింది.

## యేసు ప్రసంగాలు జీవితాలను మార్చివేశాయి

> "బైబిల్ ను మన జ్ఞానాన్ని పెంచడానికి ఇవ్వలేదు,మన జీవితాలు మార్చడానికి ఇచ్చాడు."
> - డి. యల్. మూడి రచనల నుండి తీసుకున్నారు.

అమెరికా సివిల్ వార్ సమయంలో, ప్రెసిడెంట్ అబ్రాహాం లింకన్ పాస్టర్ డా. ఫినేయాస్ గుర్లె కాపరిగా పనిచేస్తున్న చర్చికి వెళ్ళాడు. అక్కడ ఒక ఆరాధన అయిపోయిన తర్వాత, 'ప్రసంగం గురించి మీరేమి అనుకుంటున్నారు?" అని ఒక మిత్రుడు అడిగినప్పుడు, 'మంచిగా ప్రసంగించారు, మంచి ఆలోచనలు ఇచ్చారు" అని లింకన్ బదులిచ్చాడు.

అప్పుడు మిత్రుడు, 'నీకు నచ్చిందా?" అని అడుగగా, మిస్టర్ లింకన్ సంకోచించి, 'లేదు. ఈరాత్రి రెవ. గుర్లె విఫలమయ్యాడు" అని చెప్పాడు. మిత్రుడు ఆశ్చర్యపోయి, 'ఎందుకలా చెబుతున్నావు?" అని ప్రశ్నించాడు. అప్పుడు

లింకన్, "అతను మనల్ని ఏ గొప్ప కార్యం చేయమని చెప్పలేదు" అన్నాడు. ప్రసంగం ప్రతిస్పందించే పిలుపు ఇవ్వాలని ప్రెసిడెంట్ లింకన్ నమ్మాడు. ప్రసంగం జీవితాలని మార్చాలని నమ్మాడు.

► మత్తయి 18 చదవండి.

యేసు జీవితాలు మార్చడానికి ప్రసంగించాడు. ఆయన ప్రసంగం ఆచరణాత్మకం. "పరలోకరాజ్యంలోని సంబంధాల" గురించి మత్తయి 18వ అధ్యాయం యేసు ప్రసంగాన్ని నమోదు చేస్తుంది. యేసు ఈ విషయాలు బోధించాడు:

- వినయం యొక్క ప్రాముఖ్యత (18:2-6)
- శోధనకు ప్రతిస్పందన (18:7-9)
- తప్పినపోయినవారి పట్ల ప్రతిస్పందన (18:10-14)
- మీకు వ్యతిరేకంగా పాపం చేయువారిపట్ల ప్రతిస్పందన (18:15-20)
- క్షమాపణ ఆవశ్యకత (18:21-35)

ఇవి అనుదిన జీవితంలో ఆచరణాత్మక విషయాలు. యేసు తన శ్రోతల నిజమైన అవసరాలు గురించి మాట్లాడాడు. ఆయన జీవితాలు మార్చడానికి ప్రసంగించాడు.

పుట్టుగ్రుడ్డివానికి, యేసు కంటిచూపు ఇచ్చాడు, పిమ్మట శాశ్వతంగా తన జీవితాన్ని మార్చగల సందేశం ఇచ్చాడు.

> పరిసయ్యులు వానిని వెలివేసిరని యేసు విని వానిని కనుగొని–నీవు దేవుని కుమారునియందు విశ్వాసముంచుచున్నావా అని అడిగెను. అందుకు వాడు–ప్రభువా, నేను ఆయనయందు విశ్వాసముంచుటకు ఆయన ఎవడని అడుగగా యేసు – నీవాయనను చూచుచున్నావు; నీతో మాటలాడుచున్నవాడు ఆయనే అనెను. అంతట వాడు–ప్రభువా, నేను విశ్వసించుచున్నానని చెప్పి ఆయనకు మ్రొక్కెను (యోహాను 9:35-38).

ఆకలిగొన్నవారికి, యేసు ఆహారం పెట్టాడు పిమ్మట, వారి జీవితాలను శాశ్వతంగా మార్చగల సత్యాన్ని ప్రకటించాడు. "జీవాహారము నేనే; నాయొద్దకు వచ్చువాడు ఏమాత్రమును ఆకలిగొనడు, నాయందు విశ్వాసముంచువాడు ఎప్పుడును దప్పిగొనడు" (యోహాను 6:35).

జీవితాలను మార్చే ప్రసంగం, దేవుని వాక్య సత్యాన్ని, ప్రజల అక్కరలను కలిపి చూస్తుంది. ప్రభావవంతమైన ప్రసంగం దేవుని సత్యాన్ని ప్రజల అవసరాలకు అనుగుణంగా మాట్లాడుతుంది.

యేసు ప్రకటించినప్పుడు, ఆయన మనసుతో, భావాలతో, చిత్తంతో మాట్లాడాడు. నిజమైన మార్పులో ఈ మూడు ఉంటాయి.

**యేసు మనసుతో మాట్లాడాడు**

మత్తయి 18లో, మీరు యేసు ప్రసంగం గురించి చదివినప్పుడు, సంబంధాలు గురించి ఎన్నడు చెప్పని జ్ఞానమైన బోధ మీరు చూస్తారు. ప్రజలు ఒకరినొకరు వినయంగా చూసుకునే సమాజం గురించి ఆలోచించండి. క్షమాపణ ప్రమాణంగా ఉన్న సమాజం గురించి ఆలోచించండి. యేసు తన శ్రోతల మనసులతో వివేకాన్ని మాట్లాడాడు.

**యేసు భావోద్వేగాలతో మాట్లాడాడు**

యేసు శ్రోతల ఆశ్చర్యం, అద్భుతం, వింత గురించి సువార్తలు 34సార్లు మాట్లాడతాయి. ఎమ్మాయి మార్గంలో శిష్యులు, "ఆయన త్రోవలో మనతో మాటలాడుచు లేఖనములను మనకు బోధపరచుచున్నప్పుడు మన హృదయము మనలో మండుచుండలేదా అని?" (లూకా 24:32) చెప్పుకున్నారు. యేసు మాటలు విన్నవారు ఆయన దయగల మాటలకు ఆనందించారు, పాపాలను బట్టి దుఖించారు, అన్నిటికి మించి భవిష్యత్ నిరీక్షణ పొందుకున్నారు.

**యేసు సంకల్పం/చిత్తంతో మాట్లాడాడు**

యేసు కేవలం శ్రోతలతో తృప్తిపడలేదు; అనుచరులను పిలిచాడు. యేసు బాహ్య మార్పు చూసి తృప్తిపడలేదు; జీవితాలు, హృదయాలు మారాలని పిలిచాడు. పాపంతో నిండిన సమరయ స్త్రీయైనా లేక ధర్మశాస్త్రాన్ని అనుసరించిన ధనవంతుడైన యువకుడైన, దేవునికి అప్పగించుకోవాలని తన శ్రోతలను పిలిచాడు. మనం యేసువలే ప్రసంగించినప్పుడు, మన శ్రోతలకు క్రొత్త జీవన విధానానికి పిలుపునిస్తాం.

**నిశిత పరిశీలన: మీరు సువార్త ప్రకటిస్తున్నారా?**

ఒక పాస్టర్ రోమా 1వ అధ్యాయం నుండి స్వలింగ సంపర్క పాపం గురించి ప్రసంగించాడు. అతడు సత్యం బోధించాడు. కాని ఏదో లోపించింది....అక్కడ కూర్చున్నవాళ్లలో ఒకడు స్వలింగ-ఆకర్షితుడు. స్వలింగ సంపర్కం పాపమని ఆ యువకుడికి తెలుసు, విమోచన కోసం ప్రార్థించడం మొదలుపెట్టాడు. అతని పాపస్వభావపు వాస్తవం అతనికి తెలుసు; దేవుడు శోధనపై జయమివ్వగలడనే సుసమాచారం (సువార్త) అతడు వినాలి/అతనికి అవసరం.

విడాకుల గురించి యేసు హెచ్చరించిన మాటలను పాస్టర్ ప్రస్తావించాడు. సులభంగా విడాకులు ఇచ్చే నియమాలు గురించి చెప్పాడు. అతడు సత్యం బోధించాడు. కాని ఏదో లోపించింది....ఆ వారం ఇద్దరు పిల్లలుగల యువ దంపతులు విడాకులకు నడిపిస్తున్న గొడవను పరిష్కరించుకోలేక, విడాకులు కోసం న్యాయవాది యొద్దకు వెళ్ళారు. విడాకులు

తీసుకోవడం పాపమని వాళ్ళకు తెలుసు; విచ్ఛిన్నమౌతున్న వైవాహిక జీవితాలను యేసు స్వస్థపరచగలడనే సుసమాచారం (సువార్త) వారు వినాలి/వారికి అవసరం.

ఒక పాస్టర్ ఇలా అరిచాడు, "గర్భస్రావం ఏ తప్పు చేయనిశిశువు ప్రాణం తీస్తుంది." అతడు సత్యం బోధించాడు. కాని ఏదో లోపించింది..... అతని సంఘంలో ఒక స్త్రీ పెళ్లికాకుండా తాను గర్భస్రావం చేయించుకోవడానికి హాస్పిటల్ కు వెళ్లిన ఆ దినం జ్ఞాపకం చేసుకొని ఏడుస్తుంది. ఇరవై-ఏళ్ళ తరువాత, దేవుడు తన పాపం క్షమిస్తాడా అనే అనుమానంలో ఉంది; దేవుడు గతంలో ఆమె చేసిన పాపానికి పశ్చాత్తాపపడితే, ఆయన క్షమాపణ అందిస్తాడనే సుసమాచారం (సువార్త) ఆమె వినాలి/ఆమెకు అవసరం.

యేసు ఎన్నడు సత్యం విషయంలో రాజీపడలేదు, కాని నిరీక్షణ ఇవ్వడం కూడా మర్చిపోలేదు. సువార్త జీవితాలను మారుస్తుందని ఆయనకు తెలుసు. స్వలింగ-ఆకర్షణతో పోరాడుతున్న యువకునితో యేసు, "శోధనపై జయమివ్వడానికి నా కృప నీకు చాలును" అని చెబుతాడు. విచ్ఛిన్నమైన వైవాహిక జీవితాన్ని గడుపుతున్న దంపతులతో యేసు, "ప్రేమను పొందని విధంగా కనిపిస్తున్న జీవిత భాగస్వామి యెడల ప్రేమ చూపించే హృదయం నేను ఇవ్వగలను" అని చెబుతాడు. గర్భస్రావ పాపంతో ఉన్న స్త్రీతో యేసు, "నేను ఇతర పాపాలను క్షమించినట్లుగానే గర్భస్రావ పాపం కూడా క్షమిస్తాను. వెళ్లి ఇకమీదట పాపం చేయకు" అని చెబుతాడు.

పాపంపై తీర్పు సందేశం కూడా సువార్తలో భాగం. కాని యేసువలే ప్రకటించాలంటే, జీవితాలను మార్చే కృపాశక్తిని మనం మర్చిపోకూడదు. మనం దేవుని కృపా సువార్తను పతనమైన లోకంలో ప్రకటించాలి.

సువార్తలో ఎలప్పుడు రెండు సుసమాచారాలు ఉంటాయి. మొదటిగా, దేవుడు మన కొరకు ఏం చేశాడో సువార్త చెబుతుంది. నిరీక్షణలేని లోకంలో నిరీక్షణ కలిగిస్తుంది.

తరువాత, పరిశుద్ధాత్మ శక్తి ద్వారా మనం ఏం అవ్వగలం అనే విషయం సువార్త చెబుతుంది. సువార్త మనలను ఉన్నచోటనే విడిచిపెట్టదు; దేవునితో మరింత సన్నిహితంగా నడవడానికి సవాలు చేస్తుంది.

### యేసు ప్రసంగాలు సరళమైనవి మరియు జ్ఞాపకముంచుకోదగినవి

యేసు ఎన్నడు సత్యంతో ప్రజల్ని విసిగించలేదు. సులభంగా సూటిగా ఎలా ప్రసంగించాలో ఆయనకు తెలుసు. ఆయన లోతైన సత్యాలు ప్రకటించాడు, కాని శ్రోతల్లో పామరుల ఆసక్తిని ఆకర్షించాడు.

ప్రభావవంతమైన ప్రసంగికుని లక్ష్యం లోతైన తన జ్ఞానంతో శ్రోతలను ముగ్ధుల్ని చేయడం కాదు. ప్రసంగికుని లక్ష్యం, దేవుని వాక్యాన్ని సులభంగా శక్తివంతంగా ప్రకటించడం, దేవుని వాక్య సత్యంతో శ్రోతల్ని ఒప్పించడంలో పరిశుద్ధాత్మని అనుమతించడం.

యేసు తన ప్రసంగాలను సులభంగా, ఆసక్తికరంగా ఎలా చేశాడు?

**యేసు కథలు చెప్పాడు**

యేసు ప్రసంగాలు విన్న ప్రతి ఒక్కరు తరచుగా "నేను ఒక కథ చెబుతాను" అనే మాటలు వింటారు. ఆయన కథలు శ్రోతలను ఆకర్షించాయి, ఆయన సందేశం వైపు వారి చెవులు తెరచేలా చేశాయి.

మనలో చాలామంది మూడు అంశాలున్న సందేశం కంటే కథను ఎక్కువగా గుర్తుంచుకుంటారు. సందేశాన్ని ఉదహరించిన మంచి కథలు సందేశంలోని ప్రధాన అంశాన్ని గుర్తుంచుకునేలా చేస్తాయి. గొప్ప కథ ప్రసంగికుడు చేస్తున్న సందేశాన్ని సంగ్రహిస్తుంది.

► సందేశంలో మీరు విన్న చివరి కథ గురించి చర్చించండి. అది ప్రసంగికుని సందేశాన్ని ప్రభావితంగా వెల్లడి చేసిందా? కథ ఉద్దేశాన్ని మీరు జ్ఞాపకం చేసుకోగలరా? కథ లేకుండా కూడా సందేశం ప్రభావవంతంగా గుర్తుండిపోయేలా ఉందా?

**యేసు సరళమైన భాష ఉపయోగించాడు**

బోధకుడు ఒక విషయాన్ని ఎంత మంచిగా అర్థం చేసుకుంటే, దానిని అంత సులభంగా విద్యార్థికి వివరించగలడు. బోధనా సమయంలో సంక్లిష్టమైన పదాలు ఉపయోగించే బోధకుడు, తన అవగాహన లేమిని కప్పిపుచ్చుకుంటాడు. ఒక విషయాన్ని మంచిగా అర్థం చేసుకున్నప్పుడు, దానిని అంతే సులభంగా బోధించగలుగుతాం.

సత్యాన్ని తన శ్రోతల భాషలో ఎలా మాట్లాడాలో యేసుకు తెలుసు. ఆయన విత్తనం విత్తటం గురించి రైతులకు బోధించాడు. గొర్రెల గురించి కాపరులకు బోధించాడు. చేపలు పట్టడం గురించి జాలర్లకు బోధించాడు. చాలామంది యేసు సందేశాన్ని తిరస్కరించారు, కాని ఏ ఒక్కరు ఆయన సందేశాలకు విసుకు చెందలేదు.

యేసు సందేశాన్ని జాలర్లు, రైతులు, గృహిణులు అందరు అర్థం చేసుకోగలరు. కాని ఆయన పండితులు, మతాధికారులు, రాజకీయ నాయకుల గురించి కూడా మాట్లాడాడు. ఆయన ప్రసంగం సమాజంలో ప్రతి స్థాయి గురించి మాట్లాడుతుంది. సరళం అంటే పైపైన చెప్పటం కాదు. మన ప్రసంగాలు కూడా సువార్త గొప్ప సత్యాన్ని సరళంగాను, స్పష్టంగాను ప్రకటించాలి.

**యేసు పునరావృతం చేసే పద్ధతిని ఉపయోగించాడు**

ఒక యౌవ్వన సేవకుడు తన సంఘం విషయంలో విసిగిపోయి, "వారికిది ఇప్పటికే తెలిసుండాలి; నేను గత రెండు సంవత్సరాల క్రితం ఇది చెప్పాను" అన్నాడు. తనశిష్యులు అర్థం చేసుకునేవరకు యేసు అదే సందేశం చెప్పాడని అతని మిత్రుడు అతనికి జ్ఞాపకం చేశాడు.

మిత్రుడు ఈ సేవకుడ్ని అడిగాడు, "నీ ప్రసంగం యేసు ప్రసంగం కంటే గొప్పదనుకుంటున్నావా?"

"నిజానికి, కాదు!"

"మీ సంఘ సభ్యులు శిష్యుల కంటే తెలివైనవారా?"

"కాదు!"

"అయితే నువ్వు యేసువలే సత్యాన్ని పునరావృతం చేయాలి."

యేసు ఒకే సత్యాన్ని పదే పదే ప్రకటించాడు. పదే పదే ఆయన మరణం, పునరుత్థానం గురించి శిష్యులకు బోధించాడు. అనేకసార్లు దేవుని రాజ్యం గురించి ప్రకటించాడు. ఈ సత్యాలు ముఖ్యమైనవని ఆయనకు తెలుసు, కాబట్టి శ్రోతలకు చేరే వరకు ఆయన తన సందేశాన్ని అనేకమార్లు ప్రకటించాడు.

**యేసు ప్రసంగాలు యధార్థమైనవి**

యేసు ప్రసంగం యదార్థం. ఆయన జీవితం ఆయన సందేశానికి అనుగుణం. యేసు కేవలం దైవిక జీవితం గురించి ప్రకటించలేదు; దైవిక జీవనం గడిపాడు. యేసు సందేశం, ఆయన జీవితానికి మధ్య ఏ ఒక్కరు కూడా వ్యత్యాసం చూపించలేరు. యేసు ఏది ప్రకటించాడో అలా జీవించాడు.

మీరు కారు నడపడం నేర్చుకోవాలనుకున్నారని అనుకోండి. కారు నేర్పుతామని ఇద్దరు వచ్చారు. ఒకడు నడపటం గురించి చాలా పుస్తకాలు చదివాడు కాని ఎప్పుడు కారు నడపలేదు. మరొకడు, చాలాకాలంగా కారు మంచిగా నడుపుతున్నాడు. మీరు ఎవర్ని ఎన్నుకుంటారు?

మీరు క్రైస్తవ జీవితం జీవించాలనుకున్నారు అనుకోండి. ఇద్దరు పాస్టర్లను కనుగొన్నారు. ఒకరు, పాపజీవితంలో ఉన్నారు, కాని మంచి ప్రసంగాలు చేస్తారు. మరొకరు, దేవునికి సన్నిహితంగా జీవిస్తున్నారు. ఏ పాస్టర్ ని ఎన్నుకుంటారు?

మన ప్రసంగం యదార్థంగా ఉండాలి. మనం ప్రకటించే విధంగా జీవించాలి. కొంతకాలం పాటు నకిలీ యదార్థతను కలిగి ఉండటం సాధ్యమని చాలామంది బోధకులు కనుగొన్నారు. నిజాయితీగా ప్రసంగిస్తూ, కానుకల డబ్బులు దొంగిలించే బోధకుల విషయంలో ప్రజలు మోసపోతున్నారు. వ్యభిచారం చేస్తూ, నైతికత గురించి బోధించే ప్రసంగికుల వలన మోసపోతున్నారు. తన భార్యను కొడుతూ ప్రేమ గురించి మాట్లాడే ప్రసంగికుల వలన మోసపోతున్నారు. కాని చివరకు, సత్యం బయటకు వస్తుంది. శూన్యతతో నిండిన హృదయం ఆత్మీయ శక్తిలేని పరిచర్యనిస్తుంది. మనలో పనిచేయడానికి దేవునిని అనుమతించినప్పుడు ఆయన మన ద్వారా పనిచేస్తాడు.

> ‘వారి పరిచర్య పరిమాణం బట్టి మీరు వారిని ఎరుగుదురు’ అని యేసు చెప్పలేదు. ‘వారి క్రియల ఆధారంగా వారికి తెలుసుకుంటారు’ అని చెప్పాడు.
> - క్రెయిగ్ కీనర్

పాప జీవితాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రసంగ ఆకర్షణను వాడొద్దు. ప్రభావవంతమైన ప్రసంగం దేవుని ఎరిగిన హృదయంతో మొదలౌతుంది.

## అన్వయం: కాపరిగా సేవకుడు

► మార్కు 6:30-34 చదవండి.

పాస్టర్ గురించి ఒక ఉత్తమ చిత్రం కాపరి. “గనుక యేసు వచ్చి ఆ గొప్ప జనసమూహమును చూచి, వారు కాపరిలేని గొఱ్ఱెలవలె ఉన్నందున వారిమీద కనికరపడి, వారికి అనేక సంగతులను బోధింపసాగెను.” యేసు జనసమూహాన్ని చూసినప్పుడు, కాపరి అవసరతలో ఉన్న గొర్రెలను చూశాడు.

► మార్కు 6లో 5000 మందిలో ఎవరెవరున్నారో ఊహించండి. జాబితా చేయండి.

- మీ జాబితాలో ప్రజల్ని మోసం చేసిన సుంకరులు ఉన్నారా? ఉన్నారు. ఈ నిజాయితీ లేనివారిని ఖండించడం సులభమే కాని యేసు నశించిపోయి, విమోచన అవసరతలో ఉన్న గొర్రెలను చూశాడు.
- మీ జాబితాలో, యేసును పట్టుకోవాలని చూస్తూ తీర్పుతీర్చేడి పరిసయ్యులు ఉన్నారా? ఉన్నారు. జనసమూహం యెదుట వాళ్ళని అవమానించడం యేసుకు చాలా సులభం కాని యేసు సరైన మార్గం అవసరమైన కఠిన గొర్రెలను చూశాడు.
- మీ జాబితాలో, వ్యభిచారాన్ని బట్టి దోషిగా ఉన్న అవిశ్వాసి భర్త ఉన్నాడా? ఉన్నాడు. యేసు, దిద్దుబాటు ఆపై స్వస్థత అవసరతలో ఉన్న పడిపోయిన గొర్రెలను చూశాడు.

- ఇంటిలో తిరుగుబాటు చేసి, పాఠశాలలో నుండి పారిపోయి అన్య సమూహంలో చేరిన యువకులు మీ జాబితాలో ఉన్నారా? ఉన్నారు. వాళ్లు మరింత దారితప్పిపోకుండా సరైన మార్గంలోకి తీసుకురావడానికి తిరుగులాడుతున్న గొర్రెలను యేసు చూశాడు.

మీరు ప్రసంగిస్తున్నప్పుడు ఎవర్ని చూస్తున్నారు? మీ సంఘ లోపాలు మాత్రమే చూస్తున్నారా లేక మీ గొర్రెల అవసరాలు చూస్తున్నారా? కేవలం కోపంతో ఉన్న బోర్డు సభ్యుడిని చూస్తున్నారా లేక పాపం వలన బాధపడుతున్న గొర్రెను చూస్తున్నారా? యేసు అవసరతలో ఉన్న గొర్రెలను చూశాడు.

► యోహాను 10:1-18 చదవండి.

పాస్టర్లుగా, సంఘానికి మనం కాపరులుగా ఉండుటకు పిలవబడ్డాం. కాపరి గొర్రెలకు ఎలా సేవ చేస్తాడు? యోహాను 10 దీనికి మాదిరి.

**కాపరి గొర్రెలను నడిపిస్తాడు**

కాపరిని గమనిస్తే, దుడ్డుకర్ర పట్టుకుని గొర్రెలను చెల్లాచెదురు చేయడు. దానికి బదులుగా, కాపరి గొర్రెలను సరైన మార్గంలో నడుపుతాడు. యేసు “అతనికి ద్వారపాలకుడు తలుపు తీయును, గొఱ్ఱెలు అతని స్వరము వినును, అతడు తన సొంత గొఱ్ఱెలను పేరుపెట్టి పిలిచి వాటిని వెలుపలికి నడిపించును. మరియు అతడు తన సొంత గొఱ్ఱెలనన్నిటిని వెలుపలికి నడిపించునపుడెల్ల వాటికి ముందుగా నడుచును; గొఱ్ఱెలు అతని స్వరమెరుగును గనుక అవి అతనిని వెంబడించును” (యోహాను 10:3-4) అని యేసు చెప్పాడు.

మనం సువార్తలు చదువుతుండగా, యేసు పేతుర్ని, యోహానుని, లేక తోమాను దుడ్డుకర్రతో కొడితే బాగుండని మనం అనుకునే సందర్భాలు చాలా ఉన్నాయి! పదే పదే వాళ్లు సమస్యలో ఇరుక్కున్నారు. అయితే యేసు వారిని కొట్టకుండా, ఈ బలహీన శిష్యులను లేవనెత్తి, వారిని సరైన త్రోవలో నడిపించడానికి ఆ దుడ్డుకర్రను ఉపయోగించాడు.

కాపరిగా, దేవుడు మీ సంఘంలో ఉంచిన గొర్రెలను మీరు నడిపిస్తున్నారా లేక వెళ్లగొడుతున్నారా? మీరు గొర్రెలను నడిపించే కాపరులా లేక గొర్రెలను విధేయత చూపుమని ఆజ్ఞాపించే నాయకులా?

**కాపరి గొర్రెలపట్ల శ్రద్ధచూపుతాడు**

“ఉదయం 9:00 గంటలు నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఉండి, వారాంతాల్లో సెలవులు ఇచ్చి, సాయంత్రం 5:00 గంటలు తరువాత ఏ ఫోన్ కాల్ లేని ఉద్యోగం అంటే నాకిష్టం” అని మీరెప్పుడైన ఆలోచించారా? ఇది కొన్నిసార్లు అద్భుతంగా ఉంటుంది! కాని కాపరి జీవితం అలా ఉండదు.

కాపరి గొర్రెలకు అవసరమైన సమయాల్లో శ్రద్ధ చూపుతాడు కాని కేవలం పనివేళలో కాదు. కాపరి దెబ్బతగిలిన గొర్రెతో, "రేపు ఉదయం 9:00గంటల వరకు, నేను పనికి వచ్చే వరకు వేచియుండు" అని చెప్పడు. కాపరి గొర్రెపిల్లను తప్పించడానికి రాత్రివేళ పరిగెడతాడు.

అదే విధంగా, తన గొర్రెలు అవసరంలో ఉన్నప్పుడు పాస్టర్ శ్రద్ధ చూపుతాడు. ఆత్మీయ గొర్రెల పట్ల శ్రద్ధ అనేది ప్రసంగానికి మించి ఉంటుంది. ఇందులో ప్రసంగం ఒక భాగమే, కాని సలహాలు ఇవ్వడం, దర్శించడం, వినటం, ప్రార్థించడం, కొన్నిసార్లు గాయపడిన గొర్రెపిల్ల దగ్గర కూర్చోవడం కూడా ఇందులో భాగం.

అవును, పాస్టర్లు, మీకు మీరు శ్రద్ధ చూపుకోవాలి. మీరు భౌతికంగా, భావోద్వేగపరంగా, ఆత్మీయంగా అలసిపోతే ప్రభావవంతమైన కాపరిగా ఉండలేరు. యేసు ఏకాంతంగా సమయం గడిపాడు, మీరు కూడా ఏకాంత సమయం తీసుకోవాలి. అయితే, గొర్రెలపై శ్రద్ధచూపడానికి తన సౌకర్యాన్ని త్యాగం చేయాల్సిన సందర్భాలు ఉన్నాయని కూడా యేసుకు తెలుసు.

పరిచర్య, విశ్రాంతి – ఈ రెండు విషయాలలో సమతుల్యత కలిగి ఉండడం కష్టమే. ఒక తెలివైన సేవకుడు-కాపరిగా, మీరు పరిశుద్ధాత్మ నడిపింపు విషయంలో అదే విధంగా మీ చుట్టూ ఉన్నవారి సలహాల విషయంలో సున్నితంగా ఉండాలి. "ఇది విశ్రాంతి, పునరుద్ధరణకు సమయం" అని ఆత్మ మీతో చెప్పినప్పుడు ఆలకించాలి. "నీకు కొంత సమయం కావాలి" అని చెప్పినప్పుడు నీ భార్య లేక మిత్రుని మాట వినాలి. పునరుద్ధరణ పొందిన తరువాత ఒక నూతన ఆసక్తితో, దేవుడు అప్పగించిన గొర్రెల పట్ల శ్రద్ధ చూపాలి.

**కాపరి గొర్రెలను కాపాడతాడు**

ప్రమాదం సంభవించినప్పుడు పారిపోయే జీతగాడికి, తన ప్రాణానికి తెగించి గొర్రెలను కాపాడిన మంచి కాపరికి మధ్య వ్యత్యాసాన్ని యేసు వివరించాడు. జీతగాడు గొర్రెలను గూర్చి లక్ష్యం చేయడు, కాని కాపరి గొర్రెల కొరకు తన ప్రాణం పెడతాడు (యోహాను 10:13, 15).

ఆయన తన చివరి ఘడియల్లో కూడా, యేసు శిష్యుల పట్ల శ్రద్ధ చూపాడు. ప్రభురాత్రి భోజన సమయంలో, వారు త్వరలో ఎదుర్కొనబోవు విచారణకై వారిని సిద్ధపరచాడు. గెత్సమనే తోటలో, పేతురు, యాకోబు, యోహానులకు తన బోధ కొనసాగించాడు. సిలువలో, మరియను యోహాను చేతులకు అప్పగించాడు. చివరి వరకు, మంచి కాపరి గొర్రెలను లక్ష్యపెడుతూనే ఉన్నాడు.

కాపరులవలే సేవచేయాలని ఎఫెసీ సంఘ పెద్దలను పౌలు నియమించాడు. వారు యేసు రక్తంలో సంపాదించబడిన గొర్రెమందను కాయాలి. తరువాత వచనంలో, క్రూరమైన తోడేళ్లు గొర్రెమందపై దాడిచేస్తాయని కూడా పౌలు హెచ్చరించాడు. గొర్రెమందను కాపాడే బాధ్యత కాపరులది (అపొస్తలుల కార్యములు 20:28-31).

సేవకుడు-కాపరిగా, దేవుడు మీ సంఘంలో ఉంచిన గొర్రెలను కాపాడుతున్నారా? తప్పుడు సిద్ధాంతాల నుండి, వివాహంలో, కుటుంబంలో, ఇతర ఆత్మీయ దాడుల నుండి వారిని కాపాడుతున్నారా? మీరు జీతగాళ్లా లేక కాపరులా?

మీరు తరువాతి ఆదివారం ప్రసంగించడానికి ముందు, మీ గొర్రెల అవసరాలను మీకు బయలుపరచమని దేవుని అడగండి. మీ మందలో విరిగి నలిగిన హృదయాలను బయలుపరచమని అడగండి. మీరు ప్రసంగిస్తున్నప్పుడు, వేధింపులకు గురై, నిస్సహాయంగా ఉండి, దైవిక కాపరి ప్రేమ అవసరతలో ఉన్న గొర్రెలను చూడండి.

### నిశిత పరిశీలన: “శ్రమ!”

► మత్తయి 23:1-39 చదవండి.

యేసు, ఆయనను తిరస్కరించిన పట్టణాలు గురించి (మత్తయి 11:21), ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న పరిసయ్యులు, శాస్త్రులు గురించి (మత్తయి 23:13-29), ఆయన్ని ధిక్కరించబోవు యూదా గురించి (మార్కు 14:21) మాట్లాడుతూ, ఆయన “అయ్యో మీకు శ్రమ” అనే మాట ఉపయోగించాడు. మనం కొన్నిసార్లుతనను తిరస్కరించిన వారిపట్ల యేసు చూపిన ప్రేమను మరచిపోయేంతగా, ఈ “శ్రమలను” కోపంతో చదువుతాం.

శ్రమ అనే పదంలో తీర్పు ఉంది, కాని దుఖం కూడా ఉంది. “శ్రమ” అనే పదంలో, విచారణకు గురైన వ్యక్తికి తీర్పు మరియు “దుఖం, చింత” రెండు ఉంటాయి. “తమ పరిస్థితి యొక్క నిజమైన దుస్థితిని గుర్తించడంలో విఫలమైనవారి పట్ల యేసు విచారాన్ని” ఇది వ్యక్తపరుస్తుంది.[27] “శ్రమ” లోతైన దుఃఖాన్ని అదే విధంగా హెచ్చరికను అందిస్తుంది.

యేసు తాను ప్రేమించిన పట్టణ గతిని చూసి దుఃఖపడుతూ మతాధికారులపై తీర్పు ప్రకటనలను, ముగించాడు “యెరూషలేమా, యెరూషలేమా, ప్రవక్తలను చంపుచును నీయొద్దకు పంపబడినవారిని రాళ్లతో కొట్టుచునుఉండు దానా, కోడి తన పిల్లలను రెక్కలక్రింది కేలాగు చేర్చుకొనునో ఆలాగే నేనును నీ పిల్లలను ఎన్నోమారులు

---

[27] Martin H. Manser, *Dictionary of Bible Themes*. (London: Martin Manser, 2009). Joel B. Green and Scot McKnight, *Dictionary of Jesus and the Gospels*. (Westmont, Illinois: InterVarsity Press, 1992) ఇవి కూడా చూడండి.

చేర్చుకొనవలెనని యుంటిని గాని మీరు ఒల్లకపోతిరి." త్వరలో ఆయనను సిలువవేయబోవు పట్టణ గతిని చూసి యేసు ఏడ్చాడు (మత్తయి 23:37 మరియు లూకా 19:41).

తీర్పు ప్రకటించే విషయంలో ఇది మనకు మాదిరి. మన ప్రసంగంలో పాపం గురించి హెచ్చరికలు, మారుమనసు పొందుటకు నిరాకరించే వారిపై తీర్పు సందేశాలు ఉండాలి. కాని మన సందేశం పాపం విషయంలో దుఖం చూపించాలి, కాని పాపి పై కోపం చూపకూడదు.

నరకం గురించి ప్రసంగం విన్న తర్వాత తిరుగుబాటు స్వభావం కలిగిన ఒక యువకుడు ఇంటికెళ్లాడు. "బాబు, ప్రసంగం గురించి నువ్వేమనుకుంటున్నావ్?" అని తండ్రి అడిగాడు. "నాకది నచ్చలేదు. కోపం తెప్పించింది!" అని చెప్పాడు. తర్వాత వారం, మరొక ప్రసంగికుడు నరకం గురించి చెప్పటం మళ్ళీ కుమారుడు విన్నాడు. "ప్రసంగం గురించి నువ్వేమనుకుంటున్నావ్?" అని తండ్రి అడిగాడు. "నేను యేసును సేవించాలి. నాకు ఆ భయంకరమైన చోటుకి వెళ్లాలనిలేదు!" అని బదులిచ్చాడు.

తండ్రి ఆశ్చర్యపోయాడు. "గత వారం, నరకం గురించి చెప్పిన ప్రసంగం నీకు కోపం రేపింది. ఈ వారం, నరకం గురించి చెప్పిన ప్రసంగం పశ్చాత్తాపానికి గురిచేసింది. ఏంటి తేడా?" అని తండ్రి అడిగాడు. అప్పుడతడు, "నరకం గురించి నన్ను హెచ్చరించటప్పుడు ప్రసంగికుడు ఏడ్చాడు!" అని బదులిచ్చాడు.

మీరు తీర్పును గూర్చి ప్రకటిస్తున్నప్పుడు ఏడుస్తారా? నరకం గురించి ప్రసంగం తయారు చేసేటప్పుడు మీరు ఏడుస్తారా? మీరు, తీర్పు గురించి హెచ్చరించేటప్పుడు కూడా గొర్రెలను ప్రేమించే కాపరేనా?

### ముగింపు: ప్రసంగంలో పరిశుద్ధాత్ముని పాత్ర

ప్రసంగికులంగా, మన బోధ వినే వారిలోఒప్పింపు కలుగజేయడానికి పరిశుద్ధాత్మ శక్తిపై ఆధారపడాలి. భావోద్వేగ విజ్ఞప్తులను కలిగించడానికి మనం మానవ పద్ధతుల్ని మాత్రమే ఉపయోగిస్తే, త్వరిత ఫలితాలు చూస్తాం కాని ఆత్మీయ ఫలితాలు నశిస్తాయి. మన శ్రోతల్లో శాశ్వత ఫలితాలు తీసుకొచ్చేది కేవలం పరిశుద్ధాత్ముడే.

► 1 కొరింథీయులకు 2:1-16 చదవండి.

ఆత్మీయ మార్పు కేవలం పరిశుద్ధాత్మ శక్తి ద్వారా మాత్రమే కలుగుతుందని పౌలు గ్రహించాడు. ఏథెన్సు పట్టణంలో అరేయొపగులో తత్వశాస్త్రులతో వాదించిన తరువాత, అతడు కొరింథుకి వచ్చాడు (అపొస్తలుల కార్యములు 17:16-18:1). కొరింథులో, అతను వాక్చాతుర్యంతో, జ్ఞానంతో కాకుండా సిలువవేయబడిన యేసుక్రీస్తును తప్ప మరేది

ప్రకటించకూడదని నిశ్చయించుకున్నాడు. "పరిశుద్ధాత్మయు దేవుని శక్తియు కనుపరచు దృష్టాంతములనే వినియోగించితిని" (1 కొరింథీయులకు 2:1-5).

పరిశుద్ధాత్మ దేవుడు ఆత్మీయులైనవారికి ఆత్మీయ సత్యాలు బయలుపరుస్తాడని పౌలుకు తెలుసు (1 కొరింథీయులకు 2:13). పౌలు శిక్షణకు, నేర్చుకోవడానికి విలువిచ్చాడు; అతడు గొప్ప పండితుడు. ప్రభావవంతమైన బహిరంగ ప్రసంగ అవగాహనగలవాడు; అతడు గొప్ప గ్రీకు ఉపన్యాసకులను అధ్యయనం చేశాడు. తార్కికంగా ఎలా మాట్లాడాలో అతనికి తెలుసు; తార్కిక నిర్మాణంలో రోమా పత్రిక గొప్పది. కాని అన్నిటికి మించి, పౌలు పరిశుద్ధాత్మ శక్తికి విలువిచ్చాడు. నిజమైన ఒప్పుకోలు ఆత్మ కార్యం ద్వారానే వస్తుందని అతనికి తెలుసు.

పౌలు కొరింథీయులకు "అయినను ఆ బలాధిక్యము మా మూలమైనది కాక దేవునిదైయుండునట్లు మంటి ఘటములలో ఈ ఐశ్వర్యము మాకు కలదు" (2 కొరింథీయులకు 4:7) అని జ్ఞాపకం చేశాడు. శరీరం సంపద కాదు! పరిచర్య చేసే మనం పగిలిన మట్టి పాత్రల వంటివాళ్ళం. కానీ మనం సేవించే ప్రజల యొద్దకు ఐశ్వర్యమైన సువార్తను తీసుకెళ్ళే గొప్ప అద్భుత అవకాశం మనకుంది.

పరిచార నాయకులకు ఇది గొప్ప హెచ్చరిక. శరీరంలో ఉన్న సంపదపై కాకుండా ఘటంపై దృష్టిపెట్టడం చాలా సులభం. మనం మన సందేశం కంటే మనపై దృష్టిపెట్టగలం; మనం సంపద కంటే ఘటముపై దృష్టిపెట్టగలం. శక్తి మనది కాదు దేవునిదని చూపించడానికి ఆయన ఉద్దేశ్యపూర్వకంగా మంటి ఘటాలను ఉపయోగించుకున్నాడని పౌలు జ్ఞాపకం చేస్తున్నాడు. మనం దేవుని శక్తికి అడ్డుపడకూడదు. కేవలం ఆయనకు చెందిన మహిమ మనం తీసుకోకూడదు. మనం ఆత్మ శక్తితో ప్రకటించాలి.

## పాఠం 5 అభ్యాసాలు

(1) మత్తయి సువార్తలో ఐదు ప్రధాన ప్రసంగాలు ఉన్నాయి. ప్రతి ప్రసంగం చదివి, దానిని ప్రభావవంతంగా చేసిన ఒక లక్షణం గుర్తించి, క్రింద పట్టికలో రాయండి. ఈ అభ్యాసంలో తప్పు లేక ఒప్పు సమాధానాలు ఏమి ఉండవు. "యేసు నన్ను ఎలా ఒప్పింపజేశాడు, ప్రేరేపించాడు, లేక ఆయన సందేశం గుర్తుంచుకుని, దాని అన్వయించుకోవడానికి ఎలా సహాయం చేశాడు?" అని అడగండి.

(2) మీరు తదుపరి ప్రసంగం సిద్ధం చేసేటప్పుడు, యేసు ప్రసంగాల్లో మీరు చూసిన లక్షణాలు సమీక్షించండి. ప్రభావవంతంగా ప్రకటించడానికి ఆయన ప్రసంగాలను మాదిరిగా తీసుకోండి. తరగతిలో ఈ ప్రసంగాన్ని ఇతరులతో పంచుకోనండి. ఈ ప్రశ్నతో ప్రసంగాన్ని మూల్యాంకనం చేయండి, "నా ప్రసంగం యేసు మాదిరికి అనుగుణంగా ఉందా?"

| ప్రసంగం | లక్షణాలు |
|---|---|
| కొండమీద ప్రసంగం (మత్తయి 5-7) | |
| అపొస్తలులను పంపడం (మత్తయి 10) | |
| రాజ్య ఉపమానాలు (మత్తయి 13) | |
| రాజ్యంలో జీవితం (మత్తయి 18) | |
| ఒలీవకొండ ప్రసంగం (మత్తయి 24-25) | |

# పాఠం 6

# యేసు, దేవుని రాజ్యం

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) సువార్తల్లో దేవుని రాజ్య భావాన్ని అర్థం చేసుకుంటారు.

(2) దేవుని రాజ్యంలో వర్తమాన మరియు భవిష్యత్ కోణాలు గుర్తిస్తారు.

(3) కొండమీద ప్రసంగంలో నుండి రాజ్య జీవనానికి యేసు సూత్రాలు అనుసరిస్తారు.

(4) రాజ్యం గూర్చి యేసు ఉపమానాలు సరిగా వివరిస్తారు.

(5) శిష్యత్వానికి యేసు షరతులకు లోబడతారు.

## పరిచర్యకు సూత్రం

మన లోకంలో దేవుని రాజ్యానికి ప్రాతినిధ్యం వహించే రాయబారులుగా మనం పరిచర్య చేస్తాం.

## పరిచయం

క్రొత్త నిబంధన గ్రంథంలో దేవుని రాజ్యం ప్రధాన విషయం.[28] రాజ్యం అను పదం మత్తయిలో 54సార్లు, మార్కులో 14సార్లు, లూకాలో 39సార్లు, మరియు యోహానులో 5సార్లు కనిపిస్తుంది.[29]

---

[28] ఈ అధ్యాయంలో ఉపయోగించిన మూలాలు:

D. Matthew Allen, "*The Kingdom in Matthew*." (1999). https://bible.org/article/kingdom-matthew వద్ద అందుబాటులో ఉంది March 22, 2021.

Darrell L. Bock, *Luke: Baker Exegetical Commentary on the New Testament*. (Grand Rapids: Baker Books, 1994-1996)

J. Dwight Pentecost, *The Words and Works of Jesus Christ*. (Grand Rapids: Zondervan, 1981)

Martyn Lloyd-Jones, *Studies in the Sermon on the Mount*. (Grand Rapids: Eerdmans, 1959)

[29] మత్తయి సాధారణంగా "పరలోక రాజ్యం" అని సూచిస్తాడు, లూకా "దేవుని రాజ్యం" అని సూచిస్తాడు. మత్తయి ప్రాథమిక శ్రోతలు యూదులు; యూదులు దేవుని పేరును ఉచ్చరించరు గనుక దేవునికి సభ్యోక్తిగా "పరలోకం" అనే పదాన్ని వాడతారు. చాలావరకు మత్తయి "దేవుని రాజ్యానికి" బదులుగా "పరలోక రాజ్యం" అని ఉపయోగించాడు. ఈ పాఠంలో, మత్తయి ని ఉల్లేఖించునప్పుడు మినహా నేను "దేవుని రాజ్యం" అనే పదం వాడతాను.

యేసు ఉపమానాలు సగానికి సగం దేవుని రాజ్యం గురించి బోధిస్తాయి. ఆయన రాజ్యం గురించి ప్రకటించాడు. రాజ్య శక్తిని కనుపరచడానికి స్వస్థతలు చేశాడు, దయ్యాలను వెళ్లగొట్టాడు. ఆరోహణమైన తర్వాత, ఆది సంఘం దేవుని రాజ్య సందేశాన్ని ప్రకటించడం కొనసాగించింది (అపొస్తలుల కార్యములు 8:12, అపొస్తలుల కార్యములు 28:23).

ఈ పాఠంలో, యేసు పరిచర్యలో దేవుని రాజ్యం గురించి, అదే విధంగా నేటి పరిచర్యపై దాని ప్రభావం గురించి మనం అధ్యయనం చేస్తాం. ఈ కోర్సు ముగింపులో, దేవుని రాజ్యం గురించి నైజీరియాలో ప్రకటించిన ప్రసంగం ఉంది. ఈ ప్రసంగం, మన ప్రపంచంలో రాజ్య సందేశం ఎలాంటి ప్రభావం చూపుతుందో వివరిస్తుంది.

## దేవుని రాజ్యం

దేవుని రాజ్య అధ్యయనాన్ని పరిచయం చేసే రెండు ప్రశ్నలు.[30]

1. దేవుని రాజ్యం అంటే ఏంటి?
2. దేవుని రాజ్యం ఎప్పుడు స్థాపితమైంది?

### దేవుని రాజ్యం అంటే ఏంటి?

► అపొ. కా. 1:1-8 చదవండి.

పునరుత్థానం తర్వాత 40 రోజుల కాలంలో, యేసు దేవుని రాజ్యం గురించి బోధిస్తూ శిష్యులతో ఉన్నాడు. యేసు ఆరోహణమయ్యే ముందు, శిష్యులు, "ప్రభువా, యీ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా?" అని అడిగారు. శిష్యులు ఇలా ఆశించారు:

1. **తక్షణ రాజ్యం:** "యీ కాలమందు." యేసు తక్షణమే రాజ్యం స్థాపించాలని వారు ఆశించారు.
2. **రాజకీయ, భౌగోళిక రాజ్యం:** "రాజ్యమును మరల." యేసు రోమా ప్రభుత్వాన్ని పడగొట్టి, ఇశ్రాయేలు రాజకీయ అధికారాన్ని మరలా పునరుద్ధరిస్తాడని వారు ఆశించారు
3. **జాతీయ రాజ్యం:** "ఇశ్రాయేలునకు రాజ్యమును." పాత నిబంధన దావీదు రాజులవలే యేసు పరిపాలిస్తాడని వారు ఆశించారు.[31]

---

[30] దేవుని రాజ్యం గురించి వీడియో ఉపన్యాసం కోసం Scot McKnight, "What and Where is the Kingdom of God?" at http://www.seedbed.com/where-is-the-kingdom-of-god/ (Accessed March 22, 2021.) చూడండి.

[31] John Stott, *The Message of Acts* (Westmont, Illinois: InterVarsity Press, 1990), 41

యేసు సమాధానమిచ్చాడు, "వాటిని తెలిసికొనుట మీ పనికాదు. అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశములయందంతటను భూదిగంతముల వరకును, నాకు సాక్షులైయుందురని వారితో చెప్పెను."

దేవుని రాజ్యం ఈవిధంగా ఉంటుందని యేసు సమాధానం సూచిస్తుంది:

1. **నిత్య రాజ్యం:** "కాలములను సమయములను తండ్రి తన స్వాధీనమందుంచుకొని యున్నాడు." యేసు రాజ్యం మనుష్యుల సమయంపై ఆధారితం కాదుగాని తండ్రి కాలంపై ఆధారితం.

2. **అతీంద్రియ రాజ్యం:** "అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు." యేసు రాజ్యం పరిశుద్ధాత్మ శక్తిపై ఆధారపడుతుందే గాని రాజకీయ అధికారంపై ఆధారపడదు.

3. **సార్వత్రిక రాజ్యం:** "భూదిగంతముల వరకును." యేసు రాజ్యం సమస్త దేశాలను చేరుతుంది. అది కేవలం ఇశ్రాయేలుకు పరిమితం కాదు.

కాలాలు, సమయాలు గురించి తెలుసుకోవాల్సిన అవసరం లేదని యేసు శిష్యులతో చెప్పాడు. బదులుగా, వారు రెండు విషయాలపై దృష్టిపెట్టాలి: పరిశుద్ధాత్మ పొందాలి, భూదిగంతాల వరకు సాక్షులుగా ఉండాలి.

**దేవుని రాజ్యం ఎప్పుడు స్థాపితమైంది?**

> "రాజ్యం వచ్చింది;
> రాజ్యం వస్తుంది;
> రాజ్యం రాబోతుంది."
> - మార్టిన్ లాయిడ్-జోన్స్

వేదాంతవేత్తల మధ్య, దేవుని రాజ్యం గురించి మూడు ప్రాథమిక అభిప్రాయాలున్నాయి.

***రాజ్యం వస్తుంది***

కొందరు వేదాంతవేత్తలు, వెయ్యేండ్లకాలంలో యేసు భూమిమీద పరిపాలించే సమయంలో, అంత్యకాల రాజ్య స్థాపనను చూస్తారు. ఈ రచయితలు రాజ్య రాజకీయ మరియు ప్రాంతీయ విషయాలను ఉద్ఘాటించే మత్తయి 24-25 వంటి లేఖనాలు చూస్తారు.

***రాజ్యం వచ్చింది.***

యేసు భూలోకంలో ఉండగానే రాజ్యాన్ని స్థాపించాడని ఇతర వేదాంతవేత్తలు బోధిస్తారు. "పరలోక రాజ్యము సమీపించియున్నది" మరియు "దేవుని రాజ్యము మీయొద్దకు వచ్చియున్నది" (మత్తయి 4:17 మరియు లూకా

11:20) వంటి యేసు లేఖనాలపై వారు దృష్టిపెడతారు. రాజ్యాన్ని గూర్చిన ఈ దృక్పథం, విశ్వాసుల హృదయాల్లో దేవుని పాలన, ఆత్మీయ రాజ్యంపై దృష్టిపెడుతుంది.

***రాజ్యం వచ్చింది గాని పూర్తిగా పరిణితి చెందలేదు***

రాజ్యంలో వర్తమాన, భవిష్యత్ కోణాలు ఉన్నాయని చాలామంది వేదాంతవేత్తలు బోధిస్తారు. ఈ అభిప్రాయం ప్రకారం, దేవుని రాజ్యం యేసు భూమిపై పరిచర్య చేసిన సమయంలో ఆరంభమైంది; సంఘ పరిచర్య ద్వారా కొనసాగుతుంది; క్రీస్తు పాలించడానికి తిరిగి వచ్చినప్పుడు పూర్తిగా పరిణితి చెందుతుంది.[32] క్రీస్తు వచ్చినప్పుడు, ఆయన సమస్తమైన ఆధిపత్యాన్ని, సమస్తమైన అధికారాన్ని, బలాన్ని కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును (1 కొరింథీయులకు 15:24). ఇది దేవుని రాజ్య సంపూర్ణ స్థాపన.

► రాజ్యాన్ని గూర్చిన ఈ అభిప్రాయాల్లో మీరు దేనిని కలిగియున్నారు? పరిచర్యలో ప్రతి అభిప్రాయం యొక్క ఆచరణాత్మక ప్రభావం ఏంటి?

ఈ పాఠంలో, ఇప్పటికే ఉనికిలో ఉన్న రాజ్య విషయాలు అదే విధంగా నెరవేర్చబడలసిన రాజ్య విషయాలు చూద్దాం. రాజ్యంలో ఈ క్రింది విషయాలు భాగంగా ఉంటాయి:

- **రాజు**: ఆయన పుట్టినప్పుడు వచ్చిన జ్ఞానులు నుండి సిలువపై పైవిలాపం రాసే వరకు, యేసు రాజుగా వచ్చాడు.
- **అధికారం:** యేసు తన అద్భుత కార్యాల ద్వారా, సమాధిని జయించడం ద్వారా అధికారాన్ని కనుపరచాడు.
- **ధర్మశాస్త్రం/నియమం**: యేసు కొండమీద ప్రసంగంలో రాజ్య నియమాన్ని సంగ్రహించాడు.
- **భూభాగం:** ఆయన రాజ్యం భూదిగంతాల వరకు వ్యాపిస్తుందని, అందులో అన్ని జాతులవారు, అన్ని భాషలు మాట్లాడువారు ఉంటారని యేసు బోధించాడు.
- **ప్రజలు**: రాజు విమోచించిన వారందరూ, ఆయన పరిపాలనలోనున్న వారందరూ యేసు రాజ్య పౌరులు.

---

[32] యేసు భూలోక పరిచర్య కాలంలో రాజ్య ఆరంభాన్ని సూచించటానికి వ్యాఖ్యాతలు “రాజ్య ఆరంభం” అనే పదం ఉపయోగించారు. “రాజ్య ముగింపు” అనేది, క్రీస్తు తిరిగి వచ్చునప్పుడు రాజ్య వాగ్దానాల తుది నెరవేర్పు.

## రాజ్య వాగ్దానం

► మత్తయి 3:1-12 చదవండి.

దేవుని రాజ్యం గూర్చిన మొదటి క్రొత్త నిబంధన సూచన బాప్తిస్మమిచ్చు యోహాను ప్రకటనలో కనిపిస్తుంది. పాత నిబంధన చివరి ప్రవక్తగా, యోహాను ఇశ్రాయేలు మతాధికారుల వేషధారణను ఖండించాడు. మొదటి క్రొత్త నిబంధన దూతగా, నూతన రాజు కోసం మార్గం సరాళం చేశాడు. "పరలోకరాజ్యము సమీపించియున్నది, మారుమనస్సు పొందుడి" (మత్తయి 3:2). "సమీపించియున్నది" అను మాట రాజ్యం వేగంగా సమీపిస్తుందనే ఆలోచన ఇస్తుంది. అది ఇంకా రాలేదు, కాని చాలా దగ్గరగా ఉంది. నూతన రాజ్యాన్ని తీసుకొచ్చే మెస్సీయ రాక కోసం ఇశ్రాయేలును సిద్ధపరచడానికి యోహాను ప్రకటించాడు.

యోహాన్ని బంధించిన తర్వాత, యేసు బహిరంగ పరిచర్య మొదలుపెట్టాడు. దేవుని రాజ్య సువార్త ప్రకటిస్తూ గలిలయ ప్రాంతాలు పర్యటించాడు (మత్తయి 4:23). బాప్తిస్మమిచ్చు యోహానువలే, యేసు, "పరలోక రాజ్యము సమీపించియున్నది గనుక మారుమనస్సు పొందుడని" (మత్తయి 4:17) ప్రకటించాడు.

► మత్తయి 10:5-42 చదవండి.

ఇశ్రాయేలు వంశంలో నశించిన గొర్రెల యొద్దకు వెళ్లి రాజ్య సువార్త ప్రకటించమని యేసు పన్నెండుమంది శిష్యులను పంపాడు. బాప్తిస్మమిచ్చు యోహాను, యేసువలే, వారు "పరలోకరాజ్యము సమీపించియున్నదని" (మత్తయి 10:5-7) ప్రకటించారు.

శిష్యుల పరిచర్య వాళ్ల యజమాని పరిచర్యకు అనుగుణంగా రూపించబడింది. యేసువలే, వారు రాజ్యం గురించి ప్రకటిస్తూ, ప్రజల భౌతిక అవసరాలు తీర్చాలి. యేసువలే, వారు రోగులను స్వస్థపరచారు, దేవుని రాజ్యం సాతాను రాజ్యంలోకి విరుచుకుపడిందనుటకు సూచనగా దయ్యాలను వెళ్లగొట్టారు. యేసు, రోగులను స్వస్థపరచుటకు, మృతులను లేపుటకు, కుష్ఠురోగులను శుద్ధులుగా చేయుటకు, దయ్యాలను వెళ్లగొట్టుటకు తన ప్రతినిధులను పంపాడు. (మత్తయి 10:8).

## రాజ్య ఆరంభం

► మత్తయి 12:22-32 చదవండి.

రాజ్య వాగ్దానం క్రొత్త కాదు. పాత నిబంధన ప్రవక్తలు భవిష్యత్ రాజ్యాన్ని వాగ్దానం చేశారు. అయితే, రాజ్యం కేవలం భవిష్యత్ నిరీక్షణ కాదుగాని తక్షణ వాస్తవికత అని యేసు చెప్పాడు. యేసు రాజ్య ఆరంభాన్ని ప్రకటించాడు. యేసు ఉన్నప్పుడెల్లా దేవుని రాజ్యం ఉంది.

అపవిత్రాత్మలపై ఆయన అధికారంతో, సాతాను రాజ్యాన్ని పారద్రోలిన రాజు అధికారాన్ని యేసు చూపించాడు. ఆయన అపవిత్రాత్మ పట్టిన వ్యక్తిని స్వస్థపరచిన తర్వాత, యేసు దయ్యాలకు అధిపతియైన బయెల్జెబూలువలననే దయ్యాలను వెళ్లగొట్టుచున్నాడు గాని మరియొకనివలన కాదని పరిసయ్యులు చెప్పారు. అందుకు యేసు, తాను దేవుని శక్తివలన దయ్యాలను వెళ్లగొట్టుచున్నానని చెప్పాడు: "దేవుని ఆత్మవలన నేను దయ్యములను వెళ్లగొట్టుచున్నయెడల నిశ్చయముగా దేవుని రాజ్యము మీ యొద్దకు వచ్చియున్నది" (మత్తయి 12:28). యేసు సాతాను రాజ్యాన్ని ఓడించాడు.

► మత్తయి 11:1-24 చదవండి.

యేసు అద్భుత కార్యాలు ఆయన రాజ్య ఆరంభానికి సంకేతాలు. యోహాను సువార్త యేసు అద్భుతాలకు *సూచకక్రియలు* అనే పదం ఉపయోగిస్తుంది. అద్భుతాలు యేసు దైవత్వానికి సూచనలు, నూతన రాజ్యానికి రుజువులు.

"దేవుని రాజ్యము మీ యొద్దకు వచ్చియున్నది" అని బాప్తిస్మమిచ్చు యోహాను ప్రకటించాడు. ఇశ్రాయేలుకు విమోచన కలిగించే రాజకీయ సంబంధమైన రాజ్యాన్ని అతడు ఆశించాడు. బదులుగా, యోహానును చెరసాలలో వేశారు! అతను తన శిష్యుల్ని పంపించి ఇలా అడుగమని చెప్పాడు: "క్రీస్తు చేయుచున్న కార్యములనుగూర్చి యోహాను చెరసాలలో విని రాబోవు వాడవు నీవేనా, మేము మరి యొకనికొరకు కనిపెట్టవలెనా?" (మత్తయి 11:3) భూసంబంధమైన రాజ్యాన్ని స్థాపించే రాజకీయ సంబంధమైన మెస్సీయను గూర్చిన యోహాను అంచనాలకు యేసు పరిచర్య సరిపోలలేదు.

యేసు, మెస్సీయగా తాను చేసిన క్రియలు ఉద్ఘాటిస్తూ ప్రతిస్పందించాడు.

> మీరు వెళ్లి, విన్నవాటిని కన్నవాటిని యోహానుకు తెలుపుడి. గ్రుడ్డివారు చూపుపొందుచున్నారు, కుంటివారు నడుచుచున్నారు, కుష్ఠరోగులు శుద్ధులగుచున్నారు, చెవిటి వారు వినుచున్నారు, చనిపోయినవారు లేపబడుచున్నారు, బీదలకు సువార్త ప్రకటింపబడుచున్నది. మరియు నా విషయమై అభ్యంతరపడనివాడు ధన్యుడు (మత్తయి 11:4-6).

మెస్సీయ గురించి ప్రవచించిన సూచనలు నెరవేరుచున్నవని యేసు యోహానుకు జ్ఞాపకం చేశాడు. యేసు యోహానుకున్న బలాన్ని, ధైర్యాన్ని మెచ్చుకున్నప్పటికీ, పరలోకంలో అల్పులు యోహాను కంటే గొప్పవారని ప్రకటించాడు. ఎందుకు? యేసు రాజ్యాధికృతలన్నిటితో క్రొత్త నిబంధన స్థాపించడానికి వచ్చాడు. గొప్ప పాత నిబంధన పరిశుద్ధుడు ఎన్నడు చూడని ఆధిక్యతలు, కొత్త నిబంధనలోని అల్ప విశ్వాసికి ఉన్నాయి. క్రొత్త నిబంధన విశ్వాసులు పాత నిబంధనల నెరవేర్పును చూశారు. వాగ్దానం చేయబడిన రాజ్యం ఆరంభమైంది.

## రాజ్యంలో జీవితం: కొండమీద ప్రసంగం

సువార్తల్లో కొండమీది ప్రసంగమే, సుదీర్ఘమైన ప్రసంగం. ఈ ప్రసంగంలో దేవుని రాజ్యమే సమగ్రమైన ఇతివృత్తం. దీనిని అనేక విధానాల్లో చూడొచ్చు:

- ధన్యతల్లో మొదటి మాట, పరలోక రాజ్యము, ఆత్మవిషయమై దీనులైనవారు (మత్తయి 5:3) కలిగియున్నారు అని బోధిస్తుంది. చివరి ధన్యత పరలోక రాజ్యము నీతినిమిత్తము హింసింపబడువారు (మత్తయి 5:10) కలిగియున్నారు అని బోధిస్తుంది. ధన్యతల్లో ప్రధాన విషయం పరలోక రాజ్యమని చూపిస్తూ, మిగిలిన ధన్యతల చుట్టూ ఈ రెండు ధన్యతలు ఒక కప్పు/ఆవరణం లాగా పనిచేస్తాయి.

- ధర్మశాస్త్రాన్ని పునఃవ్యాఖ్యానించే అధికారం తనకుందని యేసు ప్రకటించాడు (మత్తయి 5:21-48). ఇది, తన రాజ్య నియమాలు వివరించడానికి, అన్వయించడానికి అధికారంగల రాజు యొక్క చర్య.

- యేసు తన శిష్యులకు ప్రార్థించడం నేర్పించాడు, "నీ రాజ్యము వచ్చుగాక, నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక" (మత్తయి 6:9-13). భూలోకంలో దేవుని రాజ్య పురోగతి కోసం ప్రార్థించడానికి మనం పిలువబడ్డాం. దేవుని ప్రజలు కొండమీద ప్రసంగం ప్రకారం జీవిస్తే, రాజ్యం, దేశంలోని నూతన పౌరులకు విస్తరిస్తుంది.

- ప్రసంగ ముగింపులో, పరలోక రాజ్యంలో ప్రవేశించాలంటే అద్భుత కార్యాలు సరిపోవని యేసు బోధించాడు. తండ్రి చిత్త ప్రకారం చేసేవారే రాజ్యంలో ప్రవేశిస్తారు (మత్తయి 7:21).

### కొండమీద ప్రసంగం చదవడానికి సూత్రాలు

కొండమీద ప్రసంగం చదివేటప్పుడు మూడు సూత్రాలు గుర్తించుకోవాలి.

**(1) కొండమీద ప్రసంగంలో ఆజ్ఞలకి విధేయత చూపడం పరలోక రాజ్యంలో పౌరత్వాన్ని "సంపాదించదు."**

"ఈ విధంగా జీవిస్తే, క్రైస్తవుడౌతావు" అని ఆలోచించకూడదు. బదులుగా, రాజ్య పౌరునిగా మన జీవితాలను మార్గనిర్దేశం చేసేదిగా మనం ఈ ప్రసంగం చదవాలి: "నీవు క్రైస్తవుడవు గనుక ఈ విధంగా జీవించు." మనం కృపచేతనే రక్షించబడ్డాం; కాబట్టి దేవుని రాజ్య పౌరులుగా, మనమాయన ఆజ్ఞలకు విధేయత చూపుతాం.

**(2) కొండమీద ప్రసంగం శిష్యులకే గాని, అవిశ్వాసులకు కాదు.**

ఇది లౌకిక ప్రపంచానికి రాజ్యాంగం కాదు. అవిశ్వాసులు ఈ సూత్రాల ప్రకారంగా జీవించనప్పుడు ఆశ్చర్యపడొద్దు! ఇది దేవుని రాజ్యంలో జీవితం గురించిన వివరణేగాని మానవ రాజ్యాల్లో జీవితం గురించిన వివరణ కాదు.

**(3) కొండమీద ప్రసంగం ప్రతి విశ్వాసికి.**

ఈ సూత్రాలు సాధారణ విశ్వాసులకు వర్తించవని వాదిస్తూ, ఈ ప్రసంగంలోని విషయాలు అనేకమంది విస్మరిస్తారు. "ఈ నియమం భవిష్యత్ వెయ్యేండ్ల రాజ్యానికి సంబంధించిందని" కొందరంటారు. మరి కొందరు, "ఇది కొంతమంది పరిశుద్ధులకే. చాలామంది క్రైస్తవులు ఈ ఆజ్ఞలు పాటించలేరని" చెబుతారు. ఇంకొందరు, "మనం ఎన్నటికీ దేవుని ఆజ్ఞలు పాటించలేం. మనం దేవుని ఆజ్ఞలు పాటించలేమని గ్రహించినప్పుడు, కేవలం కృప మీద ఆధారపడతామని" చెబుతారు.

ఏదేమైనా, ఆది సంఘం ప్రతి విశ్వాసికి మార్గదర్శినిగా ఈ ప్రసంగాన్ని చూస్తుంది. యాకోబు మరియు 1 పేతురు పత్రికలు ఈ ప్రసంగంలోని అనేక విషయాలను పునరావృతం చేస్తాయి. దేవుని పరిశుద్ధమైన ప్రామాణికతను బలహీనపరచడానికి యేసు నిరాకరించాడు. పరిసయ్యుల కంటే తక్కువ ప్రమాణికతకు బదులుగా, యేసు తన అనుచరులను ఉన్నత ప్రామాణికత కొరకు పిలిచాడు: "శాస్త్రుల నీతికంటెను పరిసయ్యుల నీతికంటెను మీ నీతి అధికము కానియెడల మీరు పరలోకరాజ్యములో ప్రవేశింపనేరరని మీతో చెప్పుచున్నాను" (మత్తయి 5:20).

**దేవుని రాజ్యంలో జీవితం**

► మత్తయి 5-7 చదవండి.

యేసు ఈ భూమిపై తన పరిచర్య కాలంలో రాజ్యాన్ని ఆరంభిన యెడల, ప్రస్తుతం మనం దేవుని రాజ్యంలో జీవిస్తున్నాం. కొండమీద ప్రసంగం పరలోక రాజ్య పౌరుని పాత్ర గురించి వివరిస్తుంది. ప్రసంగంలోని విషయాల సంక్షిప్త వివరణ ఇక్కడుంది.

**(1) దేవుని రాజ్య విలువలు, లోక విలువలకు విరుద్ధం.**

బీదలు, దుఃఖపడువారు, హక్కులు కోల్పోయినవారు, హింసించబడినవారు ధన్యులని ఏ భూలోక పాలకుడు చెప్పడు. యేసు కాలంలోని రోమా సామ్రాజ్య విలువలకు లేక మన ప్రస్తుత లోక విలువలకు పూర్తి విరుద్ధంగా ధన్యతలు ఉన్నాయి. దేవుని రాజ్యం మానవ రాజ్యానికి భిన్నం.

**(2) దేవుని రాజ్య పౌరులు తమ ప్రపంచాన్ని ప్రభావితం చేయాలి.**

యేసు కాలంలో ఎస్సేనులు, నీతిమంతులు సమాజం నుండి వైదొలగి, దూరంగా ఏకాంత ప్రదేశంలో దేవుని రాజ్యం స్థాపించాలని చెప్పారు. యేసు, "కాదు! మీరు మీ లోకాన్ని భద్రపరచే ఉప్పుగాను, పరలోకమందున్న మీ తండ్రికి మహిమతెచ్చు వెలుగుగాను ఉండాలని" చెప్పాడు. దేవుని రాజ్యం ప్రధానంగా ఆత్మ సంబంధమైనప్పటికీ, రాజ్యంలోని పౌరుల ద్వారా మన లోకం రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా ప్రయోజనం పొందాలి.

లౌకిక ప్రపంచంలో ఉప్పుగా, వెలుగుగానున్న క్రైస్తవుల ఉదాహరణలు చాలా ఉన్నాయి. విలియం విల్బర్ ఫోర్స్ బ్రిటీష్ సామ్రాజ్యంలో బానిసల వ్యాపారం రద్దు చేయడానికి నాయకత్వం వహించాడు; మెథడిస్ట్ పునరుద్ధరణ ఆంగ్ల సమాజంలోని అన్ని స్థాయిల్లో సామాజిక సంస్కరణ తీసుకొచ్చింది; విలియం కేరి భారతదేశంలో చట్టబద్ధంగా చిన్న పిల్లలను చంపడం, అదే విధంగా సతికి (విధవలను-దహించడం) వ్యతిరేకంగా పోరాడాడు; క్రైస్తవులు అక్షరాస్యత పెంచారు, ఆసుపత్రులు, అనాథ ఆశ్రయాలు స్థాపించారు, అనేక దేశాల్లో బీదలకు, అవసరతలో ఉన్నవారికి సహాయం చేశారు.

> "హృదయశుద్ధిగలవారు దేవుని చూడటమే కాదుగాని సమాజం ఆయనను చూసే పత్రికలుగా అవుతారు."
> \- లియోన్ హైన్సన్

**(3) దేవుని రాజ్య పౌరులు తండ్రి ప్రేమను కనుపరచడానికి ధర్మశాస్త్రం ఆశించే కనీస విషయాలను దాటివెళ్ళారు.**

యేసు ధర్మశాస్త్రాన్ని భర్తీ చేయడానికి రాలేదుగాని నెరవేర్చడానికి వచ్చాడు. "నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదు" (మత్తయి 5:17). ఒకదానిని నెరవేర్చాలంటే దాన్ని ముగింపుకు తేవాలి. యేసు ధర్మశాస్త్రాన్ని కొట్టివేయడానికి రాలేదుగాని ధర్మశాస్త్రం వెనుకున్న ఆత్మను వెల్లడిపరచడానికి వచ్చాడు. యేసు క్రమంగా చెప్పిన ఆరు ఉదాహరణలలో, రాజ్య పౌరుల నీతి, శాస్త్రులు, పరిసయ్యుల నీతికంటే మించినదిగా ఉండాలని యేసు చెప్పాడు.

| ధర్మశాస్త్రం | రాజ్య పౌరులు |
|---|---|
| ధర్మశాస్త్రం హత్యను నిషేధిస్తుంది. | రాజ్య పౌరులు మూల ప్రేరణయైన కోపంపై దృష్టి పెడతారు. |
| ధర్మశాస్త్రం వ్యభిచారాన్ని నిషేధిస్తుంది. | రాజ్య పౌరులు, ఒక స్త్రీని మోహపు చూపుతో చూడరు. |
| ధర్మశాస్త్రం "పరిత్యాగ పత్రిక" కోరుతుంది. | రాజ్య పౌరులు వైవాహిక జీవితంలో నిలిచియుండడానికి చూస్తారు కాని వదిలించుకోవడానికి సాకులు వెదకరు. |
| ధర్మశాస్త్రం తప్పుడు ప్రమాణాలనునిషేధిస్తుంది. | రాజ్య పౌరుడు చెప్పే "అవును" లేక "కాదు" అనే మాట సరిపోతుంది. |
| ధర్మశాస్త్రం ప్రతీకారాన్ని కోరుతుంది ("కంటికి కన్ను"). | రాజ్య పౌరులు ప్రతీకార భావంతో కాక ప్రేమతో వ్యవహరిస్తారు. |
| ధర్మశాస్త్రం మీ పొరుగువారిని ప్రేమించమని సెలవిస్తుంది. | రాజ్య పౌరులు తమ శత్రువులను ప్రేమిస్తారు.[33] వారు తమ పరలోక తండ్రి ప్రేమ, దయను ప్రతిబింబిస్తారు (లూకా 6:36). |

**(4) రాజ్య పౌరులు ఇతరులను మెప్పించక దేవుని మెప్పించడానికి శ్రద్ధ చూపుతారు.**

ప్రజలు తమ దాతృత్వం చూడాలని పరిసయ్యులు ఆశిస్తారు; దేవుని రాజ్య పౌరులు రహస్యంగా ఇస్తారు. ఆకట్టుకునే తమ ప్రార్థనలు ప్రజలు వినాలని వేషధారులు ఆశిస్తారు; దేవుని రాజ్య పౌరులు సరళంగా, నిజంగా ప్రార్థిస్తారు. తమ సుదీర్ఘ ఉపవాసాలు చూసి ప్రజలు తమను గౌరవించాలని పరిసయ్యులు ఆశిస్తారు; దేవునిరాజ్య పౌరులు తండ్రి బహుమానం కొరకే ప్రార్థిస్తారు.

**(5) దేవుని రాజ్య పౌరులు తమ సంపదను నమ్ముకోరు, తమ అవసరాలు గురించి చింతపడరు.**

బదులుగా, వారు పరలోక తండ్రి సహాయం కోసం కనిపెడతారు.

[33] "నీ శత్రువును ద్వేషించు"మని పాత నిబంధన ఆజ్ఞాపించదు. ఇది పాత నిబంధన సాధారణ అపార్థం.

**(6) దేవుని రాజ్య పౌరులు ఇతరులకు తీర్పుతీర్చరు.**

అయితే, అబద్ధ బోధకుల చెడ్డ ఫలితాలు గ్రహించే విషయంలో జాగ్రత్తగ ఉంటారు.

**(7) దేవుని రాజ్య పౌరులు తమ ప్రార్థనలలో నమ్మకంగా ఉంటారు.**

దేవుని రాజ్య పౌరులు తమ ప్రార్థనల్లో నమ్మకంగా ఉంటారు ఎందుకంటే పరలోకమందున్న తమ తండ్రి ఆయనను అడుగువారికి నిశ్చయంగా మంచి యీవులు ఇస్తాడని వారికి తెలుసు! (మత్తయి 7:11)

**(8) దేవుని రాజ్య పౌరులకు కేవలం రెండు మార్గాలే ఉన్నాయని తెలుసు.**

విశాల మార్గం, ఇరుకు మార్గం. మంచి వృక్షం, చెడ్డ వృక్షం. బుద్ధిమంతుడు, బుద్ధిహీనుడు. దేవుని రాజ్య పౌరులు వివేచన కలిగినవారు.

**రాజ్య సూత్రాల ప్రకారం జీవించటం**

> "కొండమీద చేసిన ప్రసంగాన్ని స్వార్థపరులకు, నిజమైన నీతిని తిరస్కరించువారికి వ్యతిరేకంగా చేశారు. నిజానికి, ప్రసంగం, క్షమించాలని, ఇవ్వాలని, కృతజ్ఞులుగా ఉండాలని కనికరంతో ప్రేమగా మెలగాలని పిలుపునిస్తుంది."
> - డారెల్ బాక్

మనం కొండమీద ప్రసంగ సూత్రాలు ఆధారంగా ఎలా జీవిస్తాం? మూలం, మత్తయి 5:48. రాజ్య పౌరులు మన పరలోక తండ్రివలే ఉండుటకు పిలువబడ్డారు. యేసు బోధన చాలా సరళం, చాలా కష్టం. యేసు కృప మాత్రమే ఆయన బోధన ప్రకారం జీవించే శక్తినిస్తుంది. మన సొంత శక్తితో, ప్రసంగ నియమాలకు అనుగుణంగా మనం జీవించలేం. రాజ్య జీవితాన్ని సాధ్యపరచేది కేవలం ఆత్మ.

మనం కొండమీద ప్రసంగం బోధించునప్పుడు, ఈ సూత్రాన్ని అర్థం చేసుకోవాలి. ప్రసంగాన్ని కేవలం ధర్మశాస్త్రంగా బోధిస్తే, ప్రజలు నిరుత్సాహంలో, నిరాశలో ఉంటారు. ప్రసంగాన్ని కృప చేత అనుగ్రహించబడి, కుమారుని బలి ద్వారా కొనుగోలు చేయబడి, పరిశుద్ధాత్మ శక్తితో బలపరచబడిన దేవుని రాజ్య జీవితానికి మాదిరిగా ప్రకటించినప్పుడే, కొండమీద ప్రసంగం నిజంగా సువార్తలా, "శుభవార్త"గా ఉంటుంది.

► కొండమీద ప్రసంగం చదివి, ఈ సారాంశాన్ని సమీక్షించిన తర్వాత, వీటిని చర్చించండి:

- మీ సమాజంలో క్రైస్తవులకు ప్రసంగంలోని ఏ బోధలు కష్టంగా ఉన్నాయి?
- ఒక క్రైస్తవ నాయకుడిగా మీకు ప్రసంగంలోని ఏ బోధలు కష్టంగా ఉన్నాయి?

## రాజ్య మర్మం: రాజ్య ఉపమానాలు

ప్రతిపాదిత ప్రకటనలు గుర్తుపెట్టుకోవడం కంటే కథలు గుర్తుంచుకోవడం సులభమని యూదా బోధకులకు తెలుసు. ఈ కారణంగా, యూదా బోధకులకు ఉపమానాలే సుప్రసిద్ధ బోధనా పద్ధతి. దేవుని రాజ్యం గురించి లోతైన సత్యాలు తెలియజేయడానికి యేసు ఉపమానాలు ఉపయోగించాడు.

ఆయన పరిచర్య ఆరంభంలో, ఉపమానాల వాడకంవల్ల, యేసు తన శత్రువులతో సంఘర్షణ నివారిస్తూ, శిష్యులకు బోధించాడు. తరువాత, యెరూషలేములో మతాధికారులతో ముఖాముఖిగా మాట్లాడాడు. కాని ఈ ఆరంభ సంవత్సరాల్లో, శిష్యుల బోధనపై దృష్టిపెట్టాడు.

అనేకులు ఉపమానాలు విన్నారు కాని అర్థం చేసుకోలేదు. వారు విన్నారు కాని అర్థం చేసుకోలేదు; వారు చూశారు కానీ గ్రహించలేదు (మత్తయి 13:14). ఎందుకు? ఎందుకంటే వారు కఠిన హృదయులు. యెషయా ప్రవచించాడు:

> ఈ ప్రజలు కన్నులార చూచి, చెవులారా విని, హృదయముతో గ్రహించి మనస్సు త్రిప్పుకొని నావలన స్వస్థత పొందకుండునట్లు వారి హృదయము క్రొవ్వినది, వారి చెవులు వినుటకు మందములైనవి, వారు తమ కన్నులు మూసికొనియున్నారు గనుక మీరు వినుటమట్టుకు విందురుగాని గ్రహింపనే గ్రహంపరు, చూచుటమట్టుకు చూతురు గాని యెంత మాత్రమును తెలిసికొనరు (మత్తయి 13:14-15, యెషయా 6:9 ఉల్లేఖనం).

వినగలిగే మనసున్న వారికి యేసు ఉపమానాల ద్వారా బోధించగలిగాడు.

దేవుని రాజ్య మర్మాలను గురించి మత్తయి 13లోని ఉపమానాల క్రమం అందిస్తుంది (మత్తయి 13:11). ఈ ఉపమానాలు యేసు అనుచరులకు దేవుని రాజ్య స్వభావం గురించి బయలుపరచుచునే, అవిశ్వాసులైన నాయకులకు మరుగు చేస్తుంది.

► ముందుకు కొనసాగడానికి ముందు, ఆగి మత్తయి 13:1-52 మరియు లూకా 19:11-27చదవండి. మీరు ప్రతి ఉపమానం చదివినప్పుడు, తర్వాత పేజిలోనున్న పట్టికలో ఒకటి రెండు వాక్యాల్లో ప్రధాన విషయాన్ని కుదించి రాయండి. ప్రతి ఉపమానంలో, నేటి పరిచర్యకు ఒక అన్వయం కనుగొనండి. ఒక ఉదాహరణగా మొదటి ఉపమానం మీ కోసం సంపూర్తి చేశాం.

| రాజ్య ఉపమానాలు | | |
|---|---|---|
| **ఉపమానం** | **ప్రధాన విషయం** | **నేటి పరిచర్యకు పాఠం** |
| **వ్యవసాయకుడు** | విత్తనాల విషయంలో శ్రోతల ప్రతిస్పందన దాని ఫలాన్ని నిర్ణయిస్తుంది. | నేను ప్రకటించి, బోధించేటప్పుడు, ఫలితాలతో నేను దేవుని నమ్మాలి. కోతకు నేను బాధ్యత వహించను; విత్తనాన్ని నమ్మకంగా విత్తే బాధ్యత నాది. |
| **గురుగులు** | | |
| **ఆవగింజ** | | |
| **పుల్లని పిండి** | | |
| **దాచబడిన ధనం** | | |
| **గొప్ప విలువైన ముత్యం** | | |
| **వల** | | |
| **ఇంటి యజమానుడు** | | |
| **పది మినాలు** | | |

**వ్యవసాయదారుని ఉపమానం (మత్తయి 13:3-9, 18-23; లూకా 8:5-18)**

దేవుని రాజ్య ఉపమానాల క్రమంలో మొదటి ఉపమానం, విత్తనం విషయంలో మన ప్రతిస్పందన విత్తన ఫలితాన్ని నిర్ణయిస్తుందని బోధిస్తుంది. పరలోక రాజ్యంలో, కొందరు నమ్మి ఫలిస్తారు, కొందరు నమ్మకుండా మొదటి ప్రతిస్పందన తర్వాత పతనమైపోతారు.

ఈ ఉపమానాన్ని నేలలను గురించిన ఉపమానం అని పిలవచ్చు ఎందుకంటే ఇది వివిధ నేలల గురించి మాట్లాడుతుంది గాని వ్యవసాయదారుని గురించి మాట్లాడదు. ప్రతి ఉదాహరణలో, విత్తనం మారలేదు, రైతు మారలేదు; మారిందల్లా నేల. మనం దేవుని రాజ్య సువార్త ప్రకటిస్తుండగా, కొందరు మిగిలిన వారిలా సరిగా స్పందించనప్పుడు ఆశ్చర్యపడకూడదు. మనం నిరుత్సాహపడకూడదు. కొందరు ఫలించే నేలగా ఉంటారు కాని మరికొందరు వాక్యానికి కఠినంగా ఉంటారని యేసు బోధించాడు.

వ్యవసాయదారుని ఉపమానానికి లూకా ఇచ్చే ముగింపు, ఇది సత్యాన్ని వినటం గూర్చిన ఉపమానమని చూపిస్తుంది. “కలిగినవానికి ఇయ్యబడును, లేనివానియొద్దనుండి తనకు కలదని అనుకొనునది కూడ తీసివేయబడును గనుక మీరేలాగు వినుచున్నారో చూచుకొనుడని చెప్పెను” (లూకా 8:18). ఒక వ్యక్తి సత్యానికి అనుకూలంగా ప్రతిస్పందించినప్పుడు, వారు మరింత సత్యాన్ని స్వీకరిస్తారు. ప్రసంగంలో మరిన్ని ఉపమానాలు చెప్పే ముందు, ఫలించే నేలగా తన శ్రోతలు ఎలా వినాలో యేసు బోధించాడు.

**గురుగుల ఉపమానం (మత్తయి 13:24-30, 36-43)**

దేవుని రాజ్యం దుష్టులపై తక్షణ తీర్పు తెస్తుందని యూదులు ఆశించారు. విశ్వాసులు, అవిశ్వాసులు కలిసి జీవించే లోకం కొరకు యేసు తన శిష్యులను సిద్ధపరచాడు. ఈ కథలో, పొలమే లోకం (మత్తయి 13:38). యుగాంతంలోనే దేవదూతలు గురుగులను సేకరించి అగ్నితో కాల్చేస్తారు (మత్తయి 13:40). దేవుని రాజ్యం దేవుని సమయంలో **ఎదుగుతుంది కాని మానవుని సమయంలో కాదు.**

**ఆవగింజ ఉపమానం (మత్తయి 13:31-32)**

యేసు ఈ లోకంలో చేసిన పరిచర్యను చూసిన ఏ ఒక్కరూ, సంఘం లోకమంతటా వ్యాపిస్తుందని ఊహించలేదు. శిష్యులు పామరులు, బీదలు, భయస్తులు. వారికి జనాకర్షణ, సాంఘిక స్థితి లేక రాజకీయ అధికారం లేదు. వాళ్లు చిన్న ఆవగింజవంటివారు. ఒక చిన్న ఆవగింజ, మొక్కలన్నిటిలోకెల్లా పెద్దగా పెరిగినట్లే లేక పొదగా మారినట్లే, దేవుని రాజ్యం లోకమంతటా వ్యాపిస్తుంది.

యేసు దేవుని రాజ్యాన్ని ఆవగింజతో పోల్చినప్పుడు ఆయన శ్రోతలు విని, ఆశ్చర్యపోయి ఉంటారు. దేవుని రాజ్యం మహిమతోను శక్తితోను వస్తుందని యూదుల రబ్బీలు ఆశించారు. పాపులపై తీర్పు వస్తుందని ఆశించారు; రోమా ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తుందని ఆశించారు; నూతన యూదా రాజ్య స్థాపన సాంఘిక విప్లవం సృష్టిస్తుందని ఆశించారు. బదులుగా, యేసు తన శిష్యులను ఆకట్టుకోని రాజ్యం కొరకు సిద్ధపరచాడు.

మనం క్రొత్త నిబంధన చదివినప్పుడు, మొదటి శతాబ్దంలో యూదయకు అంతగా ప్రాముఖ్యత లేకపోవడాన్ని మర్చిపోవచ్చు. యూదయ క్రొత్త నిబంధనకు కేంద్రం, కాని అది మొదటి శతాబ్దపు ప్రపంచ కేంద్రానికి చాల దూరంగా ఉంది. మీ దేశంలో రాజధాని గురించి ఆలోచించండి. మొదటి శతాబ్దంలో యూదయ పాత్ర అలా ఉండేది కాదు; ఆ పాత్రను రోమా సామ్రాజ్యం పోషించింది. గొప్ప విశ్వవిద్యాలయం, విద్యాసంస్థలున్న పట్టణం గురించి ఆలోచించండి. మొదటి శతాబ్దంలో యూదయ పాత్ర అలా ఉండేది కాదు; ఆ పాత్ర ఏథెన్సు లేక అలెగ్జాండ్రియ పోషించింది.

ప్రపంచంలోని ఇతర దేశాలకు సంబంధించి, యూదయకు రాజకీయ ప్రాముఖ్యత లేదు; ఆర్థిక ప్రాముఖ్యత లేదు; సాంఘికంగా ప్రాముఖ్యత లేదు. మీ దేశంలో ప్రాముఖ్యత లేని ఒక ప్రాంతం గురించి ఆలోచించండి; రోమా సామ్రాజ్యంలో యూదయ స్థానమదే.

ఆవగింజ ఉపమానం, దేవుని రాజ్యం రోమా సామ్రాజ్యంలోని ఒక మూలలో చిన్న గుంపుతో ఆరంభమై అన్ని రాజ్యాల్లో విస్తరించిన గొప్ప వృక్షంగా అభివృద్ధి చెందిందని చూపిస్తుంది.[34] దేవుని రాజ్యం కేవలం యూదులకు మాత్రమే పరిమితమని యూదా రబ్బీలు బోధించారు; దేవుని రాజ్యం భూదిగంతాలవరకు వ్యాపిస్తుందని యేసు బోధించాడు.

**పులిసిన పిండి ఉపమానం (మత్తయి 13:33)**

పులిసిన పిండి ఉపమానం కూడా దేవుని రాజ్యపు స్వాభావిక ఎదుగులను గురించి వివరిస్తుంది. దేవుని రాజ్య వ్యాప్తికి చిహ్నంగా యేసు పులిసిన పిండిని ఉపయోగించాడు. మూడు కుంచాల పిండి 100మందికి చాలిన రొట్టెలు అందిస్తుంది. ఆరంభం ప్రాముఖ్యంగా లేనప్పటికీ, దేవుని రాజ్యం గొప్ప శక్తితో ఎదుగుతుంది.

పులిసిన పిండి ఉపమానం రాజ్యం యొక్క స్థిరమైన ఎదుగుదలను చూపిస్తుంది. పులవడం అనేది నాటకీయం కాదు; అది డైనమైట్ వలే పేలదు; అది నెమ్మదిగా రొట్టె వలె పనిచేస్తుంది. దేవుని రాజ్యం ప్రపంచవ్యాప్తంగా

[34] దానియేలు 4:12 మరియు యెహెజ్కేలు 31:6 లో, ఆకాశపక్షులు గూళ్ళుకట్టుకోవడం, రాజ్యం అనేక దేశాలకు వ్యాపించిందని సూచిస్తుంది.

పరిచయమౌతుందని యూదుల రబ్బీలు ఆశించారు; రాజ్యం ప్రపంచవ్యాప్తంగా చేరుకునే వరకు నెమ్మదిగా, క్రమంగా పెరుగుతుందని యేసు బోధించాడు.

**దాచబడిన ధనం, గొప్ప విలువైన ముత్యం ఉపమానాలు** (మత్తయి 13:44-46)

ఈ రెండు ఉపమానాలు రాజ్య ఆనందానికి సంబంధించినవి. రెండింటిలో, ఒక వ్యక్తి విలువైనదానిని కనుగొని, అతనికి ఉన్నదంతా అమ్మేసి దానిని కొనుగోలు చేశాడు. ఉపమాన దృష్టి, మానవుడు చేసిన త్యాగంపై కాదుగాని విలువైనదాని కనుగొనుటపై ఉంది. అతడు ఆనందంలో తనకు కలిగినదంతా అమ్మేశాడు! నిజమైన శిష్యులు క్రీస్తును అనుసరించునట్లు సమస్తాన్ని విడిచిపెట్టడానికి ఆనందిస్తారు.

ఈ ఉపమానాలు దేవుని రాజ్యపు అత్యున్నత విలువను చూపిస్తాయి. మరోచోట, యేసు "నీ కన్ను నిన్ను అభ్యంతరపరచినయెడల దాని తీసిపార వేయుము; రెండు కన్నులుకలిగి నరకములో పడవేయబడుటకంటె ఒంటికన్ను గలవాడవై దేవుని రాజ్యములో ప్రవేశించుట మేలు" (మార్కు 9:47) అని చెప్పాడు. దేవుని రాజ్య ప్రవేశం భూసంబంధమైన ఏ త్యాగానికంటే కూడా విలువైనది.

**వల ఉపమానం (మత్తయి 13:47-50)**

గలిలయ సముద్రంలో చేపలు పట్టే దోనెలు, తినదగిన తినలేని చేపలు రెంటినీ వలలో పట్టి లాగుతాయి. సముద్ర తీరానికి వచ్చిన తర్వాత, జాలర్లు మంచి చేపలను, చెడు చేపలను వేరుచేస్తారు.

గురుగుల ఉపమానంవలే, ఈ ఉపమానం తీర్పు యుగాంతంలో వస్తుందని శిష్యులకు జ్ఞాపకం చేస్తుంది. తక్షణ తీర్పు ఆశించక, దేవుడు తన కాలంలో నీతిమంతులకు దుష్టులకు తీర్పుతీర్చుతాడని ఎరిగి దేవుని రాజ్యాన్ని ప్రకటించాలి. మంచివారిని చెడ్డవారిని వేరు చేసే తుది తీర్పు ఉంటుంది కాని ఆ సమయాన్ని దేవుని చేతికి విడిచిపెట్టాలి.

**ఇంటి యజమాని ఉపమానం (మత్తయి 13:51-52)**

శిష్యులు ఫలవంతమైన నేలగా ఉండాలని బోధిస్తూ, యేసు ఈ ఉపమానాలను ఆరంభించాడు. ఇతరులకు దానిని పంచే బాధ్యతను వారికి బోధిస్తూ, యేసు ఈ ఉపమానాలను ముగించాడు. శిక్షణ పొందిన ప్రతి ఒక్కడు ఇతరులకు బోధించడానికి తన జ్ఞాన నిధిని విప్పాలి. మనం కేవలం మన స్వప్రయోజనం కోసం నేర్చుకోము. శిష్యులు ఇతర శిష్యులకు శిక్షణ ఇచ్చేలా శిక్షణ పొందారు.

**పది మినాలు ఉపమానం.**[35] **(లూకా 19:11-27)**

► లూకా 19:11-27 చదవండి

ఈ ఉపమానం లూకాలో ఉంది కాని మత్తయి ఒలీవ ఉపన్యాస సమయంలో ఇదే విధమైన ఉపమానం చెప్పాడు. యేసు యెరూషలేముకు సమీపంగా ఉన్నప్పుడు పది మినాల ఉపమానం చెప్పాడు, ఎందుకంటే దేవుని రాజ్యం తక్షణమే కనిపిస్తుందని ప్రజలు భావించారు (లూకా 19:11).

యేసు యెరూషలేమును సమీపిస్తుండగా, ప్రజలు రాజకీయ మెస్సీయ గురించిన తమ అంచనాల విషయంలో చాలా ఉత్సాహంతో ఉన్నారు. ఆయన శిష్యులు రాజ్యం కొరకు వేచియుండగా నమ్మకంగా ఉండాలని బోధించడానికి యేసు ఈ ఉపమానం చెప్పాడు. యజమానుడు వారికిచ్చిన దానిని జాగ్రత్తగా దాచిపెట్టకూడదు; వారు రాజ్య వ్యాప్తి కోసం తమ వనరులు ఉపయోగించాలి.

### దేవుని రాజ్య సంపూర్ణ స్థాపన

► మత్తయి 24-25 చదవండి.

యేసు తన పరిచర్య ఆరంభంలో చేసిన బోధలు ఎక్కువగా రాజ్య తక్షణ ఆరంభంపై దృష్టినిలుపుతాయి. ఆయన తన భూలోక పరిచర్య ముగింపుకు వచ్చేసరికి, భవిష్యత్ లోదేవుని రాజ్య సంపూర్ణ స్థాపన గురించి ఎక్కువగా మాట్లాడాడు. మత్తయి 24 మరియు 25లో ఒలీవ ఉపదేశంలో, రాజ్య వాగ్దానాలు భవిష్యత్ లో నెరవేర్చబడతాయనే దానిపై విస్తృతంగా బోధించాడు.

### నిశిత పరిశీలన: హేరోదు దేవాలయం

క్రీ.పూ.19లో, గొప్ప హేరోదు దేవాలయ పునర్నిర్మాణం మొదలుపెట్టాడు.[36] ఈ దేవాలయాన్ని, క్రీ.పూ. 516లో జెరుబ్బాబెలు పూర్తిచేశాడు, ఇది సొలొమోను అసలు దేవాలయం కంటే కొంచెం చిన్నది, సరళమైంది. హేరోదు దాని పూర్వపు అందాన్ని పునరుద్ధరించాలని ఆశపడ్డాడు. అది 80 ఏళ్ళకు పైగా కొనసాగింది. నిర్మాణం కోసం హేరోదు


---

[35] "మీనా" అనేది ఒక యూనిట్. ఇది ఒక కార్మికుని సుమారు మూడు నెలల వేతనంతో సమానం.

[36] "Temple Comparison" ను SGC Ricardo Gandelman (CC BY 2.0) తీసిన ఫోటో నుండి సృష్టించారు మరియు దేవాలయ ప్రణాళికలు EB Vol. IV and Gal m, నుండి తీసుకున్నారు https://www.flickr.com/photos/sgc-library/52345523784, public domain (CC0).

10,000మంది నైపుణ్యంగల పనివాళ్లని నియమించాడు, కేవలం యాజకులకు మాత్రమే ప్రవేశమున్న భాగాలలో పనిచేయడానికి 1,000మంది లేవీయులకు శిక్షణ ఇచ్చాడు.

ప్రపంచంలోనే అత్యంత గొప్ప దేవాలయాన్ని నిర్మించినవాడిగా హేరోదు పేరుపొందాలనుకున్నాడు. యేసు పరిచర్య సమయానికి, పని 46 ఏళ్లుగా కొనసాగింది (యోహాను 2:20). క్రీ.శ. 63వరకు దేవాలయమంతా పూర్తి కాలేదు, ఆ తర్వాత ఏడు సంవత్సరాల్లో క్రీ.శ. 70లో యెరూషలేమును రోమా జనరల్ టైటస్ ముట్టడించినప్పుడు దేవాలయం నాశనమైపోయింది.




హేరోదు దేవాలయం సొలొమోను దేవాలయం కంటే రెండు రెట్లు పెద్దది, పండుగల కోసం యెరూషలేముకు వచ్చిన వేలాదిమంది యూదా యాత్రికులకు ఎక్కువ స్థలం ఉంది. ఇది రోమా సామ్రాజ్యంలో ఒక గొప్ప అద్భుతం.

## దేవుని రాజ్య సంపూర్ణ స్థాపన (కొనసాగింపు)

యెరూషలేములో యేసు చివరి వారంలో, శిష్యులు దేవాలయ నిర్మాణం గురించి ఆయనకు చెప్పారు. దేవాలయ నిర్మాణం కొనసాగుతుంది గనుక, వాళ్లు ముందు చూసినట్లుగా కాకుండా కొన్ని మార్పులు జరిగినందున వారు వాటిని ఎత్తి చూపారు.

దేవాలయం పట్టగొట్టడం గురించి ముందుగానే వివరిస్తూ "మీరు ఇవన్నియు చూచుచున్నారు గదా; రాతిమీద రాయి యొకటియైనను ఇక్కడ నిలిచియుండకుండ పడద్రోయబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని వారితో అనెను" అని యేసు సమాధానం చెప్పాడు. అప్పుడు శిష్యులు, "ఆయన ఒలీవల కొండమీద కూర్చుండియున్నప్పుడు శిష్యులాయనయొద్దకు ఏకాంతముగా వచ్చి ఇవి ఎప్పుడు జరుగును? నీ రాకడకును ఈ యుగసమాప్తికిని సూచనలేవి? మాతో చెప్పుమనగా" (మత్తయి 24:2, 3).

శిష్యుల ప్రశ్న రెండు భాగాలు; యేసు సమాధానం రెండు భాగాలు. పాత నిబంధన ప్రవచనాలు దగ్గర, దూరపు కోణాలు కలిగియున్నట్లుగా, యేసు ప్రవచనంలో తక్షణమే జరిగే కొన్ని విషయాలు, యుగాంతంలో జరిగే కొన్ని విషయాలు ఉన్నాయి.

- శిష్యులు, "వచ్చి ఇవి ఎప్పుడు జరుగును?" అని అడిగారు. "ఇవి" (రాతిమీద రాయి యొకటియైనను ఇక్కడ నిలిచియుండకుండ పడద్రోయబడు దేవాలయం) క్రీ.శ. 70లో జరిగాయి.
- శిష్యులు, "నీ రాకడకును ఈ యుగసమాప్తికిని సూచనలేవి?" అని అడిగారు. "మనుష్యకుమారుడు ప్రభావంతోను మహా మహిమతోను ఆకాశ మేఘారూఢుడై వచ్చుట" (మత్తయి 24:30) అని యేసు భవిష్యత్ రాకడ గురించి మాట్లాడాడు.

దేవుని రాజ్యంలో అన్ని రాజ్యాలవారు, యూదులు అన్యులు ఉంటారని యేసు చూపించాడు. అన్యజనులు రాజ్యంలో పాలివారగుట దేవుని ప్రణాళికని చూపించాడు, "లోకము పుట్టినది మొదలుకొని" (మత్తయి 25:34). దేవుని రాజ్యం దేవుని ప్రజలకు ఆయన నిత్య ప్రణాళిక.

ఒలీవ ఉపదేశంలో రెండు ఉపమానాలు, రాజ్యం కోసం వేచియుండగా నమ్మకంగా ఉండాలని బోధిస్తాయి. ఐదుగురు బుద్ధిలేని కన్యకలు వేచియున్నారు, కాని సరైన సిద్ధపాటుతో లేరు. ఒక తలాంతుగల సేవకుడు వేచియున్నాడు, కాని నమ్మకంగా లేడు. దేవుని రాజ్య పౌరులుగా, మనం రాజుకు సేవ చేసే విషయంలో, నమ్మకంగాను, స్థిరంగాను ఉండడానికి పిలువబడ్డాం.

తుది తీర్పులో, మత్తయి 13 ప్రకారం మంచి చెడులు వేరుచేయబడతాయి. ప్రధాన పాఠం, ఈ తీర్పు ఎప్పుడు ఎలా జరుగుతుందని కాదు. తుది తీర్పు కోసం సిద్ధపడుతూ నేటి రాజ్య పౌరులు ఎలా జీవించాలనేది యేసు బోధించాడు. ఆ దినాన, రాజు, "మిక్కిలి అల్పులైన యీ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనును" (మత్తయి 25:40). మనం రాజు రాకడ కోసం స్థిర సిద్ధపాటుతో జీవించాలి. ఆయన వచ్చినప్పుడు మనం నమ్మకంగా కనిపించాలి.

**అన్వయం: శిష్యరికం వెల**

► లూకా 9:21-27 చదవండి.

దేవుని రాజ్యంలో పౌరసత్వం కేవలం కృపవలన సాధ్యం. సత్క్రియల ద్వారా దేవుని రాజ్య పౌరులం కాలేము. అయితే, దీని అర్థం శిష్యత్వానికి వెల/మూల్యం లేదని కాదు. లూకా 9లో, శిష్యత్వం వెల గురించి యేసు తన అనుచరులకు బోధించాడు.

డల్లాస్ విల్లార్డ్ "కృప శ్రమకు వ్యతిరేకం కాదు; కృప సంపాదనకు వ్యతిరేకం" రాశాడు.[37] శిష్యులుగా మనం చేసే శ్రమ/ప్రయత్నం కృపకు వ్యతిరేకం కాదు. నిజానికి, శిష్యత్వాన్ని పొందుకునే ఒకే ఒక మార్గం, దేవుని కృప వలననే.

దయచేసి యేసు బోధనా పద్ధతి గమనించండి: **ముందు సిలువ ఆ తర్వాత మహిమ.**

- యేసు తన మరణం, పునరుత్థానం గురించి ముందుగా చెప్పాడు (లూకా 9:21-22). రాజ్యంలో మనకు పౌరసత్వాన్ని అందించడానికి యేసు చెల్లించిన వెల ఇదే.
- తన శిష్యులుగా ఉండాలంటే వెల ఎంతో యేసు తన అనుచరులకు చెప్పాడు (లూకా 9:23-25). "ఎవడైనను నన్ను వెంబడింప గోరినయెడల తన్నుతాను ఉపేక్షించుకొని, ప్రతిదినము తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపవలెను." దేవుని రాజ్యాన్ని స్థాపించడానికి యేసు సిలువలో శ్రమపొందాడు; మనం దేవుని రాజ్యంలో నివసించాలంటే సిలువను ఎత్తుకోవాలి.

[37] Dallas Willard, *The Great Omission: Reclaiming Jesus's Essential Teachings on Discipleship*. (New York: HarperOne, 2006)

- యేసు దేవుని రాజ్యం గురించి మాట్లాడాడు (లూకా 9:26-27). “నన్నుగూర్చియు నా మాటలనుగూర్చియు సిగ్గుపడువాడెవడో వానిగూర్చి మనుష్య కుమారుడు, తనకును తన తండ్రికిని పరిశుద్ధదూతలకును కలిగియున్న మహిమతో వచ్చునప్పుడు సిగ్గుపడును.”

సిలువలో పాలుపంచుకోకుండా మనం దేవుని మహిమలో పాలుపంచుకోలేం. యేసు, “అనగా సిలువమరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్నుతాను తగ్గించు కొనెను. అందుచేతను…దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పైనామమును ఆయనకు అనుగ్రహించెను.” (ఫిలిప్పీయులకు 2:8-11).

దేవుని పిల్లలంగా, మనం కూడా ఇదే పద్ధతి పాటిస్తాం. “తన నిత్యమహిమకు క్రీస్తునందు మిమ్మును పిలిచిన సర్వకృపా నిధియగు దేవుడు, కొంచెము కాలము మీరు శ్రమపడిన పిమ్మట, తానే మిమ్మును పూర్ణులనుగాచేసి స్థిరపరచి బలపరచును” (1 పేతురు 5:10). ఇది దేవుని రాజ్య జీవన విధానం. క్రీస్తు మహిమపరచబడకముందు సిలువలో శ్రమపొందాడు. ఆయన అనుచరులు కూడా నిత్య మహిమను ఆనందించడానికి ముందు తమ సిలువ ఎత్తుకోవాలి.

యేసు సమర్పణగల శిష్యుల కోసం చూశాడు. తన శిష్యులు తెలివైనవారిగా ఉండాలని ఆశించలేదు; యదార్థ హృదయులుగా ఉండాలని ఆశించాడు. శిష్యులుగా ఉండాలంటే వెల ఎంత? “ఎవడైనను నన్ను వెంబడింపగోరినయెడల, తన్నుతాను ఉపేక్షించుకొని, తన సిలువనెత్తి కొని నన్ను వెంబడింపవలెను” (మత్తయి 16:24).

1. **శిష్యుడు తననుతాను ఉపేక్షించుకోవాలి.** “స్వయానికి” కాదు అని చెప్పడం చాలా కష్టం.

2. **శిష్యుడు తన సిలువను ఎత్తుకోవాలి.** సిలువ అంటే మరణమని యేసు అనుచరులకు తెలుసు. సిలువ శ్రమకు, అవమానానికి సూచన. అయితే, శిష్యత్వానికి సిలువ అవసరమని ఆది క్రైస్తవులకు తెలుసు. ఇగ్నేషియస్ హతసాక్షి అవ్వడానికి రోమాకు ప్రయాణించినప్పుడు, అతడిలా చెప్పాడు: “నేను శిష్యుడుగా ఉండటం మొదలుపెట్టాను.” శిష్యత్వానికి సిలువ అవసరం.

3. **శిష్యుడు ప్రవర్తనలోను పాత్రలోను యేసును *వెంబడిస్తూ* ఉండాలి.** *వెంబడించు* అనే క్రియా పదం వర్తమాన కాలంలో ఉంది.

శిష్యత్వానికి వెల చెల్లించాలా? శిష్యునిగా ఉండడానికి యేసు మూడు కారణాలు ఇచ్చాడు. విచిత్రమేమిటంటే ఈ కారణాలవల్లే చాలామంది శిష్యులుగా ఉండరు. మనం శిష్యత్వానికి వెల ఎందుకు చెల్లించాలి?

1. **భద్రత.** సిలువను ప్రక్కనపెట్టి తన ప్రాణాన్ని రక్షించుకొనగోరువాడు పోగొట్టుకుంటాడు (లూకా 9:24).
2. **నిజమైన సంపద.** క్రీస్తుతో గుర్తింపు కలిగి ఉండనివాడు సమస్తం నష్టపోతాడు (లూకా 9:25).

3. **బహుమానం**. క్రీస్తును అనుసరించేవారు మాత్రమే దేవుని రాజ్య ఆహ్వానం పొందుతారు (లూకా 9:26-27).

► లూకా 14:25-33 చదవండి.

తరువాత యేసు శిష్యత్వం గురించి తన బోధను మరింతగా వివరించాడు. ఆయన ఉపదేశాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు:

1. శిష్యత్వం వెల (లూకా 14:26-27)
2. వెల లెక్కించకుండా శిష్యుడుగా మారడంలోని మూర్ఖత్వం (లూకా 14:28-32)
3. శిష్యత్వం వెల గుర్తుచేయడం (లూకా 14:33)

మీరు కారు కొనుగోలు చేయాలని వెళ్లినప్పుడు, అమ్మేవాడు కొన్నిసార్లు పూర్తి ధరను చెప్పడు. "ఈ అందమైన కారు చూడండి!" ఈ కారు ప్రభావాన్ని అనుభవించండి!" అని చెబుతాడు. మీరు ఆ కారును ఇష్టపడిన తర్వాత మాత్రమే పూర్తి ధర చెబుతాడు.

యేసు ఎప్పుడు కూడా తన అనుచరులకు దేవుని రాజ్యంలో ప్రవేశించడానికి సులువైన మార్గాన్ని ఇవ్వలేదు. ఆయన ఈ వెలతో మొదలుపెట్టాడు:

> ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని తల్లిని భార్యను పిల్లలను అన్న దమ్ములను అక్కచెల్లెండ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు. మరియు ఎవడైనను తన సిలువను మోసికొని నన్ను వెంబడింపని యెడల వాడు నా శిష్యుడు కానేరడు (లూకా 14:26-27).

ఈ వాక్యభాగంలో, ఒకదానిని ద్వేషించడమంటే మరొకదాని కంటే దానిని తక్కువగా ప్రేమించడం. "నీ తండ్రికంటే, తల్లికంటే, పిల్లలకంటే, అన్నదమ్ములకంటే, అక్కచెల్లెళ్ళకంటే, మీ సొంత జీవితం కంటే నన్ను ఎక్కువగా ప్రేమించని వాడు నా శిష్యుడు కాడని" యేసు చెప్పాడు.

శిష్యుడుగా ఉండాలంటే ఎంత మూల్యం చెల్లించాలి? సమస్తం! క్రీస్తు శిష్యుడుగా ఉండడమంటే మెస్సీయ వాగ్దానాల్లో పాలుపంచుకోడమే కాదు; సిలువలో పాలుపంచుకోవడం కూడా.

► యోహాను సువార్త శిష్యత్వం గురించి మూడు అదనపు షరతులు ఇస్తుంది. యోహాను 8:31, యోహాను **13:35**, మరియు యోహాను 15:8 చదవండి. లూకా మరియు యోహానులో శిష్యత్వానికి షరతుల ఆధారంగా, మీరు మీ పరిచర్యలో శిష్యుల్ని చేస్తున్నారా*?*

## ముగింపు: దేవుని రాజ్యం అంటే ఏంటి?

క్రీస్తు తిరిగి వచ్చేవరకు, రాజ్యం గురించి ఆయన చేసిన బోధలన్నిటి వివరాలు మనం అర్థం చేసుకోలేం. అయితే, సువార్తలు అనేక దేవుని రాజ్య లక్షణాలు చూపిస్తాయి.

- దేవుని రాజ్యం ఆత్మీయ రాజ్యం. “దేవుని రాజ్యము భోజనమును పానమును కాదు గాని, నీతియు సమాధానమును పరిశుద్ధాత్మయందలి ఆనందమునై యున్నది” (రోమా 14:17). నూతనంగా జన్మించడం మనలని సాతాను అధికారం నుండి విడిపించి, దేవుని రాజ్య వారసులుగా చేస్తుంది.
- యుగాంతమందు దేవుని రాజ్యంలో భౌతిక, రాజకీయ పాలన ఉంటుంది.
- దేవుని రాజ్యం సార్వత్రికం; కేవలం యూదా రాజ్యానికి పరిమితం కాదు.
- దేవుని రాజ్యం, లోకంలో పనిచేయు దేవుని శక్తి. రాజ్యం భౌతిక ఏలుబడి కాదు. పది మి నాల ఉపమానంలో, రాజ్యం అంటే పాలించే అధికారం, భౌగోళిక స్థానం కాదు (లూకా 19:11-12).
- దేవుని రాజ్యం అతీంద్రియం. మనిషి విత్తనాన్ని విత్తుతాడు; దాని వృద్ధి చేయలేడు. దేవుని శక్తి ద్వారా రాజ్యం పెరుగుతుంది.
- దేవుని రాజ్యం కేవలం అస్పష్టమైన భవిష్యత్ నిరీక్షణ కాదు; అది తక్షణ ప్రతిస్పందన కోరే ప్రస్తుత వాస్తవికత.
- దేవుని రాజ్యం యేసు పరిచర్య ద్వారా ఆరంభించబడింది. అపవిత్రాత్మలపై ఆయన అధికారం, సాతాను రాజ్యంపై దేవుని రాజ్యం విజయం పొందిందని చూపిస్తుంది.
- దేవుని రాజ్యం సంఘ పని ద్వారా కొనసాగుతుంది. కొండమీద ప్రసంగం, నూతన విశ్వాసులు ప్రస్తుత యుగంలో జీవించడానికి ఎలా పిలువబడుతున్నారో చూపిస్తుంది.
- క్రీస్తు మహిమలో ఏలుబడి చేయడానికి వచ్చినప్పుడు దేవుని రాజ్యం పూర్తిగా స్థాపితమౌతుంది. సాతాను అధికారం విచ్ఛిన్నమౌతుంది, దేవుడు నిత్యం పరిపాలన చేస్తాడు.

► ఈ కోర్సు వెనుక భాగంలో, “రాజ్య సువార్త” అనే ప్రసంగం ఉంది. 7వ పాఠంలోకి వెళ్లే ముందు దీన్ని చదవండి.

## పాఠం 6 అభ్యాసాలు

యేసు కొండమీద ప్రసంగం ఆధారంగా మూడు ప్రసంగాలు సిద్ధం చేయండి. మీ ప్రసంగ ప్రధాన విషయం, "దేవుని రాజ్యంలో జీవం/జీవితం" అయ్యుండాలి. దేవుని రాజ్య పౌరులుగా నేడు మనమెలా జీవించాలో చూపించండి. మీ ప్రసంగాన్ని సువార్తగా ప్రకటిస్తున్నారో లేదో చూసుకోండి. దేవుని రాజ్య పౌరులుగా జీవించడానికి దేవుని కృప మనల్ని ఎలా బలపరుస్తుందో చూపించండి.

# పాఠం 7

# యేసువలే ప్రేమించడం

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) యేసు జీవితం మరియు పరిచర్యలో ప్రేమ కేంద్రంగా ఉండడాన్ని గుర్తించాలి.

(2) దేవుని యెడల ప్రేమ అంటే, దేవునితో సంబంధం, దేవుని వాక్య జ్ఞానం, దేవుని చిత్తాన్ని నమ్మడమని గ్రహించాలి.

(3) పరిచర్యలో ప్రజలపట్ల యేసు ప్రేమను అనుకరించాలి.

(4) దేవునికి నిరంతరం సమర్పించుకొను ప్రాముఖ్యతను అభినందించాలి.

(5) దైనందిన జీవితంలో యేసు స్వభావం చూపించాలి.

## పరిచర్యకు సూత్రం

క్రీస్తువంటి పరిచర్యకు, క్రీస్తువంటి ప్రేమ ప్రేరణ.

## పరిచయం

ప్రేమే, యేసు జీవితాన్ని, పరిచర్యనంతటినీ ప్రేరేపించింది. దేవుని పట్ల తనకున్న ప్రేమ మరియు ఇతరుల పట్ల తనకున్న ప్రేమ తన జీవితానికి, పరిచర్యకు కేంద్రం అనే విషయాన్ని పదే పదే చూపించాడు. మనం యేసు మాదిరి అనుకరిస్తే, మన జీవితానికి, పరిచర్యకు ప్రేమ కేంద్రంగా ఉండాలి. ఇది మంచి సమరయుని ఉపమానంలో కంటే మరెక్కడా స్పష్టంగా లేదు.

► లూకా 10:25-37 చదవండి.

యేసు ఈ ఉపమానం చెప్పే ముందు, “తండ్రీ, ఆకాశమునకును భూమికిని ప్రభువా, నీవు జ్ఞానులకును వివేకులకును ఈ సంగతులను మరుగు చేసి పసిబాలురకు బయలు పరచినావని” (లూకా 10:21) చెప్పాడు. ఇది ఆత్మీయ అవగాహన గురించి ఒక ముఖ్య పాఠాన్ని బోధిస్తుంది. ఆత్మీయ అవగాహన కావాలంటే, మేధోపరమైన అధ్యయనం చాలదు; ఆత్మీయ ప్రత్యక్షత అవసరం. దేవుని సత్యం, దేవుని ఆత్మ సహాయంగా చిన్నపిల్లవాడు కూడా అర్థం చేసుకోగలిగేంత సరళమైంది కాని పండితుడు కేవలం తన మేధో శక్తితో అర్థం చేసుకోలేనంత లోతైనది.

ఇదెలా సాధ్యం? దేవుడు, సత్యాన్ని ఆశించే వాళ్ళకి దాచి ఉంచుతాడా? సమాధానంలో రెండు సూత్రాలున్నాయి.

1. **ఆత్మీయ సత్యం కేవలం పరిశుద్ధాత్మ ద్వారా బయలుపరచబడుతుంది.** పౌలు "దేవుని సంగతులు దేవుని ఆత్మకే గాని మరి ఎవనికిని తెలియవు" అని రాశాడు. కాబట్టి, "మనుష్యజ్ఞానము నేర్పు మాటలతో గాక ఆత్మ సంబంధమైన సంగతులను ఆత్మ సంబంధమైన సంగతులతో సరిచూచుచు, ఆత్మ నేర్పు మాటలతో వీటిని గూర్చియే మేము బోధించుచున్నాము" (1 కొరింథీయులకు 2:11, 13).

2. **ఆత్మీయ సత్యం కేవలం స్వీకరించే శ్రోతలకే బయలుపరచబడుతుంది.** పౌలు ఇలా కొనసాగించాడు: "ప్రకృతి సంబంధియైన మనుష్యుడు దేవుని ఆత్మ విషయములను అంగీకరింపడు, అవి అతనికి వెఱ్ఱితనముగా ఉన్నవి, అవి ఆత్మానుభవముచేతనే వివేచింపదగును గనుక అతడు వాటిని గ్రహింపజాలడు" (1 కొరింథీయులకు 2:14).

వినువారి వైఖరి విత్తనం యొక్క ఫలాన్ని నిర్ణయిస్తుందని వ్యవసాయదారుని/విత్తువాని ఉపమానం చెబుతుంది (మత్తయి 13:1-23). సత్యాన్ని స్వీకరించేవారే, సత్యాన్ని గ్రహిస్తారు.[38]

లూకా 10:25 లోని ధర్మశాస్త్రోపదేశకుడు, రెండవ సూత్రానికి నిజమైన ఉదాహరణ. ధర్మశాస్త్రోపదేశకుని ప్రశ్న సత్యం తెలుసుకోవాలనే తాపత్రయం నుండి పుట్టలేదు, కాని యేసును ఇబ్బందిపెట్టాలనే కోరిక నుండి పుట్టింది; యేసును పరీక్షించాలనుకున్నాడు. ధర్మశాస్త్రోపదేశకుడు, యేసు సమాధానం విన్న తరువాత, అతని సమాధానం ఫలవంతమైన నేల ప్రతిస్పందనకాదు. దానికి బదులుగా, తననుతాను సమర్థించుకోవడానికి మరో ప్రశ్న అడిగాడు (లూకా 10:29).

"నిత్యజీవమునకు వారసుడనగుటకు నేనేమి చేయవలెను?" అను ప్రశ్నకు యేసు సమాధానం ఇచ్చాడు. " సమాధానం ధర్మశాస్త్రంలో రాయబడి ఉంది, "నీ దేవుడైన ప్రభువు ను నీ పూర్ణహృదయముతోను, నీ పూర్ణమనస్సుతోను, నీ పూర్ణ శక్తితోను, నీ పూర్ణవివేకముతోను ప్రేమింపవలెననియు, నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింపవలెను" (లూకా 10:27).

ఇది యేసు మనకు చూపించు మాదిరి. యేసువలే జీవించి, పరిచారం చేయాలంటే, యేసు ప్రేమించినట్లుగా మనం దేవుని ప్రేమించాలి, పొరుగువారిని ప్రేమించాలి. క్రీస్తువంటి ప్రేమ లేకుంటే, ఈ కోర్సులోని ఇతర పాఠాలు అంత

---

[38] ముఖ్యంగా, మత్తయి 13:12 గమనించండి. సత్యాన్ని అంగీకరించువానికి మరింత ఇవ్వబడుతుంది:: "కలిగినవానికే యియ్యబడును, వానికి సమృద్ధి కలుగును." సత్యాన్ని తిరస్కరించువాడు వాడు వినిన సత్యం కూడా అతనికి మరుగుచేయబడుతుంది: "లేనివానికి కలిగినదియు వానియొద్దనుండి తీసి వేయబడును."

ప్రముఖంగా ఉండవు. ప్రార్థన, నాయకత్వం, బోధనా మరియు ప్రసంగం- ప్రేమ లేకపోతే ఏది నిజంగా ప్రభావవంతంగా ఉండదు.

బహుశా ఇది చాల సరళంగా కనిపించొచ్చు. మీరిలా అనుకోవచ్చు, "నిజానికి మనం దేవుని ప్రేమించాలి, ప్రజలను ప్రేమించాలి" అది నాకు తెలుసు!" కాని అనుదిన పరిచర్య భారంలో, ప్రేమతో నిండిన హృదయాన్ని మనం కలిగి లేకపోవచ్చు. సంఘ సభ్యుల్ని ప్రేమించకుండా, వారికి సేవ చేయటం సాధ్యం. మన కుటుంబాలను ప్రేమించకుండా, వారికి సేవ చేయడం సాధ్యం. దేవుని ప్రేమించకుండా, క్రైస్తవ పని చేయటం సాధ్యం. క్రైస్తవ పరిచర్యలో క్రీస్తువలె ప్రేమించడమే మన ప్రేరణగా ఉండాలి.

## యేసు ప్రేమించినట్టుగా దేవుని ప్రేమించడం

మానవాళికి యేసు చేసిన పరిచారం తండ్రి యెడల ఆయనకున్న ప్రేమ నుండి వెలువడింది. పరిచర్యలో మానసికంగాను, భావోద్వేగపరంగాను నిరాశకు లోనవ్వడం, ఆందోళనకు లోనవ్వడం వంటివి నివారించాలంటే, ప్రజలకు మనం చేసే సేవ, దేవుని యెడల ప్రేమ నుండి కలగాలి. దేవుని ప్రేమ లేని పరిచర్య త్వరలో శూన్యంగా, నిష్ఫలంగా మారిపోతుంది.

తండ్రి యెడల యేసుకున్న ప్రేమలోని మూడు కోణాలు మనకు మాదిరి: సంబంధం, జ్ఞానం, నమ్మకం.

### యేసు తన తండ్రితో సన్నిహిత సంబంధం కలిగి ఉన్నాడు

పదే పదే, తండ్రితో యేసుకున్న సంబంధాన్ని సువార్తలు చూపిస్తాయి. ఇది ఈ వాక్యాల్లో కనిపిస్తుంది:

- యేసు తన తల్లిదండ్రులతో చెప్పిన మాట, "నేను నా తండ్రి పనులమీద నుండవలెనని మీరెరుగరా?" (లూకా 2:49)
- యోహాను 17లో యేసు సన్నిహిత ప్రార్థన.
- సిలువలో యేసు ఆవేదనతో మాట్లాడిన మాట, "నా దేవా, నా దేవా నన్నెందుకు చెయ్యి విడిచితివని?" (మత్తయి 27:46)

గెత్సెమనే తోటలో యేసు, దేవునిని కుటుంబంలో ఉపయోగించే సన్నిహిత భాష ఉపయోగించి సంబోధించాడు, "నాయనా తండ్రీ" (మార్కు 14:36). ఇది తండ్రితో తనకున్న సంబంధంలో భద్రత కలిగిన కుమారుడు మాట్లాడే భాష.

సాంప్రదాయ యూదుల ప్రార్థనల్లో దేవునికి అనేక పేర్లు ఉపయోగించారు: అబ్రాహాము ఇస్సాకు యాకోబుల దేవుడు; మా పితరుల దేవా; యెహోవా; ఇశ్రాయేలు విమోచకుడు. యేసు అబ్బా అనే సన్నిహిత పదం ఉపయోగించాడు. యేసు తన తండ్రితో సన్నిహిత సంబంధం కలిగి జీవించాడు.

కెన్నెత్ ఇ. బెయిలీ చాలా సంవత్సరాలపాటు మధ్య తూర్పు ప్రాంతంలో బోధించాడు. మధ్య తూర్పు ప్రాంతంలో పిల్లలు నేర్చుకునే మొట్టమొదటి పదం అబ్బా అని అతడు రాశాడు. అబ్బా అనేది పిల్లాడు తన తండ్రికి ఉపయోగించే పేరు.

దేవుని పిల్లలముగా, "అబ్బా తండ్రీ" (రోమా 8:15, గలతీయులకు 4:6) అని మొర్రపెట్టగల ఆధిక్యత మనకుందని పౌలు చెప్పాడు. మనం ఆరాధించే దేవుడు సుదూరంగా లేడు. బదులుగా, యేసువలే మనం మన తండ్రి ప్రేమలో భద్రంగా, సౌకర్యంగా జీవిస్తున్నాం.

సేవకులముగా, మన పరిచర్యలో మనం పొందే విజయాన్ని బట్టి మనల్ని మనం అంచనా వేసుకునే శోధనలో పడిపోతాం. మన విలువ మన సంఘ పరిమాణం బట్టి లేక సంఘ ఆమోదాన్ని బట్టి, లేక తోటివారి గుర్తింపును బట్టి వస్తే, విజయం కోసం యదార్థతను విడిచిపెట్టె శోధనలో పడిపోతాం. మన ప్రయత్నాలు విఫలమైనప్పుడు నిరుత్సాహపడతాం. అయితే, మన విజయంతో నిమిత్తం లేకుండా మన తండ్రి మనలను ప్రేమిస్తున్నాడని నమ్మితే, ఫలితాలు ఆయన చేతికి అప్పగించవచ్చు. ఆయన ప్రేమ మన ప్రదర్శనపై ఆధారపడదు.

**యేసుకు తన తండ్రి చిత్తం తెలుసు**

ఆయన భూలోక పరిచర్య ముగింపులో, "చేయుటకు నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చి భూమిమీద నిన్ను మహిమ పరచితిని" (యోహాను 17:4) అని యేసు సాక్ష్యమిచ్చాడు. తన తండ్రి ఏమి నెరవేర్చడానికి తనను భూలోకంలోకి పంపాడో యేసుకు తెలుసు, ఆ పనికే ఆయన తన జీవితాన్ని సమర్పించుకున్నాడు.

యేసు మానవుడిగా జీవించినప్పుడు, తన తండ్రి చిత్తాన్ని వాక్యం ద్వారా, ప్రార్థన ద్వారా నేర్చుకున్నాడు. ప్రార్థన ద్వారా, యేసు తండ్రి చిత్తాన్ని కనుగొన్నాడు.

యేసు వాక్యం ద్వారా కూడా తండ్రి చిత్తం నేర్చుకున్నాడు. కపెర్నహూములో, యేసు తన మిషన్ ను యెషయా ప్రవచన నెరవేర్పుగా సంగ్రహించాడు. (లూకా 4:18-19). బాప్తిస్మమిచ్చు యోహాను శిష్యులకు సమాధానం చెప్పినప్పుడు, తన మెస్సీయత్వ పరిచర్యకు రుజువుగా యేసు యెషయా మాటలు ఉపయోగించాడు. (మత్తయి 11:4-5). యేసుకు వాక్యం తెలుసు.

క్రొత్త నిబంధన అంతటిలో, క్రైస్తవులు కష్టాలు ఎదుర్కొన్నప్పుడు లేఖనాలు సూచించటం మనం చూస్తాం. హతసాక్షియైనప్పుడు, స్తెఫను చివరి ప్రసంగంలో ప్రధానంగా పాత నిబంధన లేఖనాలు, యేసుక్రీస్తులో వాటి నెరవేర్పు భాగంగా ఉన్నాయి (అపొస్తలుల కార్యములు 7:1-53). యూదా నాయకులు, యేసు సందేశాన్ని ప్రకటించడాన్ని మానేయమని క్రైస్తవులకు ఆజ్ఞాపించినప్పుడు, సంఘం కలిసి ప్రార్థించింది. ఈ ప్రార్థన కీర్తన 2 యొక్క సుదీర్ఘ ఉల్లేఖనం (అపొస్తలుల కార్యములు 4:24-30, కీర్తన 2:1-2). ఆది సంఘంలోనున్న విశ్వాసులకు లేఖనాలు తెలుసు. ప్రసంగించినప్పుడు, ప్రార్థించినప్పుడు ఇది వారి సాధారణ భాష.

సంఘ చరిత్ర అంతటా, ప్రపంచాన్ని తలక్రిందులు చేసినవారు వాక్యం తెలిసిన వ్యక్తులే. మార్టిన్ లూథర్ డైట్ ఆఫ్ వార్మ్స్ అనే సభలో ఇలా సాక్ష్యమిచ్చాడు: "నేను లేఖనాలకు కట్టుబడి ఉన్నాను, నా మనసు దేవుని వాక్యంతో నిండియుంది." జాన్ వెస్లీ తననుతాను "మ్యాన్ ఆఫ్ వన్ బుక్" అని చెప్పుకున్నాడు. "బైబిల్ సారం మీలో నుండి ప్రవహించేవరకు" వాక్యంలో మునిగితేలాలని చార్ల్స్ స్పర్జన్ ప్రసంగికులకు చెప్పాడు. హడ్సన్ టేలర్ వాక్యంలో ఎక్కువ సమయం గడిపేవాడు గనుక అతని గురించి ఒక రచయిత, "టేలర్ బైబిల్ వాతావరణంలో జీవించాడు" అని రాశాడు. వీరు వాక్యాన్ని అధికారంతో ప్రకటించారు గనుక భూలోకాన్ని మార్చగలిగారు.

> "బైబిల్ ను మంచి పుస్తకాలతో భర్తీ చేయొద్దు. బావిలోనిది త్రాగుడి!"
> - అమీ కార్మైఖేల్

మనం యేసువలే, ఆది క్రైస్తవులవలే, చరిత్రలో గొప్ప బోధకులవలే పరిచర్య చేయాలంటే, దేవుని వాక్యంతో మనం మన వైఖరులు, ఆలోచనలు మార్చుకోవాలి. పౌలు పరిచర్యలో, లేఖనాలు అత్యున్నత అధికారం గలవి (2 తిమోతికి 3:16-17). తన శిష్యులు సేవ కొరకు ప్రత్యేకించబడాలని లేక ప్రతిష్ఠించబడాలని, వేరుచేయబడాలని యేసు ప్రార్థించాడు. ఇది వాక్యం ద్వారా సాధ్యమౌతుంది: "సత్యమందు వారిని ప్రతిష్ఠ చేయుము; నీ వాక్యమే సత్యము" (యోహాను 17:17). వాక్యం, పరిచర్యలో శిష్యులను ప్రభావవంతులుగా చేసింది; వాక్యం మనలను పరిచర్యలో ప్రభావవంతులుగా చేస్తుంది.

అజిత్ ఫెర్నాండో (Ajith Fernando) తన జీవితం మొత్తం శ్రీలంకలో పరిచర్య చేస్తూ గడిపాడు. తన బోధనలో ఏ ముఖ్యమైన ప్రకటన చేయడానికి ముందుగా దానికి లేఖన ఆధారం ఉండాలని ఎల్లప్పుడూ పాటించే సాధనగా ఆయన రాశాడు. ఇది ఆయన బోధనను వాక్యంపై ఆధారపడి ఉండేలా చేస్తుంది. క్రైస్తవులుగా, మనం దేవుని ఆయన వాక్యం ద్వారా తెలుసుకుంటాం. పరిచారకులుగా, దేవుని వాక్యంపై ఆధారపడిన పరిచర్య ద్వారా బలమైన సంఘాలను నిర్మిస్తాం.

**యేసు తన తండ్రిని నమ్మాడు**

భూమిపై యేసు పరిచర్య చేసిన కాలంలో, యేసుకు తన తండ్రితో ఉన్న సంబంధాన్ని గెత్సెమనే తోట ప్రార్థనలో సంగ్రహించవచ్చు, "అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్త ప్రకారమే కానిమ్ము" (మత్తయి 26:39). ఇది సంపూర్ణమైన నమ్మకం, విధేయత చూపించే మాట.

నమ్మకంలేని వారి చిత్తానికి లోబడటం చాలా కష్టం. బయట నమ్మేలా బలవంతం చేయబడతాం కాని మనం నమ్మలేని వారికి లోబడడానికి మన హృదయం ఒప్పుకోదు. యేసు తండ్రి ప్రేమను, ఆయన మంచితనాన్ని పూర్తిగా నమ్మాడు గనుక తండ్రి చిత్తానికి లొంగిపోయాడు.

► యోహాను 5:1-47 చదవండి.

యేసు పూర్తిగా తండ్రిపై ఆధారపడ్డాడని ఆయన పరిచర్య అంతటిలో కనిపిస్తుంది. విశ్రాంతి దినమందు యేసు కుంటివాడిని బాగుచేసినప్పుడు వ్యతిరేకించిన యూదా నాయకులకు, యేసు సమాధానం ఇచ్చాడు:

> తండ్రి యేది చేయుట కుమారుడు చూచునో, అదే కాని తనంతట తాను ఏదియు చేయనేరడు; ఆయన వేటిని చేయునో, వాటినే కుమారుడును ఆలాగే చేయును…. నా అంతట నేనే ఏమియు చేయలేను; నేను విను నట్లుగా తీర్పు తీర్చుచున్నాను. నన్ను పంపిన వాని చిత్తప్రకారమే చేయగోరుదును గాని నా యిష్ట ప్రకారము చేయగోరను గనుక నా తీర్పు న్యాయమైనది (యోహాను 5:19, 30).

యేసు దైవికమైనవాడని అప్పటికే చెప్పుకున్నాడు: "నాతండ్రి యిదివరకు పనిచేయుచున్నాడు, నేనును చేయుచున్నాను" (యోహాను 5:17). అయితే, యేసు పూర్తిగా దైవికమైనవాడైనప్పటికీ, ఆయన భూమిపై చేసిన పరిచర్యలో సేవకుని పాత్రకు ఇష్టపూర్వకంగా లోబడ్డాడు. ఆయన, తండ్రితో సమానుడు, కాని ఆయన తండ్రి చిత్తానికి లోబడ్డాడు.

కొన్నినెలలు తర్వాత శాస్త్రులు, పరిసయ్యులు యేసును వ్యతిరేకించినప్పుడు, తండ్రి అధికారాన్ని నొక్కి చెప్తు, తన క్రియలను సమర్థించుకున్నాడు: "నా అంతట నేనే యేమియు చేయక, తండ్రి నాకు నేర్పినట్టు ఈ సంగతులు మాటలాడుచున్నాననియు మీరు గ్రహించెదరు" (యోహాను 8:28). ఆయన తండ్రిని పూర్తిగా నమ్మాడు గనుక, తండ్రి చిత్తానికి పూర్తిగా తలవంచగలిగాడు.

సంఘ నాయకత్వానికి కష్టమైన సమతుల్యత అవసరం. అనేకమంది పాస్టర్లకు, సంఘ నాయకులకు బలమైన నాయకత్వ నైపుణ్యాలు ఉన్నాయి. నాయకులుగా, వారికి బలమైన అభిప్రాయాలు, వ్యక్తిత్వాలు ఉన్నాయి. నాయకునికి

ఇదొక విలువైన బలం. అయితే, ఈ బలం, దేవునికి ఇష్టపూర్వకంగా లోబడడం ద్వారా సమతుల్యమవ్వాలి. మనం విశ్వాసంతో దేవునికి లోబడకపోతే, దేవుని మార్గానికి అనుగుణంగా జీవించడానికి బదులు మన వ్యక్తిగత మార్గాలకు లొంగిపోతాం.

బైబిల్లో దీనికి మోషే ఒక ఉత్తమ ఉదాహరణ. మోషే భూమి మీదనున్న వారందరిలో మిక్కిలి సాత్వికుడు (సంఖ్యాకాండము 12:3). మోషే బలవంతుడు, అదే సమయంలో సాత్వికుడు కూడా. అతను ఐగుప్తులో అత్యంత బలవంతుడైన ఫరోను ఎదుర్కొన్నాడు. అరణ్యంలో కఠిన హృదయులైన ఇశ్రాయేలీయులను నడిపించాడు. మోషే బలమైన నాయకుడు. కానీ అదే సమయంలో, అతడు దేవునికి లోబడ్డాడు. ప్రభావవంతమైన సంఘ నాయకత్వానికి, మన సాధారణ బలం దేవుని చిత్తానికి అప్పగించుకోవడం అవసరం. దేవునితో నమ్మకంగా, విశ్వాసంగా నడిచినప్పుడే ఇది సాధ్యపడుతుంది.

► తండ్రి యెడల ప్రేమ చూపించు ఈ మూడు కోణాల్లో (సంబంధం, ఆయన వాక్య జ్ఞానం, విశ్వాసం కలిగి లోబడడం), వ్యక్తిగతంగా మీకు ఏది గొప్ప సవాలు?

### నిశిత పరిశీలన: యేసు దేవుడనని చెప్పుకున్నాడా?

మర్మోనిజం, యెహోవా సాక్షులువంటి తప్పుడు శాఖలు, అదే విధంగా ఇస్లాం వంటి క్రైస్తవేతర మతాలు యేసు నిజమైన దేవుడని ఒప్పుకోవు. వారు యేసును ఒక గొప్ప బోధకుడు లేక ప్రవక్తగా, మొదట సృష్టించబడిన వ్యక్తిగా మరియు మెస్సీయగా కూడా గుర్తిస్తారు. కాని ఆయన నిజమైన దేవుడని ఒప్పుకోరు.[39]

ఈ మతాలను అనుసరించేవారు ఎల్లప్పుడు ఇలా చెప్తారు: "యేసు ఎప్పుడూ తాను దేవుడనని చెప్పుకోలేదు. మనం దేవుని కుమారులుగా ఉన్నట్లే, ఆయన కూడా దేవుని కుమారుడని చెప్పుకున్నాడు."

యేసు దేవుడని చెప్పుకున్నాడా? చెప్పుకున్నాడు. యేసు మాటలు విన్న ప్రజలు ఆయన మాటలు అర్థం చేసుకున్నారు. యేసు దేవుడిని "నాతండ్రి," అని సంబోధించినప్పుడు, యూదా నాయకులు ఆయన్ని చంపాలని చూశారు. ఎందుకు? "ఆయన విశ్రాంతిదినాచారము మీరుట మాత్రమేగాక, దేవుడు తన సొంత తండ్రి అని చెప్పి, తన్ను దేవునితో సమానునిగా చేసికొనెను గనుక ఇందు నిమిత్తమును యూదులు ఆయనను చంపవలెనని మరి ఎక్కువగా ప్రయత్నము చేసిరి" (యోహాను 5:18).

---

[39] ఈ తప్పుడు మతాల బోధనలను తెలుసుకోవడానికి, దయచేసి Shepherds Global Classroom కోర్సు, "ఈ లోకంలోని విశ్వాస సంప్రదాయాలు" ను అధ్యయనం చేయండి.

యేసు దేవుడని చెప్పుకున్న ఒక ప్రకటనలో, యూదా నాయకులతో, “అబ్రాహాము పుట్టకమునుపే నేను ఉన్నానని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను” (యోహాను 8:58). మండుచున్న పొదలో దేవుడు మోషేకు తనను తాను ప్రత్యక్షపరచుకోవడానికి ఉపయోగించిన మాటలు ఇవి: “మరియు ఆయన–ఉండుననువాడు మీయొద్దకు నన్ను పంపెనని నీవు ఇశ్రాయేలీయులతో చెప్పవలెననెను” (నిర్గమకాండము 3:14). ఈ మాటలతో, యేసు మోషేకు ప్రత్యక్షమైన దేవుడనని చెప్పుకున్నాడు. యేసు మాటల అర్థం ఖచ్చితంగా యూదా నాయకులకు తెలుసు. కాబట్టి, ఆయన్ని చంపడానికి రాళ్ళు ఎత్తారు. ఇది దేవదూషణకు- తనని తాను దేవునిగా చెప్పకోవడానికి- తగిన శిక్ష (లేవీయకాండము 24:16).

యేసును విచారణ చేసినప్పుడు, కయప “పరమాత్ముని కుమారుడవైన క్రీస్తువు నీవేనా?” అని అడిగాడు. యేసు స్పష్టంగా జవాబిచ్చాడు: “అవును నేనే; మీరు మనుష్యకుమారుడు సర్వశక్తిమంతుని కుడిపార్శ్వమున కూర్చుండుటయు, ఆకాశమేఘారూఢుడై వచ్చుటయు చూచెదరని చెప్పెను.” ఈ జవాబుతో, యేసు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండువాడనని, దానియేలు ప్రవచన ఆధారంగా లోకానికి తీర్పుతీర్చడానికి వచ్చు మనుష్యకుమారుడనని చెప్పుకున్నాడు (కీర్తన 110:1 and దానియేలు 7:13-14). యేసు దేవుడుగా చెప్పుకుంటున్నాడని కయపకు తెలుసు. కాబట్టి అతను తన వస్త్రములు చింపుకొని, “ఈ దేవదూషణ మీరు విన్నారు కారా” (మార్కు 14:61-64) అని చెప్పాడు.

యేసు మాటలు నమ్మడానికి మీరు నిరాకరించవచ్చు, కాని మీరు సువార్తలు జాగ్రత్తగా చదివినప్పుడు, యేసు దేవుని కుమారునిగా చెప్పుకున్నాడని ఒప్పుకోకుండా ఉండలేరు. ఆయన మాటలు విన్న శ్రోతలు ఆయన్ను దేవునిగా అంగీకరించడానికి లేక దేవదూషకుడు, అబద్ధ ప్రవక్తయని చెప్పి చంపడానికి బలవంతం చేయబడ్డారు.

### యేసు ప్రేమించినట్లుగా మన పొరుగువారిని ప్రేమించడం

యేసు బోధిస్తుండగా, ఆయన సుంకరులను పాపులను దగ్గరకు తీసుకున్నాడు. యేసు వీరికి బోధించడమే కాదుగాని వారితో కలిసి భుజించాడు. యేసు పాపులతో తినడం చూసిన పరిసయ్యులు, ఆయన్ని విమర్శించారు. యేసు మూడు కథలతో సమాధానం చెప్పాడు. మీరు ఈ కథలు చదివినప్పుడు, నేపథ్యంలో రెండు ముఖ్య విషయాలు గ్రహించాలి.

1. యేసు కాలంలో, ఒక వ్యక్తితో కలిసి తినడం అంటే సంబంధం ఏర్పాటు చేసుకున్నట్టు.[40] యేసు పాపులతో తిన్నప్పుడు, ఆయన వారితో కలిసిపోయాడని అర్థం. ప్రజలు ఆయన దగ్గరకు వచ్చేవరకు దేవుడు వేచియుండడు; బదులుగా, నశించినవారి కొరకు దేవుడే వెదకుతాడని యేసు చూపించాడు.

2. యేసు కాలంలో యూదులు, నీతిమంతులు పాపులతో సాంగత్యం చేయకూడదని భావించారు. మెస్సీయ వచ్చినప్పుడు, ఆయన దుష్టులతో సాంగత్యం చేయక, కేవలం నీతిమంతులతోనే భుజిస్తాడని రబ్బీలు బోధించారు.

► లూకా 15:1-32 చదవండి.

ఇది మూడు భాగాలుగల ఒక పెద్ద ఉపమానం: తప్పిపోయిన గొర్రె, పోయిన నాణెం, తప్పిపోయిన కుమారుడు. ప్రతి సందర్భంలో, తప్పిపోయిన దానిని కనుగొన్న వ్యక్తి ఆనందమే ప్రధాన విషయం. పాపులు మారుమనసు పొందినప్పుడు పరలోకంలో ఆనందముంటుందని యేసు చూపించాడు.

రబ్బీలకు సుప్రసిద్ధ సామెత ఉంది: "దేవుని యెదుట పాపి నశించినప్పుడు పరలోకంలో ఆనందం ఉంటుంది." యేసు దీనిని మార్చి చెప్పాడు: "మారుమనస్సు పొందు ఒక్క పాపి విషయమై పరలోకమందు ఎక్కువ సంతోషము కలుగును." యేసు మరియు ఇతర రబ్బీల మధ్య ఏంటి వ్యత్యాసం? ప్రేమ. ప్రేమగల హృదయంతో పరిచర్య చేయడమంటే ఏంటో యేసు చూపించాడు.

> "సువార్త అంత మంచిగా ఉన్నవారికి కాదు. సువార్త అంత మంచిగా లేనివారికి అని ఈ ఉపమానాలు చూపిస్తాయి."
> - శామ్యూల్ లామర్సన్

మనం ప్రేమలేకుండా పరిచర్య చేసినప్పుడు, హోదా, స్థాయి ప్రజల కంటే ముఖ్యమైపోతాయి. అయితే, ప్రేమగల హృదయంతో పరిచర్య చేసినప్పుడు, నశించినవారి కోసం మన హోదాను త్యాగం చేస్తాం. ప్రేమను పొందాల్సిన అవసరతలో ఉన్నవారిపై ప్రేమను చూపడానికి, యేసు మతాధికారుల విమర్శలు కూడా అనుభవించడానికి ఇష్టపడ్డాడు.

► "మీరు తప్పిపోయిన కుమారుని ప్రేమిస్తారా?" అని మనం అడిగితే, "ప్రేమిస్తాం" అని అందరు చెప్తారు. మనకు సరైన సమాధానం తెలుసు! బదులుగా, "నా మార్గంలో నేను ఎదుర్కొన్న తప్పిపోయిన కుమారుడు ఎవరు? ఆ వ్యక్తిని నేనెలా ప్రేమించాను?" అని అడగండి.

---

[40] సామెతలు.గ్రంథంలో ఇది వివరించబడింది. జ్ఞానం తన బల్ల యొద్ద భుజించుటకు "జ్ఞానంలేనివారిని" పిలుస్తుంది (సామెతలు 9:1-6). జ్ఞానంతో సంబంధం ద్వారా, జ్ఞానంలేనివాడు జ్ఞానవంతుడౌతాడు.

**బాధను అనుభవించే వారిపై కనికరం చూపడం ద్వారా యేసు ప్రేమ చూపించాడు**

సువార్తలు చదివినప్పుడు, ఇతర మతాధికారుల నుండి *పారిపోయినవారు* యేసు యొద్దకు *పరిగెత్తుకురావడం* గమనించారా? పాపులు యేసు కోసం ఎందుకు వెదికారు?

యేసు వారి పాపాలు పట్టించుకోలేదని కాదు; ఆయన పరిసయ్యుల నీతి కంటే అధిక నీతి ఆశించాడు (మత్తయి 5:20). యేసు కనికరంగలవాడు గనుక పాపులు ఆయన యొద్దకు పరిగెత్తుకొచ్చారు. ఆయన పాపాన్ని మినహాయించలేదు, పాప బంధకాల్లో ఉన్న వారిపై కనికరపడ్డాడు.

వ్యభిచారంలో పట్టబడిన స్త్రీతో మాట్లాడిన యేసు మాటల్లో దీన్ని మనం చూడొచ్చు. ఆమెను నిందించువారు వెళ్లిపోయిన తర్వాత, యేసు "నేనును నీకు శిక్ష విధింపను; నీవు వెళ్లి ఇక పాపము చేయకుమని ఆమెతో చెప్పెను" (యోహాను 8:11). యేసు పాపానికి మినహాయింపు ఇవ్వలేదు; పాప బంధకాల్లో నుండి ఆమె విడిపించబడాలని కోరాడు. ఆమెను శిక్షించకుండా కనికరించాడు.

లూకా సువార్త యేసు కనికరం పట్ల శ్రద్ధ చూపుతుంది. లూకా ఇతర మతాధికారులు త్రుణీకరించిన, సుంకపు గుత్తదారుడైన జక్కయ్య కథ చెబుతాడు. చూస్తున్న వారు ఆశ్చర్యపడే విధంగా, పాపి ఇంటిలో అతిథిగా ఉంటానని యేసు చెప్పాడు (లూకా 19:7).

► లూకా 5:12-16 చదవండి.

లూకా ఈ స్వస్థత గురించి నివేదిస్తూ, జనసమూహానికి ఆశ్చర్యం కలిగించే విషయాలు ఇచ్చాడు. యేసు చేయి చాపి, వానిని ముట్టాడు. ప్రాచీన లోకంలో ఎవ్వరు కుష్ఠురోగిని తాకలేదు! అంటువ్యాధి గనుక వైద్యపరంగా ఇది ప్రమాదకరం. ఒక యూదునికి, ఆచారపరంగా ఇది అపవిత్రతకు కారణం.

> "మీరు ఎంత పట్టించుకుంటారో తెలిసేంతవరకు మీకు ఎంత తెలుసు అనే దాని గురించి ప్రజలు పట్టించుకోరు."
> —థియోడర్ రూజ్‌వెల్ట్

యేసు ఎందుకు ఈ కుష్ఠురోగిని ముట్టాడు? ఆయన కనికరపడ్డాడు. "ఆయన కనికర పడి, చెయ్యిచాపి వానిని ముట్టి" (మార్కు 1:41). ఈ కుష్ఠురోగికి భౌతిక స్వస్థత అవసరం, కాని భావోద్వేగ స్వస్థత కూడా అవసరం. కుష్ఠురోగులు ఇతరులకు దూరంగా ఉండాలి. కుష్ఠురోగం వచ్చిన తర్వాత, ఇతడు మరొక మానవుని స్పర్శ అనుభవించలేడు. ఈ కుష్ఠురోగిని ముట్టకుండానే యేసు ఇతనిని స్వస్థపరచగలడు, కాని కుష్ఠురోగికి మరొకరి స్పర్శ అవసరమని ఆయనకు తెలుసు. యేసు కనికరపడ్డాడు.

మనం యేసువలే పరిచర్య చేయాలంటే, యేసువంటి కనికర హృదయం కావాలి. పాపులు యేసు కళ్లలోకి చూసినప్పుడు, కనికరం చూశారు. పాపులు మన కళ్లలోకి చూసినప్పుడు, ఏం చూస్తారు?

**యేసు అవసరతలో ఉన్నవారికి సేవ చేస్తూ ప్రేమ చూపించాడు.**

"పేదవారిని చూస్తే జాలేస్తుంది" అని చెప్పడం సులభం; వారి అవసరాలు తీర్చడం చాలా కష్టం. యేసు తన చుట్టూనున్న ప్రజలకు సేవ చేస్తూ ప్రేమ చూపించాడు. యేసు పరిచర్య అంతా సేవే. యేసు దాసుని స్వరూపం తీసుకుని, తననుతాను రిక్తునిగా చేసుకున్నాడని పౌలు రాశాడు (ఫిలిప్పీయులకు 2:7). "మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెనని" (మార్కు 10:45) యేసు తన శిష్యులకు చెప్పాడు.

యేసు అద్భుతాలు ఇతరులకు తన సేవను కనుపరచాయి. అద్భుతాలు ఆయన మెస్సీయత్వ పరిచర్యకు సంకేతాలు, కాని మానవుని అవసరాలు తీర్చే సాధనాలు. కొన్నిసార్లు అద్భుతాలు కేవలం కొద్దిమందికి మాత్రమే చేయబడ్డాయి. కొన్నిసార్లు అవి అధికారం లేక ప్రభావం లేని ప్రజలకు ప్రయోజనం కలిగించాయి. కొన్నిసార్లు ఆయన అద్భుతాలు (విశ్రాంతి దినమున) ఆయనకు మరింత తిరస్కరణ కొనితెచ్చాయి.

యేసు అధికారుల అనుగ్రహం పొందాలని అద్భుతకార్యాలు చేయలేదు; అవసరతలో ఉన్నవారికి సహాయం చేయాలని చేశాడు. యేసు అద్భుతాలు చేయుటకు తిరస్కరించిన రెండు సందర్భాలు లేఖనాలు జ్ఞాపకం చేస్తాయి. "ఆకాశమునుండి యొక సూచకక్రియను చూపుమని" (మార్కు 8:11) పరిసయ్యులు ఆయనతో వాదించారు. యేసు వారికి సూచన ఇవ్వలేదు. యేసు విచారణలో, ఆయన చేయు సూచక క్రియ చూడాలని హేరోదు ఆశించాడు (లూకా 23:8). యేసు హేరోదుకు ప్రతిస్పందించడానికి కూడా ఇష్టపడలేదు. సందేహంలో ఉన్న ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి లేక వాళ్లు కోరినప్పుడు అద్భుతాలు చేయలేదు.

యేసు హేరోదు అంతిప కోసం అద్భుతం చేయడానికి నిరాకరించినప్పటికీ, ఆయనకు తిరిగి ఏమి చెల్లించలేని జాలరి అత్తను, గ్రుడ్డి బిక్షగాడిని, దయ్యాలు పట్టినవారిని బాగుచేశాడు. ఆయనను విడిచిపెట్టి కృతజ్ఞతలేమి చూపించే 5,000మందికి ఆహారం పెట్టాడు, ఆయనను బంధించడానికి వచ్చే ప్రధాన యాజకుని దాసుని బాగుచేశాడు. యేసు తన అద్భుతాలు ద్వారా అవసరతలో ఉన్నవారికి సేవచేశాడు.

పాస్టర్లు మరియు సంఘ నాయకులుగా, మనకు సహాయం చేసేవారికి సహాయం చేయాలనే నిర్ణయాన్ని సమర్థించుకోవడం సులభం. మనం బీదలతో కాకుండా సంపన్నులతో ఎక్కువ సమయం గడిపినప్పుడు, బహుశ మనమిలా చెబుతాం, "వ్యాపారవేత్తలు సంఘానికి సహాయం చేయగలరు." ఒక ప్రాభల్యం కలిగిన అధికారిని కలవాలని

ఒక విధవరాలి యొద్దకు వెళ్ళటం మానేస్తే, "ఆయన ప్రాభల్యం కలిగిన అధికారి గనుక దేవుని పనికి సహాయం చేస్తాడు" అని మనం సమర్థించుకోవచ్చు. యేసు ఎప్పుడు ఇలా చేయలేదు. మనం యేసువలె పరిచర్య చేయాలంటే, యేసువలె దాసునిగా ఉండాలి. ఆయనవలే, పరిచారం చేయించుకోవడం కాదు, పరిచారం చేయాలి (మత్తయి 20:28). "గనుక మేము మమ్మును గూర్చి ప్రకటించు కొనుటలేదు గాని, క్రీస్తుయేసునుగూర్చి ఆయన ప్రభువనియు, మమ్మునుగూర్చి, యేసు నిమిత్తము మేము మీ పరిచారకులమనియు ప్రకటించుచున్నాము" (2 కొరింథీయులకు 4:5) అని పౌలు రాశాడు.

కొందరు పాస్టర్లు "నాకు మంచి విద్య ఉంది. నేను నా సంఘ విశ్వాసియైన రైతుకు సేవకుడ్ని కాదు!" అని భావిస్తారు. పౌలు ఎప్పుడు ఇలా అనుకోలేదు. పౌలుకు శ్రేష్ఠమైన విద్య ఉంది, కాని యేసును బట్టి అతడు కొరింథీయులకు దాసుడయ్యాడు. ఆయన "నా విద్య చూడు; నేను యూదుల సాహిత్యంలో, గ్రీకు తత్వశాస్త్రంలో, క్రైస్తవ వేదాంతంలో శిక్షణ పొందాను. నేను సన్హెడ్రిన్ లో(మహాసభ), గ్రీకు అరెయొపగులో, రోమా సినేట్ లో మాట్లాడగలను" అని చెప్పి ఉండవచ్చు. కాని అతను "నా యజమానుడైన యేసు నిమిత్తం నేను కొరింథులో విద్యావంతుడుకాని వాని దాసుడను" అని చెప్పాడు.

మనం యేసువలె పరిచర్య చేయాలంటే, దాసునివలె జీవించే విధేయత మనకు కావాలి. దాసులముగా, మన జీవన శైలి గవర్నర్ వంటి ఘనమైన జీవనశైలి కాదు. మనం యేసువలె ప్రేమించాలనుకుంటే, మనం విధేయతగల దాసులుగా ఉండాలి.

**యేసు తన శత్రులపై దయ చూపుతూ ప్రేమ చూపించాడు**

► మత్తయి 5:43-48 చదవండి.

మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండాలని యేసు తనను వెంబడించేవారికి బోధించాడు, అంటే మీ పరలోకపు తండ్రి ప్రేమించినట్లుగా ప్రేమించాలని అర్థం. అంటే, "మీ శత్రువులను ప్రేమించుడి" మరియు "మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి" అని అర్థం. మీరు ఆ విధమైన ప్రేమ చూపినప్పుడు, "మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై" యున్నారని లోకం తెలుసుకుంటుంది.

యేసు కొండమీద ప్రసంగం ప్రకటించడానికి సుమారు 200 సంవత్సరాల క్రితం, యూదా శాస్త్రి సిరాక్ అనే బోధనల సంకలనం చేశాడు. సహాయానికి అనర్హులైన వారితో ఎలా వ్యవహరించాలో అతడు తన అనుచరులకు నేర్పిన విధానం వినండి:[41]

- మీరు మంచి పని చేసినప్పుడు, దాని నుండి ఎవరు ప్రయోజనం పొందుతున్నారో తెలుసుకోండి; అప్పుడు మీరు చేస్తుంది వృథా కాదు.
- దీనులకు మంచి చేయండి, భక్తిలేని వారికి ఏం ఇవ్వద్దు.
- వారికి ఆహారం పెట్టొద్దు, లేక వారు మీ కనికరాన్ని మీకు విరోధంగా ఉపయోగిస్తారు. అలాంటి వారికి మీరు చేసే ప్రతి మంచి, రెండింతల సమస్యను తెచ్చిపెడుతుంది.
- దేవుడు పాపులను ద్వేషిస్తాడు, వారిని శిక్షిస్తాడు.
- మంచివాళ్లకి ఇవ్వండి, కాని పాపులకు సహాయం చేయొద్దు.

యేసు కాలంలో యూదులు బెన్ సిరాను లేఖనంగా పరిగణించేవారు. "నీ పొరుగువాని ప్రేమించి, నీ శత్రువును ద్వేషించుమని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా" (మత్తయి 5:43) అని యేసు చెప్పినప్పుడు దీనిసే సూచిస్తున్నాడు. సికార్ "నీతిమంతులకు మాత్రమే మేలు చేయండి. దుష్టుల పై మంచి పనులు వృథా చేయొద్దు" అని చెబుతుంది.

► ఇప్పుడు మత్తయి 5:43-48 మళ్లీ చదవండి. యేసు బోధ ఆయన ప్రేక్షకులకు ఎందుకు ఆశ్చర్యం కలిగించిందో చూశారా?

పాత నిబంధనలో, తమ శత్రువులను ప్రేమించాలని దేవుడు తన ప్రజలకు బోధించాడు. ఇది క్రొత్తది కాదు. పాత నిబంధన సబ్జెక్టులో కాలేజి విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఒక ప్రశ్న వేశాడు.

*మీ పొరుగువాడు మీ సంఘానికి శత్రువు. మీరు వాళ్ళని దాటుకుంటూ వెళ్తున్న ప్పుడు మిమ్మల్ని శపిస్తాడు. మిమ్మల్ని మోసం చేస్తాడు, మీ పశువులు దొంగిలిస్తాడు. ఒకరోజు తుఫానులో, మీ పొరుగువాని ఎద్దు విడిపించుకుని పారిపోవడం మీరు చూశారు. మీ పొరుగువారి యెడల మీ బాధ్యత ఎలా ఉంటుంది?*

[41] Sirach 12:1-7, *Good News Translation*

*1. కొరడా తీసుకుని ఆవును మరింత దూరం తోలతారా?*

ఇది సరైన సమాధానం కాదని విద్యార్థులకు తెలుసు!

*2. దానిని పట్టించుకోకుండా, "అది నా సమస్య కాదు" అంటారా?*

చాలామంది విద్యార్థులు ఈ ఎంపిక చేసుకుంటారు. "అది పొరుగువాని ఆవు, మాది కాదు. నా పని నేను చేసుకుంటా. పైగా పొరుగువానికి నేనంటే ఇష్టం లేదు; అతనికి నా సహాయం నచ్చదు" అని చెబుతారు.

*3. నిర్గమకాండము 23:4కు విధేయత చూపుతారా? "నీ శత్రువుని యెద్దయినను గాడిదయైనను తప్పిపోవుచుండగా అది నీకు కనబడినయెడల అగత్యముగా దాని తోలుకొనివచ్చి వాని కప్పగింపవలెను."*

పాత నిబంధనలో కూడా, దేవుని ప్రజలు తమ శత్రువులను ప్రేమించవలసి ఉంది. యేసు కాలంలో, ప్రజలు నిర్గమకాండము 23 కంటే *సిరాక్* ఎక్కువగా ప్రస్తావించారు. తమ పొరుగువారిని ప్రేమించి, శత్రువులను ద్వేషించుమని చెప్పే బోధ వారు ఇష్టపడ్డారు. "మీ పరలోకపు తండ్రి మంచివారిని చెడ్డవారిని ప్రేమిస్తున్నాడు గనుక మీరు మీ శత్రువులను ప్రేమించాలని" యేసు చెప్పాడు.

నిజ జీవితంలో ఇదెలా ఉంటుంది? మీ పరిచర్యలో ఈ దృశ్యాన్ని ఆలోచించుకోండి:

*మీ అనేకమైన నమ్మకాలు పంచుకునేవారు మిమ్మల్ని బహిరంగంగా వ్యతిరేకిస్తారు. మిమ్మల్ని ఇబ్బంది పెట్టె ప్రశ్నలడుగుతారు; మీరు అబద్ధ బోధకులని మీ సభ్యులకు చెబుతారు; మీ అనుచరులతో మీకు భేదం కలిగించే పని చేస్తారేమోనని మీకోసం ఎదురుచూస్తారు. అలాటివారిని మీరెలా చూస్తారు?*

*1. వాళ్లని పంపించేసి, మళ్లీ రావద్దని చెబుతారా?*
*2. వారు మీతో ఉన్నట్లుగా మీరు వారితో ఉంటారా?*
*3. వాళ్ల తప్పుల విషయంలో యదార్థంగా ఉండి, ప్రేమతో స్పందిస్తారా?*

యేసును వ్యతిరేకించాలని పరిసయ్యులు అన్ని విధాల ప్రయత్నాలు చేశారు. వాళ్ల తప్పుల విషయంలో ఆయన యదార్థంగా ఉన్నాడు; వాళ్లకి సత్యం బోధించాడు; కాని వాళ్లతో ప్రేమగా వ్యవహరించాడు.

మనం యేసువలే పరిచర్య చేయాలంటే, మన శత్రువులను ప్రేమించాలి. ఇది యేసు ఎక్కువగా కోరుకునే బోధ. మనల్ని మోసగించేవారికి, మన సందేశం తిరస్కరించేవారికి, మనల్ని హింసించేవారికి, యేసు ప్రేమ చూపించాలి.

## అన్వయం: క్రైస్తవుని జీవితంలో యేసు గుణగణాలు

దేవునిని, పొరుగువారిని ప్రేమించడం గురించి రాయడం చాలా సులభం. ఆ ప్రేమ అనుదిన జీవితంలో చూపడం చాలా కష్టం. మన జీవితాల్లో యేసు గుణగణాలు ప్రతిబింబించినప్పుడే, మన లోకంలో ఆయనను పంచుకోవడానికి సిద్ధంగా ఉంటాం.

యేసు స్వభావం కలిగియుండటం మనకు సాధ్యమా? ఆయనవలే ఆలోచించడానికి దేవుడు తన ప్రజలకు శక్తినిస్తాడని లేఖనం సెలవిస్తుంది. దేవుడు ఆశించినట్లుగా ఉండడానికి, ఆయన ఆశించినట్లుగా జీవించడానికి దేవుడు తన ప్రజలకు నూతన ఆత్మ ఇస్తాడు (యెహెజ్కేలు 36:26-27). దేవుడు తన కుమారుని స్వభావం మనలో వృద్ధి చేయాలని ఆశపడుతున్నాడు.

అనుదిన సేవలో విశ్వసనీయత గురించి ఆస్వాల్డ్ ఛాంబర్స్ ఏం చెప్పాడో వినండి:

> మీకు దేవుని దర్శనం లేనప్పుడు, మీ జీవితంలో ఉత్సాహం లేనప్పుడు, మిమ్మల్ని ఎవరు ప్రోత్సహించనప్పుడు, మీరాయన పట్ల చూపే భక్తిలో మరో అడుగు ముందుకు వేయడానికి సర్వశక్తిగల దేవుని కృప అవసరం...సువార్త ప్రకటించడానికి కావలసిన కృప కంటే మరెక్కువ దేవుని కృప చాలా అవసరం.
>
> ఇతరులు ఆ పని చూడనప్పుడు కూడా నిలకడగా ఉండడమే దేవునికి ఆయన ప్రజలకు నిజంగా సాక్ష్యమిచ్చే విషయం. దేవుని వైపు చూడడమే జయ జీవితం గడపడానికి ఏకైక మార్గం. పునరుత్థానుడైన క్రీస్తుని చూడడానికి సహాయం చేయమని దేవుని వేడుకోవాలి...[42]

పరిచర్యలో ఈ విశ్వాస్యతను మనం ఎలా కాపాడుకోగలం? వారం వెంబడి వారం, సంవత్సరాల తరబడి మనం దేవునిని, పొరుగువారిని ఎలా ప్రేమించగలం? మన అనుదిన జీవితంలో యేసు గుణగణాలు పెంపొందించుకోవాలి. దీనికి మనం క్రీస్తు మనసు కలిగియుండాలి.

### క్రీస్తు మనసు వివరణ

► ఫిలిప్పీయులకు 2:1-16 చదవండి.

---

[42] Oswald Chambers, *My Utmost for His Highest* (మార్చి 6 ప్రవేశం). https://utmost.org/taking-the-next-step/ నుండి మార్చి 22, 2021న ప్రాప్తం..

ఫిలిప్పీ సంఘానికి పౌలు ఇచ్చిన ఉపదేశం, యేసు స్వభావం కలిగియుండడానికి శక్తివంతమైన మార్గదర్శిని. వ్యక్తిగత సంఘర్షణలతో నిండిన సంఘానికి, పౌలు "కక్షచేతనైనను వృథాతిశయముచేతనైనను ఏమియు చేయక, వినయమైన మనస్సుగలవారై యొకనినొకడు తన కంటె యోగ్యుడని యెంచుచు మీలో ప్రతివాడును తన సొంతకార్యములను మాత్రమేగాక యితరుల కార్యములను కూడ చూడవలెను" (ఫిలిప్పీయులకు 2:3-4) అని రాశాడు.

వారు దీనిని ఎలా సాధిస్తారు? "క్రీస్తుయేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి" (ఫిలిప్పీయులకు 2:5) అనే పౌలు మాటలకు విధేయత చూపితే సాధిస్తారు.

క్రైస్తవ జీవితానికి తెలియని నాలుగు లక్షణాలు పౌలు ఇచ్చాడు.[43] ఈ లక్షణాలు క్రైస్తవ సాక్ష్యాన్ని, క్రైస్తవ నాయకుని ప్రభావాన్ని నాశనం చేస్తాయి. పౌలు చెప్పాడు:

**(1) కక్ష చేత ఏమియు చేయకూడదు (ఫిలిప్పీయులకు 2:3).**

స్వార్థపూరితమైన ఆలోచన, "ఇందులో నాకేముంది? నాకేంటి ప్రయోజనం?" అని అడుగుతుంది. సిలువకు వెళ్ళడానికి ముందు లేక కుష్ఠురోగిని బాగుచేయడానికి ముందు, "దీని వల్ల నాకేంటి ప్రయోజనం?" అని యేసు అడగడం ఊహించగలరా? ఊహించలేం!

మనం "క్రీస్తుయేసునకు కలిగిన మనసు కలిగియుంటే-క్రీస్తువలే ఆలోచిస్తే- కక్షచేత ఏది చేయము" అని పౌలు చెబుతున్నాడు. మన వైఖరి దాసుని వైఖరిలా ఉంటుంది. "నేనెలా పరిచారం చేయగలను?" అని అడుగుతాం తప్ప "నేనెలా పరిచారం చేయించుకోగలను?" అని అడగము.

**(2) వృథాతిశయముచేత ఏమియు చేయకూడదు (ఫిలిప్పీయులకు 2:3).**

అతిశయం, "ఇది నన్నెలా చూపిస్తుంది? ప్రజలు ఆకర్షితులౌతారా?" అని అడుగుతుంది. మళ్ళీ, యేసు బావి యొద్ద సమరయ స్త్రీని దర్శించడానికి ముందు "ప్రజలు ఆకర్షితులవుతారా?" అని అడగడం మీరు ఊహించగలరా? ఊహించలేరు!

---

[43] Dennis F. Kinlaw, *The Mind of Christ* (Anderson, Indiana: Warner Press, 1988), 101-107 నుండి ఈ భాగం తీసుకున్నారు.

మనం "క్రీస్తుయేసునకు కలిగిన మనసు కలిగియుంటే-క్రీస్తువలే ఆలోచిస్తే- వృథాతిశయంతో ఏది చేయము" అని పౌలు చెబుతున్నాడు. మనం క్రీస్తును చూపించే అవకాశాల కొరకు చూద్దాం కాని హోదాను సంపాదించుకునే అవకాశాలు కోసం కాదు.

**(3) సణుగుకొనక సమస్తం చేయుడి (ఫిలిప్పీయులకు 2:14-15).**

సణుగుడు "నేను దీనికి మించి అర్హుడను!" అని చెబుతుంది. యేసు "నేను శిష్యుల పాదాలు కడగనక్కర్లేదు. నేను బోధకుడను. నేను దీనికి మించి అర్హుడను" అని చెప్పడం ఊహించగలరా? ఊహించలేరు!

మనం "క్రీస్తుయేసునకు కలిగిన మనసు కలిగివుంటే-క్రీస్తువలే ఆలోచిస్తే- క్లిష్ట పరిస్థితులలో కూడా సణుగుకొనక పరిచర్య చేస్తాం" అని పౌలు చెబుతున్నాడు. మనం దేనికీ అర్హులు కాదని గ్రహిస్తాం. మనకున్న సమస్తం దేవుని బహుమానంగా గుర్తించినప్పుడు, పరిచర్యలో వచ్చే సవాళ్ల విషయంలో మన వైఖరి మారుతుంది.

Helen Roseveare (హెలెన్ రోజ్వేరే) ఇరవయ్యవ శతాబ్దంలో ఒక గొప్ప మిషనరీ. ఆమె కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో శిక్షణ పొందిన వైద్యురాలు. జైరెలో మిషనరీ డాక్టర్ గా పనిచేస్తున్నప్పుడు, ఆసుపత్రిని నిర్మించాలనుకుంది. అక్కడ సామాగ్రి లేనందున, మొదటి మెట్టు ఇటుకలు తయారుచేయుట. Dr. Roseveare (డా. రోజ్వేరే) ఒక బట్టీలో ఇటుకలను తయారుచేసే ఆఫ్రికన్ కార్మికులతో కలిసి పనిచేసింది.

ఇటుకల పనిచేస్తున్నప్పుడు, ఆమె మృదువైన చేతులు రక్తస్రావమయ్యాయి. "దేవా, నేను ఇటుకలు తయారు చేయడానికి కాదు, శస్త్రచికిత్స నిపుణురాలుగా ఆఫ్రికాకు వచ్చాను! ఖచ్చితంగా ఈ అల్పమైన పని చేయడానికి మిగిలిన వాళ్లు ఉన్నారు" అని సణుగుకుంటూ ఉండేది.

కొన్ని వారాల తర్వాత, ఒక ఆఫ్రికా కార్మికుడు ఆమెతో, "డాక్టరుగారు, మీరు శస్త్రచికిత్స గదిలో ఉన్నప్పుడు, డాక్టర్ గా మమ్మల్ని భయపెడతారు. కాని మాతో పాటు ఇటుకులు తయారుచేస్తున్నప్పుడు, మావలే మీ చేతులు రక్తం చిందుతున్నప్పుడు, మీరు మా సహోదరిగా, మేం మిమ్మల్ని ప్రేమిస్తాం" అని చెప్పాడు. Dr. Roseveare (డా. రోజ్వేరే) వెంటనే, "దేవుడు నన్ను ఆఫ్రికా దేశానికి శస్త్రచికిత్స నిపుణురాలుగా మాత్రమే పంపలేదు; క్రీస్తు ప్రేమను చూపించడానికి కూడా నన్ను పంపాడు" అని గ్రహించింది.

**(4) సంశయాలను మాని, సమస్త కార్యాలను చేయుడి (ఫిలిప్పీయులకు 2:14-15).**

సంశయం, “అవును, ప్రభువా, కాని....నేను విధేయత చూపడానికి ఇష్టపడుతున్నాను, కాని....” అని అంటుంది. మళ్ళీ, యేసు ఇలా చెప్పడం మీరు ఊహించగలరా: “తండ్రీ, నేను నిన్ను సేవిస్తాను; ఇది ఎందుకు కష్టంగా ఉంచారు?” యేసు తండ్రితో తన సందేహాన్ని వెల్లడి చేయడం మనం ఊహించలేం.

పౌలు, మనకు క్రీస్తుయేసునకు కలిగిన మనసు ఉంటె- మనం క్రీస్తువలే ఆలోచిస్తే- వాదించి, సులభ మార్గం ఎన్నుకోము” అని చెబుతున్నాడు. సులభమైన మార్గం కోసం అడగడం ద్వారా మన జీవితాల్లో దేవుని చిత్తంతో రాజీపడం. “సరే ప్రభువా” అని దేవునికి మనం సమాధానం ఇస్తాం. క్రీస్తుయేసునకు కలిగిన మనసు కలిగియుంటాం.

ఫిలిప్పీయులు క్రీస్తుయేసునకు కలిగిన మనసు కలిగియుండాలని పౌలు పిలుపునిచ్చాడు గనుక, అది సాధ్యమని అతడు నమ్మాడు. యేసు మాదిరిని సూచించే వినయం, విధేయత వారు కలిగియుంటారని అతనికి తెలుసు. ఈ క్రీస్తు మనసు మనం ఎలా పొందుకుంటాం?

**మన మనసులు లేఖనాల ద్వారా రూపాంతరం పొందుతాయి**

మునుపు ఈ పాఠంలో, లేఖనం దేవుని చిత్తం గురించి ఎలా బోధిస్తుందో మనం చూశాం. యేసుకు దేవుని వాక్యం తెలుసు. అపొస్తలులకు దేవుని వాక్యం తెలుసు. సంఘ చరిత్రలోని ప్రతి ఉజ్జీవ కార్యక్రమం దేవుని వాక్య అధ్యయనంతో మొదలైంది.

ఫిలిప్పీ విశ్వాసులు జీవవాక్యం చేత పట్టుకోవాలని పౌలు సవాలు చేశాడు (ఫిలిప్పీయులకు 2:16). సువార్తలో వారి నమ్మకం, వారి సమర్పణ లోకంలో వారిని వెలుగుగా చేస్తుంది.

దేవుని వాక్యాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయడం ద్వారానే మనం యేసువలే ఆలోచించడం మొదలుపెడతాం, క్రీస్తు మనసు కలిగియుంటాం. అంటే లేఖనాలు అర్థం చేసుకోవడానికి మీరు హెబ్రీ, గ్రీకు భాషలు నేర్చుకోవాలని కాదు; మీకు పెద్ద పెద్ద బైబిల్ వ్యాఖ్యానాలు ఉండాలని కాదు; దేవుని వాక్యంలో ఎక్కువ సమయం గడపాలి. అది మీ అనుదిన జీవితంలో భాగం కావాలి.

క్రైస్తవులమైన మనకు, దేవుని వాక్యం అనుదిన ఆహారం. అది కేవలం బాధ్యత కాక ఆనందంగా ఉండాలి. “నువ్వు ఈ రోజు తినాలి! తినకపోతే, అనారోగ్యానికి గురౌతావు” అని ఆరోగ్యవంతునికి ఎవరు చెప్పక్కర్లేదు. మీరు చేయవలసిన పని, మంచి ఆహారం అందుబాటులో ఉంచడం, ఆరోగ్యవంతుడైన వ్యక్తి భుజించటం! దేవుని వాక్యం ఆకలిగొన్న ప్రతి క్రైస్తవునికి ఆహారం.

మనం దేవుని వాక్యం భుజిస్తుండగా, మన మనసులు క్రీస్తు మనసువలే మారతాయి. చాలామంది క్రైస్తవులు తిరిగి జన్మించారు, కాని అవిశ్వాసులుగానే ఆలోచిస్తూ ఉంటారు. వాళ్ల మనసులు క్రీస్తు మనసువలే మారలేదు. ఎందుకు?

నూతన విశ్వాసులుగా, క్రీస్తువలే ఆలోచించునట్లుగా మన మనసులు మార్చుకోవాలి. మీరు క్రైస్తవులుగా మారక మునుపు, మీ అవసరాలు గురించి మొదటిగా ఆలోచించేవారు. బీదవాని చూసి, "నాకు డబ్బు కావాలి. నేను అతనికి ఇవ్వలేను" అని ఆలోచించి ఉంటారు. క్రైస్తవునిగా, మీరు దేవుని వాక్యంలో "బీదలకిచ్చువానికి లేమి కలుగదు" (సామెతలు 28:27) అనే మాటలు చదువుతారు. యేసు మాటలు వింటారు, "ఇయ్యుడి, అప్పుడు మీకియ్యబడును; అణచి, కుదిలించి, దిగజారునట్లు నిండు కొలతను మనుష్యులు మీ ఒడిలో కొలుతురు. మీరు ఏ కొలతతో కొలుతురో ఆ కొలతతోనే మీకు మరల కొలువబడునని చెప్పెను" (లూకా 6:38). క్రీస్తు డబ్బు గురించి అలోచించినట్లుగా మీరు ఆలోచించడం మొదలుపెడతారు. దేవుని వాక్యం ద్వారా మీరు క్రీస్తు మనసు పొందుకుంటారు.

మనం క్రైస్తవులము కాకమునుపు, మనలను బాధించేవాళ్ళని బాధించాం. మన యెడల కఠినంగా ఉన్న వారిని, కోపంతో కొట్టి ఉంటాం. కాని క్రైస్తవులుగా, "మీరు జాలిగల మనస్సును...ధరించుకొనుడి" (కొలొస్సయులకు 3:12) అని చదువుతాం. "ఆశీర్వాదమునకు వారసులవుటకు మీరు పిలువబడితిరి గనుక కీడుకు ప్రతికీడైనను దూషణకు ప్రతి దూషణయైనను చేయక దీవించుడి" (1 పేతురు 3:9) అని చదువుతాం. క్రీస్తు తనను బాధించిన వారి పట్ల ఎలా స్పందించాడో అదేవిధంగా స్పందించడం మొదలుపెడతాం. దేవుని వాక్యం ద్వారా మనం క్రీస్తు మనసు పొందుకుంటాం.

**మన మనసులు అనుదిన సమర్పణ ద్వారా రూపాంతరం పొందుతాయి**

క్రీస్తుయేసునకు కలిగిన ఈ మనసు మీరు కలిసియుండుడని పౌలు ఫిలిప్పీయులకు చెప్పాడు. ఈ మనసు గురించి వివరించాడు, వాళ్ల జీవితాల్లో అదెలా కలుగుతుందో చెప్పాడు. వాళ్లు విధేయతతో తమ సొంత రక్షణ కొనసాగించాలి-తమ రక్షణ సంపాదించుకోవాడానికి కాదుగాని-దేవుడు కార్యసిద్ధి కలుగజేస్తున్నాడు గనుక, "తన దయాసంకల్పము నెరవేరుటకై మీలో కార్యసిద్ధి కలుగజేయువాడు దేవుడే" (ఫిలిప్పీయులకు 2:12-13). వాళ్లు దేవునికి అప్పగించుకొనుచుండగా, ఆయన వారికి దైవికంగా జీవించే ఆశను, ("సంకల్పం") శక్తిని ("పని చేయుటకు") ఇస్తాడు.

మనం సమర్పణగల జీవితం గడుపుతుండగా, యేసు జీవితం పరిచర్యలో చూసే అదే గుణలక్షణాలను పరిశుద్ధాత్ముడు మనలో పెంపొందిస్తాడు. మన ప్రయత్నాల ద్వారా క్రీస్తు మనసు మనం కనుగొనలేము; సమర్పణ ద్వారా క్రీస్తు మనసు కనుగొనగలము.

ఇది అనుదిన సమర్పణగా ఉండాలి. పౌలు మనలను పిలిచాడు: సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు (రోమా 12:1). సజీవ యాగం మృతమైనది కాదు; అది జీవించడమే కొనసాగిస్తుంది. ఒక సమర్పణలో మనం మన

చిత్తాన్ని పూర్తిగా దేవుని చిత్తానికి అప్పగిస్తాం, కానీ అనుదినం మనం ఆయన చిత్తానికి లోబడుతూ కొనసాగించవలసి ఉంటుంది.

Nancy Leigh DeMoss (నాన్సీ లీ డెమోస్) సమర్పణగల జీవితం గురించి ఒక చిత్రం ఇచ్చాడు.[44] మీరు ఈ వివరాలు చదివేటప్పుడు, ఈ విషయంలో నేను అనుదిన సమర్పణతో జీవిస్తున్నానా? ఈ విషయంలో క్రీస్తు మనసు కలిగియున్నానా?" అని అడగండి.

- మీ శరీర స్వభావం విమర్శనాత్మక పదాలు పలుకనుద్దేశించినప్పుడు, "ఎవనిని దూషింపక" (తీతుకు 3:2) అని ఆత్మ చెబుతాడు. సమర్పణగల హృదయం "అవును" అని చెబుతుంది.
- మీ శరీర స్వభావం కష్టాలు గురించి ఫిర్యాదు చేసినప్పుడు, "ప్రతి విషయమునందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి" (1 థెస్సలొనీకయులకు 5:16-18) అని ఆత్మ చెబుతాడు. సమర్పణగల హృదయం "అవును" అని చెబుతుంది.
- మీ శరీర స్వభావం, ఇబ్బంది పెడుతున్న యజమానిని ఎదిరించాలనుకున్నప్పుడు, "మనుష్యులు నియమించు ప్రతి కట్టడకును ప్రభువునిమిత్తమై లోబడియుండుడి" (1 పేతురు 2:13) అని ఆత్మ చెబుతాడు. సమర్పణగల హృదయం "అవును" అని చెబుతుంది.

మనం సమర్పించుకున్నప్పుడు, క్రీస్తులో నివసించిన ఆత్మ మనలో నివసిస్తాడు. మనకుండే మంచి ఉద్దేశ్యాల ద్వారా కాదు గాని ఆత్మ ద్వారా అనుదిన జీవితంలో పరిచర్యలో నిరాశలు ఎదురైనప్పుడు, సాతాను శోధించినప్పుడు క్రీస్తువలే స్పందించే శక్తి మనకు ఉంటుంది.

> "పరిశుద్ధ జీవిత రహస్యం యేసును అనుకరించడంలో లేదుగాని, నా జీవితంలో యేసును కలిగివుండడంలో ఉంది.. పవిత్రీకరణ అంటే పరిశుద్ధంగా ఉండడానికి యేసు నుండి శక్తి పొందుకోవడం కాదుగాని ఆయనలో ప్రత్యక్షపరచబడిన పరిశుద్ధత నుండి పొందుకోవడం. "
> - ఓస్వాల్డ్ ఛాంబర్స్

► శరీరసంబంధమైన కోరికలు దేవుని చిత్తానికి విరుద్ధంగా ఉన్న సందర్భాన్ని పంచుకోండి. ఈ శోధన ఎదుర్కొన్నప్పుడు మీరు అనుదిన సమర్పణ విషయంలో ఎలా ఉన్నారు? మీరు మళ్ళీ దేవుని చిత్తానికి అప్పగించుకోవలసిన ప్రస్తుత శోధన ఏదైనా ఉందా? తరగతిగా, ఈ విషయాల్లో ఒకరికొకరు ప్రార్థించండి.

---

[44] Nancy Leigh DeMoss, *Surrender*. (Chicago: Moody Press, 2008), 223-224 నుండి తీసుకున్నారు.

## ముగింపు: దేవుడు క్రీస్తు-వంటి ప్రేమ ద్వారా కార్యం చేస్తాడు

మనం సమస్యాత్మక లోకంలో జీవిస్తున్నాం. ఈ పాఠాలు చదువుతున్న అనేకులు, ప్రభుత్వం, అబద్ధ మతాలు లేక సాంఘిక ఒత్తిళ్లకు లోనైన సంఘ పరిస్థితుల్లో జీవిస్తున్నారు. మన శత్రువులను ప్రేమించడం ద్వారా మన లోకాన్ని మార్చగలమని ఆలోచించడం సమంజసమేనా? మన శత్రువు మనల్ని చంపడానికి ప్రయత్నిస్తున్నప్పుడు ఎలా ప్రేమించగలం?

ఒక విలేఖరి బాగ్దాద్ లో నివసిస్తున్న ఇరాక్ కి చెందిన క్రైస్తవునితో మాట్లాడాడు.[45] విలేఖరి ఈ వ్యక్తితో మాట్లాడుతుండగా, ISIS సైనికులు 40 నిమిషాల దూరంలో ఉన్నారు. "మీ సంఘం ఆరాధన కోసం సమావేశమవుతుందా?" అని విలేఖరి అడుగగా, అతడు:అవును! నిజానికి, మా సంఘంలో మరో రెండు ప్రార్థన బృందాలు మొదలుపెట్టాం-ఒకటి ఉత్తర ప్రాంతంలో హింసల గుండా వెళ్తున్న మా సోదరుల కొరకు ప్రార్థిస్తుంది, మరొకటి శత్రువుల కొరకు ప్రార్థిస్తుంది" అని చెప్పాడు.

బాగ్దాద్ లోని St. జార్జ్ సంఘ సభ్యులు తమ శత్రువుల కొరకు ప్రార్థించారు. ముస్లిం విధవరాళ్లకు ఆహార పొట్లాలు అందించారు. వారు యేసు మాదిరి అనుసరించడానికి పిలువబడ్డారని నమ్మారు గనుక తమ శత్రువులను ప్రేమించారు.

సంఘ చరిత్ర అంతటా కనిపించే సత్యాన్ని ఇది మనకు జ్ఞాపకం చేస్తుంది. దేవుడు పని చేసే విధానం ఎల్లప్పుడు మనుష్యులు పని చేసే విధానానికి భిన్నంగా ఉంటుంది. మధ్య యుగంలో మానవుడు ముస్లింలకు వ్యతిరేకంగా సైనిక క్రూసేడ్ల ద్వారా పనిచేస్తాడు; 82 ఏళ్ల వయసులో ఇస్లాం దేశంలో తన చివరి మిషనరీ పర్యటనలో ఉండగా మరణించిన రేమండ్ లల్ ద్వారా దేవుడు పనిచేశాడు. మనిషి సైనిక బలం (ఆర్మీ) ద్వారా పనిచేస్తాడు; చైనా అంతర్భాగాల్లో సువార్త ప్రకటనకు తన జీవితాన్ని కేటాయించిన హడ్సన్ ద్వారా దేవుడు పని చేశాడు. మనిషి బలంతో పనిచేస్తాడు; దేవుడు బలహీతల ద్వారా పనిచేస్తాడు.

దేవుని మార్గం మనిషి మార్గానికి భిన్నం. కానీ తుదకు, దేవుని మార్గమే గెలుస్తుంది. క్రైస్తవులు యేసువలే ప్రేమించినప్పుడు మన లోకం నిత్యత్వంలా మారిపోతుంది. మార్పు నెమ్మదిగా బాధగా ఉంటుంది కాని పతనమైన లోకంలో దేవుడు ఆ విధంగానే పనిచేస్తాడు.

యేసువలే పరిచర్య చేయడం అంటే యేసువలే ప్రేమించాలి. ఒక వృద్ధ సువార్తికుని ఆయన పరిచర్య రహస్యం ఏమిటని అడిగారు. అతడు, "దేవుడు వారిని ఎంత ప్రేమిస్తున్నాడో ప్రజలు తెలుసుకోవడం కొరకు మీరు వారిని ఎంత

---

[45] Mindy Belz, "How Does the Church Move the World?" *World Magazine*, May 27, 2017

ప్రేమిస్తున్నారో చూడటమే ఏకైక మార్గం" అని చెప్పాడు. ఈ సువార్తికుడు క్రీస్తు ప్రేమ మనద్వారా ప్రకాశించినప్పుడు, లోకాన్ని దేవుని యొద్దకు తీసుకెళ్లగలమని అర్థం చేసుకున్నాడు. యేసువలే ప్రేమించడమంటే ఇదే.

## పాఠం 7 అభ్యాసాలు

ఈ పాఠంలో, యేసు ఎలా ప్రేమించాడో మనం చూశాం. మీ పొరుగువారిని ప్రేమించడంలో యేసు మాదిరిని అనుసరించే మార్గాలు కనుగొనాలని ఈ అభ్యాసం కోరుతుంది. ఈ అభ్యాసం పూర్తి చేయడానికి ఎక్కువ సమయం పట్టదు; కాని దానిని ఆచరించడానికి సమయం పడుతుంది! ఆచరించడంలో విఫలమవ్వద్దు. మనం యేసువలే ప్రేమించాలి.

సువార్తల నుండి, ప్రజల యెడల యేసు చూపిన ప్రేమకు మూడు ఉదాహరణలు ఇవ్వండి. మీ జీవితంలో మూడు అన్వయాలు ఇవ్వండి. యేసు మాదిరిని మీరు ఎలా అనుకరిస్తారు? ఈ అభ్యాసం మీ కోసమే; సాధ్యమైనంత నిర్దిష్టంగా ఉండండి.

| యేసు మాదిరి | నా అన్వయం |
|---|---|
| | |
| | |
| | |

# పాఠం 8

# సిలువ మరియు పునరుత్థానం

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) యేసు పరిచర్యలో ప్యాషన్ వీక్ సందర్భంగా భిన్నమైన ప్రతిస్పందనలను గుర్తించండి.

(2) సజీవమైన ఉపమానంగా అంజూరపు చెట్టును శపించుట అర్థం చేసుకొంటారు.

(3) పేతురు వైఫల్యాలకు నడిపిన బలహీనతలు గుర్తిస్తారు.

(4) క్రైస్తవ జీవితం మరియు పరిచర్యకు పునాదిగా సిలువ, పునరుత్థానాన్ని అభినందిస్తారు.

## పరిచర్యకు సూత్రం

ప్రభావవంతమైన పరిచర్యంతా సిలువ పునరుత్థాన శక్తిలో జరుగుతుంది.

## పరిచయం

సువార్తలలో చివరిది శ్రమను గూర్చిన కథ (సిలువ). సువార్తలలోని 89 అధ్యాయాల్లో, 30 అధ్యాయాలు యెరూషలేములో విజయోత్సవ ప్రవేశం మరియు పునరుత్థానం మధ్య జరిగిన సన్నివేశాలకే కేటాయించారు. యోహాను సువార్తలో సుమారు సగానికి సగం ఈ వారంలో జరిగిన సంఘటనలకే కేటాయించారు. యేసు పూర్తి జీవితం, ఆయన పరిచర్య సూచించిన చివరి ఘట్టం ఇదే. ఈ పాఠంలో, యేసు ఈ లోకంలో చేసిన పరిచర్య చివరి వారాన్ని అధ్యయనం చేసి, మన జీవితానికి, పరిచర్యకు పాఠాలు నేర్చుకుందాం.

► ఈ పాఠం కొనసాగించే ముందు, రెండు ప్రశ్నలు చర్చిద్దాం:

- వేదాంతపరంగా, వ్యక్తిగతంగా సిలువ నాకు ఎలా వర్తిస్తుంది?
- వేదాంతపరంగా, వ్యక్తిగతంగా పునరుత్థానం నాకు ఎలా వర్తిస్తుంది?

## యేసుకు ఇచ్చిన ప్రతిస్పందనలు: యేసు బహిరంగ పరిచర్య చివరి వారం

సువార్తికులు ప్రాధమికంగా నొక్కి చెప్పిన విషయాలలో ఒకటి, యేసును ముఖాముఖిగా ఎదుర్కొనినవారి ప్రతిస్పందన. ఉదాహరణకు, యేసు జీవిత ఆరంభంలో, మత్తయి జ్ఞానుల ఆరాధనకు, ప్రత్యర్థి రాజును చంపడానికి చూసిన హేరోదు

ప్రతిస్పందనకు మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. యోహాను బావి యొద్ద చదువులేని సమరయ స్త్రీతో చేసిన సంభాషణకు, యూదుల బోధకుడైన నీకొదేము ప్రశ్నకు ప్రతిస్పందించడానికి మధ్యనున్న వ్యత్యాసాన్ని వివరించాడు.

► మత్తయి 10:32-39 చదవండి.

యేసు సందేశ విషయంలో ఎవ్వరు తటస్థంగా ఉండరు; అయితే ఆయన మాటలు అంగీకరిస్తారు లేక తిరస్కరిస్తారు. యేసు తన పరిచర్య గురించి, ఈ రెండు బృందాలను వేరు చేసే ఖడ్గంగా వివరించాడు. తమ స్పందన ఆధారంగా కుటుంబాలు విభజించబడతాయి; యేసు కుటుంబం కూడా ఈ పరీక్ష ఎదుర్కొంది (యోహాను 7:5, మార్కు 3:21). ఎవ్వరు తటస్థంగా ఉండరు.

యేసుకు విరుద్ధమైన ప్రతిస్పందనలు, ఆయన బహిరంగ పరిచర్య చివరి వారంలో మరింత నాటకీయంగా కనిపిస్తాయి. ఈ వైరుధ్యం సిలువలో కూడా కొనసాగింది, ఇద్దరు దొంగలు యేసుకు భిన్నంగా ప్రతిస్పందించారు.

**లాజరును లేపిన సందర్భంలో ప్రతిస్పందనలు**

► యోహాను 11:1-57 చదవండి.

లాజరును లేపడానికి ముందు, మతాధికారులు యేసును వ్యతిరేకించారు. శీతాకాలంలో ప్రతిష్ఠిత పండుగ సమయంలో యేసు దేవాలయాన్ని దర్శించినప్పుడు, ఆయన దేవదూషణ చేస్తున్నాడని మతాధికారులు రాళ్లతో కొట్టడానికి ప్రయత్నించారు. అది ఆయన త్యాగానికి సమయం కాదు గనుక, యేసు యెరూషలేమను మతపరమైన కేంద్రం నుండి తప్పించుకుని యోర్దాను వైపుకు వెళ్ళాడు (యోహాను 10:22-42).

లాజరు చనిపోయాడన్న వార్త విన్నప్పుడు, యేసు యూదయకు తిరిగి వెళ్ళటం ప్రమాదమని శిష్యులకు తెలుసు. పాఠకులు తోమా అనుమానం, నిరాశావాదాన్ని అవమానిస్తారు కాని అతడు తన యజమాని యెడల నమ్మకంగా ఉన్నాడు. యేసును యూదయలో చంపుతారని అతడు సరిగానే ఊహించాడు, అయితే తోమా నమ్మకస్తుడు. యేసు యూదయకు వెళ్ళాలని నొక్కి చెప్పినప్పుడు, “ఆయనతోకూడ చనిపోవుటకు మనమును వెళ్లుదము” (యోహాను 11:16)అని తోమ తన తోటి శిష్యులతో చెప్పాడు. తోమా తరువాత అనుమానం వ్యక్తపరచినప్పటికీ, ఈ భయపడే ఈ శిష్యుని నమ్మకత్వాన్ని మనం మర్చిపోకూడదు. పునరుత్థానం తర్వాత, తోమా భారతదేశానికి సువార్త తీసుకెళ్ళి, అక్కడ హతసాక్షి అయ్యాడని ఆశ్చర్యపోతున్నారా?

బేతనియ వంటి చిన్న గ్రామంలో, లాజరును లేపడాన్ని రహస్యంగా ఉంచలేదు. అలాంటి నాటకీయ సంఘటనను దాచే విధానం మతాధికారులకు లేదు. ఈ అద్భుతానికి వివిధ ప్రతిస్పందనలు వచ్చాయని యోహాను చూపించాడు.

*జనసమూహం ప్రతిస్పందన*

లాజరును లేపిన వార్త వ్యాప్తి చెందగా, యేసు రోమాను పడద్రోసి, యెరూషలేములో దావీదు సింహాసనం స్థిరపరుస్తాడని ప్రజలంతా ఆశించారు. యేసు వాగ్దానం చేయబడిన మెస్సీయని నమ్మారు. "కాబట్టి మరియ యొద్దకు వచ్చి ఆయన చేసిన కార్యమును చూచిన యూదులలో అనేకులు ఆయనయందు విశ్వాసముంచిరి" (యోహాను 11:45 మరియు 12:11). "ఇదిగో లోకము ఆయనవెంటపోయినదని చెప్పుకొనిరి" (యోహాను 12:19) అని యేసు గురించి పరిసయ్యుడు మాట్లాడిన మాటలు చాలామంది నమ్మారు. యేసు గాడిదపై యెరూషలేములోకి ప్రవేశించినప్పుడు, ఇది జనసమూహంలో ఉత్సాహాన్ని ప్రేరేపించింది.

*మతాధికారుల ప్రతిస్పందన*

లాజరును లేపటం, మతాధికారులు యేసును మెస్సీయగా తిరస్కరించే విధానాన్ని పాడుచేసింది. జనసమూహమంత యేసు వైపు మొగ్గు చూపినందున, మతాధికారులకు కేవలం రెండు ఎంపికలు మాత్రమే మిగిలాయి:

1. **యేసు తాను ప్రకటించినట్లు మెస్సీయ అని నమ్మడం.** అయితే, అధికారం కొరకు వారికున్న ఆశను వారు ఆయనకు అప్పగించుకోవాలి. యేసు అప్పటికే వారి వేషధారణ ప్రవర్తనను ఖండించాడు. యేసు మెస్సీయని వారు ఒప్పుకుంటే, యూదా ప్రజలకు నాయకులుగా వారు తమ అధికారాన్ని కోల్పోతారు.

2. **యేసును పట్టుకుని చంపడం.** యేసు మెస్సీయగా అంగీకరించకపోతే, వారు ఆయనను చంపుతారు.

యేసును చంపటం రాజ్యానికి ఉత్తమమైన విషయంగా మతాధికారులు సమర్థించారు. చరిత్రయంతటిలోని బలహీనమైన నాయకులవలే, వారు తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. "కాబట్టి ప్రధానయాజకులును పరిసయ్యులును మహా సభను సమకూర్చి–మనమేమి చేయుచున్నాము? ఈ మనుష్యుడు అనేకమైన సూచక క్రియలు చేయుచున్నాడే. మనమాయనను ఈలాగు చూచుచు ఊరకుండినయెడల అందరు ఆయనయందు విశ్వాసముంచెదరు; అప్పుడు రోమీయులు వచ్చి మన స్థలమును మన జనమును ఆక్రమించుకొందురని చెప్పిరి" (యోహాను 11:47-48). యేసు రోమాకు వ్యతిరేకంగా విప్లవం నడిపిస్తాడని వారు భయపడ్డారు. ఆయన రాజ్యం ఆత్మీయమైనదని వారు గ్రహించలేకపోయారు.

"మన స్థలమును" అంటే బహుశా దేవాలయాన్ని సూచిస్తుంది, మరియు "మన జనమును" అంటే ఇది రోమీయులు యూదులకు ఇచ్చిన స్వాతంత్ర్యాన్ని సూచిస్తుంది (అపొస్తలుల కార్యములు 6:13 మరియు అపొస్తలుల కార్యములు 21:28 చూడండి). యూదయ రోమా ఆధీనంలో ఉన్నప్పటికీ, యూదులు దేవాలయంలో ఆరాధించేవారు,

మతపరమైన నియమాలు పాటించేవారు, సన్హెడ్రిన్/మహాసభ ద్వారా కొంతమేరకు పౌర వ్యవహారాలు నడిపించుకుంటారు. రోమా తిరుగుబాటును పతనం చేస్తే ఇదంతా నాశనమైపోతుంది.

జనమంతయు నశించిపోకుండా ఒక మనుష్యుడు చనిపోవడం ఉత్తమమని కయప సన్హెడ్రిన్ కు ధృవీకరించాడు (యోహాను 11:49-50). వ్యంగ్యంగా, యేసును చంపిన తరువాత, సన్హెడ్రిన్ భయం నిజమైంది. యేసును చంపిన నలబై సంవత్సరాలకు, రోమీయులు యూదుల తిరుగుబాటుదారులను అణచివేసి, దేవాలయాన్ని నాశనం చేశారు, యూదా ప్రజల హక్కులు తీసివేశారు, కయప నివారించడానికి చూసిన ప్రతి పనిని చేశారు.

రుజువులన్నిటిని నాశనం చేయకుండా వారు ఈ అద్భుతాన్ని దాచిపెట్టలేకపోయారు గనుక, రాజ్య రక్షణ కొరకు యేసును మరియు లాజరును చంపాలని సన్హేడ్రిన్/మహాసభ నిర్ణయించింది (యోహాను 11:53 మరియు యోహాను 12:10). అద్భుతాలు ఖచ్చితంగా అవిశ్వాసులను నమ్మించలేవు. మనం చాలాసార్లు ఇలా ఆలోచిస్తాం, “ఒక అద్భుతం ద్వారా దేవుడు తననుతాను ‘నిరూపించుకుంటే,’ అందరు నమ్ముతారు.” అయితే, సంశయవాదికున్న అవిశ్వాసాన్ని బట్టి అద్భుతం అతని హృదయాన్ని మరింత కఠినపరుస్తుంది.

ధనవంతుడు, లాజరు కథలో (యేసు లేపిన లాజరు కాదు), తన సోదరులను హెచ్చరించుటకై లాజరును పంపుమని ధనవంతుడు అబ్రాహామును వేడుకున్నాడు. అప్పుడు అబ్రాహాము, “ప్రవక్తలును (చెప్పిన మాటలు) వారు విననియెడల మృతులలోనుండి ఒకడు లేచినను వారు నమ్మరని” (లూకా 16:31) చెప్పాడు. సత్యానికి లేఖనమే చాలినంత ఆధారం. మనం లేఖనాలు విస్మరిస్తే, ఇతర సాక్ష్యాలు మనలను ఒప్పించలేవు.

**యేసుకు ఇచ్చిన ప్రతిస్పందన: మరియ**

► మత్తయి 26:6-13 మరియు యోహాను 12:1-11 చదవండి.

యేసు భూమిపై చేసిన పరిచర్య అంతటా, లాజరు మార్తాల సహోదరియైన మరియ, ఆయనను భయభక్తులతో అనుసరించినవారిలో ఒకరు. ముందు జరిగిన కథలో, మార్తా అనేక పనుల భారంతో ఉండగా మరియ యేసు మాటలు వినడానికి కూర్చుందని మార్తా ఫిర్యాదు చేసింది. ఆ కథలో, యేసు మరియను కొనియాడాడు. “ఉత్తమమైనదానిని ఏర్పరచుకొనెను, అది ఆమె యొద్దనుండి తీసివేయబడదు” (లూకా 10:42).

ఆయన మరణానికి వారంలోపే, యేసు ఆయన శిష్యులు కుష్ఠురోగియైన సీమోను ఇంటిని దర్శించారు. లాజరు మరియు అతని సహోదరీలను కూడా అక్కడికి ఆహ్వానించారు. భోజనం సమయంలో, మరియ విలువైన అత్తరు యేసు

తల, పాదాలు మీద పోసింది. ఈ అత్తరు వెల, ఒక సంవత్సరం వేతనమైన మూడు వందల దేనారాలు. బ్యాంకులు లేని దినాల్లో, బహుశ ఇది మరియ పొదుపు కావచ్చు.

మరియ చాలా డబ్బు వృథా చేసిందని శిష్యులు కోపపడ్డారు (మత్తయి 26:8, మార్కు 14:5), కాని మరియ మాత్రం యేసు ప్రతిస్పందన కొరకు చూసింది. ఆమె ప్రేమతో ఆ పని చేసింది గనుక ఇతరులు ఏమనుకుంటారో అనే విషయం ఆమె పట్టించుకోలేదు. ఆ అత్తరు వెల ఎంతో పట్టించుకోలేదు, ఇతరులు ఏమనుకుంటారో అనే విషయం ప్రక్కన పెట్టింది. ఆమె తన యజమానుని ఆరాధించింది, మరేది పట్టించుకోలేదు.

మరియ పనిని శిష్యులు వ్యతిరేకించారు, యేసు వారిని గద్దించాడు: "ఈమె జోలికిపోకుడి; ఈమెను ఎందుకు తొందరపెట్టుచున్నారు? ఈమె నాయెడల మంచి కార్యము చేసెను" (మార్కు 14:6). సిలువకు ఇంకా కొన్ని రోజులు మాత్రమే ఉన్నాయని గ్రహించి, యేసు ఆమె చేసిన ఆ సూచనార్థక పనిని గుర్తించాడు: "ఈమె యీ అత్తరు నా శరీరము మీద పోసి నా భూస్థాపన నిమిత్తము దీనిని చేసెను" (మత్తయి 26:12). తన ఉత్తమమైనదాన్ని నిస్వార్థమైన ప్రేమపూర్వక ఆరాధనగా అర్పించిన ఈ స్త్రీని యేసు గౌరవించాడు.

మరియ యేసును అభిషేకించిన కథ గురించి చదివినప్పుడు, "నేను యేసును ఎంత ప్రేమిస్తున్నాను? నేను ఆయనకు ప్రాముఖ్యత ఇస్తానా లేక ఇతరులకు ఇస్తానా?" అని ప్రశ్నించుకోవాలి. మరియ యేసును నిజంగా ప్రేమించింది.

**యేసుకు ఇచ్చిన ప్రతిస్పందనలు: విజయోత్సవ ప్రవేశం**

► మత్తయి 21:1-11 మరియుయోహాను 12:12-19 చదవండి.

ఆదివారం, యేసు గాడిదపై యెరూషలేములో ప్రవేశించాడు. సాధారణమైన రోజు, ఈ సంఘటలో ఎటువంటి అసాధారణం లేదు; గలిలయ బోధకుడు చిన్న గుంపుతో పస్కా పండుగకు యెరూషలేముకు వచ్చాడు. కాని ఇది సాధారణ సమయం కాదు. లాజరును లేపటంవలన ఈ పస్కా పండుగ, మతపరమైన రాజకీయపరమైన ప్రకటనగా మారిపోయింది.

యేసు యెరూషలేములోకి ప్రవేశించిన మతపరమైన సూచనలను మత్తయి నొక్కి చెప్పాడు. యేసు ప్రవేశం జెకర్యా ప్రవచన నెరవేర్పని మత్తయి చూపించాడు. జనసమూహం మాట్లాడిన మాటలు కీర్తన 118 నుండి తీసుకోబడినవి, ఇది యెరూషలేములో విజయోత్సవ ఊరేగింపును వివరించే పస్కా కీర్తన (మత్తయి 21:4-11, జెకర్యా 9:9, కీర్తన 118:26).

ఈ ఊరేగింపు రాజకీయ ప్రకటనలతో నిండుకొనియుంది:

- రాజుకు లోబడుతున్నామనడానికి సూచనగా జనసముహమంతా మార్గంలో తమ వస్త్రాలు పరిచారు (మత్తయి 21:8, 2 రాజులు 9:13).

- మక్కాబీయుల కాలం నుండి, ఖర్జూర మట్టలు సైనికు శత్రువులపై విజయానికి సూచనగా ఉన్నాయి (యోహాను 12:13, 1 మక్కాబీయులు 13:51).
- "జయము" అంటే "రక్షించుము" రక్షణకొరకైన మొర అని అర్థం.
- "దావీదు కుమారునికి" అనే పదం రాజరిక మెస్సీయ బిరుదు.

యేసు రోమాను పారద్రోలి ఆయన రాజ్యాన్ని స్థాపించడానికి యెరూషలేములో ప్రవేశిస్తున్నాడని ప్రజలు నమ్మారు. దావీదు రాజు కోసం చాలాకాలం నుండి వేచిచూస్తున్న విధానం ముగిసింది. ప్రవక్తలు ప్రవచించిన ప్రవచనాలు త్వరలో నెరవేరతాయి.

కేవలం కొన్ని దినాలు తరువాత, ఈ ప్రజలే, "వానిని సిలువవేయుమని! కేకలు వేశారు." ఎందుకు? వారు యేసును తప్పుడు కారణాలతో గొప్ప చేశారు. ఆయన రోమాను పారద్రోలతాడని వారు నమ్మారు కాని సైనిక దళాన్ని నడిపించే ఉద్దేశ్యం ఆయనకు లేదు. వారు రాజకీయ సంబంధమైన రాజ్యం కోసం చూస్తున్నారు, కాని ఆయన ఆత్మీయ సంబంధమైన రాజ్యాన్ని తీసుకొస్తున్నాడు. కాబట్టి వారు నిరుత్సాహపడి, త్వరలోనే యేసుకు వ్యతిరేకంగా తిరుగబడ్డారు.

సన్హెడ్రిన్/మహాసభలో రాజకీయ అధికారులు, సమాజంలో ఉన్నతమైనవారు యేసును చంపాలని నిర్ణయించుకున్నారు; సాధారణ ప్రజలు, ఎలాంటి పలుకుబడి లేని వారు కూడా యేసుకు వ్యతిరేకంగా మారారు. ముందు జరుగబోవు దానిని గ్రహించి, ఆయనను తిరస్కరించు పట్టణ గతి చూసి యేసు కన్నీరు విడిచాడు (లూకా 19:41-44). ఆయన విజయోత్సవ ఊరేగింపు సిలువకు నడిపిస్తుందని యేసుకు తెలుసు. జనసమూహం కీర్తన 118:26, "యెహోవాపేరట వచ్చువాడు ఆశీర్వాద మొందును గాక" అను మాటలు ఉల్లేఖించారు. కీర్తనలో తరువాత మాటలు యేసుకు తెలుసు, "ఉత్సవ బలిపశువును త్రాళ్లతో బలిపీఠపు కొమ్ములకు కట్టుడి." (కీర్తన 118:27) త్వరలోనే "బలిపీఠం" అంటే రోమా సిలువకు కట్టివేయబడు బలిపశువుగా యేసు యెరూషలేములోకి ప్రవేశించాడు.

### నిశిత పరిశీలన: యేసు అంజూరపు చెట్టును శపించుట

► మార్కు 11:12-25 చదవండి.

యేసు ఆయన పరిచర్య చివరి వారంలో ఫలించని అంజూరపు చెట్టును శపించిన సంఘటన సారూప్య సువార్తలన్నిటిలో ఉంది. బేతనియలో రాత్రి గడిపి, సోమవారం ఉదయాన యెరూషలేములోకి ప్రవేశిస్తుండగా యేసు అంజూరపు చెట్టును శపించాడు. మంగళవారం, 24 గంటల్లోనే ఆ చెట్టు వాడిపోవడం శిష్యులు చూశారు.

అది అంజూరపు పండ్లకాలము కాదు (మార్కు 11:13) అయినప్పటికీ, పచ్చటి పండ్లు చెట్టుకు ఉండాలని ఆకులు సూచిస్తున్నాయి. అంజూరపు పండ్లు ఆకులు వచ్చిన కొద్దిదినాలకే కనిపిస్తాయి. చెట్టుకు అంజూరపు పండ్లు లేకుండా ఆకులు మాత్రమే ఉన్నప్పుడు, ఆ సంవత్సరం ఆ చెట్టు ఫలించదు.

ఈ కథ ఫలించని ఇశ్రాయేలును గూర్చిన ఒక సజీవమైన ఉదాహరణ.[46] అనేక రాజ్యాలకు ఆశీర్వాదకరంగా ఉండునట్లు దేవుడు ఇశ్రాయేలును ఎన్నుకున్నాడు (ఆదికాండము 12:3). అయితే, ఇశ్రాయేలు యెహోవా నామానికి అవమానం తెచ్చింది.

దేవాలయం సమస్త జనులకు ప్రార్థనా మందిరమనబడాలి (యెషయా 56:7). కాని, దేవాలయం దొంగల గుహగా మారింది, శక్తివంతమైన ప్రధాన యాజకులు బీదలను మోసం చేస్తున్నారు.

అంజూరపు చెట్టు ఫలించలేదు; ఇశ్రాయేలు ఫలించలేదు. అంజూరపు చెట్టు శపించబడింది. ఇశ్రాయేలు త్వరలో శపించబడుతుంది.

అంజూరపు చెట్టును శపించటం, యేసు బహిరంగ పరిచర్య చివరి దినాల్లో ఒక తీవ్రమైన తీర్పు సందేశం:

1. ఫలాలు లేని అంజూరపు చెట్టు సజీవ ఉపమానం (మార్కు 11:12-14, 20-25).
2. దేవాలయం శుద్ధీకరణ (మార్కు 11:15-19).
3. అపనమ్మకమైన కాపులవారి ఉపమానం (మార్కు 12:1-12).
4. మతాధికారులతో వివాదాలు (మార్కు 12:13-40).
5. దేవాలయాన్ని నాశనమవ్వడాన్ని గురించి యేసు ప్రవచనం (మార్కు 13:1-37).

## యేసుకు ఇచ్చిన ప్రతిస్పందనలు: యేసు బహిరంగ పరిచర్య చివరి వారం (కొనసాగింపు)

### యేసుకు ఇచ్చిన ప్రతిస్పందనలు: మతాధికారులు

► మత్తయి 21:23-22:46 చదవండి.

లాజరును లేపిన తర్వాత, మతాధికారులు యేసును చంపాలని నిర్ణయించుకున్నారు. అయితే, ఆయన జనాదరణవలన కష్టమైంది. ప్రజల దృష్టిలో యేసును కించపరచడానికి కొన్ని మార్గాల కోసం వెదకసాగారు. యేసు విజయోత్సవ ప్రవేశానికి కొన్ని రోజులు తరువాత, మతాధికారులు దేవాలయంలో సంఘర్షణలను కలిగించారు.

[46] పాత నిబంధనలో, అంజూరపు చెట్టు ఇశ్రాయేలుకు సూచనగా ఉంది (ఉదా. యిర్మీయా 8:13, హోషేయ 9:10, యోవేలు 1:7).

యేసును ఇరికించాలని చూశారు, కాని పదే పదే విఫలమయ్యారు. యేసు తరచూ ఆయన జ్ఞానంతో తెలివితో మతాధికారులను ఇబ్బందిపెట్టడం ప్రజలు చూశారు.

మొదటిగా, దేవాలయాన్ని శుద్ధీకరించే, మరియు బహిరంగంగా ప్రకటించే ఆయన అధికారాన్ని మతాధికారులు పెద్దలు సవాలు చేశారు. బాప్తిస్మమిచ్చు యోహాను గురించి ఒక ప్రశ్నతో యేసు వారిని ఇబ్బంది పెడుతూ సమాధానమిచ్చాడు.

ఆ తర్వాత మతాధికారులను ఖండించే మూడు ఉపమానాలు యేసు చెప్పాడు. కేవలం వృత్తి మాత్రమే కాదుగాని విధేయత దేవుని రాజ్యంలో సంబంధాన్ని నిరూపిస్తుందని ఇద్దరు కుమారుల ఉపమానం చూపిస్తుంది. యేసును మెస్సీయగా అంగీకరించకపోవడం వలన కలిగే ఫలితాలు గురించి దుర్మార్గులైన కావాలివారి ఉపమానం సెలవిస్తుంది. చివరిగా, విందుకు ఆహ్వానించబడిన మతాధికారులు ఆహ్వానాన్ని తిరస్కరించారు కాని అర్హతలేని వారు ఆహ్వానానికి స్పందించారని వివాహ విందు ఉపమానం సెలవిస్తుంది.

యేసును కించపరచటానికి నిర్ణయించుకుని, ఆయనను ఇరికించాలని మతాధికారులు అనేక ప్రశ్నలు తీసుకొచ్చారు. వాళ్ల ఉద్దేశ్యం సత్యం నేర్చుకోవడం కాదు; యేసును నాశనం చేయడం. వారు సత్యాన్ని ఆశించడం లేదని యేసుకు తెలుసు గనుక, ఆయన వారి ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పలేదు.

యేసును ఇరికించడంలో విఫలమైనందున, నాయకులు విరమించుకున్నారు. మత్తయి వాళ్ల వైఫల్యాన్నిచూపిస్తూ, ఈ భాగం ముగించాడు: “ఎవడును మారుమాట చెప్పలేకపోయెను. మరియు ఆ దినమునుండి ఎవడును ఆయనను ఒక ప్రశ్నయు అడుగ తెగింపలేదు” (మత్తయి 22:46). ఈ వివాదాలను చూస్తున్న సాధారణ ప్రజల ఆనందం చూపిస్తూ మార్కు ముగించాడు, “సామాన్యజనులు ఆయన మాటలు సంతోషముతో వినుచుండిరి” (మార్కు 12:37).

► పాస్టరుగా లేక క్రైస్తవ నాయకునిగా, మీరు కష్ట ప్రశ్నలు ఎదుర్కొంటారు. నిజాయితీగా అడిగే ప్రశ్నలకు, మిమ్మల్ని ఇరికించాలని చూసే ప్రశ్నలకు తేడా ఎలా గ్రహిస్తారు? ఈ రెండు విధాల ప్రశ్నలకు మీరు ఇచ్చే సమాధానాలు ఎలా ఉంటాయి? (ఈ విరుద్ధతకు ఉదాహరణగా సామెతలు 26:4-5 చూడండి.)

## విచారణ మరియు సిలువ

► 1 కొరింథీయులకు 15:1-8 చదవండి.

యేసు ఆరోహణమైన ఇరవై సంవత్సరాలు తర్వాత, పౌలు కొరింథీ పట్టణంలో సంఘం స్థాపించాడు. ఈ సంఘంలో వివిధ నేపథ్యాల వారు ఉన్నారు. హెబ్రీ లేఖనాలు ఎరిగిన యూదులు, నిజమైన దేవుని గురించి అవగాహనలేని అన్యులు ఉన్నారు.

కొరింథీ సంఘంలో విభేదాలు వచ్చాయి, అబద్ధ బోధలు బయలుదేరాయి. ఈ సమస్యలకు ప్రతిస్పందనగా, పౌలు మొదట ప్రకటించిన మాటలు కొరింథీయులకు గుర్తుచేశాడు. ఒక పెద్ద అన్య పట్టణంలో పౌలు చేసిన మొదటి ప్రసంగం నాలుగు చారిత్రిక సంఘటనల ఆధారంగా ఉంది:

- క్రీస్తు మన పాపాల నిమిత్తము మృతిపొందెను.
- సమాధిచేయబడెను.
- మూడవదినాన లేపబడెను.
- ఆయన బహిరంగంగా- కేఫాకు, పండ్రెండుగురికి, ఒకేసారి ఐదువందలమందికి, యాకోబుకు, అపొస్తలులకు, చివరిగా పౌలుకు కనబడెను.

> "ఆయనను కొరడాలతో కొట్టారా?
> అతడు పొందిన దెబ్బలచేత మనకు
> స్వస్థతకలుగుచున్నది.
> ఆయన నిర్దోషిగా ఉన్ననూ, దోషియాయెనా?
> మనం అపరాధులమైననూ,
> విడిచిపెట్టబడితిమి.
> ఆయనపై ముళ్ళ కిరీటం పెట్టారా? మనం
> మహిమ కిరీటం పొందుతాము.
> ఆయన వస్త్రాలు తీసివేశారా?
> మనం శాశ్వత నీతితో కప్పబడుతాం.
> ఆయనను దూషించి, అవమానించారా?
> మనం గౌరవాన్ని, ఆశీర్వాదాన్ని పొందుతాం.
> ఆయన దుష్టునిగా ఎంచబడి, అపరాధులలో
> యెంచబడ్డాడా?
> మనం నిర్దోషులుగా, పాపం నుండి
> నీతిమంతులుగా తీర్చబడుతాం.
> అయన రక్షించుకోలేనివానిగా
> ప్రకటించబడ్డాడా?
> ఇతరులను పూర్తిగా రక్షించగలడు.
> ఆయన చివరకు, బాధాకరమైన, అవమాన
> మరణం చెందాడా? మనం నిత్యం బ్రతుకుతూ,
> ఉన్నత మహిమ పొందుతాము."
> - బిషప్ రైల్

కొరింథీ పట్టణంలో పౌలు చేసిన ప్రసంగంలో మొదటి భాగం సిలువ గురించి: "క్రీస్తు మన పాపములనిమిత్తము మృతిపొందెను." సిలువ సందేశం క్రైస్తవ విశ్వాసానికి కేంద్రం.

పాత నిబంధనలో, బలి అర్పణ కోసం గొర్రెపిల్లను తెచ్చిన వ్యక్తి దానితో గుర్తించబడుటకు గొర్రెపిల్ల తలపై చేయి పెడతాడు. గొర్రెపిల్ల తలపై చేయి పెట్టడం ద్వారా, ఆరాధించే వ్యక్తి "నేను నా పాపము నిమిత్తం మరణానికి పాత్రుడను. ఈ గొర్రెపిల్ల నా స్థానంలో మరణిస్తుంది" అని చెబుతాడు. అదే విధంగా, మనం మన పాపాల నిమిత్తం మరణ పాత్రులం; కాని క్రీస్తు మన స్థానంలో మరణించాడు. మనం మరణ పాత్రులం; మనం జీవించునట్లుగా ఆయన మరణించాడు.

**బంధించడం**

► మత్తయి 26:1-5, 14-56 చదవండి.

ప్యాషన్ వీక్ బుధవారం, యేసు తన మరణం రెండు దినాల తరువాత జరగనుందని ముందుగానే చెప్పాడు. మహాసభవారు పస్కా పండుగ జనాలు పట్టణాన్ని విడిచి వెళ్ళిన తరువాత, ఈ భవిష్యవాణి చెబుతున్న సమయానికి కనీసం తొమ్మిది రోజుల తరువాత, యేసును అరెస్టు చేయాలని ప్రణాళిక చేశారు. అయితే, యూదా తన యజమానుని

తిరస్కరించడానికి సిద్ధమయ్యినప్పుడు, ఆయన అనుచరుల్లో ఒకరి సహకారం ఉన్నప్పుడే యేసును అరెస్టు చేయాలని నిర్ణయించారు.

ప్రధానయాజకులకు యూదా ఎందుకు అవసరం? ఆయన జనసమూహానికి దూరంగా ఉన్నప్పుడే వారు యేసును పట్టుకోవాలి. ఆయన ప్రజాదరణవలన, బహిరంగంగా ఆయనను అరెస్టు చేస్తే అల్లర్లు జరుగుతాయి.

> "యేసు తన దైవత్వంలో మానవత్వపు శ్రమల నుండి ఉపశమనం పొందలేదు; ప్రార్థనలో నెమ్మది పొందాడు."
> - టి.బి. కిల్పాట్రిక్ నుండి తీసుకున్నారు.

ఆయన శిష్యులతో కలిసి పస్కా భోజనం చేసిన తరువాత, యేసు ప్రార్థించడానికి గెత్సెమనే తోటకు వెళ్ళాడు. సిలువ శ్రమను, అదే విధంగా తండ్రికి దూరమైన ఆత్మీయ ఆవేదన అనుభవిస్తూ, యేసు ఇలా ప్రార్థించాడు, "నా తండ్రీ, సాధ్యమైతే ఈ గిన్నె నాయొద్దనుండి తొలగి పోనిమ్ము, అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్త ప్రకారమే" (మత్తయి 26:39). ఉన్నత విచారణలో కూడా, యేసు తన తండ్రి చిత్తానికి అప్పగించుకున్నాడు.

ఆ రోజు సాయంకాలవేళ, యేసును బంధించడానికి యూదా గొప్ప జనసమూహంతో వచ్చాడు.[47] యూదా యేసును ముద్దుతో గుర్తించిన తర్వాత, యేసు సైనికులతో మాట్లాడాడు. "ఆయన–నేనే ఆయనననని వారితో చెప్పగా వారు వెనుకకు తగ్గి నేలమీద పడిరి" (యోహాను 18:6). ఈ సైనిక బృందం మరణంపై అధికారమున్న వ్యక్తికి భయపడ్డారు. ఆయన శత్రువులు కాదు, యేసు అధికారంలో ఉన్నాడు. 19వ శతాబ్దపు ప్రసంగికుడైన ఆక్టేవియస్ విన్స్లో, "యేసును మరణానికి అప్పగించింది ఎవరు? డబ్బు కోసం యూదా కాదు. భయంతో పిలాతు కాదు. శత్రుత్వంతో యూదులు కాదు. ప్రేమ కోసం తండ్రి అప్పగించాడు!" అని అన్నాడు.[48]

**విచారణ**

► మత్తయి 26:57-27:26, లూకా 22:54-23:25, యోహాను 18:12-19:16 చదవండి.

యేసు విచారణలో యూదుల విచారణ మరియు రోమీయుల విచారణ రెండు ఉన్నాయి. యూదుల ధర్మశాస్త్రం ప్రాచీన న్యాయవ్యవస్థలో అత్యంత మానవత్వంగలది; జీవితాన్ని కాపాడడానికి యూదుల ధర్మశాస్త్రం సాధ్యమైనంత చేసింది. రోమా చట్టం దాని కఠినమైన నియమాలకు మరియు సమగ్రతకు ప్రసిద్ధి చెందింది. ప్రాచీన లోకంలో ఈ రెండూ ఉత్తమమైన న్యాయవ్యవస్థలే, కాని అవి దేవుని కుమారుని చంపకుండా పాపులను ఆపలేకపోయాయి.

---

[47] యోహాను 18:3 ఈ బృందాన్ని "సైనుకులు" లేక బంట్రౌతులు" అని సూచిస్తుంది. రోమా బంట్రౌతుల బృందం మొత్తం 600 మంది ఉంటారు.

[48] John Stott, *The Message of Romans* (Westmont, Illinois: InterVarsity Press, 1994), 255.లో ఉల్లేఖించబడింది.

ఆయనను బంధించిన తర్వాత, యేసును చట్టబద్ధమైన ఆరు విచారణలు చేశారు. యూదుల మతపరమైన విచారణలు, రోమీయుల పౌర విచారణలు. యూదుల విచారణ యూదుల ధర్మశాస్త్రం ప్రకారం చట్టవిరుద్ధమని చరిత్రకారులు చెబుతారు. యేసును ఒప్పించాలనే కంగారులో, మహాసభవారు:

- రాత్రి విచారణ చేపట్టారు (చట్టవిరుద్ధం)
- యేసును బంధించడానికి ముందు అధికారికంగా ఆరోపణలు చేయలేదు (చట్టవిరుద్ధం)
- యేసు తన పక్షాన సాక్ష్యం చెప్పేందుకు సాక్షులను పిలవడానికి ఆయన్ని అనుమతించలేదు (చట్టవిరుద్ధం)
- యూదా ధర్మశాస్త్రం అనుమతించిన దానికంటే వేగంగా విచారణను చేపట్టారు (చట్టవిరుద్ధం)

ఇదంతా యేసును సిలువవేసి పస్కా ముగిసే లోపే ఆయన దేహాన్ని తీసివేయటానికి చేశారు. సరైన సమయంలో పస్కా గొర్రెపిల్లను భుజించగలిగేలా వారు దేవుని గొర్రెపిల్లను చంపారు.

***విచారణల క్రమం***

**(1) అన్న ఎదుట యూదుల విచారణ (యోహాను 18:12-14, 19-23)**

అన్నను జీవితకాల ప్రధాన యాజకునిగా నియమించారు. అన్న స్థానంలో అతని అల్లుడు కయపను రోమీయులు నియమించినప్పటికీ, చాలామంది యూదులు అన్నను “ప్రధాన యాజకుడు” అనే పేరుతో పిలిచేవారు. అన్న ఎదుట ఈ మొదటి విచారణను అనధికారికంగా చేపట్టారు. ఇందులో ఆరోపణలు లేవు, సాక్షులు లేరు.

**(2) మహాసభ ఎదుట యూదుల విచారణ (మత్తయి 26:57-68)**

మహాసభ యెదుట మొదటి విచారణ తెల్లవారుజామున 2:00 గంటలు జరిగియుండవచ్చు. వారు సూర్యోదయానికి ముందు చట్టబద్ధంగా విచారణ నిర్వహించలేకపోయినప్పటికీ, యూదా నాయకులు మరింత వేగవంతం చేయాలని చూశారు. రాత్రి జరిగిన విచారణ చట్టవిరుద్ధమైనప్పటికీ, మహాసభ అనధికార విచారణ చేపట్టి, దేవదూషణ చేశాడని ఆరోపించి, అందుకు మరణ శిక్ష సరైనదని నిర్ణయించారు.

**(3) మహాసభ ఎదుట అధికారికంగా యూదుల విచారణ (లూకా 22:66-71)**

ఉదయకాలమైనప్పుడు, మహాసభ అధికారికంగా విచారణ చేపట్టింది. ఈ విచారణలో, యేసు దేవదూషణ చేశాడని అధికారికంగా ఆరోపించింది.

**(4) పిలాతు ఎదుట మొదటి రోమీయుల విచారణ (లూకా 23:1-5, యోహాను 18:28-38)**

నేరస్థులను చంపే అధికారం రోమా మహాసభకు ఇవ్వలేదు (యోహాను 18:31). పిలాతు మరణ శిక్ష విధించాలని, యూదా మతాధికారులు మతపరమైన ఆరోపణలను రాజకీయపరమైన ఆరోపణగా మార్చారు. "ఇతడు మా జనమును తిరుగబడ ప్రేరేపించుచు, కైసరునకు పన్నియ్యవద్దనియు, తానే క్రీస్తను ఒక రాజుననియు చెప్పగా మేము వింటిమని ఆయనమీద నేరము మోపసాగిరి" (లూకా 23:2).

పస్కా సమయంలో, యూదులు అపవిత్రులై పస్కా భోజనం చేయలేమనే భయంతో ఏ రోమీయుల భవనాల్లోకి ప్రవేశించరు. వారు రాజభవనంలోకి వెళ్ళలేరు గనుక, రాజభవనం బయట పిలాతు విచారణ చేపట్టాడు.

**(5) హేరోదు అంతిప ఎదుట రోమీయుల విచారణ (లూకా 23:6-12)**

యేసు నిర్దోషియని పిలాతుకు తెలుసు, కాని యూదా నాయకులకు అతడు కోపం తెప్పించాలని అనుకోలేదు. "ఇతడు గలిలయదేశము మొదలుకొని ఇంతవరకును యూదయదేశమందంతట ఉపదేశించుచు ప్రజలను రేపుచున్నాడని," (లూకా 23:5) యేసు గురించి అతడు విన్నప్పుడు, పిలాతు గందరగోళ పరిస్థితి నుండి తప్పించుకోవాలని నిర్ణయించుకున్నాడు. పస్కా వారంలో, గలిలయ పాలకుడు హేరోదు అంతిప, యెరూషలేములో ఉన్నాడు.[49] యేసు గలిలయకు చెందినవాడు గనుక, ఈ కేసులో హేరోదు న్యాయవాదిగా వ్యవహరిస్తాడని పిలాతు ఆశించాడు. పిలాతు యేసును హేరోదు యొద్దకు పంపించాడు, కాని హేరోదు జోక్యం చేసుకోవడానికి నిరాకరించాడు.

**(6) పిలాతు ఎదుట రోమీయుల విచారణ (మత్తయి 27:15-26, లూకా 23:13-25, యోహాను 18:39-19:16)**

యేసు, అతని న్యాయస్థానానికి తిరిగి వచ్చినప్పుడు, పిలాతు మరో పరిష్కారం కోసం వెదకాడు. యేసు నిర్దోషియని పిలాతుకు తెలుసు: "ఇదిగో నేను మీయెదుట ఇతనిని విమర్శింపగా మీ రితని మీద మోపిన నేరములలో ఒక్కటైనను నాకు కనబడ లేదు" (లూకా 23:14). పిలాతు నిర్దోషియైన యేసును ఖండించుటకు ఇష్టపడలేదు.

నమ్మకద్రోహం చేసినందున కైసరుకు చెప్తామని నాయకులు అతన్ని బెదిరించినప్పుడు, పిలాతు వారి మాటలకు లొంగిపోయాడు. పిలాతు బలహీనమైన నాయకుడు. మునుపటి సంఘర్షణలో, చక్రవర్తి రూపాన్ని మోసుకుంటూ యెరూషలేములో ప్రవేశించడానికి అతడు సైనికులను అనుమతించాడు. ఐదు రోజులు పిలాతు రాజభవనం వెలుపల

---

[49] పస్కా వారంలోమ, పాలస్తీనాలోని ప్రతి రోమా అధికారి తిరుగుబాటు జరుగకుండ చూసేందుకు యెరూషలేముకు వస్తాడు.

యూదులు నిరసనలు చేపట్టారు. నిరసనకారులను చంపుతానని అతడు బెదిరించినప్పుడు, పరిశుద్ధ పట్టణంలో కైసరు ప్రతిమను సహించటం కంటే చనిపోతామని చెప్పారు. అప్పుడు పిలాతు వెనక్కి తగ్గవలసిన పరిస్థితి ఏర్పడింది.

ఈ అనుభవం వలన, పిలాతు యూదా ప్రజలకు భయపడ్డాడు. తరువాత, రోములో అతనిపై అధికారి సిజేనస్, పిలాతు యూదా ప్రజలను నియంత్రించలేడని భావించాడు. యేసును విడుదల చేస్తే కైసరుకు ఫిర్యాదు చేస్తామని నాయకులు బెదిరించినప్పుడు, “సిలువవేయబడుటకై అతడాయనను వారికి అప్పగించెను” (యోహాను 19:16). యేసు దోషియని చెప్పి పిలాతు ఆయనకు మరణ శిక్ష విధించలేదుగాని, అతని బలహీనతవలన విధించాడు.

***విచారణ సమయంలో, పేతురు యేసును తిరస్కరించాడు***

పస్కా భోజన సమయంలో, యేసు పేతురును “ఆయనను ఎరుగనని నీవు ముమ్మారు చెప్పకముందు కోడికూయదని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను” (యోహాను 13:38) అని హెచ్చరించాడు. ఇప్పుడు, యేసు విచారణ సమయంలో, పేతురు యేసును ముమ్మారు తిరస్కరించాడు.

పేతురు అవమానకరంగా పతనమైన సంఘటన గురించి మనం చదివినప్పుడు, ఆ రాత్రి యేసును విఫలం చేసింది కేవలం పేతురు మాత్రమే కాదని మనం గుర్తుంచుకోవాలి. పేతురు మరియు యోహాను మాత్రమే విచారణలో హాజరయ్యారు. ఇతర శిష్యులు భయంతో పారిపోయారు.

పేతురు యేసును ప్రేమించాడనేది స్పష్టం. అయితే ఎందుకు పడిపోయాడు? మునుపు, శోధన ఎదుర్కోవడం గురించి పాఠాలు నేర్చుకోవడానికి యేసు శోధన గురించి మనం చదివాం. పేతురు పతన స్థితి నుండి, మనం శోధించబడినప్పుడు సహాయపడే హెచ్చరికలు నేర్చుకుంటాం. పేతురు పతనానికి కనీసం రెండు లక్షణాలు కారణం:

**(1) మితిమీరిన విశ్వాసం/అతి నమ్మకం**

సాతాను దాడి గురించి యేసు హెచ్చరించినప్పుడు, పేతురు అతిశయంతో ఇలా చెప్పాడు: “చూచి నేను నీతోకూడ చావవలసివచ్చినను, నిన్ను ఎరుగనని చెప్పననెను” (మత్తయి 26:35). మనం అతి నమ్మకంతో ఉన్నప్పుడు, పతనమయ్యే ప్రమాదంలో ఉంటాం. కేవలం ఆత్మ శక్తి ద్వారా మాత్రమే మనం జయజీవితం పొందగలం. ఆత్మీయ విఫలతకు అతి నమ్మకం ప్రధాన కారణం.

**(2) ప్రార్థనలేమి**

తోటలో, “మీరు శోధనలో ప్రవేశించకుండునట్లు ప్రార్థనచేయుడని చెప్పి” యేసు తన శిష్యులకు హెచ్చరించాడు (లూకా 22:40). రాబోవు పరీక్షను ఎదుర్కొనే బలం కోసం ప్రార్థించకుండా, పేతురు నిద్రపోయాడు.

ప్రార్థన లేకపోవడం, ఆత్మీయ ఓటమికి నడిపిస్తుంది. శక్తివంతమైన ప్రార్థనా జీవితం లేకుండా జయజీవితం కొనసాగించటం అసాధ్యం. సాతానుడు, క్రైస్తవ పరిచారకులను అనేక పనుల్లో నిమగ్నం చేసి, ప్రార్థించే సమయం లేకుండా చేస్తాడు. ప్రార్థించలేనంత బిజీగా ఉన్నప్పుడు, మనం పతనమైపోతామని సాతానుడికి తెలుసు.

► మీ క్రైస్తవ జీవితాన్ని, పరిచర్యను ఒక్కసారి జ్ఞాపకం చేసుకోండి. శోధనలో పడిపోయిన లేక పతనమగుటకు సమీపమైన సందర్భాలు గుర్తు చేసుకోండి. పతనానికి ఏవి కారణం? అతి నమ్మకం కలిగించే పరిచర్య జయం మీరు అనుభవిస్తున్నారా? మీరు బిజీగా ఉండి, ప్రార్థనలో తగినంత సమయం గడుపలేకపోతున్నారా? భవిష్యత్తుకు హెచ్చరిక సంకేతాలుగా ఉండే ఇతర విషయాలు ఉన్నాయా?

### *విచారణ సమయంలో యూదా ఆత్మహత్య చేసుకున్నాడు*

పేతురు తిరస్కరించిన వెంటనే, మత్తయి యూదా ఆత్మహత్య చేసుకోవడాన్ని గురించి చెబుతాడు. ద్రోహ ఫలితాలు చూసి, యూదా తన మనసు మార్చుకుని, ఆ ముప్పై వెండి నాణేలు ప్రధాన యాజకులు, పెద్దలు యొద్దకు తీసుకొచ్చి, "నేను నిరపరాధరక్తమును అప్పగించి పాపము చేసితినని" (మత్తయి 27:3-4) అని చెప్పాడు. ద్రోహం చేయడానికి తీసుకున్న ఆ వెండి నాణేలు పారవేసి, పోయి ఉరిపెట్టుకున్నాడు (మత్తయి 27:5). యూదా జీవితకాలం అపరాధ భావనతో ఉండకుండా ఆత్మహత్యను ఎంచుకున్నాడు.

మత్తయి కథనం పేతురు పశ్చాత్తాపాన్ని మరియు యూదా విచారాన్ని ప్రక్కప్రక్కన ఉంచుతుంది. పేతురు, యూదా ఇద్దరు పశ్చాత్తాపపడ్డారు. అయితే, యూదాకు, నిజమైన పశ్చాత్తాపానికి ఉపయోగించే సాధారణ పదం కాకుండా ఒకరి మనసు మార్చుకొనుట అనే ఆలోచనను వ్యక్తపరిచే పదాన్ని మత్తయి ఉపయోగించాడు. పాప నేరారోపణల విషయంలో ప్రజలు ప్రతిస్పందించే విధానం అర్థం చేసుకోవడానికి ఈ వ్యత్యాసం చాలా ప్రాముఖ్యం.

పౌలు విచారం (పాప ఫలితాలు విషయంలో దుఖం) మరియు పశ్చాత్తాపం (పాప విషయంలో దుఖం, దిశ మార్చుకునే విధానం) మధ్య వ్యత్యాసం గురించి రాశాడు. అపొస్తలుడు ఇలా రాశాడు: "దైవచిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయును; ఈ మారుమనస్సు దుఃఖమును పుట్టించదు. అయితే లోకసంబంధమైన దుఃఖము మరణమును కలుగజేయును" (2 కొరింథీయులకు 7:10).

దైవచిత్తానుసారమైన దుఖం రక్షణార్థమైన మారుమనసు జీవితం కలిగిస్తుంది. లోకానుసారమైన దుఖం విచారం కలిగిస్తుంది, అది అపరాధానికి, మరణానికి నడిపిస్తుంది. పేతురు, యూదా ఇద్దరు దుఃఖపడ్డారు, కానీ కేవలం పేతురు మారుమనసు పొందాడు.

యూదా తన ద్రోహ ఫలితాలు చూసి, అపరాధం అవమానం కంటే మరణాన్ని ఎన్నుకున్నాడు; అతడు విచారపడ్డాడు, కాని మారుమనసు పొందలేదు. పేతురు తన పతన ఫలితాలు చూసి, నిజమైన మారుమనసు పొందాడు. యూదా విచార ఫలితం మరణం; పేతురు పశ్చాత్తాప ఫలితం ఫలభరితమైన శాశ్వత పరిచర్య.

► పాప విషయంలో విచారపడి, నిజమైన మారుమనసు పొందని ప్రజలను మీరు చూశారా? ఫలితం ఏంటి? మన ప్రసంగంలో, మనం ప్రజలను నిజమైన మారుమనసులోకి ఎలా నడిపిస్తాం?

**సిలువ**

► మత్తయి 27:27-54 చదవండి.

యూదయ ఒక రోమా సైనికునికి భయంకరమైన ప్రదేశం. ప్రజలకు రోమా సైనికులంటే ద్వేషం, జేలోతులు వారిని చంపడానికి కుట్రలు చేశారు. పస్కా సమయంలో, అల్లర్లు జరుగుతాయని సైన్యం నిరంతరం అప్రమత్తంగా ఉండేది. ఒక సైనికునికి ఇంతకంటే ఘోరమైన నియామకం మరొకటి లేదు. యూదా ఖైదీకి మరణశిక్ష విధించినప్పుడు, సైనికులు వారిపై తమ కోపం తీర్చుకునేవారు.

యేసుకు చేసిన విధానంలో-దెబ్బలు, అవమానం, ముళ్ళ కిరీటం- తమ పనిని ద్వేషించిన, తిరిగి పోరాడలేనివారిని శిక్షిస్తూ ఆనందిస్తున్న సైనికుల కఠిన క్రూరత్వం కనిపిస్తుంది. ఈ సైనికుల యెడల ఎటువంటి కోపం చూపకుండానే యేసు వీటన్నిటిని భరించాడు.

యేసు సిలువలో పలికిన ఏడు మాటల ద్వారా చాలామంది రచయితలు సిలువ కథ గురించి అధ్యయనం చేశారు. ఒక వ్యక్తి చివరి మాటలు, ఆ వ్యక్తికి ఏది ముఖ్యమో అవి చూపిస్తాయి. ఆయన మరణం ఎదుర్కొనుచుండగా, యేసు ఏమి చెప్పాడు?

***క్షమాపణ మాటలు***

వారయనను సిలువలో మేకులతో కొట్టుచుండగా, యేసు ఇలా ప్రార్థించాడు, “తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని చెప్పెను.” (లూకా 23:34). ముగింపువరకు, ఆయన ప్రేమ, క్షమాపణ కనుపరచాడు.

మరణ శిక్షకు అర్హుడైన దొంగతో, “నేడు నీవు నాతోకూడ పర దైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను” (లూకా 23:43) అని వాగ్దానం చేశాడు

*దయగల మాటలు*

"యిదిగో నీ తల్లి" (యోహాను 19:26-27) అని చెప్పినప్పుడు యేసు తన తల్లి బాధ్యతను యోహానుకు అప్పగించాడు. మునుపు, లోతైన కుటుంబ బంధాలు ఆత్మీయమైనవని యేసు బోధించాడు. "ఇదిగో నా తల్లియు నా సహోదరులును; పరలోకమందున్న నా తండ్రి చిత్తము చొప్పున చేయువాడే నా సహోదరుడును, నా సహో దరియు, నాతల్లియుననెను" (మత్తయి 12:49-50).

ఆయన మరణ సమయంలో, యేసు భౌతిక సహోదరులు అవిశ్వాసులు; వారు ఆయన ఆత్మీయ కుటుంబ సభ్యులు కాదు. కాబట్టి, యేసు తన తల్లి బాధ్యతను ఆత్మీయ సహోదరుడైన యోహానుకు అప్పగించాడు.

*భౌతిక హింసను తెలియజేయు మాటలు*

దేవుని కుమారుడైనందువలన సిలువలో శారీరక హింస నుండి యేసు విడిపించబడలేదు. తీర్పుపొందిన నేరస్తుడు అనుభవించే హింసలన్నీ అనుభవించాడు. ఆ ఘోరమైన ఎండలో నీరు లేకుండా కొన్ని గంటలు గడిపిన తర్వాత, యేసు "నేను దప్పిగొనుచున్నాననెను" అని కేక వేశాడు (యోహాను 19:28).

*ఆత్మీయ ఆవేదన మాటలు*

మత్తయి మరియు మార్కు కేవలం ఒక మాట మాత్రమే నివేదించారు, కాని ఇది సిలువలో పలికిన అత్యంత హృదయ విదారకమైన మాట: "నా దేవా, నా దేవా నన్నెందుకు చెయ్యి విడిచితివని" (మత్తయి 27:46, మార్కు 15:34).

తండ్రి నుండి దూరమవ్వడం యేసుకున్న గొప్ప ఆవేదన. తండ్రి మరియు కుమారుడు నిత్యత్వంలో నిరంతర సహవాసంలో ఉన్నారు. ఇప్పుడు, ఆయన మన పాపం భరించాడు గనుక, యేసు తండ్రికు దూరమయ్యాడు.

సిలువలో, "ఎందుకనగా మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను" (2 కొరింథీయులకు 5:21). యెషయా 53లో, మన పాపాలు భరించే "శ్రమ సేవకుని" గురించి ప్రవక్త మాట్లాడాడు (యెషయా 53:4-12). ఈ ప్రత్యామ్నాయ ప్రాయశ్చిత్తం సిలువలో నెరవేర్చబడిందని పౌలు చూపించాడు.

"ఎందుకనగా మనమాయనయందు దేవుని నీతి అగునట్లు" (2 కొరింథీయులకు 5:21) యేసు మన కోసం పాపంగా చేయబడెను. మనమికమీదట పాపానికి బానిసలు కాదు; క్రీస్తు మరణం ద్వారా, నీతిమంతులముగా చేయబడ్డాం. మనమాయనయందు నీతిమంతులుగా *పిలువబడ్డామని* పౌలు చెప్పలేదు. బదులుగా, మనమాయనయందు దేవుని *నీతియగునట్లు* అని చెప్పాడు. సిలువలో క్రీస్తు కార్యం ద్వారా, నిజమైన మార్పు జరిగింది. మనం నీతిమంతులమగునట్లు క్రీస్తు మనకోసం పాపి అయ్యాడు.

***విరమణ మాటలు***

"తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాననెను." (లూకా 23:46) ఆయన జీవితమంతటి ద్వారా, యేసు తన తండ్రిలో విధేయుడుగా జీవించాడు. సిలువను ఎదుర్కొంటూ, "అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్త ప్రకారమే కానిమ్మని" (మత్తయి 26:39) ప్రార్థించాడు. ఇప్పుడు ఆయన తండ్రి చిత్తానికి అప్పగించుకునే చివరి మాటలు మాట్లాడాడు.

***విజయోత్సవ మాటలు***

"సమాప్తమైనదని చెప్పి" (యోహాను 19:30). ఈ విజయోత్సవ మాటతో, తండ్రి తనను పంపిన పని తాను నెరవేర్చానని యేసు ప్రకటించాడు. పాపానికి వెల చెల్లించబడింది; సాతాను ఓడిపోయాడు. పాత నిబంధన గొర్రెపిల్లలు చూపిన మరియు యెషయా 53లో వాగ్దానం చేసిన ప్రాయశ్చిత్తం నెరవేరింది.

**సమాధి**

► మత్తయి 27:57-61 చదవండి.

పౌలు కొరింథీయులకు ఇచ్చిన సందేశంలో, యేసు మన పాపాల నిమిత్తం మృతిపొంది, సమాధిచేయబడెను అని ప్రసంగించాడు (1 కొరింథీయులకు 15:3-4). పౌలు మరియు ఆది సంఘానికి, సమాధి చాల ప్రాముఖ్యం.

నేడు శ్రమవార ఆచారాలు, శుభశుక్రవారం మరియు ఈస్టర్ ఆదివారం పాటిస్తారు. కాని సంఘ చరిత్రలో ఎక్కువగా "పరిశుద్ధ శనివారాన్ని" ఈస్టర్ ఆరాధనలో భాగంగా గుర్తించారు. సమాధి ప్రాముఖ్యత ఏంటి?[50]

***చారిత్రక ప్రాముఖ్యత***

యేసు నిజంగా చనిపోయాడని సమాధి చూపిస్తుంది. మైకంలో నుండి తరువాత లేచాడనే ఇస్లామీయుల వాదనలకు విరుద్ధంగా, ఆయన నిజంగా చనిపోయాడని సమాధి చూపిస్తుంది. శిక్ష విధించిన ఖైదీని ఎలా చంపాలో రోమీయులకు తెలుసు. వారు, ఒక వ్యక్తి చనిపోకుండా, అతనిని సిలువలో నుండి దింపే అవకాశమే లేదు.

ఇంకా, బరువైన రాయి మరియు కాపలాదారుల వలన, సమాధి నుండి ఎవ్వరు తప్పించుకునే అవకాశమే లేదు. రోమా సైనికులు ఒకవేళ చనిపోక ముందే పొరపాటున ఆయనను పాతిపెట్టినప్పటికీ, సిలువలో గంటలు తరబడి వేదనను

---

[50] James Boice, "The Burial of Jesus" నుండి తీసుకున్నారు. Http://www.alliancenet.org/tab/the-burial-of-jesus-christ-part-one మార్చి 22, 2021 న యాక్సెస్ చేయబడింది.

అనుభవించిన వ్యక్తి సమాధి నుండి రాయిని తొలగించి, కాపలాదారులను అధిగమించగలరనేది అసాధ్యం. నజరేయుడైన యేసు చనిపోయాడనే చారిత్రిక సత్యాన్ని సమాధి ధృవీకరిస్తుంది.

### *ప్రవచన ప్రాముఖ్యత*

వధకు తేబడిన గొర్రెపిల్ల గురించి రాస్తూ, "భక్తిహీనులతో అతనికి సమాధి నియమింపబడెను ధనవంతునియొద్ద అతడు ఉంచబడెను" (యెషయా 53:9) అని యెషయా ప్రవచించాడు. యేసు సమాధి మెస్సీయత్వ ప్రవచనం నెరవేర్చింది.

యేసు చనిపోయిన తర్వాత, అరిమతయియ యోసేపు దేహం కోసం పిలాతు యొద్దకు వెళ్ళాడు. యోసేపు మహాసభ సభ్యుడు, కాని యేసును చంపడానికి అంగీకరించలేదు. చాలామంది నాయకులు యేసుకు వ్యతిరేకమైనప్పటికీ, కొందరు దేవుని రాజ్యం కోసం ఎదురుచూస్తున్నారు. యోసేపు ఈ రహస్య శిష్యులలో ఒకడు. అతడు మరియు నీకొదేము యోసేపు సమాధిలో యేసు దేహాన్ని ఉంచారు (మత్తయి 27:57-60, మార్కు 15:42-46, లూకా 23:50-54, యోహాను 19:38-42).

దీనికి ఎంత సాహసం అవసరమో ఆలోచించండి. శిష్యులు యేసును విడిచిపెట్టినప్పటికీ, నేరస్తుడైన ఖైదీతో గుర్తించబడుటకు యోసేపు ముందుకొచ్చాడు. ఈ బహిరంగ వైఖరి వలన, మహాసభలో యోసేపు స్థానానికి ముప్పు మరియు సమాజంలో అతని స్థానానికి కూడా ముప్పు. అంతేకాదు, యోసేపు పిలాతు కోపానికి కూడా తెగించాడు. శిక్షించబడిన వారి దేహాలు తీసుకెళ్లడానికి వారి మిత్రులను లేక బంధువులను రోమీయులు అనుమతించరు. ఇతర నేరస్తులకు ఒక హెచ్చరికగా వారి దేహాలు అక్కడే బహిరంగంగా విడిచిపెట్టేవారు. యేసు నిర్దోషియని పిలాతుకు తెలుసు అనేదానికి అతని అనుమతి మరొక రుజువు.

### *వేదాంత పరమైన ప్రాముఖ్యత*

పౌలు మన బాప్తిస్మాన్ని యేసు సమాధితో పోల్చాడు:

> క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతనజీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మమువలన మరణములో పాలుపొందుటకై ఆయనతోకూడ పాతిపెట్టబడితిమి (రోమా 6:3-4).

సమాధి యేసు మరణానికి బహిరంగ ధృవీకరణ. అదే విధంగా, బాప్తిస్మం యేసు మరణంలో మనం పాలిభాగస్తులమనడానికి సాక్ష్యం. బాప్తిస్మంలో, మన పాత జీవితాన్ని పాతిపెట్టామని ప్రకటిస్తున్నట్లు అర్థం.

ఒక వ్యక్తి మరణాన్ని గుర్తించడానికి సమాధి చివరి మెట్టు. పాశ్చాత్య సంస్కృతిలో, ఈ భూలోకంలో "వీడ్కోలు" ముగింపును తెలియజేయడానికి దుఃఖపడే కుటుంబ సభ్యులు సమాధి చేసినప్పుడు దానిపై ధూళి వేస్తారు. పాపం విషయంలో మనం చనిపోయామనడానికి తుది మెట్టును పౌలు నొక్కి చెప్పాడు. క్రీస్తు మరణించినట్లుగా, మనం పాప విషయంలో మరణించాం. క్రీస్తుతో పాతిపెట్టబడిన తర్వాత మళ్ళీ పాపం చేయటమంటే, మృతదేహాన్ని తవ్వి తీయడమే.[51] మనం క్రీస్తుతో కూడా పాతిపెట్టబడితిమి; మనమిక పాపానికి దాసులం కాదు.

## పునరుత్థానం

పౌలు కొరింథులో సిలువ గురించి ప్రసంగించాడు; క్రీస్తు మన పాపాల నిమిత్తం మరణించి, పాతిపెట్టబడెను. ఆ తర్వాత, పునరుత్థానం గురించి ప్రసంగిచాడు; క్రీస్తు మూడవ దినాన లేచి, అనేకమందికి కనిపించాడు (1 కొరింథీయులకు 15:3-8). పునరుత్థానం క్రైస్తవ విశ్వాసానికి కేంద్రం.

►మత్తయి 27:62-28:15 చదవండి.

సిలువపై పేరు మార్చమని మతాధికారులు పిలాతును అడిగినప్పుడు, అతను నిరాకరించాడు. అతను యేసును "యూదులరాజైన నజరేయుడగు యేసు" (యోహాను 19:19) అను మాటతో సిలువవేశాడు. నేరస్తునికి ఈ బిరుదు ఉపయోగించడం వలన, పిలాతు తాను అసహ్యించుకున్న యూదులను ఎగతాళి చేశాడు.

సిలువ తరువాత, మతాధికారులు మళ్ళీ పిలాతు యొద్దకు వచ్చి, సమాధికి భద్రతగా కావాలివారు ఉండాలని అడిగారు.

> అయ్యా, ఆ వంచకుడు సజీవుడై యుండినప్పుడు మూడుదినములైన తరువాత నేను లేచెదనని చెప్పినది మాకు జ్ఞాపకమున్నది. కాబట్టి మూడవ దినమువరకు సమాధిని భద్రముచేయ నాజ్ఞా పించుము; వాని శిష్యులు వచ్చి వానిని ఎత్తుకొనిపోయి –ఆయన మృతులలోనుండి లేచెనని ప్రజలతో చెప్పుదు రేమో; అప్పుడు మొదటి వంచనకంటె కడపటి వంచన మరి చెడ్డదై యుండునని చెప్పిరి (మత్తయి 27:63-64).

పిలాతు అనుమతితో, వారు సమాధికి ముద్ర వేసి, యేసును తోటలో అరెస్టు చేసిన వారిలోనుండి కొందరిని కాపలాదారులుగా నియమించారు. అకస్మాత్తుగా:

[51] James Boice, "The Burial of Jesus" నుండి తీసుకున్నారు. Http://www.alliancenet.org/tab/the-burial-of-jesus-christ-part-one మార్చి 22, 2021 న యాక్సెస్ చేయబడింది.

> ఇదిగో ప్రభువు దూత పరలోకమునుండి దిగివచ్చి, రాయి పొర్లించి దాని మీద కూర్చుండెను; అప్పుడు మహాభూకంపము కలిగెను. ఆ దూత స్వరూపము మెరుపువలె నుండెను, అతని వస్త్రము హిమమంత తెల్లగా ఉండెను. అతనికి భయపడుటవలన కావలివారు వణకి చచ్చినవారివలె నుండిరి (మత్తయి 28:2-4).

యేసు తిరిగి లేచాడు!

► యోహాను 20:1-29 చదవండి.

యేసు పునరుత్థానం తరువాత అనేకమందికి కనిపించాడని సువార్తలు చెబుతాయి. వివిధ సందర్భాల్లో అనేక రకాల ప్రజలకు ఆయన కనిపించాడు.

సంశయవాదులు కొన్నిసార్లు, "సమాధి యొద్ద స్త్రీలు భ్రమలో ఉన్నారు. వారు చూడాలనుకున్నది చూశారు." అయితే, వీరు యేసును సజీవంగా చూడాలని ఆశించలేదు; ఆయన చనిపోయాడని వారికి తెలుసు! ఆయన పునరుత్థాన ప్రవచనాలు వారు గ్రహించలేదు (యోహాను 20:9). తాము యేసుని చూశామని మొదటి సాక్షులు చెప్పినప్పటికీ, తక్కిన శిష్యులు నమ్మలేదు (మార్కు 16:13). యేసు మృతుల్లో నుండి లేస్తాడని వారు ఆశించలేదు" అని చెప్పారు.

క్రమంగా, మగ్దలేనే మరియకు (యోహాను 20:11-18), ఎమ్మాయి మార్గంలో వెళ్తున్న ఇద్దరు శిష్యులకు (లూకా 24:13-32), పదకొండుమంది అపొస్తలులకు (యోహాను 20:19-31), 500మందికి కనిపించినప్పుడు (1 కొరింథీయులకు 15:6), ఆయన నిజంగా లేచాడని యేసు అనుచరులు గ్రహించారు. ఆదిమ సంఘం ఆరాధన సమావేశాలు ఈ మాటలతో ప్రారంభించింది, "ఆయన లేచాడు. ఆయన నిజంగా లేచాడు!"

## అన్వయం: సిలువ మరియు పునరుత్థాన శక్తిలో పరిచర్య

చాలామంది ఉదారవాద వేదాంతవేత్తలు పునరుత్థానాన్ని ఒక పురాణంగా దాటవేస్తారు. అయితే, అపొస్తలుల విశ్వాసం యేసు జీవితం ద్వారా కలిగే శాశ్వత ప్రభావం గూర్చిన అందమైన కథపై ఆధారపడలేదు కాని ఆయన మరణ పునరుత్థానమనే దృఢమైన వాస్తవాలపై ఆధారిపడింది. యేసు చనిపోయి మృతుల్లో నుండి తిరిగి లేచాడని అపొస్తలులకు తెలుసు. దీని వలన వారు హింసను, మరణాన్ని కూడా ధైర్యంగా ఎదుర్కొన్నారు. యేసు మరణ పునరుత్థానాలు నేటి పరిచర్యలో ఎలా మాట్లాడుతాయి?

### సిలువ శక్తితో పరిచర్య చేయడం

► 1 కొరింథీయులకు 1:17-2:5 చదవండి.

తన రెండవ సువార్త యాత్రలో, పౌలు అరెయొపగులో ప్రసంగించి ఏథెన్సు నుండి కొరింథుకు వచ్చాడు. పౌలు ఏథెన్సులో చేసిన పరిచర్య ద్వారా పరిమిత ఫలితాలు మాత్రమే చూసినట్లు కనిపిస్తుంది (అపొస్తలుల కార్యములు 17:16-34). అతడు ఏథెన్సులో సంఘు స్థాపన చేయలేదు, తాత్విక మనసుగల ఏథెన్సు పట్టణస్తులు తన పునరుత్థాన సందేశాన్ని అవమానించారు. ఏథెన్సు నుండి, 75 కిలోమీటర్లు పశ్చిమవైపు కొరింథుకు, అకయలో అత్యంత ప్రభావవంతమైన పట్టణానికి వచ్చాడు.

క్రమంగా థెస్సలొనీక, బెరయ, ఏథెన్సు అను మూడు పట్టణాల్లో వ్యతిరేకత ఎదుర్కొన్న తర్వాత పౌలు కొరింథుకు వచ్చాడు: బహుశా అందుకే అతడు ఇలా చెప్పాడు, “మరియు బలహీనతతోను భయముతోను ఎంతో వణకుతోను మీయొద్ద నుంటిని” (1 కొరింథీయులకు 2:3). గ్రీకు శ్రోతలు వాక్చాతుర్యం, మేధస్సు కోసం చూసినప్పటికీ, పౌలు సిలువ మాత్రమే ప్రకటించాలని నిర్ణయించుకున్నాడు. అతని సందేశంలోని శక్తి వాక్చాతుర్యంవల్ల కలుగలేదు కాని సిలువవల్ల వచ్చింది. “క్రీస్తుయొక్క సిలువ వ్యర్థముకాకుండునట్లు, వాక్చాతుర్యములేకుండ సువార్త ప్రకటించుటకే ఆయన నన్ను పంపెను” (1 కొరింథీయులకు 1:17).

కొరింథులో, “నేను, యేసుక్రీస్తును అనగా, సిలువవేయబడిన యేసు క్రీస్తును తప్ప, మరిదేనిని మీమధ్య నెరుగకుందునని నిశ్చయించుకొంటిని” (1 కొరింథీయులకు 2:2) అని పౌలు చెప్పాడు. సిలువ సందేశం అనేకమందికి అవరోధంగా ఉంటుందని పౌలుకు తెలుసు.

> యూదులు సూచకక్రియలు చేయుమని అడుగుచున్నారు, గ్రీసుదేశస్థులు జ్ఞానము వెదకుచున్నారు. అయితే మేము సిలువవేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము (1 కొరింథీయులకు 1:22-23).

ఈ సందేశం యూదులకు ఆటంకంగా ఉంటుంది. వారు మెస్సీయను ధృవీకరించే సూచనల కోసం చూశారు. వారి మనసుల్లో, సిలువవేసిన వ్యక్తి ఎన్నుకోబడిన మెస్సీయగా ఉంటాడనే ఆలోచన అసంబద్ధమైంది. “వ్రేలాడదీయ బడినవాడు దేవునికి శాపగ్రస్తుడు” (ద్వితీయోపదేశకాండము 21:23) అని ధర్మశాస్త్రం సెలవిస్తుంది. సిలువవేయబడిన యేసు మెస్సీయ అని ప్రకటించటం యూదులకు ఆటంకం.

సిలువను గూర్చిన వార్త అన్యజనులకు వెర్రితనం. గ్రీకులు హతసాక్షి మరణాన్ని గౌరవించారు. రోమీయులకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో యేసు చంపబడితే, ఆయన సాహసానికి గ్రీకు తత్వవేత్తలు ఆయనను గౌరవించేవారు. కాని సిలువ బాధితునికి అగౌరవం; ఇది గౌరవార్థమైన మరణం కాదు. సిలువవేయబడిన వారికి సరైన సమాధి కూడా చేయరు. వాళ్ల దేహాన్ని ఆకాశపక్షులు, ఎలుకలు తింటాయి, ఎముకలు సాధారణ గోతిలో పడేస్తారు. సిలువవేయబడిన యూదాలోనే అతి సామాన్యుడిని, ఒక పల్లెటూరి వాడిని ‘ప్రభువు”గా ప్రకటించటం, అన్యులకు అర్థరహితం.

సిలువ యూదులకు ఆటంకం మరియు అన్యజనులకు వెర్రితనం, కాని పౌలు నిస్సంకోచంగా సిలువ సందేశం ప్రకటించాడు. పౌలు ఉదాహరణ నేడు మనకు మాదిరి. మొదటి శతాబ్దంలో మాదిరిగానే, నేడు సిలువ కొందరికి ఆటంకంగాను మరికొందరికి వెర్రితనంగాను ఉంది, కాని అది మనం ప్రకటించవలసిన సందేశం.

పరిచారకులు మరియు సంఘ నాయకులుగా మన విశ్వాసం మన సామర్థ్యం నుండి రాదు; మన విశ్వాసం సిలువ సందేశం నుండి వస్తుంది. పౌలు అద్భుతమైన విద్యనభ్యసించాడు, మేధస్సుగలవాడు, ఆ కాలంలోని తెలివైనవారితో వాదించగలవాడు. కాని అతని తుది విశ్వాసం సిలువలో ఉంది. మనం ప్రజలను కేవలం వాదనలతో గెలుచుకుంటే, వాళ్ల విశ్వాసం మనుష్యుల జ్ఞానమందు నిలిచియుంటుంది; కాని వాళ్ళని సిలువవైపు నడిపించినప్పుడు, వాళ్ల విశ్వాసం దేవుని శక్తిపై ఆధారపడుతుంది (1 కొరింథీయులకు 2:5).

**పునరుత్థాన శక్తితో పరిచర్య చేయడం**

► అపొ. కా. 2:22-36 చదవండి.

ఆరంభ క్రైస్తవ బోధకు పునరుత్థానం కేంద్రమని అపొస్తలుల కార్యములు చూపిస్తుంది. పెంతెకొస్తను దినమందు, యేసు ప్రవక్తలు ప్రవచించిన వాగ్దానాలకు నెరవేర్పని రుజువుగా పేతురు పునరుత్థానమును సూచించాడు.

అగ్రిప్ప ఎదుట తననుతాను సమర్థించుకుంటూ, పౌలు ఇలా చెప్పాడు: "ఇప్పుడైతే దేవుడు మన పితరులకు చేసిన వాగ్దానము విషయమైన నిరీ క్షణనుగూర్చి నేను విమర్శింపబడుటకు నిలిచియున్నాను. మన పండ్రెండు గోత్రములవారు ఎడతెగక దివారాత్రులు దేవుని సేవించుచు ఆ వాగ్దానము పొందుదుమని నిరీక్షించుచున్నారు. ఇప్పుడైతే దేవుడు మన పితరులకు చేసిన వాగ్దానము విషయమైన నిరీ క్షణనుగూర్చి నేను విమర్శింపబడుటకు నిలిచియున్నాను. మన పండ్రెండు గోత్రములవారు ఎడతెగక దివారాత్రులు దేవుని సేవించుచు ఆ వాగ్దానము పొందుదుమని నిరీక్షించుచున్నారు." ఈ వాగ్దానం ఏంటి? పునరుత్థానం. "దేవుడు మృతులను లేపునను సంగతి నమ్మతగనిదని మీరేల యెంచుచున్నారు?" (అపొస్తలుల కార్యములు 26:6-8)

► 1 కొరింథీయులకు 15:12-34 చదవండి.

1 కొరింథీలో, తన పరిచర్య సిలువ శక్తితో మాత్రమే కాదుగాని పునరుత్థాన శక్తితో స్థిరపడిందని పౌలు చూపించాడు. పునరుత్థానం లేకుండా తన పరిచర్య అర్థరహితమని నొక్కి చెప్పాడు. "మరియు క్రీస్తు లేపబడియుండనియెడల మేముచేయు ప్రకటన వ్యర్థమే, మీ విశ్వాసమును వ్యర్థమే" (1 కొరింథీయులకు 15:14). పునరుత్థానం లేకుండా, యేసు

కూడా విఫలమైన మెస్సీయగా ఉన్నాడు. పునరుత్థానానికి వేరుగా, యేసు ఒక విషాదకరమైన హతసాక్షి కావచ్చు, కాని వాగ్దానం చేయబడిన మెస్సీయ కాదు.

పునరుత్థానం మన క్రైస్తవ విశ్వాసానికి ఆధారం. "క్రీస్తు లేపబడనియెడల మీ విశ్వాసము వ్యర్థమే, మీరింకను మీ పాపములలోనే యున్నారు" (1 కొరింథీయులకు 15:17). సిలువలో, క్రీస్తు మన పాపముల నిమిత్తం ప్రాయశ్చిత్తం అందించాడు, కాని పాపంపై మరణంపై క్రీస్తు శక్తి నిరూపించింది పునరుత్థానం. పునరుత్థానం లేకపోతే, మీ విశ్వాసం వ్యర్థం మీరింకను మీ పాపంలోనే ఉన్నారని పౌలు చెప్పాడు.

పునరుత్థానం మన క్రైస్తవ నిరీక్షణకు ఆధారం. "మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు" (1 కొరింథీయులకు 15:21-22). క్రీస్తు మృతుల్లో నుండి తిరిగి లేచాడు గనుక పునరుత్థాన నిరీక్షణ ఉందని పౌలు కొరింథీయులకు ధృవీకరించాడు.

రెండవ శతాబ్దంలో, లూసియన్, గ్రీకు నవలా రచయిత, పునరుత్థానమును విశ్వసించినందుకు క్రైస్తవులను అపహసించాడు. అతడు ఇలా చెప్పాడు: "బీదలు నిరంతరం బ్రతుకుతామని నమ్ముతారు. దానివలన, వారు మరణాన్ని లెక్కచేయకుండా తమ విశ్వాసం కోసం జీవితాలను త్యాగం చేయడానికి ఇష్టపడతారు." లూసియన్ క్రైస్తవులను అపహసిస్తున్నాడు కాని అతని మాటలు వాస్తవం. లూసియన్ చెప్పినట్లుగా, రెండవ శతాబ్దపు క్రైస్తవులు తాము యుగయుగాలు జీవిస్తామని నమ్మారు. ఆ నమ్మకం వలన, తమ విశ్వాసం విషయంలో చనిపోవడానికి కూడా ఇష్టపడ్డారు.

ఇది నేటికీ నిజమైయుండాలి. క్రీస్తు మృతుల్లో నుండి తిరిగి లేచాడని మనం నిజంగా నమ్మితే, అది హింసలో మరణంలో కూడా మనకు నమ్మకం ఇవ్వాలి. పునరుత్థానం మన క్రైస్తవ నిరీక్షణకు ఆధారం.

పునరుత్థానం మన క్రైస్తవ జీవితానికి ఆధారం. పౌలు పునరుత్థాన సిద్ధాంతమును ఆశ్చర్యపరిచే ఆచరణాత్మక అన్వయం ఇచ్చాడు. "మృతులు లేపబడనియెడల – రేపు చనిపోదుము గనుక తిందము త్రాగుదము ... నీతిప్రవర్తనగలవారై మేల్కొని, పాపము చేయకుడి" (1 కొరింథీయులకు 15:32, 34). పౌలు ప్రకారం, దైవికంగా జీవించడానికి పునరుత్థానం ఒక ప్రాముఖ్యమైన కారణమిస్తుంది. పునరుత్థానం లేకపోతే, మనం కూడా ఎపికురియనులు వలే జీవిస్తాం, వారిలా చెబుతారు: "మనం త్వరగా చనిపోతాం గనుక తినండి త్రాగండి." పునరుత్థానం లేకుండా నిత్యత్వం కోసం జీవించడంలో అర్థం లేదు. కాని పౌలు ఇలా కొనసాగించాడు: పునరుత్థానం ఉంది గనుక, పాపం లేని జీవితం జీవించడం మంచిది. పాపంపై జయం, పునరుత్థానంలో మన విశ్వాసం నుండి కలుగుతుంది.

పరిచర్య సవాళ్లలో విశ్వాసం సన్నగిల్లుతున్నందున పునరుత్థానం మనల్ని ఒప్పించాలి. ఎన్నిసార్లు మన ప్రార్థనలకు సమాధానాలు రాకుండా పోవాలని ఆశిస్తాం? ఎందుకు? ఎందుకంటే మనం పునరుత్థాన శక్తి మర్చిపోతున్నాం! ఎన్నిసార్లు మనం జయం పొందుతామనే నమ్మకం లేకుండా శోధన ఎదుర్కొంటున్నాం? ఎందుకు? ఎందుకంటే మనం పౌలు వాగ్దానం మర్చిపోతున్నాం: "మృతులలోనుండి యేసును లేపినవాని ఆత్మ మీలో నివసించినయెడల, మృతులలోనుండి క్రీస్తుయేసును లేపినవాడు చావునకు లోనైన మీ శరీరములను కూడ మీలో నివసించుచున్న తన ఆత్మ ద్వారా జీవింపజేయును" (రోమా 8:11).

క్రీస్తు మనలో నివసిస్తే, మనం ఇకమీదట శరీరంతో జీవించం. పాపానికి దాసులం కాదు. ఇది పునరుత్థాన జీవితం. యేసును మృతుల్లో నుండి లేపిన శక్తి, మనకు అనుదినం పాపంపై జయమిస్తుంది. పునరుత్థాన శక్తితో జీవిస్తూ పరిచర్య చేయటం అంటే ఇదే.

## ముగింపు: క్రీస్తువంటి జీవితం, పరిచర్యకు గుర్తులు

### మీ జీవితం క్రీస్తువలే ఉందా?

లూకా "మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి" (అపొస్తలుల కార్యములు 11:26) అని రాశాడు. అంతియొకయలో క్రైస్తవులను ప్రజలు చూసి, "వారు క్రీస్తువలే ఉన్నారు. వాళ్ళని మనం 'క్రైస్తవులుగా' పిలవాలి" అని అనుకున్నారు. మీరు ఈ వచనం చదివినప్పుడు, "నా పొరుగువారు నా ప్రవర్తన, మాటలు, వైఖరులు చూసి 'క్రైస్తవుడు' అనే పేరు పెడతారా? నేను క్రీస్తువలే కనిపిస్తానా?" అని అడగాలి. అంతియొకయలో క్రైస్తవులు యేసుక్రీస్తును ప్రతిబింబించేటట్లుగా జీవించారు; వారు క్రైస్తవులనబడ్డారు.

ఒక పాస్టరుగా అనేక సంవత్సరాల తర్వాత, డా.హెచ్.బి లండన్ ప్రస్తుతం యౌవ్వన పాస్టర్లకు బోధకునిగా పనిచేస్తున్నాడు. పాస్టర్లు ఎదుర్కొనే ఆత్మీయ ప్రమాదాలు గురించి హెచ్చరించాడు. "ఒక వ్యక్తి పరిశుద్ధంగా ఉండకుండా పరిశుద్ధమైన విషయాలకు దగ్గరగా ఉండగలరు. క్షమించకుండ క్షమాపణ గురించి ప్రసంగించటం సాధ్యమే. పరిచారకులు పరిచర్యకు ప్రాణం పెడతారు కాని తమ ఆత్మీయ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తారు."[52] ఇతరులకు ప్రసంగించి, మీకు మీరు అనర్హులు అవ్వడం సాధ్యం (1 కొరింథీయులకు 9:27).

డా.లండన్ ఇతరులను నడిపిస్తుండగా పాస్టర్లు ఆత్మీయ వైఫల్యాన్ని నివారించడానికి సహాయపడే ఆచరణాత్మక విషయాలు సూచించాడు. క్రీస్తువంటి జీవితం జీవించడానికి అవి సహాయపడతాయి. అతడు ఇలా రాశాడు:

---

[52] H. B. London, *They Call Me Pastor*. (Grand Rapids: Baker Books, 2000), 145

- **ఏం బోధిస్తున్నారో అలా జీవించండి.** మీరు మొదట మీ జీవితానికి అన్వయించుకోకుండా ఇతరులకు ప్రసంగించవద్దు.
- **మీ ఆత్మ పట్ల శ్రద్ధ చూపండి.** కొందరు వైద్యులు అనారోగ్యంగా ఉంటారు. వారు ఇతరులపై శ్రద్ధ చూపుతారు, కాని తమ సొంత ఆరోగ్యం పట్టించుకోరు. ఒక పాస్టరుగా, మీ ఆత్మీయ శ్రేయస్సు పట్ల శ్రద్ధ చూపాలి.
- **మిమ్మల్ని మీరు తగ్గించుకోండి.** పాస్టరు బ్యాంకు ప్రెసిడెంట్ కాదు, కాపరి అని గుర్తుంచుకోండి, పరిచారకునిగా ఉండండి.
- **నిరుత్సాహాల్లో ఎదగండి.** మీరు పరిచర్యలో నిరుత్సాహం ఎదుర్కొంటారు. మీరు శిక్షణ ఇస్తున్న వారు దూరమైపోతారు. మీ సన్నిహిత స్నేహితుడు మీకు వ్యతిరేకి అవుతాడు. సంఘ సభ్యులు మిమ్మల్ని తిరస్కరిస్తారు. నిరుత్సాహాలు మిమ్మల్ని నిరాశగలవారిగా చేయకూడదు. యూదా యేసును ధిక్కరించాడు. దేమేత్రి పౌలును విడిచిపెట్టాడు. కన్నీళ్ళలో, ఎదగండి, గొర్రెమందను నడిపించండి.

**మీ పరిచర్య క్రీస్తును పోలి ఉందా?**

యేసు జీవితం మరియు పరిచర్యను గూర్చిన ఈ పాఠాల్లో, యేసు పరిచర్యలో అనేక గుణలక్షణాలు మనం చూశాం. ఈ గుణలక్షణాలు మీ పరిచర్యలో ఉన్నాయా?

మీ పరిచర్యను మూల్యంకనం చేసేటప్పుడు అడగాల్సిన కొన్ని ప్రశ్నలు ఇవి:

- పాపులు రక్షించబడుతున్నారా? యేసు ప్రసంగించినప్పుడు, ప్రజలు నూతన జీవం పొందారు. మీరు ప్రజలను నూతన జననంలోకి నడుపుతున్నారా?
- విశ్వాసులు ఆత్మతో నింపబడుతున్నారా? యేసు తన పిల్లలకు ఆత్మను పంపుతానని వాగ్దానం చేశాడు. మీరు పరిచర్య చేస్తున్న వారి మధ్య ఈ వాగ్దానం నెరవేరిందా?
- సాతానుడు ఓడిపోయాడా? సాతానుడి దుర్గాలు పడగొట్టబడతాయా? యేసు పరిచర్య ఆత్మీయ అధికారం ద్వారా గుర్తించబడింది.
- బాధించబడినవారు స్వస్థపొందుతున్నారా? విడిపోయిన కుటుంబాల్లో సమాధానం ఉందా? విచ్ఛిన్నమైన జీవితాలు సమాధానంతో ఉన్నాయా? విచ్ఛిన్నమైన సంబంధాలు పునర్నిర్మించబడ్డాయా? యేసు భౌతికంగా, భావోద్వేగపరంగా, ఆత్మీయంగా గాయపడిన వారిని స్వస్థపరిచాడు.

- ప్రజలు కృపా సత్యాలు చూస్తున్నారా? నేను ప్రజలను యేసు వైపు నడుపుతున్నానా లేక యేసుకు దూరంగా నడుపుతున్నానా? యేసు నిశ్చయతతో సత్యాన్ని కృపను ప్రకటించాడు.

► మీరు ఈ ప్రశ్నలు చర్చించే క్రమంలో, మీ పరిచర్య ఏ విషయంలో క్రీస్తు పోలికలో ఎదగాలో చూడండి. ప్రతి పరిచారకుడు ఎదుగవలసిన విషయాలు ఉన్నాయని గుర్తించండి, కాబట్టి ఈ జాబితాను ఎదుగుదలకు సవాలుగా చూడండి తప్ప స్వీయ నిందారోపణకు సవాలుగా చూడొద్దు.

**పాఠం 8 అభ్యాసాలు**

(1) "సిలువలో పలికిన ఏడు మాటలు" పై ఒక ప్రసంగం లేక బైబిల్ పాఠం తయారుచేయండి. యేసు పలికిన ఈ మాటల సందేశాన్ని నేటి క్రైస్తవులకు నొక్కి చెప్పండి.

(2) అనుదిన క్రైస్తవ జీవితానికి పునరుత్థాన అర్థం ఏమైయుందో అనే విషయంపై ఒక బైబిల్ పాఠం లేక ప్రసంగం తయారుచేయండి. మీరు సిద్ధపడుతున్నప్పుడు, సువార్తలలోని పునరుత్థాన కథను అదే విధంగా 1 కొరింథీయులకు 15:15-17లోని పౌలు మాటలను ఉపయోగించండి.

# పాఠం 9

# చెరగని ప్రభావాన్ని విడిచి వెళ్ళడం

### పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) యేసు తన శిష్యులకు, సంఘానికి ఇచ్చిన చెరగని ప్రభావాన్ని అర్థం చేసుకోవాలి.

(2) యేసు విడిచివెళ్ళిన చెరగని ప్రభావాన్ని ఆధారం చేసుకొని మిషన్ యొక్క ప్రాముఖ్యతను అభినందించాలి.

(3) అపొస్తలుల కార్యాలలో తన శిష్యుల ద్వారా కొనసాగుతున్న యేసు పరిచర్య ప్రభావాన్ని గుర్తించాలి.

(4) తన పరిచర్య యొక్క చెరగని ప్రభావాన్ని అందించడానికి ఆచరణాత్మక మెట్లను అభివృద్ధి చేయాలి.

### పరిచర్యకు సూత్రం

మనం వెళ్ళిపోయిన తరువాత, మన తరువాతి తరానికి దేన్ని విడిచి వెళ్తామో అదే మన పరిచర్యకు పరీక్ష

### పరిచయం

అనేక సంవత్సరాలు ఒక గౌరవనీయమైన పాస్టరుగా పని చేసి సూరజ్ పదవి విరమణకు దగ్గరగా ఉన్నాడు. ఒకరతన్ని "నీ పదవి విరమణకు సంఘాన్ని ఎలా సిద్ధపరుస్తున్నావు? రాబోవు 10 సంవత్సరాలకు సంఘ దర్శనం ఏంటి?" అని అడిగారు. "నేను ఇక్కడ ఉండను, కాబట్టి నేను వెళ్లిపోయిన తర్వాత ఏం జరుగుతుందో నాకు అనవసరం" అని సూరజ్ బదులిచ్చాడు. ఈ పాస్టరు, సువార్తలో ప్రాముఖ్యమైన సూత్రాన్ని గ్రహించలేదు: మనం వెళ్లిపోయిన తర్వాత మన పరిచర్యకు పరీక్ష కలుగుతుంది.

ఈ పాస్టరుకు ప్రమోద్‌కు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గమనించవచ్చు. ప్రమోద్ 25 ఏళ్ల పరిచర్య తరువాత అనుకోకుండా మరణించాడు. ఆ సంవత్సరాల్లో, ప్రమోద్ తన స్థానిక సంఘంలో అనేక పరిచర్యలు చేశాడు. నిరాశ్రయులైనవారి కోసం పరిచర్య అభివృద్ధి చేశాడు, మాదకద్రవ్యాల నుండి బయటపడడానికి పునరావాస కార్యక్రమాలు నిర్వహించాడు, వ్యాపార నాయకుల కోసం సువార్త కార్యక్రమాలు నిర్వహించాడు. ప్రమోద్ సమాధి కార్యక్రమంలో, మాదకద్రవ్య వ్యసన పునరావాస కేంద్రంలోని నాయకుడు, "గత నెలలో, రాబోయే సంవత్సర బడ్జెట్ గురించి చర్చించటానికి ప్రమోద్ మరియు నేను కలిశాం." నిరాశ్రయులకు పరిచర్య చేసే కార్యక్రమాన్ని చూసే నాయకుడు, కుటుంబాలకు తాత్కాలిక గృహాలను

అందించే క్రొత్త భవన నమూనాను చూపించాడు. ప్రమోద్, పరిచర్య భవిష్యత్తును జాగ్రత్తగా ప్రణాళిక చేశాడు. అతడు చెరగని ప్రభావాన్ని విడిచి వెళ్లాడు.

చివరి పాఠంలో, యేసు శిష్యులకు ఇచ్చిన చివరి బోధలు, శిష్యుల చివరి నియామకం, ఆరోహణం తరువాత శిష్యుల పరిచర్య గురించి అధ్యయనం చేస్తాం. చెరగని ప్రభావాన్ని విడిచి వెళ్ళడం గురించి పాఠాలు నేర్చుకుందాం.

► మీరు ఒకవేళ ఈ రాత్రి మరణిస్తే, ఏమి విడిచి వెళతారు?

- మీ కుటుంబానికి మీరు ఇచ్చేది ఏంటి?
- మీ సమాజానికి మీరు ఇచ్చేది ఏంటి?
- మీ పరిచర్యకి మీరు ఇచ్చేది ఏంటి?

## యేసు వీడ్కోలు ఉపదేశం

యోహాను 13-16 ను, పాత నిబంధన గ్రంథంలో యాకోబు, మోషే, యెహోషువ, దావీదు ఇచ్చిన "వీడ్కోలు"లతో పోల్చి చూడవచ్చు.[53] యేసు "వీడ్కోలు ఉపదేశం" ఆయన ఇచ్చిన అత్యంత లోతైన, సన్నిహితమైన బోధను అందిస్తుంది.

యోహాను 13:1 ఈ వీడ్కోలు ఉపదేశానికి సందర్భం ఏర్పాటు చేస్తుంది: "తాను ఈ లోకమునుండి తండ్రియొద్దకు వెళ్లవలసిన గడియ వచ్చెనని యేసు పస్కాపండుగకు ముందే యెరిగిన వాడై." 48 గంటల్లో చనిపోతామని మీకు తెలిస్తే, మీ పరిచర్యను కొనసాగించు వారితో మీరేమి చెబుతారు? మీ అనుచరుల విషయంలో మీరు ముఖ్యంగా భావించిన విషయాలు, ఆ మాటలు తెలియజేస్తాయి.

ఈ ప్రభు రాత్రిభోజనంలో, యేసు తన మాటలు మరియు క్రియల (వారి కాళ్లు కడుగుట) ద్వారా శిష్యులకు తన ప్రేమను వెల్లడిచేశాడు. యేసు "లోకములోనున్న తనవారిని ప్రేమించాడు." ఇప్పుడు ఆయన "వారిని అంతమువరకు ప్రేమించెను" (యోహాను 13:1). "అంతమువరకు" అనే మాటలో రెండు ఆలోచనలు ఉన్నాయి:

1. యేసు వారితో గడిపిన సమయం ముగింపు వరకు యేసు వారిని ప్రేమించాడు.
2. యేసు వారిని ఉన్నతంగా ప్రేమించాడు. యేసు వారిని పూర్తిగా ప్రేమించాడు.

► యోహాను 13:31-14:31 చదవండి.

---

[53] ఆదికాండము 49, ద్వితీయోపదేశకాండము 32-33, యెహోషువ 23-24, 1 దినవృత్తాంతములు 28-29

## యేసు వీడ్కోలు ఉపదేశంలో ఆజ్ఞలు, వాగ్దానాలు

***ఆజ్ఞ: ఒకరినొకరు ప్రేమించాలి (యోహాను 13:34).***

"మీరు ఒకరి నొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞ ఇచ్చుచున్నాను; నేను మిమ్మును ప్రేమించి నట్టే మీరును ఒకరి నొకరు ప్రేమింపవలెను." ప్రేమ కంటే గొడవలకే ప్రసిద్ధిచెందిన శిష్య బృందానికి, ఇది ఒక కష్టమైన ఆజ్ఞే.

ఇది ఏ విధంగా క్రొత్త ఆజ్ఞ? "నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమింపవలెను" అని దేవుని ప్రజలకు పాత నిబంధన కూడా బోధిస్తుంది. యేసు ప్రేమ గురించి బోధించినప్పుడు, అందులో రెండు నూతన కోణాలు ఉన్నాయి.[54]

మొదటిగా, యేసు తాను ఆజ్ఞాపించిన ప్రేమకు మాదిరి చూపించాడు. ఆయన ప్రేమించినట్లుగా వారు ప్రేమించాలి. వారి పాదాలు కడిగిన తరువాత, "నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకరి నొకరు ప్రేమింపవలెను" అని యేసు చెప్పాడు. వినయపూర్వకమైన సేవ ద్వారా ఆయన ప్రేమ చూపించాడు. అప్పటి, ఇప్పటి శిష్యులు యేసు ప్రేమించినట్లుగా ప్రేమించాలి. ఈ ప్రేమ, పరిచారం చేయడానికి తువాలు తీసుకుంటుంది. ఈ ప్రేమ మోసం చేసేవాడిని కూడా ప్రేమిస్తుంది. ఈ ప్రేమ మరణం వరకు నిలిచియుంటుంది.

రెండవదిగా, క్రైస్తవుల మధ్య ప్రేమ, యేసు సత్యసందేశానికి ప్రత్యేక సాక్ష్యంగా ఉండాలి. "మీరు ఒకనియెడల ఒకడు ప్రేమగలవారైనయెడల దీనిబట్టి మీరు నా శిష్యులని అందరును తెలిసికొందురనెను" (యోహాను 13:35). తరువాత, "వారియందు నేనును నాయందు నీవును ఉండుటవలనవారు సంపూర్ణులుగా చేయబడి యేకముగా ఉన్నందున నీవు నన్ను పంపితివనియు, నీవు నన్ను ప్రేమించినట్టే వారిని కూడ ప్రేమించితివనియు, లోకము తెలిసికొనునట్లు నాకు అనుగ్రహించిన మహిమను వారికి ఇచ్చితిని" (యోహాను 17:23) అని యేసు ప్రార్థించాడు. సంఘ ప్రేమ, ఐక్యత యేసు సందేశానికి సాక్ష్యంగా ఉండాలి.

వ్యక్తిగత లోపాలతో నిండిపోయిన ఒక క్రైస్తవుడ్ని ప్రేమించడం కంటే ఒక అవిశ్వాసిని ప్రేమించడం సులభమని అనేకమంది క్రైస్తవులు కనుగొన్నారు. అయితే క్రైస్తవులుగా, ఒకరినొకరు ప్రేమించాలనే ఆజ్ఞ మనకు ఉంది. యాభై సంవత్సరాలు తరువాత, యోహాను తన సందేశం గురించి సంఘానికి జ్ఞాపకం చేశాడు:

> ఎవడైనను–నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి, తన సహోదరుని ద్వేషించినయెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన తన సహోదరుని ప్రేమింపనివాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు దేవుని

[54] Darrell L. Bock, *Jesus According to Scripture* (Grand Rapids: Baker Book House, 2002), 498

ప్రేమించువాడు తన సహోదరుని కూడ ప్రేమింపవలెనను ఆజ్ఞను మనమాయనవలన పొందియున్నాము (1 యోహాను 4:20-21).

ఒకరినొకరు ప్రేమించాలనే ఆజ్ఞతో యేసు తన వీడ్కోలు ఉపదేశం మొదలుపెట్టాడు. ఈ ఆజ్ఞ, ఆయన ఈ సందేశంలో ప్రకటించిన సమస్తానికి మూలం.

***ఆజ్ఞ: కలవరపడకుడి; విశ్వాసముంచుడి (యోహాను 14:1).***

ఎప్పటివలే, పేతురు, "ప్రభువా, నీవెక్కడికి వెళ్లుచున్నావని?" ప్రశ్నించడానికి మధ్యలో జోక్యం చేసుకున్నాడు. ఆయన ఇచ్చిన సమాధానంలో, పేతురు తనని తృణీకరిస్తాడని, ఎరగనని అబద్ధం చెప్తాడని యేసు చెప్పాడు. ఆ తరువాత, యేసు పేతురుతో, తక్కిన శిష్యులతో, నేడు మనతో తన సందేశాన్ని కొనసాగించాడు. "మీ హృదయమును కలవరపడనియ్యకుడి."

యోహాను 13:38 తర్వాత, అధ్యాయానికి కొంత విరామం ఉంది గనుక, యోహాను 14:1ను ఒక క్రొత్త సందేశంగా చదువుతాం. యోహాను 14:1 పేతురుకి ఇచ్చిన సమాధానంలో భాగం. దీనిని ఇలా చదవండి:

> పేతురూ, నీవు నన్ను ముమ్మారు నేను తెలియదని అబద్ధం చెప్తావు. నీవు అనుకున్నదానికంటే బలహీనుడవు. కాని, నిరాశపడవద్దు; పేతురూ, నీ కోసం, ముఖ్యంగా నన్ను పట్టుకున్నప్పుడు భయంతో పారిపోయే మీయందరి కోసం ఒక నిరీక్షణ సందేశముంది. మీ హృదయాలు కలవరపడనీయవద్దు. దేవుని నమ్మండి; నన్ను కూడా నమ్మండి.

తాను విఫలమైనప్పటికీ, యేసు నిరీక్షణ సందేశం ఇస్తాడని పేతురు తెలుసుకోవాలి. శిష్యులు భయపడుతునప్పటికీ, యేసు నిరీక్షణ సందేశం ఇస్తాడని శిష్యులు తెలుసుకోవాలి. "మీ హృదయమును కలవరపడనియ్యకుడి" అనే మాట వర్తమానకాలంలో ఉంది. యేసు హెచ్చరికలు, మతాధికారుల వ్యతిరేకతల కారణంగా, శిష్యులు అప్పటికే భయపడ్డారు. "కలవరపడనియ్యకుడి.....దేవునియందు విశ్వాసముంచుడి, నాయందు విశ్వాసముంచుడి" అని యేసు చెప్పాడు.

పరిచర్య ఒత్తిళ్లతో ఇబ్బందిపడకుండా ఉండే ఏకైక మార్గం విశ్వాసముంచటం. సోమవారం, ప్రపంచవ్యాప్తంగా కొందరు పాస్టర్లు నిరుత్సాహపడుతూ ఉంటారు. నిన్న, మీరు నమ్మకంగా ప్రసంగించారు-మీ సభ్యుల్లో ఒకరు కోపగించుకున్నారు. మీరు పశ్చాత్తాపం గురించి ప్రసంగించారు-ఒక్కరు కూడా స్పందించలేదు. మీరు అవిశ్వాసులను ఆహ్వానించారు-ఒక్కరు కూడా రాలేదు.

కొన్ని దేశాలలో, సంఘాలు ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొంటున్నాయి. మరికొన్ని దేశాలలో, సంఘాలు ఇస్లాం ఉగ్రవాదుల బెదిరింపులకు గురౌతున్నాయి. ఇంకొన్ని దేశాల్లో, సంఘాలు సాంఘిక నిర్లక్ష్య వైఖరికి, ఎవరు పట్టించుకోని స్థితికి ప్రభావితమౌతున్నాయి. అయితే యేసు, "కలవరపడకుడి. దేవునియందు విశ్వాసముంచుడి; నాయందు విశ్వాసముంచుడి" అని సెలవిస్తున్నాడు.

*వాగ్దానం: నేనే మార్గమును (యోహాను 14:6).*

యేసు తమ కోసం స్థలం సిద్ధపరచడానికి వెళ్తున్నానని తన శిష్యులను ప్రోత్సహించాడు. ఇప్పుడు తోమా జోక్యం చేసుకుని, "ప్రభువా, యెక్కడికి వెళ్లుచున్నావో మాకు తెలియదే; ఆ మార్గమేలాగు తెలియునని" అడిగాడు.

యేసు ఇచ్చిన సమాధానం, క్రైస్తవ జీవితంలో ఒక ముఖ్య సూత్రాన్ని ఇస్తుంది. "నేను ఇక్కడికి వెళ్లుచున్నాన"ని యేసు చెప్పలేదు. బదులుగా, "నేనే మార్గమును" అని చెప్పాడు. యేసు, మార్గం లేక దిశ గురించి సూచించలేదు; తననే సూచించుకున్నాడు. లేఖనాల్లో, తండ్రి దగ్గరకు వెళ్ళే ఏకైక మార్గం క్రీస్తు ద్వారా అనే స్పష్టమైన ప్రకటన లేదు. ఉదారవాద వేదాంతవేత్తల (లిబరల్ తీయాలోజియన్) వాదనలకు భిన్నంగా, యేసు తానే దేవుని యొద్దకు వెళ్ళే మార్గమని పేర్కొన్నాడు.

*వాగ్దానం: మీరు మరి గొప్పకార్యాలు చేస్తారు (యోహాను 14:12-14).*

"నేను తండ్రియొద్దకు వెళ్లుచున్నాను గనుక నేనుచేయు క్రియలు నాయందు విశ్వాసముంచువాడును చేయును, వాటికంటె మరి గొప్పవియు అతడు చేయునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అని యేసు వాగ్దానం చేశాడు. ఈ కార్యాలు మరింత అద్భుతంగా ఉన్నాయి కాబట్టి గొప్పవి కాదుగాని అవి విస్తృతమైన పరిధి కారణంగా గొప్ప కార్యాలుగా పరిగణించబడ్డాయి. ఆయన భూలోక పరిచర్య సమయంలో, యేసు కార్యాలు కేవలం ఒక భౌగోళిక ప్రదేశానికి మాత్రమే పరిమితం. ఇప్పుడు, యేసు పరిశుద్ధాత్ముని పంపుతున్నాడు గనుక, సంఘ కార్యాలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతాయి.

"మీరు నా నామమున దేని నడుగుదురో తండ్రి కుమారునియందు మహిమపరచబడుటకై దానిని చేతున"ని యేసు కొనసాగించాడు. ఈ వాగ్దానానికి రెండు షరతులు ఉన్నాయి.

**(1) "నా నామములో అడగాలి."**

ప్రార్థన ముగింపులో "యేసు నామములో అడుగుతున్నాం" అనే దానికంటే ఇది గొప్పది. ఇది, యేసు మన విన్నపాలు ఆలకించేలా ఆయనను బలవంతం చేయడానికి ఉపయోగించే తాంత్రిక పదం కాదు. బైబిల్ అంతటిలో, దేవుని నామం

ఆయన లక్షణాన్ని సూచిస్తుంది. "యేసు నామంలో ప్రార్థించడం" అంటే యేసు చిత్తానికి, లక్షణాలకు అనుగుణంగా ప్రార్థించడం అని అర్థం.

యేసు నామంలో ప్రార్థించడమంటే, కుమారుని అధికారం ద్వారా తండ్రి దగ్గరకు రావడం. మోషే, ప్రభువు నామంలో మాట్లాడడానికి ఫరో యొద్దకు వచ్చినప్పుడు, (నిర్గమకాండము 5:23) తనను పంపిన దేవుని అధికారంతో వచ్చాడు. యేసు నామంలో ప్రార్థించడమంటే, ఆయన అనుమతి, అధికారంతో ప్రార్థించడం. మన కోసం "విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్న" కుమారుని ద్వారా తండ్రిని చేరుకుంటాం (హెబ్రీయులకు 7:25).

**(2) "...తండ్రి కుమారునియందు మహిమపరచబడుటకై దానిని చేతును."**

మన ప్రార్థనలు ఖచ్చితంగా దేవుని మహిమకొరకు ఉద్దేశించబడాలి. "మీరడిగినను మీ భోగముల నిమిత్తము వినియోగించుటకై దురుద్దేశముతో అడుగుదురు గనుక మీకేమియు దొరకుటలేదు" (యాకోబు 4:3) అని యాకోబు హెచ్చరించాడు. మనం యేసు వాగ్దానాన్ని ప్రకటన చేసేప్పుడు, మన సొంత ఉద్దేశాల కొరకు కాదు; దేవుని మహిమ కొరకు ప్రార్థించాలని నిశ్చయతతో ఉండాలి.

***ఆజ్ఞ: నా ఆజ్ఞలను గైకొందురు (యోహాను 14:15).***

యేసు ఒక ప్రామాణికత ఇచ్చాడు, దాని ద్వారా మనం ఆయన యెడల మనకున్న ప్రేమను కొలవగలం. "మీరు నన్ను ప్రేమించినయెడల నా ఆజ్ఞలను గైకొందురు." యోహాను తన మొదటి పత్రిక రాసినప్పుడు ఈ మాట గుర్తు చేసుకున్నాడు: "ఆయన వాక్యము ఎవడు గైకొనునో వానిలో దేవుని ప్రేమ నిజముగా పరిపూర్ణమాయెను" (1 యోహాను 2:5). కొందరు ఆధునిక బోధకుల బోధకు విరుద్ధంగా, శిష్యులు తన ఆజ్ఞల యెడల అవిధేయులుగా జీవించవచ్చని యేసు ఎన్నడు బోధించలేదు. ప్రేమ ఇష్టపూర్వక విధేయతలో కనిపిస్తుంది.

***ఆజ్ఞ: ఆయన ఆదరణకర్తను అనుగ్రహిస్తాడు (యోహాను 14:16).***

యోహాను 14:16లో "ఆదరణకర్త"గా అనువదించిన పదం, ఒకరి పక్షాన నిలబడే న్యాయవాదిని సూచిస్తుంది. కష్ట సమయాల్లో ఆదరించే సహాయకుని లేక ఆదరణకర్తను సూచిస్తుంది.

తండ్రి "మీయొద్ద ఎల్లప్పుడు నుండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను" అనుగ్రహించునని యేసు చెప్పాడు. పరిశుద్ధాత్ముని పరిచర్య యేసు పరిచర్యలా ఉంటుందని ఇది సూచిస్తుంది. ఆత్మ ఏదో ఒక శక్తిగా రాలేదుగాని, యేసులాగా ఒక వ్యక్తిగా వచ్చాడు.

ఆదరణకర్త అనగా పరిశుద్ధాత్ముడు, "ఆయన మీతోకూడ నివసించును, మీలో ఉండును" (యోహాను 14:17). ఆయన "సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" (యోహాను 14:26). ఆయన పరిచర్య చాలా శక్తివంతంగా ఉంటుంది గనుక యేసు ఇలా చెప్పాడు, నేను వెళ్లిపోవుటవలన మీకు ప్రయోజనకరము; నేను వెళ్లనియెడల ఆదరణకర్త మీయొద్దకు రాడు; నేను వెళ్లినయెడల ఆయనను మీయొద్దకు పంపుదును" (యోహాను 16:7).

యేసు వెళ్లిపోవడం శిష్యులకు ఎలా ప్రయోజనకరం? రాబర్ట్ కోల్మెన్ ఇలా వివరించాడు:

> ఆయన వారి [శిష్యులు] మధ్య శరీరధారిగా ఉన్నప్పుడు ఆత్మపై ఆధారపడే అవసరత కొద్దిగా చూశారు, కాబట్టి వారాయన జీవితాన్ని లోతుగా, సన్నిహితంగా తెలుసుకోలేదు. అయితే, ఆయన వారి మధ్య లేనప్పుడు, వారికి కనిపించే సహాయం లేదు. మనుగడ సాగించాలంటే, ఆయనకు తండ్రితో ఉన్న అంతరంగ సంబంధంలోని రహస్యాన్ని గురించి నేర్చుకోవాలి. వారికున్న అవసరాన్ని బట్టి వారు మునుపెన్నడూ లేని దానికంటే అధిక సహవాసం క్రీస్తుతో అనుభవిస్తారు.[55]

**ద్రాక్షావల్లిలోని జీవం**

► యోహాను 15:1-16:37 చదవండి.

యేసు అత్యంత శక్తివంతమైన సాదృశ్యాలలో ఒకటైన సాదృశ్యంతో కొనసాగించాడు. "నేను నిజమైన ద్రాక్షావల్లిని, నా తండ్రి వ్యవసాయకుడు." పాత నిబంధన తరచుగా ఇశ్రాయేలును ద్రాక్షావల్లితో పోలుస్తుంది.[56] అయితే, పాపం కారణంగా, ఇశ్రాయేలీయులు, దేవుడు వారిని నాటిన ఉద్దేశ్యాన్ని ఎన్నడు నెరవేర్చలేదు. బదులుగా, ఇశ్రాయేలు భౌతికంగా అభివృద్ధి చెందుతుండగా, అబద్ధ దేవతలకు బలిపీఠాలు కట్టింది (హోషేయ 10:2). రాజ్యాలకు ఆశీర్వాదకరంగా ఉండునట్లు ఫలించకుండా, కారు ద్రాక్షాలు ఇచ్చింది[57] (యెషయా 5:2). ఇశ్రాయేలు భయంకరంగా పాపం చేసింది కాబట్టి దేవుడు ఈ ద్రాక్షవల్లితో ఏమీ చేయలేక అగ్నికి అప్పగిస్తాడు (యెహెజ్కేలు 15:1-6).

యేసు నిజమైన ద్రాక్షావల్లిగా వచ్చాడు. ఇశ్రాయేలు రాజ్యం విఫలమైన దానిని నెరవేర్చడానికి వచ్చాడు; రాజ్యాలకు ఆశీర్వాదకరంగా ఉండాలనే ఇశ్రాయేలు పిలుపును నెరవేర్చడానికి వచ్చాడు.

---

[55] Robert Coleman, *The Mind of the Master* (Colorado Springs: WaterBrook Press, 2000), 29

[56] కీర్తన 80:8-9, యెషయా 5:1-7, యెషయా 27:2-6, హోషేయ 10:1-2

[57] "కారు" అంటే నాటబడిన ద్రాక్షాతోటలో తీపి రుచి కాకుండా "పుల్లటి" రుచి అని అర్థం.

ఆయన ద్రాక్షావల్లియని, వారు తీగెలని యేసు శిష్యులతో చెప్పాడు. యేసు సందేశం స్పష్టంగా ఉంది: ఫలించడం, పూర్తిగా ఆయనయందు నిలిచి ఉండాలనే ఇష్టంపై ఆధారపడి ఉంటుంది.

> ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు. ఎవడు నాయందు నిలిచియుండునో నేను ఎవనియందు నిలిచి యుందునో వాడు బహుగా ఫలించును; నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు (యోహాను 15:5).

ద్రాక్షావల్లికి వేరుగా శిష్యులు ఏం చేయలేరు; ద్రాక్షావల్లికి వేరుగా మనం ఏం చేయలేం. మనం మన సొంత బలంతో పరిచర్య చేసినప్పుడు, నిరుత్సాహపడతాం, శక్తిహీనులౌతాం. ఎందుకు? మనం మన సొంతగా ఫలించడానికి ఉద్దేశించబడలేదు.

మన ఆత్మీయ జీవితం కూడా ద్రాక్షావల్లితో కొనసాగే సంబంధం నుండి కలుగుతుంది. ఒకడు ద్రాక్షావల్లిలో అంటుకట్టబడకపోతే, "వాడు తీగెవలె బయట పారవేయబడి యెండిపోవును; మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు, అవి కాలిపోవును" (యోహాను 15:6). ఈ వచనం హెచ్చరిస్తున్నప్పటికీ, గొప్ప ప్రోత్సాహం కూడా ఇందులో ఉంది. ద్రాక్షావల్లికి వేరుగా, మనం పనికిరానివారం మరియు విలువలేనివారం. ఒకవేళ ద్రాక్షావల్లితో కొనసాగితే, ఫలభరితమైన జీవితం కలిగి ఉంటాం. మన ఆత్మీయ జీవితం మన సొంత బలంపై ఆధారితం కాదు; మనం "ద్రాక్షావల్లి"లో జీవించాలి.

ఈ విషయం హెబ్రీ పత్రికలో కూడా కనిపిస్తుంది. మన ప్రధాన యాజకుడైన యేసు, ఆయన యొద్దకు వచ్చు వారి కోసం, "విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు" (హెబ్రీయులకు 7:25). హోవార్డ్ హెన్డ్రిక్సన్ ఒంటరితనం అనుభవిస్తున్న శ్రమల్లో ఉన్న పాస్టర్లను ప్రోత్సహించాడు; "మీ కోసం ప్రార్థించే వారు ఎవరు లేకపోతే, క్రీస్తు విజ్ఞాపన చేస్తున్నాడని ఎన్నడు మర్చిపోవద్దు." ఆయన మన విజ్ఞాపనకర్త; ఆయన మన ఆత్మీయ జీవితానికి మూలం.

వారు ద్రాక్షావల్లిలో నిలిచియుండాలని యేసు శిష్యులకు జ్ఞాపకం చేశాడు. ఇప్పుడు కూడా ఇది వాస్తవమే. పాస్టర్లు, సంఘ నాయకులుగా, మీరు మీ సొంత బలంతో పరిచర్య చేయరు. మీరు ద్రాక్షావల్లి శక్తితో జీవిస్తారు మరియు మీ కోసం మీరు విజ్ఞాపన చేసుకునే శక్తి లేనప్పుడు మన కోసం విజ్ఞాపన చేసే మన ప్రధాన యాజకుని శక్తితో జీవిస్తారు.

యేసు చివరి ఉపదేశంలో మిగిలిన భాగం ద్వారా, శిష్యులు ఒకరినొకరు ప్రేమించుకోవాలని యేసు బోధించాడు. ఈ లోక ద్వేషాన్ని ఎదుర్కోవడానికి వారిని సిద్ధపరిచాడు. లోకం యేసును ద్వేషించింది; లోకం యేసు నిజమైన శిష్యుల్ని ద్వేషిస్తుంది.

ఆ తర్వాత యేసు పరిశుద్ధాత్ముని కార్యాలు గురించి లోతుగా వివరించాడు. ఉపదేశ ఆరంభంలో, ఆత్మను పంపుతానని వాగ్దానం చేశాడు. ఇప్పుడాయన పరిశుద్ధాత్మ కార్యాలను గురించి మరింతగా వారికి బోధించాడు. పరిశుద్ధాత్మ దేవుడు లోకాన్ని ఒప్పింపజేస్తాడు; శిష్యుల్ని సర్వసత్యంలోకి నడుపుతాడు; కుమారుని మహిమపరుస్తాడు.

కొద్ది సమయంలో తాను వెళ్ళిపోవడం గురించి వివరించాడు. మళ్ళీ శ్రమల్లో సమాధానం గురించి మాట్లాడాడు. ఉపదేశం ఆరంభంలో, యేసు "మీ హృదయమును కలవరపడనియ్యకుడి; దేవునియందు విశ్వాసముంచుచున్నారు నాయందును విశ్వాసముంచుడి" (యోహాను 14:1) అని ఆజ్ఞాపించాడు. ఉపదేశాన్ని సమాంతర ప్రోత్సాహంతో ముగించాడు: "లోకములో మీకు శ్రమ కలుగును; అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించియున్నాననెను" (యోహాను 16:33).

రెండు సందర్భాల్లో, మన నిరీక్షణ కేవలం యేసులోనే ఉందని గమనించండి. మనం క్రీస్తును నమ్మితే కలవరపడకూడదు. బదులుగా, క్రీస్తు లోకాన్ని జయించినందున మనం ధైర్యంగా ఉండాలి! ద్రాక్షావల్లితో జీవితం సమాధాన జీవితం. మన నిశ్చయత భూలోక పరిస్థితులపై ఆధారితం కాదుగాని క్రీస్తుపై, లోకాన్ని జయించిన జయంపై ఆధారితం.

**నిశిత పరిశీలన: ప్రభురాత్రి భోజనం**

మిష్నా, ఒక ప్రాచీన యూదుల సాంప్రదాయాల నివేదిక. యూదులు పస్కా భోజనం ఎలా చేస్తారో మిష్నాలో ఒక భాగం చూపిస్తుంది.[58] ప్రభురాత్రి భోజనంలో, బహుశ యేసు మరియు శిష్యులు, 2000 సంవత్సరాలు తర్వాత కూడా ఆచరిస్తున్న ఈ పద్ధతి పాటించారు.

నీటితో కలిపిన మొదటి గిన్నె ద్రాక్షారసాన్ని వారికి పోస్తారు. గిన్నె ఇస్తున్నప్పుడు ఆశీర్వచనంలో, నిర్గమకాండంలోని ఈ వాగ్దానం ఉంది: "నేను ఐగుప్తీయులు మోయించు బరువులక్రింద నుండి మిమ్మును వెలుపలికి రప్పించి."

ద్రాక్షారసపు రెండవ గిన్నె కలుపుతారు, కాని అప్పుడే పోయరు. చిన్న కుమారుడు "ఈ రాత్రి ఇతర రాత్రులకంటే ఎందుకు ప్రత్యేకం?" అని అడుగుతాడు. అప్పుడు తండ్రి, ఇశ్రాయేలు, ఐగుప్తు నుండి విడిపించబడిన కథ చెబుతాడు.

కథ ముగిసిన తర్వాత, కుటుంబం మొదటి పస్కా హల్లెల్, కీర్తనలు 113-114 పాడుతుంది. రెండవ గిన్నెను ఈ వాగ్దానంతో త్రాగుతారు: "వారి దాసత్వంలో నుండి మిమ్మును విడిపించి."

---

[58] మెస్సీయ యూదుల పస్కా భోజనం గురించిన వీడియో క్రింది లింకులో చూడొచ్చు, https://www.youtube.com/watch?v=bVolBDlWloQ, మార్చి 22, 2021న ప్రాప్తం. మీరు http://www.crivoice.org/haggadah.html వద్ద మరిన్ని చదవచ్చు, మార్చి 22, 2021న ప్రాప్తం.

ఆశీర్వచనం తర్వాత, భోజనం వడ్డిస్తారు. భోజనంలో చేదు ఆకులు, పులియని రొట్టెలు, గొర్రెపిల్ల, వెనిగర్ మరియు దినుసులతో కూడిన సాస్ భాగంగా ఉంటాయి. తండ్రి చేతులు కడుక్కున్న తర్వాత, రొట్టెలు విరిచి ఆశీర్వదించి, రొట్టె ముక్క తీసుకుని, చేదు ఆకులలో చుట్టి, సాస్ లో ముంచి, తింటాడు. ఆ తర్వాత కృతజ్ఞతలు చెప్పి, మాంసం ముక్క తింటాడు. ఆ తర్వాత, కుటుంబ సభ్యులు తింటారు.

మూడవ గిన్నెను పస్కా వాగ్దానంతో ఆశీర్వదిస్తారు: “నేను మిమ్మును విడిపించి.”

నాల్గవ గిన్నెను పస్కా వాగ్దానంతో ఆశీర్వదిస్తారు: “మిమ్మును నాకు ప్రజలుగా చేర్చుకుని.”

కుటుంబం చివరి పస్కా *హల్లెల్*, కీర్తనలు 115-118 పాడుతుంది.[59]

పస్కా భోజనంలో, దేవుడు ఇశ్రాయేలును బానిసత్వం నుండి విడిపించాడని యూదులు జ్ఞాపకం చేసుకుంటారు. మరి ముఖ్యంగా, మెస్సీయ ఒకేసారి వారిని బానిసత్వం నుండి విడిపిస్తాడనే దేవుని వాగ్దానాల నెరవేర్పు కోసం కనిపెడతారు.

పస్కా భోజనమైన తర్వాత రోజు, యేసు పరిపూర్ణ పస్కా గొర్రెపిల్లగా వధించబడతాడు. సిలువలో, విమోచనా వాగ్దానం నెరవేర్చబడింది.

## ప్రధాన యాజకుని ప్రార్థన

► యోహాను 17 చదవండి.

శిష్యులు మరియు నేటి సంఘం యేసు విడిచివెళ్ళిన చెరగని ప్రభావాన్ని అర్థం చేసుకోవాలంటే, తన శిష్యులతో చివరిగా చేసిన ప్రార్థన చాలా ప్రాముఖ్యం. ఈ ప్రార్థనను “హోలీ ఆఫ్ హోలీస్ ఆఫ్ జీసస్ ప్రేయర్” అని పిలుస్తారు. అది ఆయన చేసిన అత్యంత సన్నిహిత ప్రార్థన.

### యేసు తన కోసం ప్రార్థించాడు (యోహాను 17:1-5)

యేసు తన తండ్రికి ప్రార్థించాడు, “నీ కుమారుడు నిన్ను మహిమపరచునట్లు నీ కుమారుని మహిమ పరచుము.” ఈ ప్రార్థన శిష్యులు గ్రహించనప్పటికీ, ఈ ప్రార్థనకు సమాధానం రోమీయుల సిలువలో కనబడుతుందనే దిగ్భ్రాంతికరమైన సత్యాన్ని త్వరలో నేర్చుకుంటారు.

[59] గెత్సెమనేకు వెళ్ళేముందు యేసు తన శిష్యులతో కలిసి పాడిన చివరి కీర్తన ఇది (మత్తయి 26:30).

యేసు శ్రమపొందిన చివరి వారంలో సోమవారం నాడు, "నేను భూమిమీదనుండి పైకెత్తబడినయెడల అందరిని నాయొద్దకు ఆకర్షించుకొందునని" యేసు చెప్పాడు. "తాను ఏవిధముగా మరణము పొందవలసి యుండెనో సూచించుచు ఆయన ఈ మాట చెప్పెన"ని (యోహాను 12:32-33) యోహాను వివరించాడు. యేసు గెలవడం ద్వారా మహిమపొందలేదు, గాని స్పష్టమైన ఓటమి ద్వారా మహిమపొందాడు. యేసు సిలువ ద్వారా మహిమపొందాడు.

**యేసు తన శిష్యుల కోసం ప్రార్థించాడు (యోహాను 17:6-19)**

యేసు తన శిష్యుల కోసం మూడు విషయాలు ప్రార్థించాడు. ఆయన నామంలో తండ్రి వారిని కాపాడుతాడని ప్రార్థించాడు. వారిని దుష్టుని నుండి కాపాడుతాడని ప్రార్థించాడు. సత్యమందు వారిని ప్రతిష్ఠ చేయుము అని ప్రార్థించాడు.

**యేసు విశ్వాసులందరి కోసం ప్రార్థించాడు (యోహాను 17:20-26)**

భవిష్యత్తులో తనయందు విశ్వాసముంచే వారందరి కోసం యేసు ప్రార్థించాడు. వారు ఏకమైయుండాలని ప్రార్థించాడు. ఈ ఐక్యత లోకానికి సాక్ష్యం: "నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు."

యేసు లోకం కోసం ప్రార్థించలేదు: "లోకముకొరకు ప్రార్థన చేయుటలేదు, నీవు నాకు అనుగ్ర హించియున్నవారు నీవారైనందున వారికొరకే ప్రార్థన చేయుచున్నాను" (యోహాను 17:9). బదులుగా, క్రైస్తవుల కోసం ప్రార్థించాడు, తద్వారా లోకం నమ్ముతుంది. ఆయన సంఘం కోసం చేసిన చివరి ప్రార్థనలో, మన ఐక్యత, నమ్మకత్వం ద్వారా లోకానికి సాక్ష్యంగా ఉండాలని యేసు ప్రార్థించాడు.

యేసు ఇచ్చిన చెరగని ప్రభావం ఏమిటంటే, లోకంలో తన ఉద్దేశ్యాన్ని నెరవేర్చు విశ్వాసుల బృందం. పాత నిబంధనలో, సమస్త రాజ్యాలకు ఆశీర్వాద మాధ్యమంగా ఉండడానికి దేవుడు ఇశ్రాయేలును ఆశీర్వదించాడు (ఆదికాండము 12:1-3). క్రొత్త నిబంధనలో, ప్రజలందరికీ ఆశీర్వాద మాధ్యమంగా ఉండడానికి దేవుడు సంఘాన్ని దీవించాడు. ప్రజలందరికీ ఆశీర్వాదంగా ఉండాలనే ఆజ్ఞను మనం నెరవేర్చాలని యేసు ప్రార్థించాడు.

## యేసు శిష్యులకిచ్చిన అంతిమ ఆజ్ఞ

► మత్తయి 28:16-20, మార్కు 16:15, లూకా 24:44-49, మరియు అపొస్తలుల కార్యములు 1:6-11 చదవండి.

నాయకుడి నిలిచిఉండే ప్రభావం, ఎక్కువగా తన దర్శనం ఇతరులతో పంచుకునే విధానంలో నిర్ణయించబడుతుంది. సమర్పణగల అనుచరులను ప్రేరేపించే విధంగా దర్శనాన్ని వివరించే మాదిరి యేసు ఇచ్చాడు. ఆయన దర్శనాన్ని బట్టి, రోమా సామ్రాజ్యమంతటా దేవుని రాజ్య సందేశం ప్రకటించడానికి శిష్యులు తమ జీవితాలు సమర్పించుకున్నారు.

సువార్తలలో యేసు ఆజ్ఞల గురించి మూడు ప్రకటనలు ఉన్నాయి. ప్రతి ప్రకటన విభిన్న కోణంపై దృష్టిపెడుతుంది. మిషన్ లో అధికార అవసరత గురించి మత్తయి నొక్కి చెప్పాడు. మార్కు పరిధి గురించి చెప్పాడు: "సర్వసృష్టికి." లూకా అపొస్తలులు ప్రకటించవలసిన సందేశ విషయాలపై దృష్టిపెట్టాడు.

యేసు యొక్క చివరి ఆజ్ఞలోని అత్యంత సంపూర్ణమైన ప్రకటన మత్తయి 28:18-20లో ఉంది.

> పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మిచ్చుచు నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తివరకు సదాకాలము మీతోకూడ ఉన్నానని వారితో చెప్పెను.

ఈ ఆజ్ఞలో మొదటి ఆదేశం "శిష్యులనుగా చేయుడి." ఈ ఆదేశం నెరవేర్చాలంటే మనం వెళ్ళాలి, క్రొత్తగా మారినవారికి బాప్తిస్మం ఇవ్వాలి, యువ విశ్వాసులకు బోధించాలి. ఈ కార్యాలు "శిష్యులనుగా చేయుడి" అనే కేంద్ర ఆజ్ఞకు మద్దతుగా ఉంటాయి. సౌవార్తీకరణ, సమాజ సేవ, విద్య, పరిచర్యలో మిగిలిన కోణాలు ఈ కేంద్రీయ ప్రాథమిక విషయం ద్వారా నడపబడతాయి: శిష్యులుగా చేయాలని మనల్ని ఆజ్ఞాపించడం.

**కాయడం యొక్క (Pastoring) ఉద్దేశ్యం**

అమెరికా పాస్టరైన ఎడ్ మార్క్ క్వార్ట్, కమ్యూనిస్ట్ చెరలో చాలా సంవత్సరాలు గడిపిన రోమన్ పాస్టర్ రిచార్డ్ వుమ్బ్రాండ్ తో కలిసి భుజించాడు. భోజన సమయంలో, వుమ్బ్రాండ్ మార్క్ క్వార్ట్ సంఘ సభ్యునిపైపు చూసి, "మీ పాస్టర్ మంచివాడేనా?" అని అడిగాడు. "అవునని" అతడు బదులిచ్చాడు.

"అతడు ఎందుకు మంచి పాస్టర్?" అని వుమ్బ్రాండ్ అడిగాడు. "అతడు మంచి ప్రసంగాలు చేస్తాడు" అందుకే మంచివాడని సమాధానమిచ్చాడు.

"కాని అతడు శిష్యులను చేస్తాడా?" అని వుమ్బ్రాండ్ మళ్ళీ అడిగాడు. ఈ ప్రశ్న తన పరిచర్య దిశను మార్చేసిందని పాస్టర్ మార్ క్వార్ట్ చెప్పాడు. అతడిలా చెప్పాడు:

> పాస్టర్లందరి యెడల దేవుని ఉద్దేశ్యం.....యేసుక్రీస్తు శిష్యులను తయారుచేయటం. యేసుక్రీస్తును ప్రేమించేవారుగా, యేసుక్రీస్తును అనుసరించేవారుగా, యేసుక్రీస్తును తమ ప్రభువుగా పిలిచేవారుగా తయారు చేయాలి. అందుకే మనం పిలువబడ్డాం; యేసుక్రీస్తు శిష్యులనుగా చేయడానికే గాని సంఘ సభ్యులని

చేయడానికి కాదు. సండేస్కూల్ జరిపించడానికి కాదు. భవనాలు నిర్మించడానికి కాదు....యేసు క్రీస్తు శిష్యులుగా చేయడానికి. అదే ఉద్దేశ్యం.[60]

## నిశిత పరిశీలన: యేసు మిషన్/పని

యేసు పరిచర్య చివరి వారంలో జరిగిన సంఘటనలు, అన్ని రాజ్యాలు, మతాలు, జాతులుగల ప్రజలతో తన రాజ్యాన్ని సృష్టించడం ఆయన పని అని చూపిస్తాయి. యేసు పరిచర్య చివరి వారంలోని దృశ్యాలు, ఆయన పరిచర్య దేశాలన్నిటికీ అని చూపిస్తుంది.

- యేసు గాడిదపై పట్టణంలోకి ప్రవేశించాడు. మత్తయి మరియు యోహాను జెకర్యా ప్రవచనం ఉల్లేఖించారు, "ఇదిగో నీ రాజు సాత్వికుడై, గాడిదను భారవాహక పశువుపిల్లయైన చిన్న గాడిదను ఎక్కి నీయొద్దకు వచ్చుచున్నాడని." జెకర్యా ఈ రాజు పరిపాలన గురించి వివరించాడు. "నీ రాజు సమాధానవార్త అన్యజనులకు తెలియజేయును, సముద్రమునుండి సముద్రమువరకు" (మత్తయి 21:5, జెకర్యా 9:9-10).

- ఆయన అన్యులు ఆరాధించే దేవాలయ ఆవరణాన్ని శుద్ధిచేసినప్పుడు, యేసు యెషయా మాటలు ఉల్లేఖించాడు: "నా మందిరము సమస్తమైన అన్యజనులకు ప్రార్థన మందిరమనబడును అని వ్రాయబడలేదా?" (మార్కు 11:17, యెషయా 56:7 ఉల్లేఖించాడు). అన్యజనులు కూడుకొని ప్రార్థించు స్థలాన్ని యూదా నాయకులు రూకలు మార్చే, గువ్వలమ్మేతు క్రమవిక్రయాలు చేసే స్థలంగా మార్చారు.

- విలువైన అత్తరు వృథా చేస్తుందని చెప్పి శిష్యులు మరియను విమర్శించినప్పుడు, యేసు: "సర్వలోకములో ఎక్కడ ఈ సువార్త ప్రకటింపబడునో అక్కడ ఈమె చేసినదియు జ్ఞాపకార్థముగా ప్రశంసింపబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (మార్కు 14:9).

- ఒలీవ (Olivet) ప్రసంగంలో, "ఈ రాజ్య సువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందంతటను ప్రకటింపబడును; అటుతరువాత అంతము వచ్చును" (మత్తయి 24:14) అని యేసు చెప్పాడు. రాజ్యం కేవలం ఎన్నుకోబడిన వారికే అని నమ్మే ఈ యూదులైన శిష్యులతో, లోకమంతటా సువార్త ప్రకటించబడుతుందని యేసు చెప్పాడు.

[60] Edward Markquart, చేసిన "Pentecost: Go, Go, Go, Go, Go" ప్రసంగం నుండి, https://www.sermonsfromseattle.com/pentecost_go_go_go_go_go.htm, నవంబర్ 17, 2022న ప్రాప్తం లో దొరుకుతుంది.

రాజ్యలన్నిటి కొరకు మెస్సీయ వస్తాడని పాత నిబంధన ప్రవక్తలు చెప్పారు. ఆయన పరిచర్య చివరి వారంలో, దేవుని రాజ్యంలో అన్ని రాజ్యాల ప్రజలుంటారని యేసు తన శిష్యులకు బోధించాడు. ప్రవక్తల వాగ్దానం సంఘం ద్వారా నెరవేర్చబడుతుంది.

## యేసు విడిచి వెళ్ళిన నిలిచియుండు స్వాస్థ్యం: అపొస్తలుల కార్యముల గ్రంథంలో సంఘం

క్రీస్తు జీవితంపై రాసిన అనేక పుస్తకాలు ఆరోహణంతోనే ముగుస్తాయి. అయితే, యేసు పరిచర్య సిలువ లేక ఖాళీ సమాధి వరకే కాదు; ఆయన పరిచర్య పెంతెకొస్తు యొద్దకు నడిపింది. వారితో ఎల్లప్పుడు ఉండునట్లు యేసు ఆదరణకర్తను పంపుతానని చెప్పాడు (యోహాను 14:16). ఈ వాగ్దానం అపొస్తలుల కార్యములలో నెరవేరింది. అపొస్తలుల కార్యములలో రెండు దృశ్యాలు, యేసు వారసత్వం నెరవేర్పును చూపిస్తాయి.

### పెంతెకొస్తుదినమందు సంఘం

► అపొస్తలుల కార్యములు 1:4-11 మరియు అపొస్తలుల కార్యములు 2:1-41 చదవండి.

ఆరోహణమయ్యే ముందు, శిష్యులు, “ప్రభువా, యీ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా?”అని అడిగారు. యేసు భౌతిక, రాజకీయ సంబంధమైన రాజ్యం స్థాపిస్తాడని ఆశించారు. వారి మనసుల్లో, పునరుత్థానం భౌతిక రాజ్య అవకాశాన్ని బలపరచింది. యేసు రోమీయులను వెల్లగొట్టడానికి తన అధికారం ఉపయోగించాలని వారు ఆశించారు. అయితే యేసు ఇలా స్పందించాడు,

> కాలములను సమయములను తండ్రి తన స్వాధీనమందుంచుకొని యున్నాడు; వాటిని తెలిసికొనుట మీ పనికాదు. అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశములయందంతటను భూదిగంతముల వరకును, నాకు సాక్షులైయుందురని వారితో చెప్పెను (అపొస్తలుల కార్యములు 1:7-8).

“రాజ్యం ఎప్పుడొస్తుందని తెలుసుకోవడం మీ పని కాదు,” అని యేసు సూచించాడు. “బదులుగా, నేను మీకిచ్చిన పని నెరవేర్చాలి. భూదిగంతాలవరకు నాకు సాక్షులై ఉండాలి. కాని మీరు వెళ్ళే ముందు, వేచియుండాలి.” లూకాలో, “పైనుండి శక్తి పొందువరకు పట్టణములో నిలిచి యుండుడని” (లూకా 24:49) యేసు చెప్పాడు.

పస్కా పండుగైన యాభై దినాలు తర్వాత, 120మంది శిష్యులు మేడగదిలో ఉండగా, పరిశుద్ధాత్ముని వాగ్దానం నెరవేరింది. యూదుల పెంతెకొస్తను పండుగకు ఇతర దేశాల నుండి వచ్చిన ప్రజల భాషల్లో మాట్లాడటం వారు

మొదలుపెట్టారు (అపొస్తలుల కార్యములు 2:4, 6-11). ఇది, సమస్త దేశాల నుండి వచ్చిన ప్రజలతో తన సంఘాన్ని ఏర్పాటు చేయాలనే క్రీస్తు ప్రణాళిక నెరవేర్పుకు సూచన.

అపొస్తలుల కార్యములు 2లోని రాజ్యాల జాబితా, ఆదికాండము 10లో రాజ్యాల జాబితాను మనకు గుర్తుచేస్తుంది. ఆదికాండము 11లో, వారి భాషలు తారుమారు చేస్తూ బాబెలు యొద్ద సార్వత్రిక రాజ్యం ఏర్పాటు చేయాలనే మానవుని ప్రయత్నానికి దేవుడు తీర్పుతీర్చాడు. అపొస్తలుల కార్యములు 2లో, భాషల తారుమారును త్రిప్పికొడుతూ, దేవుడు తన రాజ్యాన్ని నిర్మించడం మొదలుపెట్టాడు.

పెంతెకొస్తు, "వాటికంటె మరి గొప్పవియు" అని యేసు వాగ్దానం చేసినదానికి ఆరంభం (యోహాను 14:12). యేసు విడిచివెళ్ళిన చెరగని ప్రభావపు నెరవేర్పు ఆరంభమైంది. వాగ్దానం చేసిన పరిశుద్ధాత్ముడు ఇప్పుడు అపొస్తలుల పరిచర్యలో పని చేస్తున్నాడు. ఈ సమయం నుండి, తన రాజ్యాన్ని స్థాపించడంలో దేవుని గొప్ప ఉద్దేశ్యాన్ని నెరవేర్చడం, సంఘం ఆరంభించింది. పేతురు ప్రసంగం స్పష్టం చేసినట్లుగా, పాత నిబంధన వాగ్దానాలు సంఘం ద్వారా ఇప్పుడు నెరవేరుతున్నాయి.

పెంతెకొస్తను దినంలో నాలుగు కోణాలు జాన్ స్టాట్ వివరించాడు.[61]

- పెంతెకొస్తు దినం, భూలోకంలో యేసు చివరి రక్షణ చర్య.
- పెంతెకొస్తు దినం గొప్ప ఆదేశం కోసం అపొస్తలులను సిద్ధపరచింది.
- పెంతెకొస్తు దినం, పరిశుద్ధాత్ముని నూతన యుగానికి ఆరంభం. పాత నిబంధన అంతటా, పరిశుద్ధాత్ముడు పరిచర్యలోని ప్రత్యేక సమయాల్లో దేవుని బిడ్డలను బలపరచాడు. పెంతెకొస్తు తర్వాత, అన్ని సమయాల్లో, అన్ని ప్రాంతాల్లోని క్రైస్తవులు ఆయన పరిచర్య ద్వారా ప్రయోజనం పొందుతారు.
- పెంతెకొస్తు దినం నాడు మొదటి క్రైస్తవ ఉజ్జీవం మొదలైంది.

పెంతెకొస్తు ప్రభావాలు అపొస్తలుల కార్యములు పుస్తకమంతటా కనిపిస్తాయి. పెంతెకొస్తు దినమందు జరిగిన సూచనలు ప్రత్యేకం. ఆనందం, విశ్వాసుల సహవాసం, ఆరాధనలో స్వేచ్ఛ, ధైర్యంగా సాక్ష్యమివ్వడం, పరిచర్యలో శక్తి ఇవన్నీ పరిశుద్ధాత్ముని శక్తిలో పరిచర్యకు సాధారణ రుజువులు.

---

[61] John W. Stott, *The Message of Acts* (Westmont, Illinois: InterVarsity Press, 1990), 60-61

**ఆది సంఘంలో అనుదిన జీవం**

► అపొస్తలుల కార్యములు 2:42-47 చదవండి.

యేసు వారసత్వం నెరవేర్పును చూపించే రెండవ దృశ్యం అపొస్తలుల కార్యములు 2 చివర్లో కనిపిస్తుంది.

ఆయన ప్రధాన యాజకుని ప్రార్థనలో, తన అనుచరుల ఐక్యత గురించి యేసు ప్రార్థించాడు. "మనము ఏకమై యున్నలాగున, వారును ఏకమై యుండవలెనని" (యోహాను 17:22) అని ప్రార్థించాడు. ఈ ప్రార్థనకు సమాధానం, అపొస్తలుల కార్యములు 2లో మొదలౌతుంది. "విశ్వసించినవారందరు ఏకముగా కూడి" "ప్రతిదినము దేవాలయములో తప్పక కూడుకొనుచు ఇంటింట రొట్టె విరుచుచు;" మరియు ప్రభువు "రక్షణ పొందుచున్నవారిని అనుదినము వారితో చేర్చుచుండెను."

అపొస్తలుల కార్యముల్లో "ఏకమనస్సుతో"అనే పదం, సంఘ ఐక్యతను సూచిస్తుంది. యూదులు మరియు అన్యజనులతో కూడిన సంఘాన్ని ఏర్పరచడంలో ఇబ్బందులున్నప్పటికీ, యూదా నాయకులు హింసిస్తున్నా, అపొస్తలుల మధ్య వ్యక్తిగత విభేదాలున్నప్పటికీ సంఘం ఐక్యంగా ఉంది. ఇబ్బందులున్నా, "వారును ఏకమై యుండవలెనని" యేసు చేసిన ప్రార్థన నెరవేరింది.

► అపొస్తలుల కార్యములు 2:42-47లో ఈ సంఘ దృశ్యం, మీ సంఘంలా ఉందా*?* మీరు ఆత్మ శక్తితో పరిచర్య చేస్తున్నారా*?* ఒకవేళ చేయకపోతే*,* మీ పరిచర్యలో ఆత్మ కార్యాన్ని ఏ అవరోధాలు అడ్డుకుంటున్నాయి*?* మీ అవిధేయతా*?* ప్రార్థనాహీనతా*?* విశ్వాసలేమి*?* ఐక్యత లేమి*?* మీ పరిచర్యలో ఆత్మ కుమ్మరింపు మీరు ఎలా చూస్తారు*?*

## అన్వయం: చెరగని ప్రభావాన్ని విడిచి వెళ్ళడం

పదవి విరమణ నొందిన పరిచర్య నాయకులు వారు విడిచివెళ్ళే చెరగని ప్రభావాన్ని గురించి, నాయకత్వాన్ని విడిచిపెట్టే తమ సిద్ధపాటు గురించి, పరివర్తనా పాఠాల గురించి కొన్ని మాటలు చెప్పారు.[62]

---

[62] ఈ భాగానికి సంబంధించిన ఇంటర్వ్యూలలో ఈ క్రింది నాయకులు ఉన్నారు:

Dr. Michael Avery, God's Bible School and College, Cincinnati, OH మాజీ అధ్యక్షుడు.

Rev. Paul Pierpoint, Hobe Sound Bible Church మాజీ పాస్టర్ మరియు FEA Missions, Hobe Sound, FL అధ్యక్షుడు.

Rev. Leonard Sankey, రిటైర్డ్ పాస్టర్ మరియు బహుళ మిషన్ సంస్థల నాయకుడు

Dr. Sidney Grant, FEA Missions, Hobe Sound, FLమాజీ అధ్యక్షుడు.

**(1) చెరగని ప్రభావాన్ని విడిచివెళ్ళే నాయకులు భవిష్యత్ కొరకు ప్రణాళిక చేస్తారు.**

ఒక నిర్మాణకుడ్ని ఇలా అడిగినట్లు ఊహించుకోండి, "మీరేమి నిర్మిస్తున్నారు?" "నాకు ఇంకా తెలీదు. ఏం జరుగుతుందో చూస్తున్నాను" అని సమాధానమిస్తే మీరు ఆశ్చర్యపోతారు.

అతడు నిర్మాణం మొదలుపెట్టె ముందు, అంతిమంగా నిర్మించే దానిని ప్రణాళిక చేస్తాడు. చెరగని ప్రభావాన్ని విడిచివెళ్ళే నాయకులకు, ఏమి విడిచివెళ్ళాలో తెలుసు.

మంచిగా పూర్తి చేసే నాయకులకు వారు విడిచివెళ్లాలనుకుంటున్న వారసత్వం గురించి స్పష్టమైన అవగాహన ఉంటుంది. వారు గ్రుడ్డిగా పరిచర్య చేయరు. ఈ నాయకులు, "నా పరిచర్య స్థలంలో దేవుడు నన్ను ఈ పని నెరవేర్చమని పిలిచాడు" అని విశ్వసించారు.

యేసు ఇచ్చిన చెరగని ప్రభావం, సంఘాన్ని నడిపించే శిష్య బృందాన్ని సిద్ధపరచడం. ఆయన పరిచర్య ఆరంభం నుండి, వీరిని సిద్ధపరచడానికి తగినంత సమయాన్ని, శక్తిని వెచ్చించాడు.

మీరు చెరగని ప్రభావాన్ని విడిచిపెట్టాలంటే, భవిష్యత్ ప్రణాళిక ఉండాలి. విచారకరంగా, చాలామంది లక్ష్యం లేకుండా జీవితాలు గడుపుతున్నారు. ఒకవేళ మీరు వారిని, 30, 50, 70 ఏళ్ళ వయసులో, "మీ జీవితంలో ఏం చేస్తున్నారు?" అని అడిగితే, "నాకు తెలీదు, ఏం చెయ్యాలో చూస్తున్నాను" అని చెబుతారు.

> "మీరు చెరగని ప్రభావాన్ని ప్రతిరోజు నిర్మిస్తారు, మీ జీవితం ముగింపులో కాదు."
> - అలాన్ వీస్

**(2) చెరగని ప్రభావాన్ని ఇచ్చే నాయకులు బాధ్యతల్ని సజావుగా అందించడానికి జాగ్రత్తగా సిద్ధపడతారు.**

ఒక పెద్ద ప్రాజెక్టు ముగింపుకి దగ్గరలో ఉన్నప్పుడు, నిర్మాణకుడిని దర్శించారని అనుకోండి. గోడలు కట్టాడు; పైకప్పు వేశాడు; అందులోకి వెళ్లి, ఉండటమే ఆలస్యం. "నిర్మాణం పూర్తవ్వాలంటే ఇంకా ఏం మిలిగియున్నాయి?" అని అడగండి.

ఒకవేళ అతడు ఇలా సమాధానమిస్తే మీరు ఆశ్చర్యపోతారు, "ఈ ముగింపు విషయాలు గురించి నేను అంత ఆలోచన చేయలేదు. నాకు తెలీదు!" కాదు! తాను చేయాలనుకున్నది ఏదో విడిచిపెడుతున్నాడు. అతడు ప్రతిదీ జాగ్రత్తగా ప్రణాళిక చేస్తాడు. "ఫలానా రోజు మేం నిర్మాణం ముగిస్తాం. ఫలానా రోజు మీరు ఇంట్లోకి వెళ్ళొచ్చు" అని చెప్పగలడు. పరివర్తనకు ప్రతిదీ ప్రణాళిక చేయబడుతుంది.

చెరగని ప్రభావాన్ని ఇచ్చు నాయకులు నాయకత్వ మార్పుకు జాగ్రత్తగా సిద్ధపడతారు. సాధ్యమైనప్పుడు, వారు ముందుగానే తమ పదవి విరమణ ప్రణాళిక చేసుకుంటారు, వారసుని ఎన్నుకోవడానికి వ్యవస్థకు సమయమిస్తారు,

వారసులు నూతన బాధ్యతలు చేపట్టే అనుమతిస్తారు. కొన్ని సందర్భాల్లో, వెళ్లిపోయే నాయకుడు సలహాలివ్వడానికి అందుబాటులో ఉన్నప్పుడే క్రొత్త నాయకుడు నిర్ణయాలు తీసుకునే సమయం కూడా ఉంటుంది.

చెరగని ప్రభావాన్ని ఇచ్చే నాయకులు, వారు నడిపే పరిచర్యను మార్పుకు సిద్ధం చేస్తారు. వెళ్లిపోయే ప్రభావవంతమైన నాయకులు భవిష్యత్తుపట్ల దేవుని ఏర్పాటునందు విశ్వాసాన్ని పంచుతారు. తరువాత వచ్చే నాయకుని క్రింద మంచిగా పనిచేయడానికి ప్రజలను సిద్ధపరుస్తారు. నాయకత్వ మార్పులో, వ్యవస్థలోని ప్రజలు సురక్షితంగా ఉండేట్లు చూసుకుంటారు. ఒక నాయకుడు ఇలా రాశాడు: "నేను వెళ్లిపోయానన్న విషయాన్ని ఉద్యోగులు గుర్తించలేని విధంగా దానిని సున్నితం చేయటమే నా లక్ష్యం."

**(3) చెరగని ప్రభావాన్ని విడిచివెళ్ళే నాయకులకు ఎప్పుడు వెళ్ళాలో తెలుసు**

నాయకులు తమ వారసులకు బాధ్యతలు అప్పగించి, పశ్చాత్తాపపడకుండా వెళ్లిపోవాలి. మునుపటి నాయకులు సలహాలకు అందుబాటులో ఉండాలి, కాని వారసులు అడిగినప్పుడు మాత్రమే.

ఈ కోర్సులో, సంఘ నాయకత్వాన్ని శిష్యులు తీసుకోవడానికి యేసు వారిని ఎలా సిద్ధపరిచాడో మనం చూశాం. ముందుగా, ఆయన వారికి జాగ్రత్తగా శిక్షణ ఇచ్చాడు. తరువాత, పరిచర్య కోసం బయటకు పంపించాడు, పరిశీలన కోసం వచ్చారు. ప్రభు భోజనంలో, పరిచర్యకు తుది హెచ్చరికలు ఇచ్చాడు. ఆరోహణమయ్యే ముందు, గొప్ప ఆజ్ఞ గురించి చివరిగా గుర్తుచేశాడు. పరివర్తన కోసం యేసు జాగ్రత్తగా సిద్ధపడ్డాడు.

విచారకరమైన విషయమేమిటంటే, చాలామంది క్రైస్తవ నాయకులు నాయకత్వ బదిలీపై దృషిపెట్టరు. "నన్ను భర్తీ చేసేవరకు నా పని నేను చేస్తాను. ఆ తర్వాత, అది మరొకరి సమస్య అవుతుంది" అనుకుంటారు. వాస్తవానికి, ఆకస్మిక అనారోగ్యం, మరణం, లేక పరిచర్యలో గొప్ప మార్పు, పరివర్తనకు తగినంతగా సిద్ధపడలేని సందర్భాలు ఉంటాయి. కాని సాధ్యమైనప్పుడు, తదుపరి నాయకుడు పరివర్తన కోసం మనం జాగ్రత్తగా ప్రణాళిక చేయాలి. భవిష్యత్తుకు చెరగని ప్రభావాన్ని సంరక్షించడంలో ఇది చాలా ముఖ్యం.

## పాఠం 9 అభ్యాసాలు

ఈ సూచనల ఆధారంగా 3-5 పేజీల వ్యాసం రాయండి:

(1) మీ క్రైస్తవ జీవితం, పరిచర్యను ప్రభావితం చేసే, చెరగని ప్రభావాన్ని విడిచివెళ్ళిన నాయకుడు లేక కుటుంబ సభ్యుడు గురించి ఆలోచించండి. ఒక పేజిలో, మీ జీవితంలో వాళ్ల ప్రభావం గురించి క్లుప్తంగా రాయండి. రెండు ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి.

- మీ జీవితంపై వాళ్ల ప్రభావం ఏంటి?
- మీరు ప్రభావితమయ్యే విధంగా వాళ్లు ఏం చెప్పారు లేక చేశారు?

(2) మీరు చనిపోయేటప్పుడు, మీరు విడిచివెళ్ళాలనుకునే చెరగని ప్రభావం ఏంటి? నిర్దిష్ట సమాధానం చెప్పండి. 1-2పేజీల్లో సమాధానం రాయండి.

- మీ కుటుంబానికి మీరు ఏ చెరగని ప్రభావాన్ని ఇస్తారు?
- మీ సమాజానికి, మీరు ఏ చెరగని ప్రభావాన్ని ఇస్తారు?
- మీ పరిచర్యకు, మీరు ఏ చెరగని ప్రభావాన్ని ఇస్తారు?

(3) సమాధానం 2లోని మూడు విషయాల్లో ప్రతి దానికి, మీరు విడిచిపెట్టడానికి ఇష్టపడే ప్రభావం కోసం మీరు ఇప్పుడు పాటించాలనుకునే వాటిని గుర్తించండి. 1-2 పేజీల్లో సమాధానం రాయండి.

ఈ పేపరు మీ దగ్గర పెట్టుకుని, వచ్చే ఆరు నెలలు వారానికి ఒకసారి పునఃపరిశీలన చేయండి. తరువాత తరానికి మీరు ఇవ్వాలనే చెరగని ప్రభావాన్ని ప్రణాళిక చేయడానికి దీనిని వాడుకోండి.

# రాజ్య సువార్త (ప్రసంగం)

ప్రొఫెసర్ డానీ మెక్‌కెయిన్ (యూనివర్శిటీ ఆఫ్ జోస్, నైజీరియా)

కొన్ని సంవత్సరాల క్రితం, గోంబె ఎమిర్ నన్ను సందర్శించమని ఆహ్వానించాడు.కొన్ని నెలలు తరువాత నేను రాజభవనానికి వెళ్లాను. ఎమిర్ ని కలిసినప్పుడు పాటించాల్సిన నియమాల గురించి అధికారి వివరించాడు. రాజభవనంలో ప్రవేశించే ముందుగా బూట్లు తీసివేయాలి. ఎమిర్ తో కరచాలనం చేయకూడదు ఎందుకంటే అతడు సామాన్య ప్రజలతో కరచాలనం చేయడు. ఎమిర్ తో పాటుగా ఒకే స్థాయిలో కూర్చోకూడదు. రాజుగారిని "రాయల్ హైనెస్" అని లేక "హిస్ రాయల్ మేజెస్టి" అని సంభోదించాలి.

ప్రతి రాజ్యానికి దాని లక్షణాలు, సూత్రాలతో పాటు, నాయకులు ఉంటారు. మీరు ఆ రాజ్యంలో భాగమైతే, ఆ రాజ్యాన్ని దాని సూత్రాలను అర్థం చేసుకోవాలి. ఈ ప్రసంగానికి ఆధారంగా ఉన్న రెండు లేఖనాలతో నేను మొదలుపెడతాను.

మత్తయి 6:9-10:

> కాబట్టి మీరీలాగు ప్రార్థనచేయుడి, –పర లోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడుగాక, నీ రాజ్యము వచ్చుగాక, నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక.

లూకా 9:1-2:

> ఆయన తన పండ్రెండుమంది (శిష్యులను) పిలిచి, సమస్తమైన దయ్యములమీద శక్తిని అధికారమును, రోగములు స్వస్థపరచు వరమును వారికనుగ్రహించి దేవుని రాజ్యమును ప్రకటించుటకును రోగులను స్వస్థపరచుటకును వారి నంపెను.

ఈ సందేశంలో, దేవుని రాజ్యం గురించి ఒక పెద్ద చిత్రాన్ని అందించి, ఈ సత్యం మన జీవితాలకు ఎలా అన్వయిస్తుందో చూపిస్తాను.

## దేవుని రాజ్యం: పెద్ద చిత్రం

నా చిన్నతనంలో, "దేవుని రాజ్యాన్ని" దేవుని నిత్య నివాసం- పరలోకం అని భావించాను. రాజ్యం గురించి చాలా వచనాలు మన నిత్య నివాసం గురించి సూచిస్తాయి. "ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలుచు ప్రతివాడును

పరలోకరాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" (మత్తయి 7:21).

నేను ఎక్కువ అధ్యయనం చేస్తుండగా, రాజ్యమంటే దేవుని నిత్యనివాసానికి మించినదని గ్రహించాను. కొంతకాలం పాటు, రాజ్యమంటే సంఘంతో సమానమైనదని భావించాను. వలలో చేపలు వంటి ఉపమానాలు, రాజ్యాన్ని గూర్చిన కొన్ని రిఫరెన్సులు పరలోకం గురించి కాదని చూపిస్తాయి.

> మరియు పరలోకరాజ్యము, సముద్రములో వేయబడి నానావిధములైన చేపలను పట్టిన వలను పోలియున్నది. అది నిండినప్పుడు దానిని దరికి లాగి, కూర్చుండి, మంచి వాటిని గంపలలో చేర్చి చెడ్డవాటిని బయట పారవేయుదురు. ఆలాగే యుగసమాప్తియందు జరుగును. దేవదూతలు వచ్చి నీతిమంతులలోనుండి దుష్టులను వేరుపరచి, వీరిని అగ్ని గుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లుకొరుకుటయును ఉండును *(మత్తయి 13:47-50).*

ఇది బహుశ సంఘాన్ని సూచిస్తుంది. మన సంఘాల్లో నిజమైన విశ్వాసులు అదే విధంగా కపట విశ్వాసులు కూడా ఉన్నారు. అయితే, సంఘ యుగాంతంలో, దేవుడు వారి వేరుపరుస్తాడు: "ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోకరాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" (మత్తయి 7:21).

నేను యెంత ఎక్కువ అధ్యయనం చేస్తే, దేవుని రాజ్యం సంఘం కంటే విస్తృతమైనదనే సూచనలు అంత ఎక్కువగా కనుగొంటాను. యేసు "దేవుని ఆత్మవలన నేను దయ్యములను వెళ్లగొట్టుచున్నయెడల నిశ్చయముగా దేవుని రాజ్యము మీ యొద్దకు వచ్చియున్నది" (మత్తయి 12:28) అని చెప్పాడు. సంఘం పెంతెకొస్తు దినమందు ఆవిర్భవిస్తే, రాజ్యం అప్పటికే ఉనికిలో ఉంటే, సంఘం మరియు రాజ్యం ఒకటి కాలేవు.

ఈ ఆలోచనలను బట్టి నేను రాజ్యాన్ని సంపూర్ణ దృక్పథంలో చూడడానికి బలవంతం చేయబడ్డాను. నేను ఇప్పుడు ఈ పని చేస్తాను.

## ఏదెను తోటలో దేవుని రాజ్యం

సృష్టిలో, దేవుడు "మన స్వరూపమందు మన పోలికె చొప్పున నరులను చేయుదము; వారు సముద్రపు చేపలను ఆకాశపక్షులను పశువులను సమస్త భూమిని భూమిమీద ప్రాకు ప్రతి జంతువును ఏలుదురుగాకనియు పలికెను" (ఆదికాండము 1:26). దేవుడు మానవులను చేసినప్పుడు, వారు ఒక విధంగా ఆయనవలే ఉండాలని ఆశించాడు.

మనుష్యులు జీవించడానికి దేవుడు ఒక స్థలాన్ని సిద్ధపరచడం, అది స్వయంగా దేవుడు నివసించిన వాతావరణంగా ఉండటం సహేతుకమైనదిగా అనిపిస్తుంది. ఏదెను తోట ఎలా ఉంది?

- అక్కడ పాపం లేక నైతిక తప్పులు లేవు; అది పరలోకంవలే ఉంది.
- అక్కడ అనారోగ్యం లేక మరణం, లేక దుఖం లేవు; అది పరలోకంవలే ఉంది.
- అక్కడ అసహ్యకరమైంది లేదు. అది పరలోకంవలే పరిపూర్ణంగా ఉంది.
- అక్కడ అక్రమం లేదు. సృష్టించబడిన ప్రతిదీ మంచిగా పనిచేస్తుంది; అది పరలోకంవలే ఉంది.

ఏదెను తోట ఆ సమయంలో భూలోకంలో దేవుని రాజ్యమై ఉంది. "దేవుడు తాను చేసి నది యావత్తును చూచినప్పుడు అది చాలమంచిదిగ నుండెను" (ఆదికాండము 1:31). భూలోకంలో దేవుని నూతన రాజ్యం గురించిన మొదటి వ్యాఖ్య ఇదే. సమస్తం మంచిగా ఉంది, ప్రతిదీ క్రమంలో ఉంది. భూలోకంలో ఉన్న ప్రతిదీ దేవుడు అనుకున్నట్లు ఉంది. ఇది పరలోకంలో దేవుని నివాసాన్ని ప్రతిబింబించే క్రమాన్ని, అందాన్ని లక్షణాలను కలిగియుంది.

## ఏదెను తోటలో దేవుని రాజ్యం పతనమైంది

భూలోకంలో దేవుని రాజ్యాన్ని కాపాడే విధానం గురించి దేవుడు కొన్ని సూచనలు ఇచ్చాడు. దురదృష్టవశాత్తూ, మానవుడు దేవుని పవిత్ర నమ్మకాన్ని ఉల్లంఘించి, వ్యతిరేకంగా పాపం చేశాడు. ఫలితంగా రెండు తీవ్రమైన పరిస్థితులు ఏర్పడ్డాయి.

మొదటిగా, పాపం లోకంలో ప్రవేశించి, మానవునిలో ఉన్న దేవుని పోలికను వక్రీకృతం చేసింది. రెండవదిగా, మానవులు దేవుని స్వరూపాన్ని పాక్షికంగా కోల్పోయినందున, వారు పరిపూర్ణ స్థలంలో నివసించే అర్హత కోల్పోయారు. ఏదెన్ మానవునికి సరైన స్థలం ఇకమీదట కాదు.

కాబట్టి, దేవుడు వారిని అక్కడ నుండి పంపివేసి, స్త్రీని పురుషుని శపించినట్లుగా భూమిని శపించాడు. దేవుడు నేలను శపించాడు గనుక అది ముండ్లతుప్పలు, గచ్చపొదలు మొలిపించింది. భూమీ దాని అందం, సౌకర్యం, ఉత్పత్తి, భద్రత కోల్పోయింది. మానవులు ఒకప్పుడు పరిశుద్ధుల ఛాయగా ఉన్నట్లే, భూమి దేవుడు సృష్టించిన దాని ఛాయగా ఉంది. ఈ ప్రసంగానికి దీనిని అనుగుణంగా ఉంచడానికి: భూలోకంలో దేవుని రాజ్యం పతనమైంది.

- దేవుడు నిర్మించింది పాడైపోయింది.
- దేవుడు అందంగా చేసింది, వికారంగా మారింది.
- దేవుడు సౌకర్యంగా చేసింది, ఇప్పుడు బాధాకరంగా మారింది.

- పవిత్రంగా ఉండాలని చేసింది, ఇప్పుడు పాపంతో, చెడిపోయింది.
- దేవుడు మానవాళి కోసం భూమి కోసం చేసింది, ఇప్పుడు జరగలేదు.

అయితే, దేవుడు ఓడిపోలేదు. ఆయన ఓడించబడడు. "యెహోవాకు విరోధమైన జ్ఞానమైనను వివేచనయైనను ఆలోచనయైనను నిలువదు" (సామెతలు 21:30). సాతానుడు ప్రయత్నించాడు కాని దేవుని ఎదిరించలేకపోయాడు.

- దేవుడు చేసిన దానిని ఎవరు చెరుపగలరు?
- దేవుడు అవునని చెబితే కాదని ఎవరు చెప్పగలరు?
- దేవుడు సృష్టించింది ఎవరు నాశనం చేయగలరు?

దేవుడు ఓటమి అంగీకరించడు. తప్పు మార్గంలో వెళ్ళినవాటిని దేవుడు సరిచేయగలడు, పునరుద్ధరించగలడు. దేవుడు విమోచకుడు.

భూలోకంలో తన రాజ్యం పునరుద్ధరించాలని దేవుడు ప్రణాళిక చేశాడు.

> ఇది మొదలుకొని మితిలేకుండ దానికి వృద్ధియు క్షేమ మును కలుగునట్లు సర్వకాలము దావీదు సింహాసనమును రాజ్యమును నియమించును న్యాయమువలనను నీతివలనను రాజ్యమును స్థిరపరచు టకు అతడు సింహాసనాసీనుడై రాజ్యపరిపాలన చేయును. సైన్యములకధిపతియగు యెహోవా ఆసక్తికలిగి దీనిని నెరవేర్చును (యెషయా 9:7).

ఆదాము, హవ్వ పాపం చేయకముందే, భూలోకంలో దేవుడు తన రాజ్యాన్ని పునరుద్ధరించాలని, పునర్నిర్మించాలని ప్రణాళిక చేశాడు. బైబిల్లో, ఒక అతి ముఖ్యమైన ఉద్దేశ్యం, పరలోకంలో ఉన్నట్లుగా భూలోకంలో దేవుని రాజ్యాన్ని పునరుద్ధరించే వివరణ ఇవ్వడం. పునరుద్ధరణ ప్రక్రియ ఇంకా జరుగుతుంది. ఈ ప్రక్రియ ఆదికాండము 12:1-3లో ఆరంభమవ్వడం మనం చూస్తాం.

### దేవుని రాజ్యం మరియు అబ్రాహాము

అబ్రాహాము ఈ సందేశం పొందినప్పుడు కల్దీయుల ఊరను పట్టణంలో ఉన్నాడు:

> యెహోవా–నీవు లేచి నీ దేశమునుండియు నీ బంధువుల యొద్దనుండియు నీ తండ్రి యింటినుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్లుము. నిన్ను గొప్ప జనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్ప చేయుదును, నీవు ఆశీర్వాదముగా నుందువు. నిన్ను ఆశీర్వదించువారిని

ఆశీర్వదించెదను; నిన్ను దూషించువాని శపించెదను; భూమియొక్క సమస్తవంశములు నీయందు ఆశీర్వదించబడునని అబ్రాముతో అనగా (ఆదికాండము 12:1-3).

*రాజ్యం* అనే మాట ఇక్కడ ఉపయోగించకపోయినా, ఈ ప్రకటనలో ఉన్న రెండు మాటలను బట్టి దేవుడు భూలోకంలో తన రాజ్య పునరుద్ధరణ మొదలుపెట్టాడని నమ్ముతాం.

**ఇశ్రాయేలును గొప్ప జనంగా చేస్తానని దేవుడు వాగ్దానం చేశాడు**

పాత నిబంధనలో మూడవ వంతు ఈ రాజ్య నిర్మాణ వివరణ కోసం కేటాయించడం ఆసక్తికరం.

ఈ రాజ్యాన్ని నిర్మించడంలో, ఆయన ప్రాజెక్టుల్లో వాడుకునే రెండు సూత్రాలు దేవుడు ఉపయోగించడం మనం చూస్తాం.

1. దేవుడు భూలోకంలో పని చేసినప్పుడు, ఎల్లప్పుడు మనుష్యుల ద్వారా పనిచేశాడు. దేవుడు భూలోకంలో చేయాల్సిన పని కోసం సాధరణంగా దేవదూతలను పంపడు.
2. దేవుడు భూలోకంలో పనిచేసినప్పుడు, ఆయన కఠిన మార్గాల్లో, నిదాన మార్గాల్లో, కష్ట మార్గాల్లో, సున్నిత మార్గాల్లో, ప్రగతిశీల మార్గాల్లో, మనం చేయగల విధానానికి వ్యతిరేక మార్గాల్లో పనిచేస్తాడు. రాజ్య నిర్మాణం అనేక అవరోధాలతో నిండియుంది. అయితే, తుదకు అది వాస్తవంగా మారింది.

భూలోకంలో దేవుని రాజ్య పునరుద్ధరణ పూర్తి నెరవేర్పు రాజ్యమని నేను అనుకోను. అయితే, అది ఆ దిశలో ఒక మెట్టు. దేవుడు భూలోకంలో తన ప్రజలను పాలిస్తాడని రాజ్యం చూపిస్తుంది. దురదృష్టవశాత్తూ, మనుష్యుల కారణంగా, అది కేవలం పాక్షికంగా విజయవంతమైంది.

**భూమి యొక్క సమస్త వంశాలు అబ్రాహాము సంతానం వలన ఆశీర్వదించబడతాయని దేవుడు వాగ్దానం చేశాడు**

"...భూమియొక్క సమస్తవంశములు నీయందు ఆశీర్వదించబడునని" (ఆదికాండము 12:3). ఈ వాగ్దానం యేసు రాకతో నెరవేరింది.

## దేవుని రాజ్యం మరియు యేసు

యేసు బాప్తిస్మం, శోధన తర్వాత యేసు గురించి లూకా చెప్పే మొదటి కథ, నజరేతులో సమాజమందిర దర్శనం. యేసు తన సమాజమందిరానికి వెళ్లి, లేఖనం చదవడానికి నిలబడ్డాడు. ఆనాటి వాక్యం యెషయా 61.

"ప్రభువు ఆత్మ నామీద ఉన్నది బీదలకు సువార్త ప్రకటించుటకై ఆయన నన్ను అభిషేకించెను చెరలోనున్న వారికి విడుదలను, గ్రుడ్డివారికి చూపును, (కలుగునని) ప్రకటించుటకును నలిగినవారిని విడిపించుటకును

ప్రభువు హితవత్సరము ప్రకటించుటకును ఆయన నన్ను పంపియున్నాడు అని వ్రాయబడిన చోటు ఆయనకు దొరకెను. ఆయన గ్రంథము చుట్టి పరిచారకునికిచ్చి కూర్చుండెను. సమాజమందిరములోనున్నవారందరు ఆయనను తేరిచూడగా, ఆయన–నేడు మీ వినికిడిలో ఈ లేఖనము నెరవేరినదని వారితో చెప్పసాగెను." (లూకా 4:18-21).

ఆయన పరిచర్య ఆరంభ దినాల్లో, దేవుడు వందలాది సంవత్సరాలుగా చేస్తున్న పునర్నిర్మాణ ప్రక్రియను కొనసాగించడానికి తాను వచ్చానని యేసు బలమైన సూచన ఇచ్చాడు.

- పాప ఫలితం కారణంగా, లోకం అక్షరార్థంగా, ఆత్మీయంగా దీన స్థితికి మారింది. అయితే, "బీదలకు సువార్త ప్రకటించుటకై" తాను అభిషేకించబడ్డానని యేసు ప్రకటించాడు.
- పతనం కారణంగా, మానవులు పాపానికి దాసులైపోయారు. అయితే, తాను "చెరలోనున్న వారికి విడుదలను" ప్రకటించడానికి వచ్చానని యేసు చెప్పాడు
- పతనం కారణంగా, మానవులు ఆత్మీయ అంధులైపోయారు, అంటే ప్రజలు సత్యాన్ని గ్రహించరు. కొందరు శారీరక గ్రుడ్డితనంలో ఉన్నారు. అయితే, తాను "గ్రుడ్డివారికి చూపును, (కలుగునని) ప్రకటించుటకును" వచ్చానని యేసు ప్రకటించాడు.
- పతనం కారణంగా, సాతానుడు దాని దూతలు ప్రజలను అనేక మార్గాల్లో ఇబ్బందికి గురిచేశాయి. అయితే, తాను "నలిగినవారిని విడిపించుటకును" వచ్చానని యేసు ప్రకటించాడు.

పాప ఫలితంగా భూలోకంలో వచ్చిన అనేక శాపాలను త్రిప్పికొట్టడమే తన ఉద్దేశ్యమని యేసు సెలవిస్తున్నాడు. మరో విధంగా చెప్పాలంటే, భూలోకంలో దేవుని రాజ్య నిర్మాణం కొనసాగించడానికి యేసు వచ్చాడు. ఇంకో విధంగా చెప్పాలంటే, దేవుడు అబ్రాహాముకు చేసిన రెండవ వాగ్దానం నెరవేర్చడానికి యేసు భూలోకానికి వచ్చాడు- భూమి యొక్క సమస్త వంశాలు నీయందు ఆశీర్వదించబడును."కాలము సంపూర్ణమైయున్నది, దేవునిరాజ్యము సమీపించియున్నది; మారుమనస్సు పొంది సువార్త నమ్ముడని చెప్పుచు దేవుని సువార్త ప్రకటించుచు." (మార్కు 1:14-15). యేసు పరిచర్య అంతటా, ఆయన బోధనా పరిచర్యలో దేవుని రాజ్యం కేంద్రం.

**దేవుని రాజ్యం మరియు సంఘం**

పాత నిబంధన కాలంలో దేవుడు ఇశ్రాయేలు రాజ్యం ద్వారా పనిచేశాడు. క్రొత్త నిబంధన కాలంలో, దేవుడు సంఘం ద్వారా పనిచేశాడు. అనేక కారణాలు బట్టి సంఘం పాత నిబంధనను అధిగమించింది:

- సంఘంలో కేవలం యూదులే కాదు లోక ప్రజలంతా ఉన్నారు.
- సంఘం అందరికీ పరిశుద్ధాత్మ ప్రవేశం కలిగించింది, కాని పాత నిబంధనలో కేవలం ఆత్మీయ శూరులకు మాత్రమే అనుమతి ఉండేది.
- సంఘం దేవునితో వ్యక్తిగత సంబంధంపై నొక్కి చెప్పింది.
- బలుల అర్పణ మరియు అచారాలకు కాదుగాని ఆత్మతోను సత్యముతోను అనే ఆరాధనకు సంఘం ప్రాముఖ్యత ఇస్తుంది.

## దేవుని రాజ్యం గురించి యేసు చెప్పిన పాఠాలు

యేసు జీవితం మరియు బోధనలలో రాజ్యం గురించి కొన్ని పాఠాలు మనం నేర్చుకోవచ్చు.

**(1) దేవుని రాజ్యానికి భౌగోళిక పరిధులు లేవుగాని రాజు ఎక్కడ ఉంటే అది అక్కడ ఉంటుంది.**

- యేసు వివాహానికి హాజరైనప్పుడు, తన రాజ్యం తన ఉనికి ద్వారా ఆ ప్రదేశంలో ఉంది గనుక ద్రాక్షారసం అందించాడు.
- యేసు రోగులను కలిసినప్పుడు, వారిని స్వస్థపరిచాడు ఎందుకంటే ఆయన రాజ్యం రోగాలకు, వ్యాధులకు వ్యాపించింది.
- యేసు ఆకలిగొన్న వారిని కలిసినప్పుడు, వారికి ఆహారం పెట్టాడు ఎందుకంటే ఆయన రాజ్యం ప్రజల ప్రాథమిక అవసరాల పట్ల శ్రద్ధతో ఉంది.

యేసు నేడు తన రాజ్యాన్ని విస్తరింపజేయాలని ఆశిస్తున్నాడు, తన అనుచరులు ఎక్కడ ఉంటే అక్కడ, ఆ ప్రదేశం ఆయన రాజ్యంలో భాగం ఎందుకంటే అక్కడ రాజు ప్రజలు ఉంటారు. రాజరిక కుటుంబంగా అది మన బాధ్యత. యేసు పరిపాలన మన ప్రత్యేక ప్రదేశంలో, మన ప్రభావం ఉన్న లోక ప్రాంతాలకు విస్తరించేటట్లు చూడాలి.

- మన కుటుంబాల్లో దేవుని రాజ్యాన్ని నిర్మించాలి.
- మన సమాజాల్లో దేవుని రాజ్యాన్ని నిర్మించాలి.
- మన ఉద్యోగాల్లో, పని చేసే ప్రదేశాల్లో దేవుని రాజ్యాన్ని నిర్మించాలి.
- మన స్థానిక, కేంద్ర ప్రభుత్వాల్లో దేవుని రాజ్యాన్ని నిర్మించాలి.
- మన సంఘాల్లో మరియు క్రైస్తవ సంస్థలలో దేవుని రాజ్యాన్ని నిర్మించాలి.

రాజుగారి ప్రజలు ఎక్కడ నివాసం చేస్తారో, రాజ్యం అక్కడ స్థాపించబడాలి. కాబట్టి, మన ఇళ్ళు ఆఫీసులు దేవుని రాజ్యానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. సహోద్యోగులతో మన సంబంధాలు రాజ్యానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. పేతురు ఇలా రాశాడు,

> ప్రియులారా, మీరు పరదేశులును యాత్రికులునై యున్నారు గనుక ఆత్మకు విరోధముగా పోరాడు శరీరాశలను విసర్జించి, అన్యజనులు మిమ్మును ఏ విషయములో దుర్మార్గులని దూషింతురో, ఆ విషయములో వారు మీ సత్క్రియలను చూచి, వాటినిబట్టి దర్శనదినమున దేవుని మహిమపరచునట్లు, వారిమధ్యను మంచి ప్రవర్తనగలవారై యుండవలెనని మిమ్మును బతిమాలుకొనుచున్నాను *(1 పేతురు 2:11-12).*

రాజ్య పౌరులు కానివారు మనలో రాజ్యాన్ని చూడాలని దేవుడు ఆశిస్తున్నాడు. మనం రాజ్య సూత్రాల ప్రకారం జీవించినప్పుడే మనలో దేవుని రాజ్యాన్ని వారు చూడగలరు. ప్రజలు మీలో దేవుని రాజ్యం చూడగలరా?

**(2) దేవుని రాజ్యం ఒక నిర్దిష్టమైన ప్రజలకు కాదుగాని ఆయనను అనుసరించే వారందరికీ ఉంటుంది**

యేసు రోమా సైనికుని (అన్యుడు) దాసుని బాగుచేసినప్పుడు,

> అనేకులు తూర్పునుండియు పడమటనుండియు వచ్చి అబ్రాహా ముతోకూడను, ఇస్సాకుతోకూడను, యాకోబుతోకూడను, పరలోకరాజ్యమందు కూర్చుందురు (మత్తయి 8:11) అని చెప్పాడు.

రాజ్యానికి జాతి, భాష, లేక నేపథ్యంతో నిమిత్తం లేదు, అందరికీ వర్తిస్తుంది. యేసు విభిన్న నేపథ్యాల ప్రజలను ఎన్నుకున్నాడు గనుక, యేసు అనుచరులైన విభిన్న నేపథ్యాలు గలవారిని మనం అంగీకరించాలి. జాతివాదం, వర్గవాదం దేవుని రాజ్యంలో భాగం కాదు.

**(3) దేవుని రాజ్యానికి ఖరీదైన రాజభవనాలు, ప్రశస్త వస్త్రాలతో కాదుగాని భావార్థక సాంఘిక విలువలతో సంబంధం ఉంది.**

మనం రాజ్యాల గురించి అలోచించినప్పుడు, రాజుగారి ఇంటి గురించి-అంతఃపురం గురించి- ఆలోచిస్తాం. అంతఃపురం రాజుగారి గురించి తెలియజేస్తుంది. అయితే "నక్కలకు బొరియలును ఆకాశపక్షులకు నివాసములును కలవు గాని మనుష్యకుమారునికి తలవాల్చుకొనుటకైనను స్థలములేదని" (మత్తయి 8:20) యేసు చెప్పాడు. యేసు రాజ్యం సంపద లేక విస్తృత భవనాలు లేక ఫ్యాన్సీ దుస్తులు లేక అన్యదేశ ఆభరణాలు ద్వారా వివరించబడదు. యేసు రాజ్యం ఈ బాహ్యాపరమైన అలంకరణల ద్వారా కాదుగాని భావార్థక విలువల ద్వారా చూపించబడుతుంది.

**(4) దేవుని రాజ్యం చెడు మరియు దుష్టత్వం ద్వారా కాదుగాని నీతి, సత్యం ద్వారా వర్ణించబడుతుంది.**

“శాస్త్రుల నీతికంటెను పరిసయ్యుల నీతికంటెను మీ నీతి అధికము కానియెడల మీరు పరలోకరాజ్యములో ప్రవేశింపనేరరని” (మత్తయి 5:20) యేసు బోధించాడు. పరిసయ్యులు ప్రజలను ఆకట్టుకోవడానికి మరియు గౌరవాన్ని సంపాదించడానికి బహిరంగ నీతిని కలిగియున్నారు. నిజమైన నీతి న్యాయం మరియు మంచితనానికి మించి ముందుకు వెళ్ళాలి. యేసు రాజ్యం సరైనదిని చేసే వారిచే ప్రాతినిధ్యం పొందుతుంది. దేవుని రాజ్యం సమృద్ధి ఉన్నచోట వృద్ధిచెందగలదు. దేవుని రాజ్యం సమృద్ధి లేకపోయినచోట కూడా వృద్ధిచెందగలదు. ఇది వాస్తవం, ఎందుకంటే దేవుని రాజ్యం భౌతికమైనది కాదుగాని, విలువలు మరియు గుణాల రాజ్యం.

**(5) దేవుని రాజ్యంలో అహం, అచారం ఉండదుగాని వినయం, సేవ ఉంటాయి.**

“ఆత్మవిషయమై దీనులైనవారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది” (మత్తయి 5:3) అని యేసు చెప్పాడు. “ఆత్మవిషయమై దీనులైనవారు” అను మాట వినయాన్ని సూచిస్తుంది. వినయానికి భూలోక రాజకీయ నాయకులకు సంబంధం ఉండదు. రాజకీయ నాయకులు ప్రత్యర్థుల కంటే ఎందుకు బలవంతులో ప్రజలకు చెప్పాలి. అయితే, యేసు రాజ్యంలో వినయం, నిస్వార్థం, ఇతరుల శ్రేయస్సు ముఖ్యం.

రాజరిక వ్యక్తులను ఎక్కువగా లాలిస్తారు, పొగడతారు కాబట్టి వారు అహంకారులై, ఇతరులకంటే గొప్పగా భావిస్తారు. వారి వైఖరులు అహంకారంతో నిండియుంటాయి. అయితే, “మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని” (మత్తయి 20:28) యేసు చెప్పాడు. రాజుగారు వెళ్లిన ప్రతిచోట ప్రజలను తీసుకుని, ఆయనకు తెలిసింది బోధిస్తాడు. ఈ రాజు తన శిష్యుల పాదాలు కడగడానికి కూడా వెనుకాడలేదు. విస్తృతమైన, గొప్ప విషయాల ద్వారా కాదుగాని వినయం, సరళత ద్వారా మనం రాజ్య స్వభావం చూపిస్తాం.

**(6) దేవుని రాజ్యం స్వాభావిక జననాల ద్వారా కాదుగాని యేసు అనుచరుల కార్యాల ద్వారా వృద్ధిచెందుతుంది.**

“పరలోకరాజ్యముయొక్క తాళపుచెవులు నీకిచ్చెదను, నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని” (మత్తయి 16:19) యేసు చెప్పాడు. దేవుడు స్థాపించిన రాజ్యం పాపంలో, అంధకారంలో, శిథిలావస్థలో పడినప్పుడు, దేవుడు భూలోకాన్ని పునరుద్ధరించాలి. ప్రజలను తన రాజ్యంలోకి తీసుకురావాలని, సమాజంలో ఇతర భాగాలలో తన రాజ్య స్థాపన చేయాలని దేవుడు మానవాళికి బాధ్యత అప్పగించాడు. ఆయన రాజ్య నిర్మాణం కోసం దేవుడు దేవదూతలను పంపడు. ఈ పనికి నిన్నూ నన్నూ వాడుకుంటాడు. ఇది రాజ్యంలో భాగంగా ఉన్నవారి బాధ్యత:

- ఇతరులను రాజ్యంలోకి తీసుకురావాలి.
- వారెక్కడుంటే అక్కడ రాజ్యం నిర్మించాలి.
- సమాజంలో అన్నిచోట్ల రాజ్య విలువలు అమలుచేయాలి.

ఇది మన బాధ్యత, మన ఆధిక్యత. దేవుని రాజ్యంలోకి ప్రజలను తీసుకొచ్చు విషయంలో చురుకుగా ఉందాం.

## అపొస్తలుల కార్యాల గ్రంథంలో రాజ్య సువార్త ఆచరణ

పరలోకంలో ఉన్నట్లుగా భూలోకంలో స్థాపించబడిన రాజ్యాన్ని చూడడానికి ఆదిమ సంఘం యేసు ప్రార్థన నెరవేర్చడానికి ఎలా ప్రయత్నించిందో ఇప్పుడు చూద్దాం. ఈ ఉదాహరణలు గమనించండి:

### అవసరతలో ఉన్నవారికి సేవ చేయడం

విధవరాండ్రు, అనాథలు, బీదలతో సహా సమాజంలో అవసరతలో ఉన్నవారి పట్ల దేవుడు ఎల్లప్పుడు శ్రద్ధ చూపాడు. భూలోకంలో దేవుని రాజ్య నిర్మాణం కోసం యేసు అనుచరులు ఆచరణాత్మకంగా ఉన్నారనడంలో ఆశ్చర్యం లేదు.

అపొస్తలుల కార్యములు 6లో, ఆరంభ విశ్వాసులు విధవరాండ్రను పట్టించుకోవడం మనం చూస్తాం. దొర్కా అనే క్రైస్తవురాలు ఉంది. “ఆమె సత్క్రియలను ధర్మకార్యములను బహుగా చేసి యుండెను” *(*అపొస్తలుల కార్యములు 9:36). యెరూషలేములో కరువుతో బాధపడుతున్న క్రైస్తవుల కోసం పౌలు, బర్నబా డబ్బు, సామగ్రి తీసుకెళ్ళారు (అపొస్తలుల కార్యములు 11:29). అపొస్తలుల కార్యములలో తరువాత, యెరూషలేమునందు అవసరతలో ఉన్నవారి కోసం పౌలు మాసిదోనియ, ఆకయ నుండి అర్పణలు తీసుకెళ్ళాడు (అపొస్తలుల కార్యములు 24:17).

మన అవసరాలకు సంబంధించిన దేవుని రాజ్య సూత్రం 2 కొరింథీయులకు 8:13-15లో పౌలు సంగ్రహించాడు:

> ఇతరులకు తేలికగాను మీకు భారముగాను ఉండవలెనని ఇది చెప్పుటలేదు గాని –హెచ్చుగా కూర్చుకొనినవానికి ఎక్కువ మిగుల లేదనియు తక్కువగా కూర్చుకొనినవానికి తక్కువ కాలేదనియు వ్రాయబడిన ప్రకారము అందరికి సమానముగాఉండు నిమిత్తము, ప్రస్తుతమందు మీ సమృద్ధి వారి అక్కరకును మరియొకప్పుడు వారి సమృద్ధి మీ యక్కరకును సహాయమై యుండవలెనని ఈలాగు చెప్పుచున్నాను.

అవసరతలో ఉన్నవారికి సహాయం చేయగల మార్గాలు చాలా ఉన్నాయి, వాటికి అతీంద్రియ శక్తి అవసరం లేదు. మన సమాజంలో అనారోగ్య పరిస్థితులను సరిచేయడానికి, దేవుడు మనకు ఏదో అతీంద్రియంగా అనుగ్రహించాలని వేచి చూడకూడదు.

## న్యాయాన్ని ఎత్తి పట్టుకోవాలి

దేవుని రాజ్యంలో ఒక ముఖ్య భాగం, న్యాయం. సమాజంలో న్యాయపరమైన విషయంతో ఆది సంఘం ఎలా వ్యవహరించింది? యేసు నామంలో ప్రకటించకూడదని పేతురు, యోహానుకు చెప్పినప్పుడు, సువార్త ప్రకటించాలని ఆజ్ఞాపించబడినందున పౌర అవిధేయత చూపుతామని యూదా నాయకులకు మర్యాదపూర్వకంగా తెలియజేశారు. "మనుష్యు లకు కాదు దేవునికే మేము లోబడవలెను గదా" (అపొస్తలుల కార్యములు 5:29) అని నాయకులకు చెప్పారు.

పౌలును ఫిలిప్పులో నిర్బంధించి చట్టవిరుద్ధంగా కొట్టినప్పుడు, తనను చెరసాలలో వేసిన అధికారులు వచ్చి వెళ్ళమని చెప్పేవరకు వెళ్ళనని చెప్పాడు. ఇది సౌవార్తీకరణ చర్య కాదు. వీరిని క్రీస్తు యొద్దకు తీసుకురావడానికి అతడు ప్రయత్నించలేదు. ఇది న్యాయ చర్య. సమాజంలో న్యాయమనే సూత్రాన్ని బట్టి జీవించాలని పౌలు ఈ నాయకులకు చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు.

తన పని కేవలం సువార్త ప్రకటించడం, సంఘాలు స్థాపించడం అని పౌలు భావించలేదు. అతడు పాడైన సమాజంలో జీవించాడు, న్యాయ రోగంతో పాటుగా ఆ రోగాలను నయం చేయడానికి ప్రతివిధమైన అవకాశం సద్వినియోగం చేసుకున్నాడు.

## ఆరోగ్యాన్ని పునరుద్ధరించుట

తన యజమానివలే, పౌలు కొందరికి అతీంద్రియ స్వస్థత ఇచ్చాడు. అయితే, అతడు ఉపయోగించినది అదొక్క మార్గమే కాదు. "ఇకమీదట నీళ్లేత్రాగక నీ కడుపు జబ్బునిమిత్తమును తరచుగా వచ్చు బలహీనతల కోసరమును ద్రాక్షారసము కొంచెముగా పుచ్చుకొనుము" (1 తిమోతికి 5:23) అని పౌలు తిమోతికి రాశాడు. ద్రాక్షా రసంతో చేయబడిన వైన్లో చాలా ఐరన్ ఉంటుంది. సమపాళ్ళలో తీసుకుంటే, అది రక్తానికి మంచిది. తిమోతి తన రోగం నుండి కోలుకోవడానికి సహాయపడే ఈ స్వాభావిక మార్గాలు పౌలు సూచించాడు.

యేసు తన శిష్యులను బోధనా పర్యటనకు పంపిన తర్వాత, "మీరేకాంతముగా అరణ్య ప్రదేశమునకు వచ్చి, కొంచెముసేపు అలసట తీర్చుకొనుడని" (మార్కు 6:31) వారితో చెప్పాడు. ఆరోగ్యంగా ఉండాలంటే విశ్రాంతి అవసరమని యేసు గుర్తించాడు.

యాకోబు స్వస్థత గురించి ఆసక్తికర ప్రకటన చేశాడు.

మీలో ఎవడైనను రోగియై యున్నాడా? అతడు సంఘపు పెద్దలను పిలిపింపవలెను; వారు ప్రభువు నామమున అతనికి నూనె రాచి అతని కొరకు ప్రార్థనచేయవలెను. విశ్వాససహితమైన ప్రార్థన ఆ రోగిని స్వస్థపరచును, ప్రభువు అతని లేపును; అతడు పాపములు చేసినవాడైతే పాపక్షమాపణ నొందును (యాకోబు 5:14-15).

నూనె రాయడం రెండు గ్రీకు పదాలు ఉన్నాయి. ఒకటి ఆచార సంబంధమైన అభిషేకాన్ని సూచిస్తుంది మరొకటి, ఔషద లేక సౌందర్య ఉపయోగం సూచిస్తుంది. ప్రాచీన కాలంలో నూనె సామాన్యుడి ప్రధమ చికిత్స ఔషదం. దొంగల చేతిలో గాయపడినవానిని మంచి సమరయుడు చూసినప్పుడు, గాయాలపై నూనె రాశాడు. ప్రార్థనా ఫలితంగా దేవుడు ఒక వ్యక్తిని అతీంద్రియంగా స్వస్థపరుస్తాడు. అయితే, ఔషద ఉపయోగం ద్వారా కూడా ఒక వ్యక్తి స్వస్థపరుస్తాడు.

**ముగింపు**

పరలోకంలోవలే భూలోకంలో దేవుని రాజ్యాన్ని స్థాపించాలని దేవుడు ఆశపడుతున్నాడు. రాజ్యం సూత్రాల ద్వారా నడిపించబడుతుంది కాని భౌగోళికంగ లేక భాషాపరంగా లేక రాజకీయపరంగా కాదు. దేవుని రాజ్య సూత్రాలను బోధించి ఆచరించే విధంగా ఉంటే, దేవుని రాజ్యాన్ని అక్కడ స్థాపించామని అర్థం.

# సిఫార్సు చేసిన వనరులు

ఈ కోర్సు, నేడు జీవితం మరియు పరిచర్యకు యేసు జీవితం మరియు పరిచర్యను మాదిరిగా అధ్యయనం చేస్తుంది. ఇది సువార్తల పూర్తి అధ్యయనం కాదు, బదులుగా, ఈ కోర్సులో యేసు పరిచర్యలోని కొన్ని ఎన్నుకోబడిన విషయాలు పరిశీలించి, నేటి పరిచర్యకు పాఠాలు అందిస్తుంది. క్రీస్తు యొక్క పూర్తి జీవితాన్ని అధ్యయనం చేయాలంటే, సిఫార్సు చేయబడిన పుస్తకాలు క్రింద జాబితాలో ఉన్నాయి. ఈ పుస్తకాలు ఈ కోర్సు/సబ్జెక్ట్ కు ప్రాధమిక వనరులు.

*Jesus According to Scripture* by Darrell Bock మరియు *The Words and Works of Jesus Christ* by J. Dwight Pentecost కీస్తు జీవితం గురించి పూర్తి అధ్యయనాలు. Ajith Fernando's *Jesus Driven Ministry* మరియు Robert Coleman's *The Master Plan of Evangelism* యేసు పరిచర్య శైలిని అర్థం చేసుకోటానికి ఎక్కువగా ఉపయోగపడతాయి.


Blomberg, Craig. *Jesus and the Gospels*. Nashville: Broadman & Holman, 1997.

Bock, Darrell L. *Jesus According to Scripture*. Grand Rapids: Baker Academic, 2002.

Coleman, Robert E. *The Mind of the Master*. Colorado Springs: Waterbrook Press, 1977.

Coleman, Robert E. *The Master Plan of Evangelism*. Grand Rapids: Baker Books, 1993.

Fernando, Ajith. *Jesus Driven Ministry*. Wheaton, Illinois: Crossway, 2002.

Pentecost, J. Dwight. *The Words and Works of Jesus Christ*. Grand Rapids: Zondervan, 1981.

Robertson, A. T. *Harmony of the Gospels*. New York: Harper & Row Publishers, 1922. Available online at http://www.gutenberg.org/files/36264/36264-h/36264-h.htm

# అభ్యాసాలు రికార్డు

విద్యార్థి పేరు ________________________________

దిగువ పట్టికలో, ప్రతి అసైన్మెంట్ పూర్తయినప్పుడు విద్యార్థి పేరుయొక్క మొదటి అక్షరాలు నమోదు చేయండి. Shepherds Global Classroom నుండి సర్టిఫికెట్ పొందాలంటే అసైన్మెంట్లన్నీ విజయవంతంగా పూర్తి చేయాలి.

| పాఠం | అసైన్మెంట్ 1 | అసైన్మెంట్ 2 | అసైన్మెంట్ 3 |
|---|---|---|---|
| 1 | | | |
| 2 | | | |
| 3 | | | |
| 4 | | | |
| 5 | | | |
| 6 | | | |
| 7 | | | |
| 8 | | | |
| 9 | | | |

Shepherds Global Classroom నుండి పూర్తి చేసిన సర్టిఫికెట్ కోసం దరఖాస్తు మా వెబ్సైట్ www.shepherdsglobal.org లో పూర్తి చేయవచ్చు. విద్యార్థి(ల) తరఫున దరఖాస్తును పూర్తి చేసే బోధకులు మరియు దోహదకారులకు SGC అధ్యక్షుడు డిజిటల్ ద్వారా సర్టిఫికెట్లు పంపిణీ చేస్తారు.